

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 143

బుధవారం 13-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నారీ స్వారీ

హైదరాబాద్‌లో పహారా కాస్తున్న 10 మంది మహిళా అశ్వదళంపై కథనం - 13లో



మరింత దిగొచ్చిన ధరలు

జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.55 శాతం 2017 జూన్ తర్వాత కనిష్ఠ స్థాయి - 15లో



సెమీ కండక్టర్ల ప్రాజెక్టులకు ఓకే

ఏపీ, పంజాబ్, ఒడిశాలలో రూ. 4.594 కోట్లతో 4 సెమీ కండక్టర్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

వివరాలు 6లో ▸



అవి పౌరసత్వ రుజువులు కావు!

ఆధార్, ఓటర్ కార్డులు పౌరసత్వానికి రుజువులు కాబోవని సుప్రీంకోర్టు ఓ కేసులో తేల్చిచెప్పింది.

వివరాలు 6లో ▸



మళ్లీ డ్రాగన్‌తో 'విమాన' బంధం

భారత్–చైనా మధ్య నాలుగేళ్లుగా నిలిచిన డైరెక్ట్ విమాన సర్వీసులను త్వరలో పునరుద్ధరించాలని కేంద్రం భావిస్తోంది.

వివరాలు 6లో ▸



రూ.13 కోట్ల గంజాయి పట్టివేత

రూ. 13.3 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయి తరలిస్తూ ఓ ప్రయాణికురాలు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడింది.

వివరాలు 16లో ▸

72 గంటలు హై అలర్ట్

3 రోజులు ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు | భారీ వర్షసూచన నేపథ్యంలో సీఎం ఆదేశాలు

- స్కూళ్లు, కాలేజీలకు సెలవులపై కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలి..
- ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చేలా చూడాలి
- క్లౌడ్ బరస్ట్‌ను సైతం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగడానికి వీల్లేదు
- హెలికాప్టర్లు, అంబులెన్సులు, మందులు అందుబాటులో ఉంచాలి
- హైదరాబాద్‌లో హైడ్రా అప్రమత్తంగా ఉండాలి.. టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలి
- వరద ముంపు బాధితుల ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి.. ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్





భారీ వర్షానికి నీటమునిగిన వరంగల్‌లోని ప్రధాన రహదారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. మూడు రోజుల పాటు అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది సెలవులను రద్దు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు అధికారులను ఆదేశించారు. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఆన్‌డ్యూటీలో ఉండాలన్నారు. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని, ముందు మిగతా 5వ పేజీలో ▶

వరంగల్‌ను ముంచెత్తిన వరద

- రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి నీరు..
- వరంగల్‌లో ఒకరు, సంగారెడ్డి జిల్లాలో మరొకరు మృతి
- ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు 5లో

3 రోజులు భారీ వర్షాలు!

వాతావరణ శాఖ హెచ్చరిక
8 జిల్లాలకు రెడ్ అలర్ట్..

వరంగల్	యాదాద్రి భువనగిరి
హనుమకొండ	మెదక్
జనగామ	సంగారెడ్డి
మహబూబాబాద్	వికారాబాద్

- వివరాలు 5లో ▶

ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లిలోని పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై దాడి చేస్తున్న టీడీపీ గూండాలు



'మమ్మల్ని ఆపకండయ్యా.. మా ఓటు మమ్మల్ని వేయనివ్వండి' అంటూ పులివెందుల మండలం నల్లగొండువారి పల్లెలో పోలీసు కాళ్లు పట్టుకొని వేడుకుంటున్న ఓ ఓటరు ▶



పోలీసు రాజ్యంలో పచ్చమూకల రిగ్గింగ్

బందిపోట్లను తలపిస్తూ నిర్బంధాలు.. తాలిబన్లను తలపిస్తూ బెదిరింపులు

అత్యంత దుర్మార్గంగా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నిక పోలింగ్

ఒక్క బూత్‌లో కూడా వైఎస్సార్‌సీపీ ఏజెంట్ లేకుండా జరిగిన ఎన్నికలివి

- బయటి ప్రాంతాల నుంచి వచ్చి బూత్‌ల ముందే రౌడీలు తిష్ట వేసినా పట్టించుకోని పోలీసులు
- ఓటేయడానికి ముగ్గురు నలుగురుగా కలిసి వస్తున్న వారిని పోలీసులే కొట్టి వెనక్కు పంపిన దుస్థితి
- ఒక్కో బూత్‌ను టీడీపీ పెద్ద లీడర్లు పంచుకుని ఊళ్లకు ఊళ్లపై దండయాత్ర

- వివరాలు 12లో

న్యూస్‌రీల్



భారతదేశంలో అవయవ దానం రేటు ప్రపంచంలోనే అతి తక్కువ (ప్రతి పది లక్షల మందికి కేవలం 0.65 దాతలు). ప్రాణాలను కాపాడగల అవయవం కోసం ఎదురుచూస్తూ ఏటా దాదాపు ఐదు లక్షల మంది భారతీయులు కన్ను మూస్తున్నారు. ఇది పెను విషాదం.

ఈ దానం మానవతకే శిఖర ప్రాయం

నేడు ప్రపంచ అవయవదానం దినోత్సవాన్ని పురస్కరించుకొని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి రాసిన ప్రత్యేక వ్యాసం.

- వివరాలు 4లో ▶

సీబీఐకి 'గట్టు' హత్యకేసు



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణి హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ కేసును తిరిగి దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించింది.

- వివరాలు 5లో ▶

కమిటీ వద్దే వద్దు!



ఏపీతో జల వివాదాలపై చర్చల కోసం ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీ వేసే విషయమై తెలంగాణ వెనుకడుగు వేసింది. ఏపీ అక్రమంగా నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై ఆ రాష్ట్రంతో చర్చలు జరపాల్సిన అవసరం లేదని తెలంగాణ నిర్ణయించింది.

- వివరాలు 2లో ▶

ఖజానా కొల్లగొడదామని..



ఖజానా జ్యువెలరీ షోరూంలోకి తుపాకులతో ప్రవేశిస్తున్న దొంగలు

- చందానగర్ ఖజానా జ్యువెలరీస్‌లో భారీ చోరీ..
- ఉదయాన్నే షాపు తెరవగానే.. తుపాకులతో లోపలికి వచ్చిన బందిపోటు దొంగలు
- సిబ్బందిని బెదిరించి.. డిప్యూటీ మేనేజర్ కాలిపై కాల్చిన దుండగులు
- అప్పటికి లాకర్‌లోనే ఉన్న బంగారు ఆభరణాలు
- బంగారం అని అనుకుని.. గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలతో పరార్
- మధ్యప్రదేశ్ లేదా ఉత్తరప్రదేశ్ ముఠాగా అనుమానం

సాక్షి, హైదరాబాద్/చందానగర్: హైదరాబాద్ చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ షోరూంపై బందిపోటు దొంగలు పంజా విసిరారు. మంగళవారం ఉదయం షాపు తెరిచే సమయంలోనే తుపాకులతో చొరబడిన ముఠా బంగారం కోసం ప్రయత్నించి గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలతో పరారయ్యింది. ఈ సందర్భంగా దుండగుల కాల్పుల్లో షోరూమ్ అసిస్టెంట్ మేనేజర్ కాలుకి గాయం కాగా.. సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. జిన్నారం మీదుగా పారిపోయిన ఈ ముఠాను పట్టుకోవడానికి 20 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి ప్రకటించారు. మాదాపూర్ డీసీపీ వినీత్, మియాపూర్ ఏసీపీ సీహెచ్‌వై శ్రీనివాసకుమార్ ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు.

ఉదయం షోరూమ్ తెరిచీ తెరవగానే..

జాతీయ రహదారిపై గంగారం వద్ద ఉన్న ఖజానా జ్యువెలరీ షోరూంను యథావిధిగా మంగళవారం మిగతా 3వ పేజీలో ▶

ఇవ్వాల్సింది రూ. 248 కోట్లు.. ఇచ్చింది రూ. 50 కోట్లు

ఉపాధి కూలీలకు 7 నెలల్లో అందింది కేవలం రూ. 6 వేలే

- ఏడాదికి రెండు దఫాలుగా రూ.12 వేలు ఇస్తామంటూ జనవరి 26న పథకం ప్రారంభం
- 5 లక్షల మంది లబ్ధిదారుల ఎంపిక.. 83 వేలమందికి రూ.50 కోట్లు చెల్లింపు
- 4 లక్షల మందికిపైగా అందాల్సిన రూ.250 కోట్లు పెండింగ్



36 మందిని ఎంపిక చేసినా..

మా మండల కేంద్రంలో 36 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఏడు నెలలు గడుస్తున్నా నాతోపాటు ఏ ఒక్కరికీ ఈ పథకంలో లబ్ధి చేకూరలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద డబ్బులు అందించాలి.

- రాయరాకుల కట్టమ్మ, నల్లబెల్లి (వరంగల్ జిల్లా)

సాక్షి, హైదరాబాద్ /నెట్‌వర్క్ : ఉపాధి హామీ కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అంతంత మాత్రంగానే అందిందనే విమర్శలున్నాయి. ఈ ఏడాది జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 4 పథకాల్లో ఇది ఒకటి. ఇప్పటివరకు ఈ పథకం కింద 83,887 మంది ఉపాధి కూలీలకు రూ. 50.33 కోట్లు చెల్లించారు. మిగతా 4,13,658 మంది కూలీలకు రూ.248.19 కోట్లు ఇంకా చెల్లించాల్సి ఉంది. అయితే దీనికి సంబంధించి టోకెన్ చెక్కులు జనరేట్ అయ్యాయని అధికారులు చెబుతున్నారు. కానీ ఉపాధికూలీల ఖాతాల్లోకి మాత్రం ఈ డబ్బు జమ కాలేదు.

ఇదీ ఆత్మీయ భరోసా

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద 20 రోజులు పనిచేసి సొంతభూమి లేని ఉపాధికూలీలకు (జాబ్ కార్డులు కలిగిన వారికి) ఏడాదికి రూ.12 వేలు (ఆరునెలలకు రూ.6వేలు చొప్పున) చొప్పున చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనికోసం ఒక్కో జిల్లాలోని ఒక్కో మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. జనవరి 26న ప్రభుత్వపరంగా ఈ పథకాన్ని ప్రారంభించాక...అదే నెల 29వ తేదీ వరకు నిర్వహించిన గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక, రూ.6 వేల అందజేత వంటి ప్రక్రియ చేపట్టారు. ఈ గ్రామసభల్లో అర్హులైన వారికి పూర్తి స్థాయిలో రూ.6 వేల చొప్పున ఇవ్వలేకపోయారు. ఈ పథకం కింద గతంలో మిగతా 3వ పేజీలో ▶

రేవంత్‌ను సీఎం చేశారుగా..

మా అన్నదమ్ముల్దిద్దరికీ మంత్రి పదవి ఉంటే తప్పేంటి?

- పార్టీలో చేర్చుకునేటప్పుడు సమీకరణాలు ఎందుకు గుర్తుకు రాలేదు
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు: 'నాకు మంత్రి పదవి ఇస్తామని పార్టీలో చేర్చుకున్నారు.. నేడు పదవి ఇచ్చేందుకు సమీకరణలు కుదరడం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనడం సరైంది కాదు.. నన్ను పార్టీలో చేర్చుకునే సమయంలో సమీకరణలు ఎందుకు గుర్తుకు రాలేదు' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. తన మంత్రి పదవిని ఎవరు అడ్డుకుంటున్నారో అందరికీ తెలుసని చెప్పారు. మంగళవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఎల్గలగూడెం గ్రామంలో కొత్త గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ..'నేను ఏ పదవి కోరుకున్నా మునుగోడు ప్రజల కోసమే. నాకు పదవులపై ఎలాంటి ప్రేమ లేదు. మహబూబ్‌నగర్ నుంచి మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి





సభలో కొనసాగిన 'సవరణ' సమరం

- విపక్షాల నినాదాలు, విమర్శలతో స్తంభించిన పార్లమెంట్
- ఆందోళనల నడుమే పలు బిల్లులకు మోక్షం..
- బిహార్‌లో 35 ఏళ్ల మహిళా ఓటరు వయసును 124 ఏళ్లుగా ఎస్‌ఐఆర్‌లో ఈసీ పేర్కొనడంపై పార్లమెంట్ ప్రాంగణంలో విపక్ష ఎంపీల నిరసన

- వివరాలు 6లో

యాజమాన్య కోటా.. సగానికిపైగా ఖాళీ

ఇంజనీరింగ్‌లో యాజమాన్య సీట్లు

25,956

ఇప్పటివరకు 8 వేలు కూడా నిండక బేజారు

అడ్మిషన్లు పూర్తయ్యేనాటికి 15 వేలు నిండితే గొప్పే

కన్వీనర్ కోటాలోనే మిగిలిపోయిన 11,638 సీట్లు

విద్యార్థుల కోసం రంగంలోకి కన్సల్టెన్సీలు, పీఆర్‌ఓలు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్లు భారీగా మిగిలిపోయే అవకాశం కన్పిస్తోంది. టాప్ కాలేజీలకే విద్యార్థులు ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలు, రాజధాని పరిసర ప్రాంతాల్లోని సాధారణ కాలేజీల్లో చేరేందుకు మొగ్గు చూపడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు 180 ఉన్నాయి. వీటి పరిధిలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు 1,16,877 ఉన్నాయి. ఇందులో కన్వీనర్ కోటా కింద 90,921 సీట్లు ఉన్నాయి. 156 ప్రైవేటు కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద 25,956 సీట్లు ఉన్నాయి. టాప్ టెన్ కాలేజీల్లో దాదాపు 7 వేల సీట్లు ఉన్నాయి. కన్వీనర్ కోటా సీట్లే ఇంకా 11,638 మిగిలిపోయాయి. యాజమాన్య కోటా సీట్లు అన్ని కాలేజీల్లో కలిపి 8 వేలకు మించి భర్తీ అవ్వలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. టాప్ టెన్ కాలేజీల్లో కూడా యాజమాన్య కోటాలో కంప్యూటర్ సైన్స్, అనుబంధ కోర్సులకే ఎక్కువ డిమాండ్ కనిపించింది. ఈసీఈ, సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో సీట్లు మిగిలిపోయాయి.

15 వేల సీట్ల భర్తీ కూడా కష్టమే

యాజమాన్య కోటాలో ఉన్న 25,956 సీట్లలో స్పాట్ అడ్మిషన్లు పూర్తయ్యే వరకు 15 వేల సీట్లు భర్తీ అవ్వడం కూడా కష్టమేనని యాజమాన్యాలు అంటున్నాయి. టాప్ టెన్ కాలేజీల్లో సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సుల్లో ఒక్కో సీటుకు రూ.12 నుంచి రూ.19 లక్షల వరకు మిగతా 3వ పేజీలో ▶



క్లినికల్ ట్రయల్స్.. ఎగ్ డొనేషన్స్!

- డాక్టర్ నమ్రత ఏజెంట్ల నెట్‌వర్క్‌కు మూలాలు ఇవే
- చట్టం నుంచి తప్పించుకోవడానికే వేర్వేరు చోట్ల దందా.. 'సృష్టి'పై ఇప్పటివరకు 9 కేసులు నమోదు
- డాక్టర్లు, నర్సులు, ఏజెంట్లు సహా 25 మంది అరెస్టు
- తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసు సిట్‌కు బదిలీ: డీసీపీ సాధన

- వివరాలు 16లో

ఆర్జిస్తున్న ఆదాయం వివరాలను ఆదాయపు పన్ను శాఖకు సమర్పిస్తున్న వ్యక్తుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 8.39 కోట్ల మంది ఐటీ రిటర్నులు దాఖలు చేశారు. ఈ స్థాయిలో రిటర్నులు నమోదయ్యాయంటే భారీ మొత్తంలో ప్రభుత్వానికి ప్రత్యక్ష పన్నుల ఆదాయం సమకూరిందని భావిస్తే పొరపాటే. ఎందుకంటే వీరిలో పన్నులు చెల్లించింది.. మూడింట ఒక వంతు మాత్రమే!

పన్ను కట్టింది.. ముగ్గురిలో ఒకరే!

- 2024-25లో 8.39 కోట్ల మంది ఐటీఆర్ దాఖలు
- ఇందులో పన్ను చెల్లించిన వారు 33.5% మాత్రమే
- గణనీయంగా పెరిగిన అధిక వేతన వర్గాలవారు

ప్రాథమిక మినహాయింపు పరిమితిని మించి ఆదాయం ఆర్జించిన ప్రతి వ్యక్తి తప్పనిసరిగా ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ (ఐటీఆర్) సమర్పించాల్సి ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 8.39 కోట్లకుపైగా వ్యక్తులు తమ ఆదాయపు పన్ను వివరాలను ఐటీ శాఖకు సమర్పించారు. 2019-20లో ఈ సంఖ్య 6.47 కోట్లు. అయిదేళ్లలో ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారి సంఖ్య సుమారు 30 శాతం పెరిగింది. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. వాస్తవానికి 2024-25లో ఐటీఆర్ దాఖలు చేసినవారిలో పన్నులు చెల్లించింది 33.56 శాతం.. అంటే సుమారు 2.82 కోట్ల మంది మాత్రమే. దాదాపు 5.6 కోట్ల మంది పన్ను పరిధిలో లేరు! అంటే.. వీరి ఆదాయం..పన్ను చెల్లించే స్థాయిలో లేదన్న మాట. ఇలాంటి ఐటీఆర్‌లు ఏకంగా 66.44 శాతం ఉన్నాయంటే ఆశ్చర్యం వేయకమానదు.

సాక్షి, స్పెషల్ డెస్క్


వేతనాలు పెరిగాయ్


డిడక్షన్‌పోను రూ.15–50 లక్షల ఆదాయం పరిధిలోకి వచ్చిన వేతన జీవుల సంఖ్య 2024–25లో 29.5 లక్షలుగా నమోదైంది. 2019–20లో ఇది 13.1 లక్షలు మాత్రమే. అంటే అయిదేళ్లలో రెండింతలకుపైగా పెరిగింది. అలాగే రూ.7.5–15 లక్షల ఇన్ కం పరిధిలోకి వచ్చిన వారి సంఖ్య 62 శాతం అధికం అయింది. రూ.7.5 లక్షలలోపు ఆదాయ విభాగంలోకి వచ్చినవారు 2.8 శాతం క్షీణించడం గమనార్హం.

టాప్‌లో మహారాష్ట్ర

ఐటీ రిటర్నుల దాఖలులో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. 2024-25లో అక్కడ ఏకంగా కోటీ 27 లక్షలకుపైగా ఐటీఆర్ ఫైల్ చేశారు. తరువాతి స్థానాల్లో యూపీ, గుజరాత్ ఉన్నాయి. తెలంగాణలో గత ఆర్థిక సంవత్సరంలో 30,56,867 మంది ఐటీఆర్ దాఖలు చేశారు. అయిదేళ్లలో ఈ సంఖ్య 41.6 శాతం పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో అయిదేళ్లలో ఐటీఆర్ సమర్పించిన వారి సంఖ్య 23 శాతం అధికమై 25,59,092 చేరింది. ఇక పన్ను చెల్లించాల్సిన అవసరం లేని వారి సంఖ్య పరంగా మహారాష్ట్ర ముందంజలో ఉంది.







మహమ్మారి తర్వాత ఎకానమీ గాడిలో పడింది. కంపెనీలు తమ ఉద్యోగులకు ఇన్సెంటివ్స్ సైతం అందించాయి. నిపుణుల వేతనాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ప్రభుత్వ కఠిన నిబంధనలతో ఆదాయ వివరాలను పారదర్శకంగా వెల్లడించాల్సిందే. ఐటీఆర్ ఫైలింగ్స్‌లో ఇవన్నీ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

- అరుణ్ లాల్, డైరెక్టర్, అంబర్ కార్పొరేట్ సర్వీసెస్

క్లుప్తంగా...

బీసీ సభకు ముందు క్షమాపణలు చెప్పండి

చొప్పదండి ఎమ్మెల్యే సత్యం


గాంధీభవన్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సాక్షి, హైదరాబాద్: బీసీలకు ముందుగా క్షమాపణలు చెప్పి బీఆర్‌ఎస్ సభలు ఏర్పాటు చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గాంధీభవన్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం సత్యం విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో ప్రగతిభవన్‌లోకి సామాన్యులకు ప్రవేశం లేకుండా బీఆర్‌ఎస్ పాలించిందన్నారు.కానీ, గాంధీభవన్ ఇప్పుడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. పదేళ్ల పాలనలో బీసీలను పట్టించుకున్న పాపాన పోని బీఆర్‌ఎస్‌కు.. అసలు బీసీల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. కులగణనలో కూడా పాల్గొనని కేసీఆర్ కుటుంబానికి బీసీలతో ఏం సంబంధమని నిలదీశారు.

రూ.600 కోట్ల కోడిగుడ్ల కుంభకోణం

బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్




సాక్షి, హైదరాబాద్: గురుకులాలు, ఇతర విద్యాసంస్థలకు సరఫరా చేసే కోడిగుడ్ల ధరను పెంచి.. రేవంత్ ప్రభుత్వం రూ.600 కోట్ల కుంభకోణానికి తెర లేపిందని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ప్రవీణ్ తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో నిబంధనల మేరకు కోడిగుడ్డు బరువు 50 నుంచి 60 గ్రాముల మేర ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం 50 నుంచి 42 గ్రాముల మేర ఉండేలా బరువును తగ్గించాలని నిర్ణయించిందన్నారు. కోడిగుడ్ల సరఫరా నిబంధనలను సవరిస్తూ.. రేవంత్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 17 మూలంగా 20 వేలమంది చిన్న కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో కోడిగుడ్ల కాంట్రాక్టుకు కాంట్రాక్టర్లు ఎలాంటి వార్షిక టర్నోవర్ చూపించాల్సిన అవసరం ఉండేది కాదని ప్రవీణ్ గుర్తు చేశారు. కానీ జీవో 17 ద్వారా వార్షిక టర్నోవర్ రూ.3 కోట్లు ఉన్న సంస్థలకే కాంట్రాక్టు దక్కేలా నిబంధనలు మార్చారన్నారు.

కమిటీ వద్దే వద్దు!

ప్రాజెక్టులపై ఏపీతో చర్చలకు కమిటీ ఏర్పాటుపై తెలంగాణ వెనుకడుగు

బనకచర్లపై ఏపీతో చర్చలకు వెళ్లొద్దని తాజాగా నిర్ణయించిన తెలంగాణ



సాక్షి, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదులపై సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో తెలంగాణ, ఏపీ మధ్య నెలకొన్న వివాదాలపై చర్చల కోసం ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీ వేయాలనే అంశంపై తెలంగాణ వెనుకడుగు వేసింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ గత నెల 16న ఢిల్లీలో తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబుతో నిర్వహించిన సమావేశంలో కమిటీ ఏర్పాటుకు రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. తెలంగాణ, ఏపీ నుంచి చెరో ఐదుగురు అధికారులతోపాటు కేంద్ర జలశక్తి శాఖ నుంచి మరో ఇద్దరు అధికారులు కలిపి మొత్తం 12 మందితో వారం రోజుల్లో కమిటీ నియమించాలని అప్పట్లో నిర్ణయించగా, నెల రోజులు గడిచినా ముందడుగు పడలేదు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ అక్రమంగా నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై ఆ రాష్ట్రంతో చర్చలు జరపాల్సిన అవసరం లేదని తెలంగాణ నిర్ణయించింది. తమ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ ఏపీ మొండిగా ముందుకుపోతుండటంతో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మరోవైపు కమిటీ ఏర్పాటుకు పేర్లను సూచించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ నుంచి ఇరు రాష్ట్రాలకు ఎలాంటి లేఖ అందలేదు. కమిటీ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం ఒత్తిడి చేయగా, ఈ విషయంలో తెలంగాణకు లేఖ రాసేందుకు కేంద్ర జలశక్తి శాఖ నిరాకరించినట్టు తెలిసింది. గోదావరిలో పోలవరం ప్రాజెక్టు వద్ద 650 టీఎంసీల నీటి లభ్యత ఉందని, అందులో నుంచి 200 టీఎంసీలను గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా తరలించుకోవచ్చని ఏపీ ప్రభుత్వం నివేదిక సమర్పించగా.. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. గోదావరి బోర్డు, కృష్ణా బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సైతం బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ లేఖలు రాశాయి. ఇలాంటి ప్రాజెక్టుపై ఏపీతో చర్చలకు వెళ్లడం రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించవచ్చనే భావనతోనే తెలంగాణ ప్రభుత్వం వెనుకడుగు వేసింది.

మినిట్స్ లేని సమావేశం

కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన రెండు రాష్ట్రాల సీఎంలతో జరిగిన సమావేశం అనధికారికమని, ఆ భేటీలోని నిర్ణయాలకు సంబంధించి 'మినిట్స్'సైతం రికార్డు చేయొద్దని ముందే ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. సాధారణంగా కేంద్ర మంత్రిత్వ శాఖలు రాష్ట్రాలతో నిర్వహించే సమావేశాల మినిట్స్‌ను కొన్ని రోజుల తర్వాత సంబంధిత రాష్ట్రాలకు పంపించడం ఆనవాయితీ. ముందే జరిగిన నిర్ణయం మేరకు కేంద్ర మంత్రి సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఆ శాఖ రూపొందించలేదని అధికారవర్గాలు తెలిపాయి. మినిట్స్ రికార్డు చేయవద్దని చంద్రబాబు స్వయంగా ప్రతిపాదించినట్టు తెలిసింది. ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టుపై ఎలాంటి చర్చ జరగలేదని రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించగా, ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు మాత్రం చర్చ జరిగిందని చెప్పారు. దీనిపై బీఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సమావేశం మినిట్స్ బయటకి వస్తే చర్చ జరిగిందా? లేదా? అన్న విషయంపై స్పష్టత వస్తుందని అందరూ భావించారు. అయితే, మినిట్స్ రికార్డు చేయొద్దని తీసుకున్న నిర్ణయంతో ఆ అవకాశం లేకుండా పోయింది.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి 'గృహ నిర్బంధం'

- పెద్దమ్మ గుడికి వెళ్లకుండా రాంచందర్‌రావును అడ్డుకున్న పోలీసులు
- కేంద్రమంత్రి బండిసంజయ్, ఎంపీ డీకే అరుణ మండిపాటు


రాంచందర్‌రావును హౌస్ అరెస్టు చేసిన ఓయూ పోలీసులు

సాక్షి, హైదరాబాద్ / లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయంలో మంగళవారం తలపెట్టిన కుంకుమార్చన కార్యక్రమానికి హాజరుకాకుండా రాంచందర్‌రావును ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు హౌస్‌అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందువులు పండుగ చేసుకుంటే, గుళ్లో పూజ చేసుకుంటే అరెస్టులు చేయడం ఏమిటో తనకు అర్థంకావడం లేదన్నారు. ఇలాంటి ఘటనలతో కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ వ్యతిరేక ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంటోందని విమర్శించారు. హర్‌ఘర్ తిరంగా, యాత్ర బైక్ ర్యాలీకి సిద్ధమవుతున్న తనను పోలీసులు హౌజ్ అరెస్టు చేయడం అవివేకమన్నారు. కాగా, రాంచందర్‌రావు ఇతర నాయకుల 'గృహనిర్బంధం'పై బీజేపీ నేతలు మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలనకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఒక వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి తన ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని బహిర్గతం చేసిందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తదితరులు రాంచందర్‌రావు అరెస్టును ఖండించారు.

బండి సంజయ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసు



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్‌ట్యాపింగ్ అంశంలో తనపై నిరాధార ఆరోపణలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. బండి సంజయ్ తనపై చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలుగా కేటీఆర్ మంగళవారం పంపిన నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన నిర్వహించిన పత్రికా సమావేశంలో బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు ఈ తరహా ఆరోపణలు చేశారని నోటీసులో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు ఎలాంటి సాక్ష్యాధారాలు లేవన్నారు. ఒక పార్లమెంటు సభ్యుడిగా, కేంద్రమంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉంటూ ప్రజాజీవితంలో ఉన్న మరో శాసనసభ్యుడిపై అసత్యాలతో కూడిన అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని చెప్పారు. బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నోటీసు అందిన వారంలోపు బండి సంజయ్ స్పందించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నోటీసులకు భయపడే ప్రశ్నే లేదు: సంజయ్



లీగల్ నోటీసులకు భయపడే ప్రశ్నే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కేటీఆర్ తనకు పంపిన లీగల్ నోటీసులపై మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'గేమ్ ఆన్. లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు. నిజం ఒక సింహం.. దాన్ని విడిచిపెడితే అది తనను తాను రక్షించుకుంటుంది. ఫోన్‌ట్యాపింగ్ ద్వారా జీవితాలను నాశనం చేసిన నేరస్తులు బయటపడతారు. సత్యమేవ జయతే'అని పేర్కొన్నారు.

రేవంత్‌ను సీఎం చేశారుగా..

▶ మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డికి సీఎం పదవి ఇచ్చారు కదా.. మా అన్నదమ్ములిద్దరికి మంత్రి పదవి ఉంటే తప్పేంటి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు ముగ్గురు మంత్రులు ఉంటే.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 మంది ఎమ్మెల్యేలకు ముగ్గురు మంత్రులు ఉంటే తప్పేంటి. ఒక ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులు అంటే.. ఇద్దరం సమర్థులం, పరిపాలన చేసే సామర్థ్యం కలిగిన వ్యక్తులం. అలాంటి వారికి పదవులు ఇస్తే ఎవరికి ఇబ్బంది. ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉన్న నాకు మంత్రి పదవి ఇవ్వకుండా సమీకరణల పేరుతో దాట వేస్తున్నారు. నాకు పదవి రాకపోతే జరిగే నష్టం మునుగోడు ప్రజలకు తప్ప నాకు కాదు. పదవులు ఇచ్చే నిర్ణయం అధిష్టానం చూసుకుంటుంది. నాకు మంత్రి పదవి ఇచ్చే విషయంలో నేను ఎంతవరకైనా ఓపిక పడతా. కానీ, మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో నిధులు ఇవ్వకుండా అడ్డుపడితే ఊరుకునే ప్రసక్తి లేదు. నిధులు ఇవ్వకుంటే ఎంతటి త్యాగానికైనా సిద్ధమవుతా. మరోమారు ఉద్యమానికి సిద్ధమై తీరుతా. అలా అని మునుగోడు ప్రజలు తలవంచుకునే పని అసలు చేయను. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలన కొనసాగిస్తూ నిధులు ఇవ్వకుండా పక్షపాత వైఖరి ప్రదర్శిస్తుంటే చూసి ఊరుకోలేక ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎంను మునుగోడు ప్రజల దగ్గరకు తీసుకొచ్చా. నా రాజీనామా కారణంగానే నియోజకవర్గానికి అప్పటి ప్రభుత్వం దాదాపు రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేస్తే ఇప్పుడిప్పుడే అభివృద్ధి జరుగుతుంది. ఇంకా మరింతగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు ఇవ్వకుంటే ఎంతటి త్యాగానికైనా సిద్ధమైతా. అందుకు ప్రతి ఒక్కరి సహాయ, సహకారాలు కావాలి. ప్రధానంగా కమ్యూనిస్టుల మద్దతు పూర్తిగా అందించాలి'. అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్


ప్రియాంకా గాంధీతో ఎంపీలు చామల, రఘురాంరెడ్డి, మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, బీజేపీకి కేంద్ర ఎన్నికల సంఘం ఏజెంట్‌గా మారిందని టీకాంగ్రెస్ నేతలు ఆరోపించారు. మంగళవారం కాంగ్రెస్ ఎంపీల ఫోరం తెలంగాణ కన్వీనర్ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మల్లు రవి మాట్లాడుతూ పార్లమెంట్‌లో క్వశ్చన్ అవర్‌లో కనీసం ప్రశ్నలు అడిగే సమయం కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సభను నడిపే ఉద్దేశం మోదీకి లేదని దుయ్యబట్టారు. ప్రజల కోసం తీసుకొచ్చే బిల్లులపై ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడే అవకాశమే ఇవ్వకుంటే, ఇదేం ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ రాహుల్ గాంధీతోనే సాధ్యమని తెలిపారు. ఎంపీ చామల మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్ధంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం బీజేపీకి ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఓట్ల చోరీ అంశంపై నిరసనలు తెలుపుతామని చెప్పారు. బిహార్, పశ్చిమబెంగాల్, అసోంలో ఓటమి ఖాయమని భావించిన బీజేపీ ఆయా రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఓటరు జాబితాల్లో అవకతవకలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఎంపీలు రవి, చామల కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ అధ్యక్షతన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ జరిగింది. బీసీ రిజర్వేషన్లలలో ముస్లిం మైనారిటీలకు లబ్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందనే ఆరోపణలను ఖండించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, హరియాణా, మోదీ సొంత రాష్ట్రంలో కూడా ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ల కోసం పాటుపడుతున్నారని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు.

'స్థానిక' ఎన్నికలపై సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో దాదాపు 45 నిమిషాల పాటు ఇరువురు సమావేశమై పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం స్థానిక సంస్థల నిర్వహణ విషయంలో ప్రభుత్వపరంగా ముందుకెళ్లాల్సిన తీరు, పార్టీలో నిర్ణయం తీసుకునేందుకు ఈనెల 16న జరగనున్న రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీలో చర్చించాల్సిన అంశాల గురించి మాట్లాడుకున్నారు. అలాగే రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, బోర్డులకు డైరెక్టర్లు, సభ్యుల నియామకంపై చర్చించిన నేతలు.. ఎవరికి ఏ పోస్టు ఇవ్వాలన్న అంశాన్ని కూడా క్లియర్ చేసినట్లు సమాచారం.

బీఆర్‌ఎస్ అణచివేత విధానాలనే కాంగ్రెస్ కొనసాగిస్తోంది

మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



సాక్షి, హైదరాబాద్: గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తోందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మండిపడ్డారు. రెండు పార్టీలు ప్రజలపై అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ స్వప్రయోజనాల కోసం పని చేయడం సిగ్గుచేటని దుయ్య బట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర నాయకులను గృహ నిర్బంధంలో ఉంచడాన్ని ఖండిస్తున్నామన్నారు. మంగళవారం బాలరాజు మీడియాతో మాట్లాడుతూ బంజారాహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో హిందూ సంఘాలు నిర్వహిస్తున్న కుంకుమార్చన కార్యక్రమానికి మద్దతు విషయంలో బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం దారుణమని విమర్శించారు.

రేపటి బీఆర్‌ఎస్ కదనభేరి వాయిదా

కరీంనగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించ తలపెట్టిన బీసీ కదనభేరి సభను వాయిదా వేస్తున్నట్లు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఈనెల 14, 15, 16, 17 తేదీల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు వాతావరణశాఖ సూచనల మేరకు 14న నిర్వహించే బీసీ కదనభేరిని వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. వాతావరణం అనుకూలించిన తదుపరి తేదీని నిర్ణయిస్తామని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు గమనించాలన్నారు.

24 నుంచి మళ్లీ జనహిత పాదయాత్ర

- 3 రోజుల పాటు ప్రజల్లోకి పీసీసీ అధ్యక్షుడు
- కరీంనగర్ జిల్లా చొప్పదండి, వరంగల్ జిల్లా వర్ధన్నపేటల్లో యాత్ర
- స్థానిక ఎన్నికలపై నేడు మీనాక్షి జూమ్ సమావేశం



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మలి విడత పాదయాత్ర ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఈ జనహిత పాదయాత్ర ద్వారా మహేశ్‌గౌడ్ మరోమారు ప్రజల్లోకి వెళ్లనున్నారు. యాత్ర షెడ్యూల్‌ను గాంధీభవన్ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. 24న సాయంత్రం 5 గంటలకు మహేశ్‌గౌడ్ చొప్పదండిలో పాదయాత్ర ప్రారంభిస్తారు. 25న ఉదయం అక్కడే శ్రమదానంచేసి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో పాదయాత్ర జరుగుతుంది. 26న ఉదయం శ్రమదానం, ఆ తర్వాత వరంగల్ జిల్లా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా పాల్గొంటారు. కాగా, 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో మహేశ్‌గౌడ్ భేటీ కానున్నారు. అదేవిధంగా ఈ నెల 16వ తేదీన జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ అధికారిక నిర్ణయం తీసుకోనున్నందున ముందస్తుగా క్షేత్రస్థాయి నేతలతో మీనాక్షి సమావేశం కానున్నారు. బుధవారం ఉదయం జరిగే జూమ్ సమావేశానికి హాజరు కావాలని డీసీసీ అధ్యక్షులు, పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌లకు ఆహ్వానం అందింది.

తెలంగాణలో యూరియా కొరతలేదు

రాజ్యసభలో ఎంపీ సురేశ్‌రెడ్డి ప్రశ్నకు స్పష్టతనిచ్చిన కేంద్రం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుతసీజన్‌లో తెలంగాణ రైతులకు యూరియా ఎరువు కొరతలేదని కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రానికి అవసరమైనంత ఎరువు ముందుగానే పంపిణీ చేశామని, అందుబాటులో అవసరానికి మించి ఉందని కేంద్ర ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియా పటేల్ మంగళవారం బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. కేంద్రగణాంకాల ప్రకారం, 2024–25 జూలైలో రాష్ట్రానికి 1.70 లక్ష మెట్రిక్ టన్నుల అవసరం ఉండగా, 8.29 లక్ష టన్నులు అందుబాటులో ఉన్నట్టు నమోదైంది. అమ్మకాలు 2.48 లక్ష టన్నులు జరిగాయి. 'యూరియా తీవ్ర కొరత' వార్తలపై కేంద్రమంత్రి స్పందిస్తూ, 'ఐఎఫ్ఎంఎస్ అనే ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా ఎరువుల రవాణా, నిల్వలను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నాం. రాష్ట్ర వ్యవసాయ శాఖలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, అవసరమైతే వెంటనే ఎరువులు పంపిణీ చేస్తాం' అన్నారు.

క్లుప్తంగా...


ఈఓకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి సురేఖ

భద్రాద్రి రామాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఆలయంలో ప్రసాదాలు, విక్రయించే వస్తువుల నాణ్యతలో 19001 ప్రమాణ స్థాయితో పాటు 22000 ఆహార భద్రత నిర్వహణ స్థాయి పాటించడంతో ఈ గుర్తింపు దక్కింది. కాగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నుంచి ఈవో ఎల్.రమాదేవి మంగళవారం సర్టిఫికెట్ అందుకున్నారు. కార్యక్రమంలో ఐఎస్ఓ డైరెక్టర్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండియాలో ఏముంది?

- జేఎన్టీయూహెచ్ వీసీ వివాదాస్పద వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: 'ఇండియాలో ఏముంది?'అంటూ జేఎన్టీయూహెచ్ వైస్ చాన్స్లర్ టీకేకే రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల్లో ఉద్యోగావకాశాలు సన్నగిల్లాయని తెలిపారు. యూనివర్సిటీ పరీక్షల గురించి తాను పట్టించుకోనని, తమ సిబ్బందికే ఈ విషయాలు తెలుసన్నారు. జేఎన్టీ యూహెచ్లో మంగళవారం మీడియా సమావేశంలో టీకేకే రెడ్డి మాట్లాడారు. కోర్ ఇంజనీరింగ్కు భారత్లో పెద్దగా ఉపాధి అవకాశాలు రావడం లేదని చెప్పారు. ఎనర్జీ సిస్టమ్స్లో చదివిన వారికి జర్మనీలో వందశాతం ఉద్యోగాలొస్తున్నాయని, అందుకే జర్మనీ యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. తనపై కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని వీసీ తెలిపారు. కాగా, 'ఇండియాలో ఏముంది?'అంటూ వీసీ వ్యాఖ్యానించడంపై పత్రికా సమావేశంలో గందరగోళం చెలరేగింది. భారత్ను అవమానించేలా మాట్లాడుతున్నారని విలేకరులు అభ్యంతరం చెప్పగా, తాను ఉపాధి అవకాశాలు లేవని చెప్పడమే దీని ఉద్దేశమని టీకేకే రెడ్డి సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. 'మీరు జర్మనీలోనే వీసీగా పనిచేయాల్సింది' అని ఓ మీడియా ప్రతినిధి అనడంతో, అక్కడ అవకాశం లేదంటూ వీసీ బదులిచ్చారు.

18 నుంచి డీఈఐఈడీ ప్రాక్టికల్స్

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ ఈనెల 18 నుంచి 25 వరకు, తిరిగి 28 నుంచి వచ్చే నెల 4 వరకు రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. www.bse.telangana.gov.in వెబ్సైట్లో హాల్టికెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఖజానా కొల్లగొడదామని..

▶ మొదటి పేజీ తరువాయి

ఉదయం 10.15 గంటలకు తెరిచారు. ఆ సమయంలో విధులకు హాజరైన 25 మంది సిబ్బందితో రోజూ మాదిరిగానే డిప్యూటీ మేనేజర్ సతీష్కుమార్ మాట్లాడుతున్నారు. 10.30 గంటల ప్రాంతంలో ఆ షోరూం వద్దకు మాస్క్తో వచ్చిన ఓ ఆగంతకుడు ఫోన్ ద్వారా తన ముఠా సభ్యులకు సమాచారం ఇచ్చాడు. తర్వాత ఐదు నిమిషాలకు రెండు ద్విచక్ర వాహనాలపై మరో ఐదుగురు అక్కడకు చేరుకున్నారు.

ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ..

ఒకరు షోరూం బయటనే ఆగిపోగా.. మరొకరు ప్రధాన ద్వారం దగ్గర కాపు కాశారు. మిగిలిన నలుగురూ నేరుగా సిబ్బంది ఉన్న ప్రాంతానికి వచ్చారు. మాస్కులు ధరించి ఉన్న దుండగులను వినియోగదారులని ఉద్యోగులు భావించారు. ఏం కావాలని అడగడానికి ఓ ఉద్యోగి వస్తుండగా తుపాకులు ఉన్న ముగ్గురు దుండగులు ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తూ డిప్యూటీ మేనేజర్ను లాకర్ తాళాలు ఇవ్వాలంటూ బెదిరించారు. ఆయన తన వద్ద తాళాలు లేవని చెప్పడంతో 'చుప్ బే'అంటూ బెదిరించిన ఓ దుండగుడు అతని ఎడమ కాలుపై కాల్చాడు. షోరూమ్లో ఉన్న రెండు సీసీ కెమెరాలను కూడా కాల్చారు.

గోల్డ్ కోటెడ్వే నిజమైనవి అనుకుని..

ప్రతిరోజూ షోరూమ్ మూసేముందు అదే అంతస్తులోని మెజ్జనైన్ ఫ్లోర్లో ఉన్న లాకర్లో బంగారు ఆభరణాలను భద్రపరుస్తారు. ఉదయం షోరూమ్ తెరిచిన తర్వాత అసిస్టెంట్ మేనేజర్ తాళాలు తీస్తే బంగారు ఆభరణాలను బయటకు తీసుకువచ్చి కింది ఫ్లోర్లో ఉన్న షో కేసుల్లో సర్దుతారు. అయితే మంగళవారం ఉదయం దుండగులు వచ్చిన సమయానికి అసిస్టెంట్ మేనేజర్ రాకపోవడంతో ఈ బంగారం దోపిడీ దొంగలకు దొరకలేదు. ఈ షోరూమ్లో వినియోగదారులకు చూపించడానికి బయటకు తీసి, మళ్లీ లోపల పెట్టడానికి ఉన్న కొన్ని షోకేస్లతో పాటు ఆభరణాలను డిస్ప్లే చేయడానికి ఉన్న షో కేసుల్లో గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలను ఉంచుతారు. వీటినే బంగారు ఆభరణాలుగా భావించిన దుండగులు ఆ షోకేసుల్ని ధ్వంసం చేసి అందులో ఉన్న ఆభరణాలను బ్యాగుల్లో సర్దుకుని వాహనాలపై ఉడాయించారు. ఈ వెండి ఐదు నుంచి పది కిలోల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. కేవలం పది నిమిషాల్లోనే ఈ దోపిడీ ముగిసింది.

పక్కాగా రెక్కీ చేసిన తర్వాతే నేరం!

దుండగులు రెండుమూడు రోజుల పాటు రెక్కీ చేసిన తర్వాతే దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటనాస్థలికి వచ్చిన కమిషనర్ అవినాశ్ మహంతి బందిపోటు దొంగతనం జరిగిన తీరును తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందాలు.. నేరం చేసిన తర్వాత దుండగులు చందానగర్-పటాన్చెరు-కృష్ణారెడ్డిపల్లి-జిన్నారం మీదుగా పరారైనట్లు గుర్తించారు. దుండగుల్లో ఒకడు 'చుప్ బే'అనే పదం వాడటాన్ని బట్టి.. అది మధ్యప్రదేశ్ లేదా ఉత్తరప్రదేశ్లకు చెందిన ముఠాగా అనుమానిస్తున్నారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేశారు. ఎక్కడికక్కడ చెక్పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షోరూం డిప్యూటీ మేనేజర్ ఆరోగ్యం నిలకడగా ఉంది.


దుకాణంలో ఆభరణాలు చోరీ చేస్తున్న దుండగులు


చోరీ తర్వాత బైక్పై పారిపోతున్న దొంగలు

తెలంగాణలో రూ.2,500 కోట్ల పెట్టుబడులు!

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్బాబుతో చర్చించిన యూకే ప్రతినిధులు


యూకే ప్రతినిధులతో భేటీ అయిన భట్టి, శ్రీధర్బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బ్రిటన్కు చెందిన ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. రూ.2,500 కోట్ల వ్యయంతో తెలంగాణలో మాల్స్, ఆస్పత్రులు, హోటల్స్ రంగాల్లో పెట్టుబడులపై భట్టి విక్రమార్కతో చర్చించింది. భేటీలో జైల్స్ మెంబ్రే, మార్క్ అప్టన్, కోనాల్ ఫెరెట్, నాగెన్ సనత్కుమార్, సాయి రత్నాకర్ పెంటపాటి, ఫణి గుడివాడ, అభి కొమ్మాని తదితరులున్నారు.

నేను జూపల్లి కృష్ణారావును మాట్లాడుతున్నా..

గురుకుల విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడిన మంత్రి



కొల్లాపూర్: నాగర్కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ గురుకుల పాఠశాలను ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి 'మీ పిల్లలకు బడిలో మంచి భోజనం అందుతుందా' అని అడిగారు. ఈక్రమంలో ఓ విద్యార్థిని దిగాలుగా ఉన్న విషయాన్ని మంత్రి గుర్తించారు. ఆ అమ్మాయిని పిలిచి మాట్లాడగా తన పేరెంట్స్ వీకెండ్లో రాలేదని చెప్పి, కంటతడి పెట్టుకుంది. దీంతో అమ్మాయి తల్లిదండ్రులకు మంత్రి ఫోన్ చేసి 'పాప మీపై బెంగతో ఉంది. ఒకసారి వచ్చి చూసి వెళ్లండి. పేరెంట్స్ తప్పనిసరిగా వారంలో ఒక రోజు వచ్చి పిల్లలతో కనీసం రెండు గంటలు గడపాలి' అని సూచించారు. మంత్రి నేరుగా ఫోన్ చేసి తల్లిదండ్రులతో మాట్లాడించడంతో విద్యార్థిని సంతోషం వ్యక్తం చేసింది.

ఇవ్వాల్సింది రూ. 248 కోట్లు.. ఇచ్చింది రూ. 50 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

గుర్తించిన 5.80 లక్షల లబ్ధిదారులకుగాను, అదనంగా కొత్తగా రెండులక్షల దాకా దరఖాస్తులు అందాయి. వీటిని కూడా అధికారులు పరిశీలించాక ఎక్కువ సంఖ్యలో అనర్హులు ఉన్నట్టుగా (భూమి ఉన్నవారు, 20 రోజులు పని చేయని వారు) తేలినట్టు అధికారవర్గాల సమాచారం. గతంలో కొన్నిచోట్ల గ్రామసభల్లో కొందరు లబ్ధిదారులను ఎంపిక చేసినా, కొద్దిరోజుల తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఆ డబ్బులు వేయలేదు. ఉమ్మడి మహబూబ్నగర్, రంగారెడ్డి జిల్లాల్లో కోడ్ లేకపోవడంతో కొంత ఆలస్యంగానైనా కొందరు లబ్ధిదారులకు డబ్బులు చెల్లించారు.

క్షేత్రస్థాయిలో ఇలా...

నిజామాబాద్ జిల్లాలో ఉపాధికూలీల్లో 38,787 మందిని అర్హులుగా గుర్తించారు. మండలానికి ఒక గ్రామపంచాయతీని ఎంపిక చేసి జిల్లావ్యాప్తంగా 1,675 మందికి రూ. 6 వేల చొప్పున రూ.1.5 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 37,112 మందికి ఆత్మీయ భరోసా సాయం అందాల్సి ఉంది.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో 18 మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించారు.

డిచ్పల్లి మండలం (నిజామాబాద్ జిల్లా)

జాబ్ కార్డులు: 13,448
ఉపాధి కూలీలు: 24,765 మంది
యాక్టివ్ కూలీలు : 12,119 మంది

పైలట్ విలేజ్ కమాలాపూర్లో ఇలా..

జాబ్కార్డులు : 327
కూలీలు : 577 మంది
యాక్టివ్ కూలీలు: 361 మంది
ఆత్మీయ భరోసాకు ఎంపిక 15 మంది
సాయమందింది : 13 మందికి

2024-25లో ఈ మండలంలో 20 రోజులు పైగా 9,800 మంది పనిచేశారు. ఇందులో 2,177 మంది ఉపాధి కూలీలకు సంబంధించిన ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంటు లింకేజీ, ఇతర సాంకేతిక సమస్యలు ఉన్నాయని మండల అధికారులకు ప్రభుత్వం తెలిపింది. అన్నింటిని సరిచేసి ఆ సమాచారాన్ని ఈజీఎస్ రాష్ట్ర అధికారులకు మండల అధికారులు పంపించారు. పైలెట్ ప్రాజెక్టు కింద నేలకొండపల్లి మండలం కొంగర గ్రామపంచాయతీలో 18 మందిని ఎంపిక చేశారు. వారికి రూ .6వేలు అందించారు.

2021-22ను ప్రామాణికంగా తీసుకోవాలి



ఈ పథకం అమలు తీరు అనేది ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా ఉంది. కరోనా నేపథ్యంలో 2021-22లో ఉపాధి హామీ కింద రాష్ట్రంలో అత్యధికంగా 'పర్సన్ డేస్'నమోదైనందున, 2023-24కు బదులు ఈ పథకానికి 2021-22ను ప్రామాణికంగా తీసుకోవాలని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశాం. 2022-23లో రాష్ట్రంలో 4.4 లక్షల జాబ్కార్డులు, 15.8 లక్షల మంది పేర్లను ఉపాధిహామీ డేటాబేస్ నుంచి తొలగించారు. 2023-24లో రాష్ట్రంలోని 156 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేశారు. ఈ గ్రామాల్లో పనిచేసిన ఉపాధి కూలీలకు ఈ పథకాన్ని వర్తింపచేయాలని కోరుతున్నాం.

– పి.శంకర్, జాతీయకార్యదర్శి, దళిత బహుజన ఫ్రంట్

జాబితాలో పేరుంది..సాయం అందలే



జాబితాలో పేరు వచ్చింది. సాయం మాత్రం అందలేదు. నాకు వ్యవసాయ భూమి లేదు. భరో సా సొమ్ము వస్తే మా కుటుంబానికి ఎంతోకొంత ఆసరాగా ఉంటుందని ఆశించాం. ప్రభు త్వం మాత్రం నిరాశనే మిగిల్చింది. – పల్లెపు నవ్య, తొర్తి (నిజామాబాద్ జిల్లా)

భరోసా లభించలేదు



నేను ఉపాధి హామీ పనులతోనే ఇద్దరు కొడుకులను సాకుతున్నాను. సొంత ఇల్లు కూడా లేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హత వచ్చింది. అయితే ఈ పథకం కింద రూ.6వేలు ఇప్పటి వరకు అందలేదు. అధికారులను అడిగితే ఈనెల వచ్చేనెల అంటూ దాటవేస్తున్నారు. – భూక్యా పార్వతి, పాండురంగాపురంతండా (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)

నయాపైసా ఇవ్వలేదు



జాబితాలో నా పేరు వచ్చిందని అధికారులు చెప్పారు. డబ్బులు పడతాయని అన్నారు. కానీ ఇప్పటి వరకు నయాపైసా కూడా ఇవ్వలేదు. నాకేకాదు మా ఊరిలో ఎవ్వరికీ డబ్బులు రాలేదు. – కాంపాటి చిన్నఉప్పలమ్మ, అయోధ్యగ్రామం (మహబూబాబాద్ జిల్లా)

యాజమాన్య కోటా.. సగానికిపైగా ఖాళీ

▶ మొదటి పేజీ తరువాయి

వసూలు చేశారని సమాచారం. ఇతర బ్రాంచీల్లో రూ.5 లక్షలకు సీటు ఇస్తామన్నా కాస్త మంచి ర్యాంకు ఉన్న విద్యార్థులు ముందుకు రావడం లేదు. సివిల్, మెకానికల్ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద ఉండే వార్షిక ఫీజుతోనే కొన్ని కాలేజీలు విద్యార్థులను చేర్చుకున్నాయి. సాధారణ కాలేజీల్లో సీఎస్ఈ సీటుకు రూ.3 లక్షలకు మించి డిమాండ్ రావడం లేదు. జిల్లాలు, గ్రామీణ ప్రాంత కాలేజీల్లో కన్వీనర్ కోటా ఫీజుకే సీఎస్ఈ సీటు ఇస్తామన్నా విద్యార్థులు ముందుకు రావడం లేదు. దీంతో విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు పీఆర్ఓలు, కన్సల్టెన్సీలు, ఏజెన్సీలను రంగంలోకి దించాయి. వీటికి ఫీజులో సాధారణ కాలేజీలు 30 శాతం కమీషన్ ఇస్తుంటే, మరికొన్ని 40 శాతం వరకూ ఇచ్చేందుకు సిద్ధపడుతున్నాయి.

స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ కేసులు పరిష్కరించండి

- ఎనిమీ ప్రాపర్టీస్పై తక్షణమే సర్వే చేయించండి
- అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: పెండింగ్లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కేసులను ఈనెలాఖరులోపు పరిష్కరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీస్) సమస్యలను పరిష్కరించేందుకు సర్వేను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు ఎనిమీ ప్రాపర్టీస్ విక్రయాల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. మంగళవారం ఢిల్లీ నార్త్ బ్లాక్లోని తన కార్యాలయంలో బండి సంజయ్ స్వాతంత్ర్య సమరయోధులు, పునరావాస విభాగం సీనియర్ అధికారులు, దేశంలో శత్రు ఆస్తుల సంరక్షక (సీఈపీఐ) అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్లు, శత్రు ఆస్తుల ఆర్థికీకరణపై అధికారులు సమగ్ర నివేదిక అందజేశారు. ఎస్ఎస్ఎస్వై కింద పెండింగ్లో పెన్షన్ కేసుల పరిష్కారంలో సాధించిన పురోగతి వివరాలను సైతం వివరించారు. ఫ్రీడం ఫైటర్స్, ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పరిష్కారంలో అధికారులు తీసుకున్న చర్యలను మంత్రి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పత్రాలను సేకరించి, పెన్షన్ మంజూరును వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాలను రాష్ట్రాలకు పంపాలని కోరారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై పూర్తి వివరాలు అందించాలని బండి సంజయ్ ఆదేశించారు.

రహదారులతో ఉపాధి, ఆదాయం

రాష్ట్రంలో రూ.వేల కోట్లతో రహదారుల అభివృద్ధి: డిప్యూటీ సీఎం భట్టి

- తెలంగాణ రైజింగ్లో కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలి
- గత ప్రభుత్వం రూ.45 వేల కోట్ల అభివృద్ధి పనుల బకాయిలను వారసత్వంగా ఇచ్చింది


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క, సీఎస్ రామకృష్ణారావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వేల కోట్ల రూపాయలతో రహదారులను నిర్మించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. రహదారుల నిర్మాణంతో పరిశ్రమలు పెరిగి తద్వారా మన రాష్ట్ర యువతకు ఉపాధి, ఆదాయం సమకూరుతుందన్నారు. తెలంగాణ రైజింగ్లో కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) పద్ధతిలో రహదారులు నిర్మించడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. దీనిపై మంగళవారం హైటెక్స్లో జరిగిన ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, బ్యాంకర్ల అవగాహన కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 7,947 కి.మీ. మేర, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 5,190 కి.మీ. మేరకు రోడ్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కేబినెట్ ఆమోదించిన రోడ్లు పనులకు త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని చెప్పారు. కాంట్రాక్టర్ల ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ పెద్దలు రూ.1.75 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ఒప్పందాలు చేసుకొని, 45 వేల కోట్ల విలువైన పనులకు టోకెన్లు జారీ చేసి ఆ బకాయిలు చెల్లించకుండా తమకు వారసత్వంగా ఆర్థిక భారాన్ని మిగిల్చి వెళ్లారని భట్టి దుయ్యబట్టారు.

కాలుష్య పరిశ్రమలను తరలించండి: భట్టి

కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణ సమావేశాన్ని కేబినెట్ సబ్ కమిటీ సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన నిర్వహించారు. కమర్షియల్ ట్యాక్స్, మైనింగ్ శాఖల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు గల అవకాశాలపై చర్చించారు. కాలుష్య పరిశ్రమల వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకొని వెంటనే చర్యలు చేపట్టాలని భట్టి చెప్పారు.

రహదారులను అనుసంధానిస్తాం: కోమటిరెడ్డి

గ్రామ, మండల, జిల్లా రహదారులను అనుసంధానించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్లు, మండలాలనుంచి జిల్లాలకు రెండు వరుసల రోడ్లు వేస్తామన్నారు. అలాగే, అన్ని గ్రామాలను కలుపుతూ అన్ని వాతావరణాలకు అనుకూలమైన రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. 'ఈ విధానంలో ప్రభుత్వం 40 శాతం నిధులను 4 శాతం లెక్కన 10 వాయిదాల్లో చెల్లిస్తుంది. ఇందులో కేవలం 10 శాతం నిధులు మాత్రమే అడ్వాన్స్గా చెల్లించడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. 60 శాతం నిధులను కాంట్రాక్టరు భరించాలి. వారి పనితీరు ఆధారంగా ఆరు నెలలకోమారు ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది'అని కోమటిరెడ్డి చెప్పారు. మారుమూల గూడెంలు, తండాలు, పల్లెలకు రహదారి వ్యవస్థను బలోపేతం చేసేందుకు హామ్ ప్రాజెక్టుతో శ్రీకారం చుట్టామని మంత్రి సీతక్క అన్నారు.



ఓ భిక్షువులారా! జీవులు వారి కర్మలకు వారే యజమానులు.
వారి కర్మలే వారికి బంధువులు. వారి కర్మలే వారికి శరణు.
వారే పని చేసినా, మంచిగానీ చెడుగానీ అదే వారి వారసత్వం అవుతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 13 ఆగస్టు 2025

మునీర్ మూర్ఖత్వం!

ఉగ్రవాదాన్ని దశాబ్దాలుగా ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ పాలకులకూ, సైన్యానికీ ఆత్మాహుతి భాష నిండా ఒంటబట్టినట్టుంది. ముమ్ముందు భారత్ దాడికి దిగితే అణ్వస్త్రాలు ప్రయోగించి సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామని పాకిస్తాన్ సైనిక చీఫ్ ఆసిఫ్ మునీర్ బెదిరించటాన్ని గమనిస్తే ఆ దేశంలో మూర్ఖత్వం ఎంతగా ముదిరిందో అర్థమవుతుంది. పాకిస్తాన్ ఒక దేశంగా ఏర్పడిన నాటినుంచీ సక్రమంగా మాట్లాడటం, సవ్యంగా మసులుకోవటం దానికి చేతకావటం లేదు. అమెరికా, పాశ్చాత్య దేశాలు దాన్ని తమ తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రోత్సహిస్తూనే వచ్చాయి. అమెరికా ఈ విషయంలో ఒకడుగు ముందుంది. ఎదురుతిరిగిన పాలకుల్ని సైనిక కుట్రలో కూలదోయటం, కీలుబొమ్మను ప్రతిష్ఠించటం దానికి అలవాటైన విద్య. అమెరికా సాగు, పాడి రంగ ఉత్పత్తుల్ని భారత్‌లో అనుమతించాలన్న డిమాండ్‌ను మన ప్రభుత్వం అంగీకరించనందుకు ఆగ్రహంతో రగిలిపోతున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే మన సరుకులపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. ఆసిఫ్ మునీర్ అధిక ప్రసంగం కూడా ఆయనగారి పథక రచనే కావొచ్చన్న సంశయాలు తలెత్తుతున్నాయి. మొన్న జూన్‌లో మునీర్‌ను పిలిపించుకుని అయిదు రోజులపాటు ఇంటల్లుడి మర్యాదలు చేసిన వైనం మరవకముందే మరోసారి ఆయన అక్కడికి వెళ్లి వాలాడంటే దాన్ని సాధారణ విషయంగా తీసుకోకూడదు. తొలి పర్యటనలో ప్రోటోకాల్స్ పక్కనబెట్టి మునీర్‌కు దేశాధినేతలకిచ్చే స్థాయి ఘనమైన విందునిచ్చి, ముడి చమురు సహా పాకిస్తాన్‌తో పలు ఒప్పందాలు కుదుర్చుకున్నామని ట్రంప్ ప్రకటించిన తీరు చూసి ప్రపంచం విస్మయపడింది.

పాకిస్తాన్‌లో చచ్చీ పుచ్చీ... ఎన్నికైన ప్రభుత్వం అంటూ ఒకటుంది. అమెరికాతో సహా ఏ దేశంలోనైనా సైన్యం పని ప్రభుత్వాదేశాలు పాటించటం మాత్రమే. కానీ తోకే కుక్కను ఆడిస్తున్న చందంగా పాక్ పోకడ ఉంది. సైన్యం ఏం చేసినా అక్కడి పాలకులు కిక్కురుమనరు. అందువల్లే మునీర్ ట్రంప్‌తో సహకార ఒప్పందాలు కుదుర్చుకోగలిగాడు. ఈ విషయంలో ట్రంప్‌ను తప్పుబట్టాలి. తమ సైనిక దళాల చీఫ్ జనరల్ రాండీ ఏ. జార్జి ఏ దేశమైనా పోయి ఒప్పందాలు కుదుర్చుకొని వస్తే ఆయన శిరసావహిస్తారా? ఈసారి మునీర్ నాలుగు రోజులు అక్కడ తిష్ఠ వేశారు. నెల రోజుల్లోనే ఎందుకెళ్లాడో, ఆయన చేస్తున్న రాచకార్యమేమిటో తెలియదు. అటు అమెరికా ప్రభుత్వమూ బయటపెట్టదు. కానీ అమెరికాకు సంబంధించిన రాజకీయ నాయకులతోనూ, సైనిక నాయకత్వంతోనూ ఆయన భేటీలు జరిపాడు. అమెరికా సెంట్రల్ కమాండ్ కమాండర్ జనరల్ మైకేల్ ఈ.కురిలా రిటైర్మెంట్ సభలో పాల్గొనడానికి అక్కడికెళ్లినట్టు మీడియా కథనం. పాకిస్తాన్ సంతతి ప్రజలతోనూ సమావేశమయ్యారు. మునీర్ బెదిరింపులుగా ఇప్పుడు ప్రచారంలో ఉన్నవన్నీ ఆ సమావేశంలో మాట్లాడినవేనని చెబుతున్నారు. అధికారికంగా అయితే మునీర్ లేదా పాకిస్తాన్ సైన్యం ఈ మాటల్ని ధ్రువీకరించటానికి సిద్ధపడటం లేదు.

అణ్వస్త్ర దేశమని మిడిసిపడితే ఎవరు పూరకున్నా ఇరుగు పొరుగు దేశాలు మౌనంగా ఉండవు. మన విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పినట్టు ఈమాదిరి బాధ్యతా రాహిత్యాన్నీ, బ్లాక్‌మెయిలింగ్‌నూ మన దేశమైతే సహించదు. మునీర్ మాటల్ని భారత్ వక్రీకరిస్తోందని పాకిస్తాన్ విదేశాంగ శాఖ అనటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయనేమీ కోడ్ భాషలో మాట్లాడలేదు. ఆ ప్రసంగానికి సంబంధించిన కథనాన్ని బయటపెట్టింది కూడా అమెరికా మీడియానే. పైగా పాకిస్తాన్ ఏలికలు ఇలా మాట్లాడటం మొదటిసారేమీ కాదు. ఇక వక్రీకరణకు చోటెక్కడ?! ఏదో ఉన్మాదంలో నోరు జారివుంటే ఆ మాట చెప్పి తప్పయిందని ఒప్పుకోవాలి. విషయం బయటికొచ్చాక వణుకుడు దేనికి? ఉగ్రవాద మూకల్ని పంపి కల్లోలం సృష్టిస్తే, అణ్వస్త్రాన్ని ప్రయోగిస్తామని బెదిరిస్తే భారత్ హడలెత్తుతుందని పెహల్గాం అనంతర పరిణామాల తర్వాత కూడా పాకిస్తాన్ భ్రమల్లో ఉందంటే దాన్ని ఎవరూ రక్షించలేరు.

అమెరికా సంపన్న రాజ్యమే కావొచ్చుగానీ మంచీ మర్యాదా పాటించటం నేర్చుకోవాలి. కొత్తగా వచ్చిన భుజకీర్తుల మత్తుతో అమెరికాలో వాలిన మరో దేశ సైనిక దళాల చీఫ్ మిత్రదేశంతోపాటు ప్రపంచాన్నే బెదిరిస్తున్న వైనం కనబడుతున్నా గుడ్లప్పగించి చూడటం సబబేనా? చీవాట్లు పెట్టి పంపాల్సిన బాధ్యత లేదా? ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో ఈ మాదిరి వైఖరే ప్రదర్శించి అమెరికా భారత్‌కు దూరమైంది. ఆర్థిక సంస్కరణల అనంతరం క్రమేపీ చక్కబడుతూ వచ్చిన ద్వైపాక్షిక సంబంధాలు ఇలాంటి వింత చేష్టలతో ఛిద్రం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ట్రంప్‌దే! మునీర్ లాంటివాళ్లు ఇష్టానుసారం చెలరేగటాన్ని నిలువరించకపోతే తమకూ నష్టమేనని ఆయన గ్రహించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం; తిథి: బ.చవితి ఉ.8.15 వరకు, తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ప.1.06 వరకు, తదుపరి రేవతి; వర్జ్యం: రా.12.24 నుండి 1.54 వరకు; దుర్ముహూర్తం: ఉ.11.39 నుండి 12.29 వరకు; అమృత ఘడియలు: ఉ.8.32 నుండి 10.02 వరకు.

సూర్యోదయం: 5.45
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం: ప.12.30 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

పంపెయ్యాలి!



వలసదారులకు సరిహద్దులను ఉదారంగా తెరవడం... బిష్ణోయి టెర్రరిస్టులు, గ్యాంగ్‌స్టర్‌లను కెనడాలోకి వచ్చేట్టు చేసి, మన సమాజాలను భయకంపితులను చేసింది. బిష్ణోయి టెర్రరిస్టులను నిషేధించి, సభ్యులందరినీ అరెస్టు చేసి వెనక్కి పంపాలని పిలుపునిస్తున్నాం.

– పియరీ పొలీయవర్, కెనడా కన్జర్వేటివ్ పార్టీ నేత

దానికోసమా?



విదేశాంగ విధాన పరంగా అమెరికా ప్రభుత్వం నుంచి అస్సలు ఊహించనిది ఏమంటే– పాకిస్తాన్ కోసం ఇండియాతో సంబంధాలను తక్కువ చేసుకోవడం!

– మ్యాక్స్ అబ్రహామ్స్, ప్రొఫెసర్

మీరెంత గొప్పవారైనా!



పనిలో, జీవితంలో మీరెంత తెలివైనవారైనా, మీరెంత ప్రతిభావంతులైనా, మీరెంత అందమైనవారైనా... మీరు కూడా మంచి వ్యక్తిగానే ఉండాలి. మీకేం మినహాయింపులు ఉండవు.

– జాకీ చాన్, నటుడు

ఆ ముగ్గురూ!



మీ జీవితంలో మూడు రకాల వ్యక్తుల్ని ఎప్పుడూ మర్చిపోకండి. కష్ట సమయాల్లో మీకు సహాయం చేసినవారు. కష్ట సమయాల్లో మిమ్మల్ని వదిలేసి వెళ్లినవాళ్లు. కష్ట సమయాలను మీకు కల్పించినవారు!

– జెఫ్రీ మెల్జర్, థెరపిస్ట్

చెట్టొకటి చాలు



మానసికమైన ఒత్తిడిని తట్టుకోవటానికి ప్రకృతి కన్నా ఎక్కువగా మీకు ఏ వైద్యుడూ సహాయం చేయలేరు. ప్రకృతి ప్రశాంతతను ఇస్తుంది. నెమ్మదిగా ఉండటాన్ని నేర్పిస్తుంది. ఓర్పును అలవరుస్తుంది. ప్రకృతి కోసం అడవులు పట్టుకుని వెళ్లనక్కర్లేదు. మీ కళ్లెదురుగా కనిపించే ఒక పచ్చని చెట్టు కూడా ప్రకృతే!

– వివేక్ మీనన్, వైల్డ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

కొంతవరకే ఏఐ




సృజనాత్మకత అంటే చక్కటి అమరిక కాదు. చీలికలు, పేలికల వంటిది. తీరుగా లేకున్నా ఊహాశక్తి అసాధ్యాలను సైతం సుసాధ్యం చేస్తుంది. ఏఐకి ఉండే 'ఫీడ్' చేసిన ఊహాశక్తి అద్భుతాలను సృష్టించలేదు. కనుక మానవుడే మహనీయుడు!

– ప్రసూన్ జోషి, చైర్మన్, కేంద్ర సెన్సార్ బోర్డ్

ఈ దానం మానవతకే శిఖర ప్రాయం

సందర్భం



డా॥ ప్రతాప్ సి. రెడ్డి

ఆరోగ్య రక్షణ రంగంలో గడచిన దశాబ్దంలో భారతదేశం మెచ్చుకోదగిన విధంగా ముందంజ వేసింది. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను పటిష్ఠపరచింది. మాతా, శిశు మరణాల రేటును తగ్గించింది. ప్రమాణాలతో కూడిన ఆరోగ్య రక్షణను అందరికీ అందుబాటులోకి తేవడంలో పురోగతి సాధించింది. అయినా, అవయవాల మార్పిడికి వచ్చేసరికి, దురదృష్టవశాత్తు, ఒక మౌన సంక్షోభం వేలాది మంది జీవితాలను బలి తీసుకుంటూనే ఉంది.

విస్తృత స్థాయిలో అవయవ దానం అవసరం గురించి చాటి చెప్పేందుకు 'ప్రపంచ అవయవదాన దినోత్సవం' మనకొక అవకాశం కల్పిస్తోంది. అవయవ మార్పిడికి అవకాశం లేక ఒక వ్యక్తి ప్రాణాలను కోల్పోవడం కన్నా పెను విషాదం మరొకటి ఉండదు. ప్రాణాలను కాపాడగల అవయవం కోసం ఎదురు చూస్తూ ఏటా దాదాపు ఐదు లక్షల మంది భారతీయులు కన్ను మూస్తున్నారు.

మార్పిడికి అవయవం కొరవడటం వల్ల ఒక తోటి భారతీయుడిని లేదా భారతీయురాలిని కోల్పోవడం ఎంతమాత్రం అంగీకరించదగిన విషయం కాదు. ఎందుకంటే, మనం ఆ మరణాలను నివారించగలిగిన స్థితిలో ఉన్నాం. మనకు వైద్యపరమైన నైపుణ్యం ఉంది. కావాల్సిందల్లా అవయవాల సరఫరాకు, డిమాండ్‌కు మధ్యనున్న వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు జాతీయ స్థాయి సమష్టి సంకల్పమే!

అత్యవసరం – చేదు వాస్తవం

మూత్రపిండాల వ్యాధి చివరి దశలో ఉన్న రోగులు దాదాపు 2,00,000 మంది ఉన్నారు. తీవ్ర కాలేయ వైఫల్యంతో బాధపడుతున్నవారు 50,000 మంది ఉన్నారు. తీవ్ర గుండె జబ్బుతో బాధపడుతున్నవారు మరో 50,000 మంది ఉంటారు. వారి ప్రాణాలు కాపాడేందుకు అవయవ మార్పిడి అవసరం. దీనికి భిన్నంగా, ప్రతి ఏటా దేశంలో సుమారు 1,600 మూత్రపిండాలు, 700 కాలేయాలు, 300 గుండెల మార్పిడి చికిత్సలు మాత్రమే చోటుచేసుకుంటున్నాయి. అవసరమైన అవయవం దొరక్క వేచి చూస్తూనే ప్రతి రోజూ కనీసం 15 మంది చనిపోతున్నారు. అవయవ మార్పిడి కోసం ఎదురు చూసేవారి జాబితాలో, ప్రతి 10 నిమిషాలకు, ఒక కొత్త పేరు వచ్చి చేరుతోంది. వారందరి జీవితాలు కొనప్రాణాలతో ఉన్నట్లే లెక్క. చివరి దశ కిడ్నీ సమస్యతో ఉన్నవారిలో 5 శాతం కన్నా తక్కువ మందికే ప్రాణాలు కాపాడగల కిడ్నీ మార్పిడి జరుగుతోంది. గుండె, ఊపిరితిత్తుల పేషెంట్ల పరిస్థితి మరింత హృదయవిదారకం.



నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

◆ భారతదేశంలో అవయవ దానం రేటు ప్రపంచంలోనే అతి తక్కువ (ప్రతి పది లక్షల మందికి కేవలం 0.65 దాతలు). ప్రాణాలను కాపాడగల అవయవం కోసం ఎదురుచూస్తూ ఏటా దాదాపు ఐదు లక్షల మంది భారతీయులు కన్ను మూస్తున్నారు. ఇది పెను విషాదం.

ప్రపంచ స్థాయి ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు మనకి అందుబాటులో ఉన్నా, భారతదేశంలో అవయవ దానం రేటు ప్రపంచంలోనే అతి తక్కువగా (ప్రతి పది లక్షల మంది జనాభాకు కేవలం 0.65 దాతల చొప్పున) ఉంది. దీనికి భిన్నంగా, స్పెయిన్, క్రొయేషియా వంటి చిన్న దేశాల్లో కూడా ప్రతి పది లక్షల మందికి 30కి పైగా దాతలు అందుబాటులో ఉంటున్నారు. ఈ వ్యత్యాసం... భారతదేశంలో అవయవాల కొరత వైద్యానికి పరిమితమైన అంశం కాదనీ, సామాజిక, విధానపరమైన సవాల్‌గా పరిణమించిందనీ వెల్లడిస్తోంది.

ఒక దాత–ఎనిమిది జీవితాలు!

అవయవ దానం కేవలం ఒక క్లినికల్ ప్రొసీజర్ కాదు. అంతకన్నా మానవతకు అంతిమ ప్రతిచిహ్నం మరొకటి ఉండదు. ఒక దాత దేహం నుంచి గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు, ప్యాంక్రియాస్, కణజాలం వంటివి తీసుకుంటే ఎనమండుగురి ప్రాణాలను కాపాడవచ్చు. ఒక వ్యక్తి అవయవాలను దానం చేస్తే, ఒకరికి మించిన వ్యక్తులకు ప్రాణం పోసినవాళ్ళం అవుతాం. ఇంతకన్నా గొప్ప వారసత్వాన్ని మించి ఎవరైనా ఏమి విడిచి వెళ్ళగలరు?

మనం ఎంత చేయడానికి వీలుందో తెలుసుకునేందుకు సంజయ్ కందసామి కథనమే నిదర్శనం. అతను 1998లో, 20 నెలల శిశువుగా ఉన్నప్పుడు కాలేయ వైఫల్యం చివరి దశతో బాధపడుతూ, ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్స్‌లో కాలేయ మార్పిడి చేయించుకున్నాడు. కందసామి తండ్రే తన కాలేయంలో చిన్న ముక్కను దానం చేశాడు. ఈరోజు సంజయ్ డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూ అనేక మంది ప్రాణాలను నిలుపుతున్నాడు.

ఇది సైన్స్ గురించిన కథ కాదు. ప్రాణం దక్కించుకునేందుకు ఉన్న రెండవ అవకాశాల గురించిన కథనం. జీవితంపై ఆశలు చిగురింపజేయగల కథనం. ఒక రకంగా జీవితం గురించిన కథే!

ఊహాత్మక అనుమతి – జాతీయోద్యమం

స్థిరంగా ఎదురవుతున్న సవాల్ ఏమిటంటే, ఎవరన్నా తమ అవయవాలను దానం చేయాలని చెప్పి గతించినా కూడా సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు అందుకు అనుమతించేందుకు తిరస్కరిస్తున్నారు. చైతన్యాన్ని పెంచే ప్రచారాలు, విధానపరమైన మార్పుల ద్వారా ఆ యా కుటుంబాల వైఖరిలో మార్పు తేవాలి. దానం చేయడానికి యోగ్యత ఉన్న వ్యక్తి కుటుంబంతో కరుణామయమైన కమ్యూనికేషన్ నెరపడం చాలా కీలకం.

'ఊహాత్మక అనుమతి' భావనను స్వీకరించడం ద్వారా అవయవ దాన వ్యవస్థను నెలకొల్పే విధంగా సాహసోపేతమైన విధాన నిర్ణయం తీసుకోవడం మరొకటి. సింగపూర్, క్రొయేషియా, స్పెయిన్, యూరప్‌లోని ఇతర దేశాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. 'ఊహాత్మక అనుమతి' కింద, మరణానంతరం ప్రతి వయోజనుడినీ, అతని బంధువుల నిర్ణయంతో సంబంధం లేకుండా, అవయవ దాత కిందే పరిగణిస్తారు. తన మరణానంతరం కూడా తన అవయవాలను తీసుకోవడానికి లేదని సదరు వ్యక్తి బాహాటంగా నమోదు చేసుకుంటే తప్పించి, ఆ విధానం అమలవుతుంది. యూరప్‌లో ఈ ఊహాత్మక భావన, అవయవ దానాల పెరుగుదలపై సానుకూల ప్రభావం చూపింది. అవయవ దానాలు పెరిగాయి. అవయవ దానాల పట్ల సుముఖతా పెరిగింది.

సాహసోపేతమైన ఆలోచనలను అక్కున చేర్చుకోవడంలో భారతదేశం ఎల్లప్పుడూ ముందుంది. అవయవం దొరకక, మన ప్రజలు ప్రాణాలు పోగొట్టుకోవడాన్ని మనం ఎంత మాత్రం సహించకూడని సమయం వచ్చేసింది.

ఒక ప్రాణాన్ని నిలబెట్టే కానుకనివ్వడం జాతీయ ప్రాధాన్యంగా మారాలి. సరైన సమష్టి కార్యాచరణతోనే, అవయవ మార్పిడి అవసరమైన ప్రతి భారతీయునికీ అది లభించగల భవిష్యత్తులోకి మనం అడుగు పెట్టవచ్చు.

వ్యాసకర్త అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్

వాళ్ళు అడిగేది 'జీతాలు' పెంచమని! 'లాభాలు' పంచమని కాదు!

అభిప్రాయం



రంగనాయకమ్మ

ఒక వారం రోజులుగా, తెలుగు సినిమారంగంలో పనిచేస్తున్న కార్మికులు 'మా జీతాలు 30 శాతం పెంచాలి'! అనే డిమాండుతో సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మె చేస్తున్న వేలాది మంది కార్మికులలో, వేరు వేరు శాఖల్లో, రకరకాల శ్రమలు చేసే వాళ్ళున్నారు. మేధా శ్రమలు చేసేవారూ, శారీరక శ్రమలు చేసేవారూ, వాళ్ళల్లోనే నైపుణ్యంగల శ్రమలు చేసేవారూ, నైపుణ్యం లేని శ్రమలు చేసేవారూ, వాళ్ళల్లోనే మురికిని శుభ్రం చేసే శ్రమలు చేసే వారూ... ఇలా! రకరకాల శ్రమలు చేసే వారిని ఏ పేర్లతో పిలుస్తారో, వాళ్ళకి జీతాలు ఎంత తేడాగా ఉంటాయో– అటువంటి వివరాలన్నీ ఇక్కడ అనవసరం. ఇక్కడ మనం ప్రధానంగా మాట్లాడుకోవలసింది, సమ్మె చేస్తున్న కార్మికులు అడుగుతున్న 'జీతాల పెంపు' గురించి! జీతాలు పెంచాలి– అనేవాళ్ళ డిమాండ్ న్యాయమా, కాదా అన్నది తేలాలంటే, 'జీతం' అంటే ఏమిటో తెలుసుకోవాలి.

అసలు 'జీతం' అనేది ఒక మాయ తెర! దాని వెనక ఒక రహస్యం వుంది. ఈ సంగతి సమ్మె చేస్తున్న కార్మికులకూ తెలియదు, వాళ్ళకి జీతాలు ఇచ్చే యజమానులకూ తెలియదు. 'జీతం' అనేది, కార్మికులు చేసే 'శ్రమ మొత్తానికి' కాక, వాళ్ళు కేవలం శ్రమ చేసేవారిగా జీవించడానికి సరిపడేది మాత్రమే– అనేదే ఆ రహస్యం! అసలు విషయం, 'జీతంగా వచ్చేది ఏమిటీ' అన్నది తెలియాలి! విషయాలు తేలిగ్గా అర్థం కావడానికి ఒక్క కార్మికుణ్ణే తీసుకుందాం.

మన ఉదాహరణలో, 'కాల్షీట్' అనే పేరుతో నడిచే 'పనిదినం'లో, కార్మికుడు 12 గంటలు పని చేసినందుకు, నిర్మాత 1,200 జీతం ఇస్తాడనుకుందాం. కానీ, కార్మికుడు చేసే శ్రమ, యజమానికి ఎంత విలువని ఇస్తుందంటే, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం 2,400 విలువని ఇస్తుంది. అంటే, కార్మికుడు ఏ రోజు పనిచేసినా ఆ రోజున, యజమానికి 1,200 విలువ గల శ్రమని 'ఉచితంగా' ఇస్తున్నాడన్న మాట! జీతాన్ని 30 శాతంగా పెంచినా, అది మొత్తం శ్రమ విలువ అవదు! అదీ తక్కువే! అప్పుడు కూడా, తీసుకునే జీతం కన్నా అదనంగా ఇచ్చే శ్రమ విలువే 'అదనపు విలువ'. ఇది 'శ్రమ దోపిడీ'! కానీ, ఈ విషయం, ఇటు కార్మికులకూ తెలియదు; అటు యజమానులకూ తెలియదు!

◆ నిజం చెప్పాలంటే, నిర్మాత కార్మికుడికి జీతం 30 శాతం పెంచి, 1,360 ఇచ్చినా, ఆ కార్మికుడి నించీ 70 శాతం విలువ గల శ్రమని 'ఉచితంగానే' లాగుతాడు! ఉచితంగా లాగే, ఈ అదనపు విలువని, పెట్టుబడిదారీ యజమానులూ, వారి ఆర్థిక శాస్త్రవేత్తలూ, 'లాభం' అని ముద్దుగా పిల్చుకుంటారు.

ఇప్పుడు వచ్చిన సమస్య కార్మికుడు యజమానితో అనేది: 'ఒక రోజుకి నువ్విచ్చే 1,200, మా కుటుంబ పోషణకి చాలడం లేదు. ఇంకో 30 శాతం పెంచు! ఇక నించీ 1,200 కాకుండా, 1,360 ఇవ్వు!' అని కార్మికుడు అనడం. 'అలా వీల్లేదు. నాకు అసలే ఖర్చులు బాగా పెరిగిపోయాయి. (హీరో గారికి కోట్లలో ఇవ్వాలి మరి!)' అంటాడు నిర్మాత! నిజం చెప్పాలంటే, నిర్మాత కార్మికుడికి జీతం 30 శాతం పెంచి, 1,360 ఇచ్చినా, ఆ కార్మికుడి నించీ 70 శాతం విలువ గల శ్రమని 'ఉచితంగానే' లాగుతాడు! ఉచితంగా లాగే ఈ అదనపు విలువను, పెట్టుబడిదారీ యజమానులూ, వారి ఆర్థిక శాస్త్రవేత్తలూ 'లాభం' అని ముద్దుగా పిల్చుకుంటారు. కార్మికులు ఇచ్చే అదనపు విలువ నించే, సినిమా తీయడానికి ఖర్చు పెట్టిన డబ్బుకి వడ్డీ, షూటింగు చేసే స్టూడియోకి అద్దే, సినిమాని ప్రదర్శించే సినిమా హాళ్ళకి అద్దే, ప్రభుత్వానికి కట్టవలసిన పన్నులూ, చివరికి తనకి మిగిలే 'లాభమూ'– అన్నీ... కార్మికుల అదనపు విలువనించీ వచ్చేవే!

ఈ సమ్మె సందర్భంగా కొందరు మధ్యవర్తులు, 'నిర్మాత కూడా బాగుండాలి గదా? అతన్ని ఇబ్బంది పెడితే ఎలా? నిర్మాతలుంటేనే గదా, కార్మికులకి పనులు దొరికేది?' అంటూ, కార్మికులకు సర్ది చెపుతూ, జీతం మరీ అంతగా పెంచమని ఒత్తిడి చెయ్యవద్దని హితవు పలుకుతున్నారు. మన అమాయక సమ్మెకారులు కూడా, 'అవును! నిర్మాతలు బాగుంటేనే కదా, మాకు పనులు దొరికేది. కాకపోతే, మా బాగు కూడా కొంచెం ఆలోచించమంటున్నాం' అని అంటారు. అసలు ఆలోచించవలసింది – నిర్మాతలకి పెట్టుబడికి, ఆ మొదటి డబ్బు ఎక్కడిది?– అని! వాళ్ళ తండ్రులదీ, తాతలదీ అంటారా? ఆ తాతలకి అంత డబ్బు కూడటానికి కారణం – ఈనాటి కార్మికుల తాతల్నించీ ఆనాడు లాగిన అదనపు విలువే! (''అదనపు విలువలో ఒక భాగాన్ని ఆదాయంగా పెట్టుబడిదారుడే తన కుటుంబ పోషణకు ఉపయోగించుకుంటాడు. ఇంకో భాగాన్ని కొత్త పెట్టుబడిగా ఉపయోగించుకుంటాడు'' అనే విషయాన్ని, మార్క్స్ తన 'పెట్టుబడి' అనే పరిశోధనా గ్రంథంలో – రుజువు చేశాడు.)

ఇంతకీ, సమ్మె చేస్తున్న, సినిమా రంగంలోని, మన పిచ్చి కార్మికులు ఏ మడుగుతున్నారు? వాళ్ళు అడిగేది జీతాలు పెంచమని! లాభాలు పంచమని కాదు! ఎంత అల్ప సంతోషులు మన కార్మిక జనాలు!

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

ఉద్యమాలే ఊపిరిగా...

ఇన్ బాక్స్



అనిశెట్టి రజిత

అనిశెట్టి రజితతో 1990 నుండి 35 ఏళ్లగా విడదీయని అనుబంధం. ఎపుడూ నిండు హృదయంతో 'అన్నా' అంటూ ఉండేది. ఆమె వామపక్ష భావజాలంలో వికసించిన స్త్రీవాది, బహుజనవాది, కార్యకర్త, నాయకురాలు, మేధావి, కవయిత్రి, రచయిత్రి, సంకలనకర్త. ఆమె మృతితో తెలుగు సాహిత్యం గొప్ప యోధనూ, సాహితీవేత్తనూ కోల్పోయింది.

1973లో 'చైతన్యం పడగెత్తింది'తో రజిత రచనా జీవితం మొదలైంది. 500కు పైగా కవితలు, వందకు పైగా వ్యాసాలు, 30కి పైగా పాటలు రాశారు. 'గులాబీలు జ్వలిస్తున్నాయి' (1994), 'నేనొక నల్లమబ్బు నవుతా' (1997), 'చెమట చెట్టు' (1999), 'ఓ లచ్చవ్వ' (2005), 'ఉసురు' (2002), 'గోరంత దీపాలు' (2005) వంటి కవితా సంపుటాలతో పాటు 'మట్టి బంధం' కథల సంపుటి వెలువరించారు.

రజిత తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారు. బీసీల్లోని ఉప్పరి/సగర సామాజిక వర్గం నుండి రాతి నేలను చీల్చుకొని మహావృక్షంలా ఎదిగారు. ఎక్కడ ఏ ఉద్యమం ఉన్నా అక్కడ ఆమె ఉండేవారు. విప్లవోద్యమాలకు పేరుగాంచిన కాకతీయ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ స్టాఫ్ (సీనియర్ అసిస్టెంట్)గా 1992లో చేరారు. 2019లో రిటైరయ్యారు. కాళోజీ, కాత్యాయనీ విద్మహే, జ్యోతి వంటి సాహితీవేత్తలతో సహవాసం ఆమె చైతన్యాన్ని నిత్యం ప్రజ్వరిల్ల జేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో కూడిన 'దరకమే' ఐక్య వేదిక నిర్మాణంలో రజిత చురుకుగా పాల్గొన్నారు. 1995లో 'దరకమే' ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యారు.

ఆమె సంపాదకత్వంలో 'వెతలే కథలై', 'జిగర్', 'ముజఫర్ నగర్ మారణకాండ' వంటి సంకలనాలు వెలువరించారు. బహుజన, బీసీ, మహిళా ఉద్యమాలలో సావిత్రీ బాయి పూలే వారసత్వాన్ని కొనసాగించిన అనిశెట్టి రజితకు జోహార్లు.

(ఆగస్టు 11న మరణించిన 'ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక' జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజితకు నివాళిగా)

– బి.ఎస్. రాములు । తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఇ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

ఆహారంలో కల్తీ

ఆహారానికి సంబంధించిన భద్రతా ప్రమాణాలను 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పర్యవేక్షిస్తుంది. దేశవ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ప్రమాణాలు పాటించని, కల్తీకి పాల్పడే ఆహార వ్యాపారుల(ఎఫ్‌బీఓ)పై కేసులు పెడుతుంది. అలా 2024-25లో...

తనిఖీ చేసిన శాంపిళ్లు: 1,94,116
ప్రమాణాలకు అనుగుణంగా లేనివి: 34,388
మొత్తంలో వీటి శాతం: 17.71%
పెట్టిన కేసులు: 31,407

ఆధారం: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ

కృష్ణతత్వం

జ్యోతిర్మయం

పాండవుల బలం గురించి మాటిమాటికీ అడుగుతూ ఉండే ధృతరాష్ట్రుడికి సంజయుడు చెప్పిన కృష్ణతత్వం అనంతం. 'జగాలన్నీ ఒక ఎత్తు, కృష్ణుడు ఒక్కడూ ఒక ఎత్తు. అతని ముందు ఎన్నున్నా ఏవున్నా దుర్బలాలు. అతని సంకల్పాన్ని బట్టి సృష్టి, పుష్టి, నష్టి కలుగుతూ ఉంటాయి. సత్యమూ, ధర్మమూ స్థిరంగా ఉన్న చోట కృష్ణుడు ఉంటాడు. అక్కడే జయమూ ఉంటుంది. అన్ని లోకాలూ తానే అయి అన్ని జీవులలో ఆత్మగా ఉంటూ విహరిస్తూ ఉంటాడు. మాయను స్వీకరించి ఈ లోకంలో ఏదో రూపాన పుట్టి దుష్టశిక్ష, శిష్ట రక్ష చేస్తూ ఉంటాడు. పాండవుల కష్టాలు పోగొట్టాలనే నెపంతో ధర్మబాహ్యులైన నీ కొడుకులను నిగ్రహించడానికే ఆయన వచ్చా'డంటాడు సంజయుడు.

'ఆ దేవుని తత్వం ఏ మాత్రం తెలిసిన వారైనా సరే ఆయన్ని ఆశ్రయిస్తారు. హాయిగా బతుకుతారు. విద్య, అవిద్య అని రెండున్నాయి. అవిద్యకు లొంగినవాడు తామసుడై విష్ణువును తెలుసుకోలేడు. విద్వాంసుడే తెలుసుకోగలడు. విద్య అంటే ఎలాంటిదంటే, సత్వ రజ స్తమో గుణాల వికారాలకు లొంగక ధర్మాన్ని అనుష్ఠిస్తూ భావశుద్ధి కలిగి ఉండటమే. విష్ణువును తెలుసుకోవడానికి ఎవరికైనా ఇదే దారి. విద్యా లక్షణాలకి విరుద్ధమైన పద్ధతి అవిద్య' అని సంజయుడు చెప్పగా ధృతరాష్ట్రుడు తన కుమారుడు దుర్యోధనుడిని 'ధర్మపరుడవై కృష్ణుణ్ణి ఆశ్రయిస్తే నువ్వూ నీ తమ్ములూ సుఖంగా బతకొచ్చు' అంటాడు. కానీ దుర్యోధనుడికి ఆ మాటలు రుచించవు. గాంధారితోనూ చెప్పిస్తాడు ధృతరాష్ట్రుడు. కానీ వింటేగా దుర్యోధనుడు!

అన్నిటిలో తాను ఉంటూ అన్నిటినీ తనయందు ఉంచుకుంటాడు... ఇదే 'వాసుదేవ' నామానికి అర్థం. దీనిని సరిగ్గా తెలుసుకున్నవారు శుభ ఫలితం పొందుతారు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

తెగించి.. తీగలు బిగించి



కోహెడ రూరల్ (హుస్నాబాద్): విద్యుత్ అధికారుల సాహసం ఆదర్శంగా నిలుస్తోంది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నాగసముద్రాల చెరువు లోని విద్యుత్ స్తంభం 11 కేవీ తీగ తెగిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు లైన్‌మన్ హైముద్దీన్‌కు సమాచారమిచ్చారు. ఆయన అసిస్టెంట్ లైన్‌మన్‌తో కలిసి చెరువులోకి దిగి.. తెగిన తీగలను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వీరి సాహసాన్ని గ్రామస్తులు అభినందించారు.

అమెరికా వీసా రాక యువతి ఆత్మహత్య

జగిత్యాల జిల్లా హస్నాబాద్‌లో విషాదం



హర్షిత (ఫైల్)

జగిత్యాల క్రైం: విదేశాల్లో ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించాలని కలలుగన్న ఓ యువతి.. వీసా రాకపోవడం.. రూ.10 లక్షలు నష్టపోవడంతో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా కాంగాడిపాలెం గ్రామానికి చెందిన నల్లమోతు శ్రీనివాస్, వెంకటఅరుణ దంపతులు 25 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి వచ్చారు. గ్రామ శివారులో పప్పు మిల్లు లీజుకు తీసుకున్నారు. అలాగే పశువులు పెంచుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె హర్షిత (25) డిగ్రీ పూర్తి చేసి అమెరికా వెళ్లేందుకు గుర్తుతెలియని వ్యక్తికి రూ.10 లక్షలు చెల్లించింది. అతడు వీసా తెప్పించకపోవడంతో కొద్దికాలంగా జర్మనీ వెళ్తానని తండ్రి శ్రీనివాస్‌తో చెబుతోంది. డబ్బు లేదని ఈ ప్రతిపాదనకు తండ్రి నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన హర్షిత ఈనెల 6న పప్పు మిల్లు వద్ద గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి.. అక్కడినుంచి కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. మంగళవారం వేకువజామున మృతిచెందింది. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

సరిహద్దుల్లో తెలంగాణ జవాను మృతి

ప్రమాదవశాత్తు జారిపడటంతో దుర్ఘటన

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి రోజువారీ గస్తీ విధుల్లో ఉన్న తెలంగాణకు చెందిన జవాన్.. ఏటవాలు ప్రాంతంలో జారిపడి ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణకు చెందిన భానోత్ అనిల్ కుమార్ (31) మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీలో సిపాయిగా పనిచేస్తున్నారు. ఆయన సోమవారం ఉడి సెక్టార్‌లోని బోర్డర్ పోస్ట్‌లో గస్తీ విధుల్లో ఉండగా.. జారిపడి, అక్కడికక్కడే కన్నుమూశారని ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపాయి. అనిల్‌కుమార్ మృతదేహాన్ని ఉడి ఉప జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించాయి.

ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడి మృతి



సదానందం (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన మునుగంటి సదానందం (48) యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం మొదటి షిఫ్ట్‌లో డ్యూటీకి వెళ్లిన సదానందం స్ట్రీమ్‌లైన్ వాల్‌ను ఓపెన్ చేశారు. దీంతో స్ట్రీమ్ వాల్ ప్రెషర్ ఎక్కువై.. పైపు పగిలి సదానందం నుదిట గట్టిగా తగిలింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సదానందం 25 సంవత్సరాల క్రితం గోదావరిఖని నుంచి ఆలేరుకు వలస వచ్చాడు. ప్రమాద ఘటనపై పరిశ్రమ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సదానందం డ్యూటీ అక్కడ కాకున్నా ఎందుకు వెళ్లాడో, ఎవరు పంపించారనే విషయమై ఆరా తీస్తున్నట్టు చెప్పారు. వాస్తవానికి సదానందం డ్యూటీ రెండవ షిఫ్ట్ కాగా, కంపెనీ యూనియన్ మీటింగ్ మధ్యాహ్నం ఉందని మొదటి షిఫ్ట్‌లో వచ్చాడు. రెండో షిఫ్ట్‌లో వచ్చి ఉంటే.. ఈ ఘటన జరిగి ఉండేది కాదని తోటి కార్మికులు చెప్పారు.



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద నీటిలో మునిగిన కారు



వరంగల్ రైల్వేస్టేషన్‌లో నీట మునిగిన పట్టాలు

వరంగల్‌ను ముంచెత్తిన వరద

- రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి నీరు.. కొద్దిసేపు రైళ్ల రాకపోకలకు అంతరాయం
- గొల్లబుద్దారం ప్రభుత్వ పాఠశాలలోకి వరదనీరు.. 400 మంది విద్యార్థులకు ఇబ్బంది
- వరద నీటిలో మునిగి ఓ వృద్ధురాలు మృతి
- పర్వతగిరి మండలంలో పశువుల కాపరి గల్లంతు
- సంగారెడ్డి జిల్లాలో వాగులో కొట్టుకుపోయి ఒకరు మృతి
- ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు



సూర్యాపేట జిల్లా సంగెంలో బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద



సంగారెడ్డి జిల్లాలో పత్తి చేనులో చేరిన ఒండ్రు మట్టి

సాక్షి, వరంగల్/ఖమ్మం/నల్లగొండ నెట్‌వర్క్: వరంగల్ నగరాన్ని వరద ముంచెత్తింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వాన దంచికొట్టింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఉన్న మూడు పట్టా లైన్లు నీట మునిగి రైళ్ల రాకపోకలకు కొంతసేపు అంతరాయం కలిగింది. రైల్వే సిబ్బంది నీటిని బయటకు పంపడంతో రైళ్ల రాకపోకలు సాగాయి. హంటర్ బ్రిడ్జ్ రోడ్డులోకి భారీగా వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాశీకుంట వాంబేకాలనీలోని ఇంట్లోకి నీరు వచ్చి మంచం మునగడంతో దానిపై పడుకున్న వృద్ధురాలు పసునూటి బుచ్చమ్మ చనిపోయింది. కొన్ని ప్రాంతాల్లో వరద నీటిలో చిక్కుకున్న వారిని పోలీసులు రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఖిలా వరంగల్ కోట నీటిలో మునిగింది.

- వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామంలో గేదెలను బయటకు తోలేందుకు ఆకేరు వాగులో దిగిన పశువుల కాపరి కందికట్ల ఉప్పలయ్య వరదనీటిలో గల్లంతయ్యారు.
- గొల్లబుద్దారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగిపోవడంతో పాఠశాల ప్రాంగణం ఒక చిన్న చెరువును తలపించింది. దాదాపు 400 మంది విద్యార్థులు పాఠశాల లోపలే చిక్కుకుపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఖమ్మం జిల్లాలో....

ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పాలేరు రిజర్వాయర్ సామర్థ్యం 23 అడుగులు కాగా 23.15 అడుగులు, వైరా రిజర్వాయర్ 18.03 అడుగులకుగాను 18.08 అడుగుల మేర ప్రవాహంతో పోటెత్తుతున్నాయి. ఇక తిరుమలాయపాలెం మండలం రాకాసితండాను గతేడాది ఆకేరు వరద ముంచెత్తగా ఈసారి మంగళవారం సాయంత్రానికి ఆకేరు వరద పెరిగి సీతారామ ఆక్వాటెక్ట్‌కు తాకి ప్రవహిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో....

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామం వద్ద వలిగొండ– తొర్రూరు ప్రధాన రహదారిపై బ్రిడ్జి పనులు సాగుతుండగా, తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. వరద నీరు దిగువకు వెళ్లక అక్కడే చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వెలిశాలలో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వ లైనింగ్ దెబ్బతిన్నది. భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు, రుద్రవెల్లి గ్రామాల మధ్య గల లోలెవల్ బ్రిడ్జి పై నుంచి మూసీనది ఉధృతి కొనసాగింది. దీంతో పోచంపల్లి నుంచి బీబీనగర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి.

నీళ్లు నిలిచి.. ఒండ్రు చేరి..

సంగారెడ్డి జిల్లాలో పత్తి చేలన్నీ నీట మునిగాయి. కొన్ని చోట్ల మొక్కలు ఎర్రగా, మరికొన్నిచోట్ల నల్లగా మారి మురిగిపోయాయి. భారీ వర్షం పడినప్పుడు పొలాల్లో నీళ్లు పారుతుండటంతో ఒండ్రుమట్టి వచ్చి చేరుతోంది.

సంగారెడ్డి జిల్లాలో....

రాయికోడ్(అందోల్): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూసుఫ్‌పూర్ గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాస్(35) మంగళవారం రాయికోడ్ నుంచి స్వగ్రామానికి పయనమయ్యాడు. గ్రామ సమీపానికి చేరుకోగానే వాగులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీనివాస్ వరద నీటిలో నుంచి గ్రామం వైపు దాటేందుకు ప్రయత్నించాడు. వరద ఉధృతికి ఒక్కసారిగా వరద నీటిలో కొట్టుకుపోయి మరణించాడు.

72 గంటలు హై అలర్ట్

▶ మొదటి పేజీ తరువాయి

జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వరద ముంపు పరిస్థితుల్లో ట్రాఫిక్ సమస్యను నివారించడానికి శాంతిభద్రతల విభాగం పోలీసుల సేవలను కూడా వినియోగించుకోవాలని చెప్పారు. రాబోయే 72 గంటలు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కాజ్‌వేలు, వంతెనలపై రాకపోకలు ఆపండి

'లోతట్టు కాజ్‌వేలు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగులు, వంకల వంతెనలపై నుంచి రాకపోకలు లేకుండా చూడాలి. పశువులు, గొర్రెలు, మేకల కాపర్లు తరచూ వాగుల్లో చిక్కుకుపోతున్నారు. వారిని అప్రమత్తం చేయాలి. ఎక్కడైనా ప్రమాదవశాత్తు చిక్కుకుంటే వారిని తక్షణమే బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలి. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలి. డ్రైనేజ్ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. గతంలో ఖమ్మంలో 2 గంటల్లో 42 సెం.మీ వర్షం పడింది. అలాంటి పరిస్థితులను కూడా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. మన దగ్గర 24 గంటల్లో 2 సెం.మీ వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణాలు నిర్మాణం అయ్యాయి. కాబట్టి ఒకటీ రెండు గంటల్లోనే 20, 30 సెంటీమీటర్ల వర్షం (క్లౌడ్ బరస్ట్) పడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. అలాంటి పరిస్థితులను కూడా ఎదుర్కొనేలా సన్నద్ధం కావాలి. అత్యధిక స్థాయిలో వర్షాలు పడే జిల్లాలు ప్రాంతాలను ముందుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలి. సహాయక చర్యలకు అవసరమైన నిధులు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది..' అని సీఎం చెప్పారు.

నీటి విడుదలపై అలర్ట్ చేయాలి..

'అకస్మిక వరదలు సంభవించినపుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్లు ఉండేలా చూసుకోవాలి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అవసరమైన మందులు ఉంచాలి. గర్భిణులను తక్షణమే తరలించేలా అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలి. ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. అవసరమైతే పాఠశాలలు, కళాశాలలకు సెలవు ఇవ్వడంపై జిల్లా కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలి. ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోపై నీటిపారుదల శాఖ పూర్తి అవగాహనతో ఉండాలి. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలపై పూర్తి సమాచారం లోతట్టు ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలి. చెరువులు, కుంటలు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవాలి..' అని రేవంత్ ఆదేశించారు.

జిల్లాలు కమాండ్ కంట్రోల్‌తో టచ్‌లో ఉండాలి..

'భారీ వర్షాల సమయంలో ప్రజలు బయటకు రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. అన్ని జిల్లాలను కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేయాలి. వారికి ఎప్పటికప్పుడు అలర్ట్ సమాచారం ఇవ్వాలి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా అందరూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. వర్షాలు, వరదల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఎఫ్‌ఎం రేడియోలలో అలర్ట్ చేయాలి. సాధ్యమైనంత వరకు రోడ్లపై ట్రాఫిక్ తక్కువగా ఉండేలా చూడాలి. మీడియా తప్పుడు వార్తలతో భయానక వాతావరణం సృష్టించే ప్రయత్నం చేయొద్దు. సమాచార శాఖ మీడియాకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలి..' అని సీఎం సూచించారు.

అన్ని విభాగాలూ సమన్వయంతో పని చేయాలి

'హైదరాబాద్‌లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా వ్యవహరించాలి. 24 గంటలూ అందుబాటులో ఉండాలి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సమన్వయంతో పని చేయాలి. జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పోలీస్, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సిబ్బంది.. ప్రతి విభాగం సమన్వయంతో పని చేయాలి. అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

'పెన్నా' కేసులో రాజగోపాల్‌కు ఊరట

సాక్షి, హైదరాబాద్: పెన్నా సిమెంట్స్ కేసులో అప్పటి మైనింగ్ డైరెక్టర్ డాక్టర్ వీడీ రాజగోపాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు విచారణను తాత్కాలికంగా నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలని నిర్ణయించింది. కర్నూల్ జిల్లాలో పెన్నా సిమెంట్స్‌కు లీజు మంజూరులో రాజగోపాల్ చట్టవిరుద్ధంగా వ్యవహరించారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. అయితే, పదవీ విరమణ చేసిన అధికారుల విచారణకు ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం 2018లో చట్టసవరణ చేసిందని.. ప్రాసిక్యూషన్‌కు సీబీఐ ఎలాంటి అనుమతి పొందలేదని సుప్రీంకోర్టులో రాజగోపాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విచారణ చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. 2013లో పెన్నా సిమెంట్స్‌పై కేసు నమోదు చేసిందన్నారు. రాజగోపాల్‌ను నిందితుల జాబితాలో చేర్చుతూ దాఖలు చేసిన అభియోగ పత్రాన్ని 2020లో సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకుందని నివేదించారు.

కృష్ణాకు పోటెత్తుతున్న వరద

శ్రీశైలం 4 గేట్లు, సాగర్ ప్రాజెక్టు 18 గేట్లు ఎత్తివేత



నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 18 గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు



శ్రీశైలం నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నాగార్జునసాగర్/దోమలపెంట/నల్లగొండ: ఎగువ నుంచి కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. మంగళవారం జూరాల, సుంకేశుల నుంచి 1,57,373 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు వస్తోంది. దీంతో విద్యుదుత్పత్తి, ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 1,74,608 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 883 అడుగుల నీటిమట్టం వద్ద 204 టీఎంసీల నిల్వ ఉంది.

- శ్రీశైలం జలాశయం నుంచి వస్తున్న వరదకు తోడు, స్థానికంగా కురిసే వర్షాలతో సాగర్ జలాశయానికి 1,86,258 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312,0450టీఎంసీలు)కాగా.. ప్రస్తుతం 589.50 అడుగులు (310.5510టీఎంసీలుగా) ఉంది. సాగర్ జలాశయం 18 గేట్లు 5 అడుగులు ఎత్తి 1,44,864 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిండుకుండలా ఉదయ సముద్రం

పానగల్లు ఉదయసముద్రం చెరువు నిండుకుండలా ఉంది. ఈ రిజర్వాయర్‌కు ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ ద్వారా నీరు వస్తోంది. ఈ చెరువు నుంచి పలు గ్రామాలకు తాగునీరు అందుతోంది.

సీబీఐకి 'గట్టు' దంపతుల హత్యకేసు

- మళ్లీ దర్యాప్తు చేయాలని సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం
- పిటిషనర్ గట్టు కిషన్‌రావుకు భద్రత కల్పించాలని సూచన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణి హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ కేసును తిరిగి దర్యాప్తు చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. వామనరావు తండ్రి గట్టు కిషన్‌రావుకు భద్రత కల్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తన కుమారుడు, కోడలి హత్య కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రావు 2021 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కె. సింగ్లా ధర్మాసనం సీబీఐ విచారణకు ఆదేశించింది. కిషన్‌రావు తరఫున సీనియర్ న్యాయవాదులు మేనక గురుస్వామి, చంద్రకాంత్‌లు వాదనలు వినిపించారు.

నడిరోడ్డుపై హత్య: పెద్దపల్లి జిల్లా మంథని సమీపంలోని కల్వచర్ల వద్ద కారులో వెళ్తున్న వామనరావు, నాగమణి దంపతులను 2021 ఫిబ్రవరి 17న దుండగులు అడ్డగించి నడిరోడ్డుపైనే కత్తులతో నరికి చంపారు. మొదట ఈ కేసును స్థానిక పోలీసులు దర్యాప్తు చేశారు. దానిని సీబీఐకి అప్పగించాలని కిషన్‌రావు అదే ఏడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. విచారణలో భాగంగా హత్యకు సంబంధించిన వీడియోలు, పత్రాలు సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని గతంలో కోర్టు ఆదేశించింది. చనిపోయే ముందు వామనరావు ఇచ్చిన మరణ వాంగ్మూలం వీడియోపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఎఫ్‌ఎస్‌ఎల్‌కి పంపించగా, అది అసలుదేనని ల్యాబ్ నివేదిక తేల్చింది. ఈ నివేదికతోపాటు అన్ని రికార్డులు పరిశీలించిన సుప్రీంకోర్టు.. కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తూ తీర్పు చెప్పింది. సీబీఐ దర్యాప్తుపై ఎలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం కోర్టుకు తెలియ చేసింది.

వామన్‌రావు కేసులో దోషులను శిక్షించాలి: మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగించిందని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో అసలు దోషులు, వారికి సహకరించిన అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే వామన్‌రావు కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు.

3 రోజులు భారీ వర్షాలు!

వాతావరణ శాఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇది 48 గంటల్లో బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. మరోవైపు ఉత్తర అంతర్గత కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది సముద్ర మట్టం నుంచి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నట్లు పేర్కొంది. ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో వచ్చే మూడు రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ, ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని హెచ్చరించింది. చాలాచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో భారీ నుంచి అతిభారీ, అత్యంత భారీ వర్షాలు నమోదు కావొచ్చని హెచ్చరించింది.

సాధారణ స్థాయికి వర్షపాతం

హైదరాబాద్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మేడ్చల్-మల్కాజిగిరి, ములుగు, పెద్దపల్లి, సిద్దిపేట, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇలావుండగా తాజాగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో సీజన్ సగటు వర్షపాతం సాధారణ స్థాయికి చేరింది. ప్రస్తుత నైరుతి సీజన్‌లో మంగళవారం నాటికి రాష్ట్రంలో సగటున 44.54 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 44.37 సెంటీమీటర్లకు చేరింది. అయితే ఇంకా 8 జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉంది. 16 జిల్లాల్లో సాధారణం, 9 జిల్లాల్లో అధిక వర్షాపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే..40 మండలాల్లో అత్యధికం, 164 మండలాల్లో అధికం, 278 మండలాల్లో సాధారణం, 139 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది.

కాపులకనపర్తిలో 21.83 సెం.మీ వర్షం

సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు నమోదయ్యాయి. ప్రస్తుత సీజన్‌లో ఇదే పెద్ద వర్షాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మంగళవారం రాష్ట్రంలో సగటున 2.04 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 10.4 సెంటీమీటర్ల సగటు వర్షం కురిసింది. జనగామ జిల్లాలో 5.09 సెంటీమీటర్లు, నల్లగొండ జిల్లాలో 4.07 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తిలో అత్యధిక స్థాయిలో 21.83 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సంగెంలో 19.1 సెంటీమీటర్లు నమోదు కాగా..సూర్యాపేట జిల్లా నాగారంలో 19.03, ఫణిగిరిలో 18.33 సెంటీమీటర్లు, ఖిల్లా వరంగల్ ఉర్సు వద్ద 15.85 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు అత్యధికంగా ములుగు జిల్లా మంగపేటలో 13.08 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

భారీ వర్షంలోనూ శంకుస్థాపనలు



కాల్వశ్రీరాంపూర్ (పెద్దపల్లి): ఉరుములు, మెరుపులు.. భారీ వర్షం ఒకవైపు.. సౌర విద్యుత్ ప్లాంట్ స్థాపన, సీసీ రోడ్లు, పాఠశాలల ప్రహరీల నిర్మాణానికి శంకుస్థాపనలు మరోవైపు.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పాండవుల గుట్ట, మడిపెల్లి, మడిపెల్లి కాలనీ, ఆశన్నపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మంగళవారం వర్షంలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిపారు.

ఒక్క నీటి చుక్కా తీసుకోనివ్వం..!

భారత్‌నుద్దేశించి పాక్ ప్రధాని షరీఫ్ బెదిరింపులు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌కు చెందాల్సిన జలాల్లో భారత్‌ను ఒక్క నీటి చుక్క కూడా తీసుకోనివ్వబోమని ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఏప్రిల్ 22న కశ్మీర్‌లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం భారత ప్రభుత్వం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా పలు చర్యలను ప్రకటించింది. ఇందులో 1960ల నాటి సింధూ జలాల ఒప్పందం (ఐడబ్ల్యూటీ)నుంచి వైదొలగడం కూడా ఉంది. తద్వారా సింధూ జలాలను దిగువకు విడుదల చేయకుండా ఆపేసింది. దీనిపై పాక్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఇది యుద్ధ నేరమే అవుతుందంటూ ప్రకటనలు కూడా చేసింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న పాక్ ప్రధాని షరీఫ్..'మా శత్రు దేశానికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నా.. మా నీళ్లను ఆపుతామంటూ మీరు బెదిరిస్తున్నారు కదా. పాకిస్తాన్‌కు చెందాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా మిమ్మల్ని తీసుకోనివ్వం. ఇది గుర్తుపెట్టుకోండి'అంటూ వ్యాఖ్యానించారు. పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో కూడా సోమవారం ఇలాంటి ప్రేలాపనలే చేయడం గమనార్హం.

డొనెట్స్క్‌ను రష్యాకు ఇచ్చే ప్రసక్తే లేదు: జెలెన్‌స్కీ

బ్రస్సెల్స్: కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా డొనెట్స్క్ ప్రాంతం మొత్తాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ కోరుతున్నట్లు తెలిసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. మంగళవారం ఆయన బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో మీడియాతో మాట్లాడారు. రష్యా ఆర్మీ ఇప్పటికే డొనెట్స్క్‌లోని 70 శాతం భూభాగంలో తిష్ట వేశాయన్నారు. మిగతా 30 భాగం, 9 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న తమ సేనలను ఉపసంహరించుకునే ప్రశ్నే లేదన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకం. డొనెట్స్క్ మొత్తాన్ని రష్యాకు ఇచ్చి వేయడమంటే రష్యా ఎప్పటినుంచో కన్నేసిన కీలక పారిశ్రామిక ప్రాంతం డాన్‌బాస్ మొత్తాన్నీ ధారాదత్తం చేయడమే అవుతుందని జెలెన్‌స్కీ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ నెల 15న అలస్కాలో సమావేశమై ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించనుండటం తెల్సిందే.

మళ్లీ డ్రాగన్‌తో విమాన బంధం!

చైనాకు నేరుగా భారతీయ విమాన సర్వీసులు

- త్వరలో సేవలు పునరుద్ధరించనున్న ఎయిర్‌ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్!
- ఎట్టకేలకు నాలుగేళ్ల తర్వాత మొదలుకానున్న పౌరవిమాన సేవలు

న్యూఢిల్లీ: కోవిడ్ సంక్షోభం, గల్వాన్ ఉద్రిక్తతలతో బీటువారిన చైనా, భారత్ బంధానికి భారతీయ విమానాలు మళ్లీ ఆకాశ మార్గాన స్నేహవారధి నిర్మించను న్నాయి. నాలుగేళ్లుగా ఆగిపోయిన భారత్, చైనా నేరుగా విమానసర్వీసులను త్వరలో పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. టియాజిన్ సిటీలో జరగబోయే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో పర్యటించనున్న నేపథ్యంలో భారత్–చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు పునరుద్ధరణ బాటలో పయనిస్తుండటం విశేషం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా టారిఫ్‌ల మోత మోగించడంతో విసిగిపోయిన భారత్, చైనాలు మళ్లీ స్నేహగీతాన్ని ఆలపించనున్నాయని, అందులో భాగంగానే నేరుగా విమానసర్వీసుల పునర్‌ప్రారంభానికి శ్రీకారం చుడుతున్నారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నాలుగు సరిహద్దు రాకపోకల మార్గాల గుండా సరకు రవాణాకు ఇరుదేశాలూ మొగ్గు చూపుతున్నవేళ నాలుగేళ్ల తర్వాత ఎట్టకేలకు డైరెక్ట్ ఫ్లైట్ సేవలు అందుబాటులోకి రానున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నూతన ఎయిర్‌సర్వీసుల ఒప్పందం త్వరలో ఖరారు కాబోతోందని ఆయా వర్గాలు తెలిపాయి. ఇది ఒకవేళ ఖరారుకాక పోయినాసరే పాత విధానంలో విమాన సర్వీసులను మొదలు పెట్టాలని చూస్తున్నారు. ఎయిర్‌ఇండియా, ఇండిగో వంటి దేశీయ పౌర విమానయా సంస్థలు ఇకపై నేరుగా చైనాకు విమాన సర్వీసులను మొదలెట్టాలని మోదీ సర్కార్ సూచించినట్లు తెలుస్తోంది.



గల్వాన్ నుంచి గట్టిబంధం దిశగా

2020 మేలో తూర్పు లద్దాఖ్‌లో ఇరు దేశాల సైనికుల మధ్య ఉద్రిక్తతకు బీజం పడింది. జూన్‌లో గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య జరిగిన ముష్టిఘాతం, పిడిగుద్దులు, ఘర్షణ కారణంగా ఇరువైపులా జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. దీంతో సరిహద్దు వెంట గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో భారీ ఎత్తున సైన్యాన్ని మోహరించి ఉద్రిక్తతలను మరింత పెంచారు. దీంతో భారత్, చైనా సత్సంబంధాలు అడుగంటాయి. పాస్‌పోర్ట్‌లు, దిగుమతులు, అనుమతులు మొదలు మరెన్నో రంగాల్లో సత్సంబంధానికి బీటలు పడ్డాయి. అయితే ట్రంప్ ఇష్టారీతిన విధించిన దిగుమతి సుంకాల భారంతో ఇబ్బందులు పడుతున్న భారత్, చైనాలు ఉమ్మడిగా ఈ సమస్యను పరిష్కరించుకుందామని భావిస్తున్నాయి. ఇందుకోసం మళ్లీ స్నేహగీతం పాడక తప్పని నెలకొంది. గత కొద్దినెలలుగా ఇందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. చైనా జాతీయులకు పర్యాటక వీసాలు ఇచ్చేందుకు భారత ప్రభుత్వం గత నెలలో అంగీకారం తెలిపింది. దాదాపు ఏడేళ్ల తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు సిద్ధపడ్డారు. చైనాతో బంధం బలపడాలని తాము కోరుకుంటున్నామని ఆదేశ పర్యటనను ఖరారుచేసి మోదీ సూచనప్రాయంగా చెప్పారు. భారత్ వంటి దేశాలపై టారిఫ్‌ను అమెరికా పెంచడాన్ని చైనా సైతం తీవ్రంగా పరోక్షంగా ఖండించింది. ఇలా నెమ్మదిగా బలపడుతున్న మైత్రీ బంధాన్ని నేరుగా విమానసర్వీసుల ద్వారా మరింత పటిష్టంచేయాలని భారత్ ఆశిస్తోంది. చివరిసారిగా మోదీ చైనాలో 2018 జూన్‌లో పర్యటించారు. ఆ తర్వాతి ఏడాది అక్టోబర్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు.

సుప్రీంకోర్టులోనూ వీధికుక్కల సంచారం

- ధర్మాసనం సీరియస్
- మిగిలిన ఆహారాన్ని మూతలున్న చెత్తబుట్టలోనే వేయాలని ఆదేశం



న్యూఢిల్లీ: దేశరాజధానిలో వీధికుక్కల స్వైరవిహారంతో విసిగిపోయిన సర్వోన్నత న్యాయస్థానం వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశాలిచ్చిన మరుసటిరోజే మరోసారి వాటి ప్రస్తావన తెచ్చింది. సుప్రీంకోర్టు ప్రాంగణంలోనూ వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని అసహనం వ్యక్తంచేసింది. మిగిలిపోయిన ఆహారాన్ని మూతలున్న చెత్తబుట్టలో పడేయకుండా కోర్టుకాంప్లెక్స్‌లో ఎక్కడపడితే అక్కడ పడేయడంతో ఈ సమస్య తీవ్రతరమైందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఢిల్లీ–జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) పరిధిలోని వీధి శునకాలను కచ్చితంగా షెల్టర్లకు తరలించాలంటూ మంగళవారం జారీచేసిన ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు భవన పరిస్థితినీ ధర్మాసనం ప్రస్తావించింది. '' సుప్రీంకోర్టుకు వచ్చి ప్రతి ఒక్కరూ తాము వెంట తీసుకొచ్చిన, కొనుగోలుచేసిన ఆహారం మిగిలిపోతే దానిని కచ్చితంగా మూసిఉన్న డస్ట్‌బిన్‌లోనే పడేయండి. ఇష్టమొచ్చిన చోట పడేస్తే దానిని తినేందుకు వీధికుక్కలు సుప్రీంకోర్టు ప్రాంగణమంతా సంచరిస్తున్నాయి. కారిడార్లు మొదలు లిఫ్టుల దాకా ప్రతిచోటా వీధి శునకాలు కనిపిస్తున్నాయి. కుక్క కాట్ల నుంచి తప్పించుకోవాలంటే వాటికి ఆహారం దొరక్కుండా మూతలున్న చెత్తబుట్టలో పడేయండి. బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పడేయకండి. ఆహారం లభించకపోవడంతో అవి ఇక సుప్రీంకోర్టు ప్రాంగణాలకు రావడం మానేస్తాయి. కుక్క కాటు ముప్పు తప్పుతుంది. కోర్టుకు వచ్చి ప్రతి ఒక్కరి సహకారంతో న్యాయస్థానం పరిసరాలు వీధికుక్కల కాట్ల నుంచి సురక్షితంగా ఉంటాయి'' అని ధర్మాసనం అభిప్రాయపడింది.

శిక్ష పూర్తయితే తక్షణం విడుదల చేయండి

- సుప్రీంకోర్టు ఆదేశం
- శిక్షాకాలం ముగిసినా జైళ్లలో ఖైదీలుగా మగ్గిపోతున్న వైనంపై కోర్టు ఆందోళన



న్యూఢిల్లీ: పూర్తి శిక్షను అనుభవించి, శిక్షాకాలం పూర్తిచేసుకున్న ఖైదీలను తక్షణం విడుదలచేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేవలం ఒక్క కేసులోనే దోషిగా తేలి శిక్షపూర్తిచేసుకుని, మరే ఇతర కేసులో దోషిగా, నిందితునిగా లేని ఖైదీలను వెంటనే విడుదలచేయాలని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం స్పష్టంచేసింది. 2002లో సంచలనం సృష్టించిన నితీశ్ కటారా హత్య కేసులో 20 ఏళ్ల శిక్షాకాలాన్ని ఈ ఏడాది మార్చితో పూర్తిచేసుకున్నా ఇంకా జైలులో మగ్గిపోతున్న సుఖ్‌దేవ్ యాదవ్ అలియాస్ పహిల్వాన్‌ను వెంటనే విడుదలచేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. '' చట్టాన్ని అతిక్రమించి ఎవరినీ తమ తమ వ్యక్తిగత స్వేచ్ఛాజీవితాన్ని హరించి జైలుకు పరిమితం చేయకూడదు. ఇది రాజ్యాంగంలోని 21వ అధికరణానికి పూర్తి విరుద్ధం. పూర్తి శిక్షను అనుభవించాక కూడా విడుదలకాకుండా జైళ్లలోనే ఉండిపోయిన వారిని వెంటనే విడుదలచేయండి'' అంటూ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల హోం శాఖ కార్యదర్శులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ తీర్పు పూర్తి స్థాయిలో అమలయ్యేలా నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీల సచివాలయాల సభ్యులు, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీలకు సమాచారం ఇవ్వండి'' అని కోర్టు ఆదేశించింది. 2002నాటి హత్య కేసులో పహిల్వాన్‌కు పడిన 20 ఏళ్ల జైలుశిక్ష ఈ ఏడాది మార్చి 9వ తేదీన ముగిసింది. ఈ లెక్కన మార్చి పదో తేదీన ఆయన జైలు నుంచి విడుదలవ్వాలి. కానీ ఇప్పటికీ తాను జైళ్లోనే ఉండిపోవాల్సి వస్తోందని పహిల్వాన్ పెట్టుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి తీర్పునిచ్చింది. ఉత్తరప్రదేశ్ రాజకీయనేత డీపీ యాదవ్ కుమార్తె భారతియాదవ్‌కు నితీశ్ కటారా ప్రేమించాడు. వేరే కులానికి చెందిన నితీశ్ తన సోదరితో సన్నిహితంగా కొనసాగడం భారతి సోదరుడు వికాస్ యాదవ్‌కు ఏమాత్రం నచ్చలేదు. దీంతో పహిల్వాన్ సాయంతో నితీశ్‌ను 2002 ఫిబ్రవరి 16 రాత్రి కిడ్నాప్‌చేయించి హత్యచేయించాడు. ఈ పరువు హత్య కేసులో పహిల్వాన్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష పడింది.

ఆధార్ ఓటర్ ఐడీ / పౌరసత్వ రుజువులు కావు!

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ఇతర ధ్రువీకరణలు తప్పనిసరి
- జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు
- ఈసీ వాదనకు పూర్తి సమర్థన



న్యూఢిల్లీ: పౌరసత్వ రుజువులకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్తంగా పదిహేనేళ్లకు పైగా అన్ని రకాల అవసరాలకూ ఏకైక గుర్తింపు కార్డుగా చెలామణిలో ఉన్న ఆధార్, ఓటు హక్కుకు గుర్తింపు అయిన ఓటర్ కార్డు రెండూ పౌరసత్వానికి రుజువులు కాబోవని కుండబద్దలు కొట్టింది. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం వైఖరి, వాదన సరైనవేనని స్పష్టం చేసింది. ''పౌరసత్వానికి ఆధార్ పూర్తిస్థాయి రుజువు కాబోదు. దాన్ని ఇతరత్రా మార్గాల ద్వారా నిర్ధారణ చేసుకోవడం తప్పనిసరి'' అని న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఐఆర్) పేరిట భారీగా ఓట్లను తొలగిస్తున్నారంటూ దాఖలైన కేసుల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. అదే సందర్భంలో బిహార్‌లో ఎన్నికల జాబితా ధ్రువీకరణకు ఈసీకి ఉన్న అధికారాలపై కీలక ప్రశ్నలు కూడా లేవనెత్తింది. దీన్ని ముందుగా తేల్చాల్సి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ''ఈసీకి ఓటర్ల జాబితా ధ్రువీకరణ అధికారమే గనక లేనిపక్షంలో ఈ వ్యవహారం ఇక్కడితో ముగిసిపోయినట్టే అన్నారు. ఎస్ఐఆర్ ముసుగులో బిహార్‌లో ఈసీ తలపెట్టిన కసరత్తు కారణంగా భారీ సంఖ్యలో ఓటర్లు జాబితా నుంచి గల్లంతవుతున్నారని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ముఖ్యంగా ఈసీ తాజాగా కోరుతున్న డాక్యుమెంట్లు సమర్పించని వారంతా ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వెలిబుచ్చారు. ''అప్పుడెప్పుడో 2003 నాటి ఓటర్ల జాబితాలో ఉన్నవారు కూడా తాజాగా ఈసీ కోరిన అన్ని పత్రాలూ సమర్పించడాన్ని తప్పనిసరి చేశారు. అలా చేయ ని వాళ్ల పేర్లను నాటికీ, నేటికీ వారి చిరునామాలతో సహా ఎలాంటి మార్పు లూ లేకపోయినా సరే ఓటర్ల జాబితా నుంచి తీసేస్తున్నారు. బిహార్‌లో 7.24 కోట్ల మంది తాజాగా కోరిన పత్రాలు సమర్పించినట్టు ఈసీ జాబితా వెల్లడిస్తోంది. అయినా సరే, ఏకంగా 65 లక్షల మందిని సరైన విచారణ కూడా లేకుండానే మృతులు, వలసదారులుగా ముద్ర వేసి జాబితా నుంచి తొలగించేశారు!'' అంటూ సిబల్ వాదించారు. పైగా ఈ విషయంలో శాస్త్రీయమైన సర్వే ఏదీ చేపట్టలేదని అఫిడవిట్ సాక్షిగా ఈసీయే అంగీకరించిందని ధర్మాసనానికి విన్నవించారు.

వాస్తవాలా, ఊహలా: ధర్మాసనం

బిహార్‌లో తాజాగా 65 లక్షల ఓట్లు తొలగించారనేందుకు ప్రాతిపదిక ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ల సందేహాలు, ఆందోళనలు వాస్తవికమా, లేక కేవలం ఊహాజనితాలా అని తెలుసుకోగోరింది. బిహార్లో 2025 జాబితాలో 7.9 కోట్ల ఓటర్లున్నట్టు సిబల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ''వారిలో 4.9 కోట్ల మంది 2003 నాటి ఓటరు జాబితాలోనూ ఉన్నారు. అందులో 22 లక్షల మందిని మృతులుగా నమోదు చేశారు'' అన్నారు. మృతి, చిరునామా మార్పు కారణంగా ఓటర్ల జాబితా నుంచి మినహాయించిన వారి పేర్లను కోర్టుకు గానీ, వెబ్‌సైట్‌లో గానీ ఈసీ అందుబాటులో ఉంచలేదని మరో సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. ''అడిగితే, దీనికి సంబంధించి బూత్ స్థాయి ఏజెంట్లకు ఏదో సమాచారం ఇచ్చామంటూ ఈసీ పొంతన లేని సమాధానం చెబుతోంది. అసలు ఇలాంటి సమాచారాన్ని ఎవరికైనా ఇవ్వాల్సిన అవసరమే తమకు లేదని బుకాయిస్తోంది'' అంటూ ఆక్షేపించారు. ఆధార్, రేషన్ కార్డులను గుర్తింపు కార్డుగా జోడిస్తూ సమర్పించే పత్రాలను ఇతరత్రా మార్గాల ద్వారా ధ్రువీకరించుకోవడం ఈసీ బాధ్యత అని ధర్మాసనం పేర్కొంది. ఓటర్ల జాబితా నుంచి తొలగించడం వంటి కీలక నిర్ణయానికి వచ్చేముందు మిస్సింగ్ డాక్యుమెంట్లకు సంబంధించి బాధ్యులకు ముందుగా సమాచారమిచ్చారా లేదా అని ఈసీని ప్రశ్నించింది.

జస్టిస్ వర్మ ఆరోపణలపై త్రిసభ్య కమిటీ

ప్రకటించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ/చెన్నై/బెంగళూరు: పార్లమెంట్‌లో అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన ప్రక్రియ మొదలైంది. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలంటూ అధికార, ప్రతిపక్షాల ఎంపీలు ఇచ్చిన నోటీసును పరిగణనలోకి తీసుకున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం తెలిపారు. న్యాయమూర్తుల విచారణ చట్టం–1968 ప్రకారం ఆరోపణలపై విచారణకు ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహీంద్ర మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ లాయర్ బీవీ ఆచార్య(91) ఉన్నారు. కమిటీ నివేదిక అందాక జస్టిస్ వర్మ తొలగింపు చర్యలు మొదలవుతాయన్నారు. జూలై 21వ తేదీన తనకిచ్చిన నోటీసుపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 146 మంది లోక్‌సభ సభ్యుల సంతకాలున్నాయని స్పీకర్ బిర్లా తెలిపారు. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ ఇంట్లో మార్చి 14న అగ్ని ప్రమాదం సంభవించడం, ఫైర్ సిబ్బందికి కాలిన నోట్ల కట్టలు కనిపించడం తీవ్ర సంచలనానికి కారణమైంది. ఘటన అనంతరం జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టు బదిలీ చేస్తూ సుప్రీం ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా మార్చిలో ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ సైతం జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి మే 4న నివేదిక అందజేసింది. జస్టిస్ వర్మ రాజీనామా చేయాలి లేదా అభిశంసన ప్రక్రియను ఎదుర్కోవాలని సీజేఐ కోరారు. జస్టిస్ వర్మ రాజీనామాకు నిరాకరించడంతో ఇప్పుడు పార్లమెంట్‌లో అభిశంసన ప్రక్రియ మొదలైంది. కాగా, స్పీకర్ బిర్లా ప్రకటించిన కమిటీలోని బీవీ ఆచార్య ఆరు దశాబ్దాల అనుభవం కలిగిన అత్యంత సీనియర్ న్యాయవాది. కర్ణాటక అడ్వొకేట్ జనరల్‌గా 1989–2012 సంవత్సరాల మధ్య ఐదు పర్యాయాలు పనిచేశారు. తమిళనాడు దివంగత సీఎం జయలలిత అక్రమాస్తుల కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు.

పరిశోధనల కోసం భారీగా పెట్టుబడులు



ముంబై: దేశంలో పరిశోధనలకు అనువైన వాతా వరణం కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూ పాయలను ఖర్చు చేస్తు న్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. మన దేశంలో సంప్రదాయానికి ఆవిష్కరణలు తోడయ్యా యన్నారు. ముంబైలో మంగళవారం మొదలైన 18వ అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉండే ఆస్ట్రనామికల్ అబ్జర్వేటరీల్లో లద్దాఖ్‌లో ఒకటుందని తెలిపారు. చేతితో నక్షత్రాలను తాకవచ్చని అనిపించేలా ఇది సముద్రమట్టానికి 4,500 మీటర్ల ఎత్తులో ఉందని చెప్పారు. చంద్రుని దక్షిణ ధ్రువంపైకి ఉపగ్రహాన్ని విజయవంతంగా ల్యాండ్ చేసింది మనమేనన్నారు. దేశవ్యాప్తంగా కోటి మంది విద్యార్థులు అటల్ టింకెరింగ్ ల్యాబ్‌లలో స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాథమేటిక్స్)అంశాలను ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారని వివరించారు.

టారిఫ్‌లకు మరో 90 రోజుల విరామం

అమెరికా–చైనా అంగీకారం

వాషింగ్టన్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా–చైనాల మధ్య ఉద్రిక్తతలకు కొంత విరామం దొరికింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి చైనాపై అమల్లోకి రావాల్సిన భారీ టారిఫ్‌లను 90 రోజులపాటు వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై సంతకం చేశానని సొంత ట్రూత్‌సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. చైనా వాణిజ్య శాఖ కూడా ఇదే రకమైన ప్రకటన చేసింది. అమెరికా ఉత్పత్తులపై అదనంగా విధించిన టారిఫ్‌లకు 90 రోజుల పాటు విరామమిస్తున్నట్లు తెలిపింది. ఈ పరిణామంతో రెండు దేశాలు తమ మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటు లభించినట్లయింది. అంతేకాదు, ఈ ఏడాది చివర్లో జరగాల్సిన ట్రంప్– జిన్‌పింగ్‌ల శిఖరాగ్రానికి మార్గం సులువైనట్లేనని భావిస్తున్నారు. తాజా పరిణామాన్ని చైనాతో వాణిజ్యం చేసే అమెరికా కంపెనీలు స్వాగతించాయి. ప్రమాదకర డ్రగ్ ఫెంటానిల్‌పై ఒప్పందం కుదిరితే, అమెరికా టారిఫ్‌లు తగ్గుతాయి, చైనా ప్రతీకార చర్యలను ఉపసంహరించుకుంటుందని అమెరికా–చైనా బిజి నెస్ కౌన్సిల్ ప్రెసిడెంట్ సీన్ స్టెయిన్ అభి ప్రాయపడ్డారు. దాదాపు అన్ని దేశాలపైనా అత్యధికంగా టారిఫ్‌లు, పన్నులు విధించడం ద్వారా ప్రపంచ వాణిజ్య వ్యవస్థను కకావికలం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా విషయంలో మాత్రం తాత్సారం చేస్తు న్నారు. కీలక ఖనిజాలు, ఎలక్ట్రిక్ వాహ నాలు మొదలు జెట్ విమానాల ఇంజన్ల వరకు వాడే మాగ్నెట్లపై చైనా ఆధిపత్యం ఉండటమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ ఏడాది మేలో చైనా ఉత్పత్తులపై 145 శాతం టారిఫ్‌లను ట్రంప్ ప్రకటించగా, అమెరికా ఉత్పత్తులపై డ్రాగన్ దేశం 125శాతం టారిఫ్ లను విధించింది. అనంతరం, రెండు దేశాలు వెనక్కి తగ్గి, జెనీవాలో చర్చలు మొదలుపెట్టాయి.

‘ఓట్ల చోరీ’ దారుణాలు ఇంకెన్నో

- దేశవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో ఇదే తంతు
- ఈసీది పూర్తి బాధ్యతారాహిత్యం
- రాహుల్‌గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ: ఎన్నికల్లో నకిలీ ఓట్లు తిష్టవేసినా, వాస్తవిక ఓటర్ల ఓట్లు చోరీకి గురైనా కేంద్ర ఎన్నికల సంఘం పూర్తి బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షపార్టీల ఆందోళన సందర్భంగా మీడియాతో రాహుల్ గాంధీ మాట్లాడారు. '' ఒకే వ్యక్తికి ఒకే ఓటు అనే ప్రాథమిక సూత్రాన్ని సైతం సమర్థవంతంగా అమలుచేయడంలో ఈసీ ఘోరంగా విఫలమైంది. ఓటర్ల జాబితాలో అక్రమాలకు అంతే లేదు. కర్ణాటక, మహారాష్ట్రలకు మాత్రమే ఈ ‘ఓట్ల చోరీ’ పరిమితం కాలేదు. ఇది జాతీయస్థాయిలో, దేశవ్యాప్తంగా ఎన్నో నియోజకవర్గాల్లో ఓట్ల చోరీ జరిగింది. ఈ దారుణాలన్నీ ఈసీకి తెలుసు. ఇప్పుడు మనకు పూర్తిగా అవగతమవుతోంది. ఈ దారుణాలకు సంబంధించి గతంలో మన వద్ద ఎలాంటి సాక్ష్యాధారాలు లేవు. కానీ ఇప్పుడు మనకు చేతికి ఆధారాలొచ్చాయి. ఇప్పుడు మేం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాం. ఒక పౌరుడికి ఒకే ఓటుది రాజ్యాంగానికి పునాది లాంటిది. ఒక పౌరుడికి ఒకే ఓటు' అనే విధానాన్ని ఈసీ సమర్థవంతంగా అమలుచేయలేకపోయింది'' అని రాహుల్ ఆరోపించారు. 35 ఏళ్ల మింతా దేవి వయసును 124 ఏళ్లుగా పేర్కొంటూ బిహార్‌లో ఓటరు జాబితాలో చేర్చడాన్ని మీడియా రాహుల్ వద్ద ప్రస్తావించగా.. '' ఇలాంటి చిత్రాలు ఇంకెన్నో ఉన్నాయి. వేచి చూడండి. ఇంకా చాలా బయటపడతాయి'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

కొనసాగిన సవరణ సమరం

- విపక్షాల నినాదాలుతో స్తంభించిన పార్లమెంట్
- ఆందోళనల నడుమే పలు బిల్లులకు మోక్షం

న్యూఢిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అంశం మరోమారు పార్లమెంట్‌ను కుదిపేసింది. కొన్ని బిల్లులకు మోక్షం లభించడం మినహా సభలో కీలక అంశాలేవీ చర్చలకు నోచుకోలేదు. ఎస్ఐఆ ర్‌పై చర్చ జరపాలన్న డిమాండ్ నుంచి విపక్ష సభ్యులు మొండిపట్టు పట్టడంతో పలు మార్లు వాయిదాల తర్వాత లోక్‌సభ, రాజ్యసభలు ఆగస్టు 18వ తేదీకి వాయిదా పడ్డాయి. స్వాతంత్రదినోత్స వేడుకలను పురస్కరించుకుని పార్లమెంట్ ఉభయసభల్లో సభాకార్యక్రమాలకు ఆగస్టు 13 నుంచి 17వ తేదీదాకా తాత్కాలిక విరామం ఇచ్చారు. లోక్‌సభ మంగళవారం ఉదయం ప్రారంభంకాగానే విపక్షసభ్యులు ఎస్ఐఆర్ అనుకూల నినాదాలిస్తూ సభ సజావుగా సాగకుండా అడ్డుకున్నారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. దీంతో తర్వాత ఇదే పునరావృతమైంది. దీంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదావేశారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ బిల్లులకు పార్ల మెంట్ ఆమోదం ఆరు దశాబ్దాలనాటి పాత ఇన్‌కమ్‌ట్యాక్స్ చట్టం ,1961కు బదు లుగా తీసుకొచ్చిన నూతన ఆదాయపన్ను చట్టా నికి పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. కొత్త పన్ను రేట్లు మోపడంలేదని, కేవలం కఠిన పదాలను తొలగించి సరళమైన పదాలతో బిల్లును తీసుకొచ్చామని రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 1961నాటి చ ట్టంలో 819 సెక్షన్లు ఉంటే వాటి ని 536కు కుదించాం. పదేపదే ప్రస్తావిస్తూ ఉన్న పదాలతో పాటు కఠిన పదాలను తొలగించాం. దీంతో బిల్లులోని 5.12 లక్షల పదాలకు ఏకంగా 2.6 లక్షల పదాలకు తగ్గాయి. 39 కొత్త టేబుళ్లను, 40 కొత్త ఫార్ములా లను జతచేశాం'' అని సీతారామన్ పేర్కొన్నారు. ట్యాక్సేషన్ ట్టాలు (సవరణ) బిల్లు, 2025సహా మొత్తంగా ఆరు బిల్లులను పార్లమెంట్ ఆమోదించింది.

పేపర్లు చించి..

అంతకముందు లోక్‌సభలో కొంత అనూహ్యఘటన చోటుచేసుకుంది. ఎస్ఐఆర్ సంబంధ నినాదాలు చేస్తూ విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి కొన్ని పేపర్లు చింపేసి అధ్యక్ష పీఠం వైపు చిందరవందరగా విసిరారు. దీనిపై ఎన్‌డీఏ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.



మింతా దేవి ఫొటో టీ-షర్ట్‌లు ధరించి నిరసన

35 ఏళ్ల బిహార్ మహిళా ఓటరు వయసును 124 ఏళ్లుగా ఎస్ఐఆర్‌లో పేర్కొనడాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో విపక్ష ఎంపీలు వినూత్న నిరసనకు దిగారు. మింతా దేవి ఫొటో ముద్రించిన తెలుపురంగు టీ–షర్ట్‌లను కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ సహాపలువురు ఎంపీలు ధరించి ఈసీ, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలుచేశారు. 124 నాట్‌అవుట్ అని ఆ టీ–షర్ట్‌పై రాసి ఉంది. మన ఓటు, మన హక్కు, మన పోరాటం అనే బ్యానర్‌తో ముందుకు కదిలారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్‌సోనియాగాంధీ, టీఎంసీ నేత డెరెక్ ఓబ్రియాన్, డీఎంకే నేత టీఆర్ బాలు, ఎన్‌సీపీ(ఎస్పీ) సుప్రియాసూలే తదితర ఎంపీలు పార్లమెంట్ మకరద్వారం వద్దకు చేరుకుని ఎస్ఐఆర్‌ను తక్షణం నిలిపివేయాలని నినాదాలిచ్చారు. ఎస్ఐఆర్ అంశాన్ని విపక్ష ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించడం ఇది 15వ రోజు.

4 సెమీ కండక్టర్ల ప్రాజెక్టులకు కేంద్రం ఓకే

- రూ.4,594 కోట్ల పెట్టుబడికి కేబినెట్ ఆమోదం
- ఆంధ్రప్రదేశ్‌లోనూ చిప్ తయారీ ప్లాంట్

న్యూఢిల్లీ: దేశంలో సెమీకండక్టర్లకు మరింత డిమాండ్ పెరిగిన నేపథ్యంలో నూతనంగా మరో నాలుగు సెమీ కండక్టర్ల ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఒడిశాల్లో నెల కొల్పబోయే ఈ 4 సెమీ కండక్టర్ల ప్రాజెక్టుల కోసం మొత్తంగా రూ.4,594 కోట్లు పెట్టు బడిగా పెట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో చిప్‌ల తయారీ కర్మాగారాల స్థాపన కోసం ఉద్దేశించిన రూ.76,000 కోట్ల ఆర్థికతోడ్పాటునందించే 'ఇండియా సెమీ కండక్టర్‌మిషన్' విధానంలో భాగంగానే ఈ 4 ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపారు. కేబినెట్ భేటీ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ''సిక్‌సెమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.2,066 కోట్ల పెట్టుబడితో ఒడిశాలోని భువనేశ్వర్‌లో సిలికాన్ కార్బైడ్ సెమీ కండక్టర్ ప్లాంట్‌ను నెలకొల్పనుంది. సిలికాన్ కార్బైడ్ అనేది అత్యంత కఠినమైన ముడి పదార్థం. ఇది అత్యధిక ఉష్ణోగ్రతలను తట్టుకుని పనిచేయగలదు. ఈ పదార్థాన్ని క్షిపణులు, కృత్రిమ ఉపగ్రహాలు, టెలికం టవర్లు, రాకెట్లు, రైల్వే ఇంజిన్లలో ఉపయోగిస్తారు. ఏడాదికి 9.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించే లక్ష్యంతో ఈ చిప్ తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేస్తున్నాం. ఒడిశాలోనే మరో రూ.1,943 కోట్లతో అమెరికా చిప్ తయారీ దిగ్గజమైన ఇంటెల్ తోడ్పాటుతో 3డీ గ్లాస్ సెమీకండక్టర్ తయారీ యూనిట్ ఏర్పాటుకూ కేబినెట్ ఆమోదం తెలిపింది. హెటి రోజీనియస్ ఇంటిగ్రేషన్ ప్యాకేజింగ్ సొల్యూ షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏటా 5 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ రూ.468 కోట్లతో చిప్ ప్యాకేజింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏటా 9.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తారు'' అని మంత్రి వైష్ణవ్ చెప్పారు. పంజాబ్‌లో సీడీఐఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఏటా 15.8 కోట్ల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో రూ.117 కోట్ల పెట్టుబ డితో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

మరికొన్ని ప్రాజెక్టులకూ అనుమతులు

రూ.8,146.21 కోట్ల వ్యయంతో అరుణాచల్ ప్రదేశ్‌లోని శియోమీ జిల్లాలో 700 మెగావాట్ల టాటో–2 జలవిద్యుత్‌ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంగా 72 నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.5,081 కోట్లతో లక్నో మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 1బీకి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఫేజ్–1బీలో భాగంగా 34 కిలోమీటర్ల పొడవునా మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు.

వారి ఓసీఐ కార్డులు రద్దు: కేంద్రం



న్యూఢిల్లీ: రెండేళ్లకు తక్కువ కాకుండా జైలు శిక్ష పడిన లేదా ఏడేళ్లు అంతకుమించి జైలు శిక్ష పడే నేరారోపణలు ఎదుర్కొనే వారి ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ)కార్డులను రద్దు చేస్తామని హోం శాఖ మంగళవారం తెలిపింది. పౌరసత్వ చట్టం–1955లోని సెక్షన్ 7డీ ప్రకారం ఈ మేరకు చర్యలు తీసుకునే అధికారముందని పేర్కొంది. ఎటువంటి వీసా అవసరం లేకుండా నేరుగా భారత్ సందర్శించేందుకు ప్రవాస భారతీయులకు వెసులుబాటు కల్పించేదే ఓసీఐ కార్డు. 2005లో కేంద్రం ఓసీఐ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. 1950 జనవరి 26వ తేదీ తర్వాత భారత పౌరులైన, భారత పౌరులయ్యేందుకు అర్హత కలిగిన భారత సంతతికి చెందిన వారంతా ఓసీఐగా నమోదు చేసుకునే వీలు కల్పించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, తదితర కేంద్రం గుర్తించిన దేశాల వారు మాత్రం ఈ పథకానికి అనర్హులు.

జమిలి ఎన్నికల జేపీసీ గడువు పెంపు



న్యూఢిల్లీ: 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానంలో భాగంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లుల పరిశీలనకు ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ గడువును కేంద్రం తాజాగా మరోసారి పొడిగించింది. శీతాకాల సమావేశాల చివరి వారం వరకు పొడిగిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) చైర్‌పర్సన్ పీపీ చౌదరి ప్రవేశపెట్టిన బిల్లును లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దీని ప్రకారం 2025 శీతాకాల సెషన్ చివరి వారం వరకు ఈ ప్యానెల్‌కు గడువు పొడిగించారు. 129వ రాజ్యాంగ సవరణకు సంబంధించిన ఈ బిల్లుల్లో ఒకటి లోక్‌సభ ఎన్నికలతోపాటే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు ఉద్దేశించింది కాగా, మరోటి లోక్‌సభతోపాటే కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూకశ్మీర్‌ల్లోనూ ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించింది.

బుధవారం, 13, ఆగస్టు, 2025



వృద్ధ దంపతులను నిర్బంధించి.. చోరీ
కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. వృద్ధ దంపతులపై దాడి చేసి, వారిని నిర్బంధించి బంగారు పుస్తెలతాడు, బీరువాలోని నగదును అపహరించారు. -8లో



షెహర్.. బస్కింగ్ హుషార్
మెట్రో నగరాల్లో ఇప్పటికే బాగా ఊపుమీదున్న బస్కింగ్ కల్చర్ మన నగరంలోనూ ఊపందుకుంటోంది. ఏ ఖర్చూ లేకుండా కళా ప్రదర్శనలు అందుబాటులోకి వస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30.0/22.0
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





పంద్రాగస్టుకు రిహార్సల్స్

పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట సిద్ధమవుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు కోటపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఎగరవేయనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మంగళవారం కోట మెయిన్ గేట్ సమీపంలోని గ్రౌండ్‌లో పోలీసులు రిహార్సల్స్ చేశారు. - గోల్కొండ

రెయిన్ అలర్ట్

రానున్న మూడు రోజులూ అతి భారీ వర్షాలు!

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఉత్తర ప్రాంతాల్లో బుధ, గురు, శుక్రవారాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మంగళవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. ఇతర ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని, సరాసరి 10 నుంచి 15 సెం.మీ కంటే ఎక్కువ, కొన్ని చోట్ల 20 సెం.మీ. కంటే ఎక్కువ వర్షం కురవవచ్చని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఆయా రోజుల్లో వాహనాల కదలికలను తగ్గించాలని అభ్యర్థించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

‘సృష్టి’ది వ్యవస్థీకృత నేరమే!

బీఎన్‌ఎస్‌లోని సెక్షన్ 111 జోడించిన పోలీసులు

- కొత్త చట్టం అమలులోకి వచ్చిన తర్వాత తొలిసారి
- ఈ కేసుల్లోనే ప్రయోగించిన నగర అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో సరోగసీ పేరుతో శిశు విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడిన డాక్టర్ అట్లూరి నమ్రత అలియాస్ పచ్చిపాల అంశాన్ని హైదరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహితలోని (బీఎస్‌ఎస్) సెక్షన్ 111కు జోడించారు. ‘సృష్టి’ సెంటర్ల ద్వారా మరికొందరితో కలిసి నమ్రత చేసింది వ్యవస్థీకృతం నేరంగా గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాది జూలై ఒకటి నుంచి అమలులోకి వచ్చిన బీఎన్‌ఎస్‌లో కేంద్రం ఈ కొత్త సెక్షన్‌ను జోడించింది. నగర పోలీసు విభాగం ఈ సెక్షన్‌ను వినియోగించడం ఇదే తొలి సారి. ఇలాంటి కేసుల్లో నిందితులకు బెయిల్ కూడా అంత త్వరగా రాదని పోలీసులు చెబుతున్నారు.

ఇద్దరి కంటే ఎక్కువ మంది పదేపదే..
ఏదైనా ఓ రకమైన నేరాన్ని ఇద్దరి కంటే ఎక్కువ మంది కలిసి పదేపదే చేస్తే అది వ్యవస్థీకృత నేరమే అవుతుందని బీఎన్‌ఎస్ స్పష్టం చేస్తోంది. ‘సృష్టి’ విషయంలో డాక్టర్ నమ్రతతో పాటు ఆమె కుమారుడు పచ్చిపాల ఎస్‌ఎస్ జయంత్ కృష్ణ, విశాఖ బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి, ల్యాబ్ టెక్నీషియన్ చిన్నారావు తదితరులు ఓ నెట్‌వర్క్‌గా ఏర్పడి ఈ శిశువుల ట్రాఫికింగ్ దందా నడిపారు. తాజాగా నమోదైన తొమ్మిది కేసుల్లోనూ వీరంతా నిందితులుగానే ఉన్నారు. ధనార్జనే ధ్యేయంగా ఓ ముఠాగా ఏర్పడి చేసిన ఈ నేరాలను ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించిన సిటీ పోలీసులు ఈ కేసుల్లో బీఎన్‌ఎస్‌లోని 111 జోడిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే బీఎన్‌ఎస్‌తో పాటు సరోగసీ యాక్ట్‌లోని వివిధ సెక్షన్లు ఈ కేసుల్లో ఉండగా దీన్ని అదనంగా చేరుస్తూ కోర్టుకు సమాచారం ఇచ్చారు.

ఒక్కో ‘సేవ’కు ఒక్కో డాక్టర్..
ఐవీఎఫ్ కోసం సికింద్రాబాద్‌లోని సృష్టి సెంటర్‌కు వచ్చే జంటల ఆర్థిక పరిస్థితుల్ని డాక్టర్ నమ్రత బేరీజు వేసేది. భారీ మొత్తం వెచ్చించే శక్తి ఉన్న వారికి ఐవీఎఫ్ ద్వారా సంతానం కలిగే అవకాశం ఉన్నా ఆ విషయం దాచి పెట్టేది. దీనికోసం కొందరి విషయంలో తప్పుడు మెడికల్ రిపోర్టులు సృష్టించేది. ఆపై సక్రమం అంటూ చెప్పి అక్రమ సరోగసీ కోసం ఒప్పందాలు చేసుకునేది. తన నెట్‌వర్క్ ద్వారా పేద గర్భిణుల్ని గుర్తించి వారి చిన్నారులకు సరోగసీ బేబీలుగా వీరికి విక్రయించింది. ఈ దందాలో ఆత్యంతం ఈమెకు హైదరాబాద్, విశాఖల్లో నలుగురు వైద్యులు సహకరించారు. గాంధీ ఆస్పత్రిలో అనస్థీషియాలజిస్టుగా పని చేస్తున్న నర్సుల సదానందం ఇక్కడ వైద్య పరీక్షలు, అండం, వీర్యం సేకరించడానికి మత్తు ఇచ్చేవాడు. విశాఖ కేజీహెచ్ అనస్థీషియాలజిస్టు వాసుపల్లి రవి అక్కడి ఈ పని చేసే వాడు. విశాఖ సృష్టి సెంటర్‌లో డెలివరీలకు కేజీహెచ్ గైనకాలజిస్టు పులుమూరి ఉషాదేవి, శిశువు సంరక్షణను కేజీహెచ్ పీడియాట్రిషన్ ఎ.విద్యుల్లత చూసుకునేవారు.



పోలీసులు గుర్తించిన నిందితుల చిత్రాలు

2010లోనే తొలి కేసు నమోదు..
డాక్టర్ నమ్రతపై 2010లోనే తొలి కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఏడాది విశాఖ, విజయవాడ, గుంటూరుల్లో కలిపి మొత్తం ఆరు కేసులో రిజిస్టర్ అయ్యాయి. ఇవన్నీ ఐవీఎఫ్ విధానం పేరుతో మోసం చేసినవే. సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి మాత్రం ఈమెపై 2020 నుంచి కేసులు నమోదవుతున్నాయి. గతంలో నమోదైన 15 కేసుల్లో రెండు రాజీ అయ్యాయి. తాజా వ్యవహారాలపై గోపాలపురం ఠాణాలోనే తొమ్మిది కేసులు నమోదు కావడంతో నమ్రత, జయంత్ కృష్ణ తదితరులపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి ఉన్న అవకాశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. గరిష్ఠంగా జీవిత కాల శిక్ష పడే అవకాశం ఉన్న బీఎన్‌ఎస్‌లోని 111 సెక్షన్ జోడించిన, ఓకే అంశంపై డీసీపీ స్థాయి అధికారులు రెండుసార్లు ప్రెస్‌మీట్ పెట్టిన కేసు కూడా ‘సృష్టి’దే కావడం గమనార్హం.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. నగర యువతి దుర్మరణం



శ్రీజ వర్మ (ఫైల్)

దుండిగల్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన విద్యార్థిని దుర్మరణం చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన శ్రీనివాస వర్మ తన కుటుంబంతో కలిసి 15 ఏళ్ల క్రితమే నగరానికి వలస వచ్చాడు. మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ బాలాజీ కాలనీలో నివాసముంటున్నాడు. ఇతనికి భార్య హేమలత, శ్రీజ వర్మ (23), శ్రీయ వర్మ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస వర్మ బౌరంపేటలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జిగా హేమలత ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. శ్రీజ వర్మ మాస్టర్స్ చదివేందుకు మూడేళ్ల క్రితం అమెరికాలో వెళ్లింది. చార్లెస్టన్‌లోని ఈస్టర్న్ ఇల్లినోయిస్ యూనివర్సిటీలో కంప్యూటర్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన శ్రీజ వర్మ ప్రస్తుతం ఉద్యోగ అన్వేషణలో ఉంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం తన స్నేహితురాలితో కలిసి భోజనం తెచ్చుకునేందుకు తాము నివసిస్తున్న అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న రెస్టారెంట్‌కు వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన ట్రక్కు శ్రీజను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. రోడ్డు ప్రమాదంలో కూతురు చనిపోయిందన్న విషాద వార్త విని తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. బాలాజీ కాలనీలోని శ్రీజ ఇంటి వద్ద విషాద ఛాయలు అలముకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి శ్రీజ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని బంధువులు కోరుతున్నారు.

స్టీల్ బ్రిడ్జి పనుల్లో వేగం పెరగాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

చాదర్‌ఘాట్: ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు ఉద్దేశించి నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నలతో కలిసి నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌ఆర్‌డీపీ)లో భాగంగా రూ. 620 కోట్ల వ్యయంతో 2.58 కిలోమీటర్ల నాలుగు లైన్ల బై డైరెక్షనల్‌గా ఈ ఫ్లైవర్‌ను నిర్మిస్తున్నారు. పనుల పరిశీలన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీప ప్రాంతాల మధ్య కనెక్టివిటీని పెంచడంలో, ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేయడంలో కీలకంగా నిలుస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, సవాళ్లను అధిగమించి, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పూర్తి చేసి నిర్మాణ పనులను 2026 మార్చిలోగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరద నీటి నిల్వను పరిశీలించారు. దానికి ప్రత్యామ్నాయ డ్రైనేజీ మార్గాలను పరిశీలించి ప్రతిపాదనలు ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కమిషనర్ వెంట మలక్‌పేట డీసీ ఎంకేఐ అలీ, ఈఈ పీర్‌సింగ్, ప్రాజెక్ట్ ఈఈ గోపాల్ ఉన్నారు.



స్టీల్ బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న కర్ణన్ తదితరులు

చర్యలు షురూ

సీఎం పర్యటించిన ప్రాంతాల్లో ముంపు సమస్యల పరిష్కారానికి..

- డీపీఆర్‌లకు టెండర్లు ఆహ్వానించిన జీహెచ్‌ఎంసీ
- రెండు పనులుగా ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ టెండర్లు
- గంగుబాయి బస్తీ, బుద్ధనగర్‌లకు ఒకటి, కృష్ణకాంత్ పార్క్– సత్యం థియేటర్ వరకు మరొకటి

సాక్షి, సిటీబ్యూరో:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం పర్యటించిన నగరంలోని అమీర్‌పేట మైత్రివనం, గుంగుబాయి బస్తీ, బుద్ధనగర్ తదితర ప్రాంతాల్లో వరదనీటి ముంపు సమస్యల పరిష్కారానికి, వరదనీటి కాలువల నిర్మాణాలకు కన్సల్టెన్సీ సర్వీసులను ఆహ్వానిస్తూ జీహెచ్‌ఎంసీ ఆసక్తి వ్యక్తీకరణ టెండరు నోటిఫికేషన్లు వెలువరించింది. సీఎం పర్యటించిన ప్రాంతాల్లో తాము ఎదుర్కొంటున్న ముంపు సమస్యల గురించి స్థానికులు వివరించడం, సమస్య పరిష్కారానికి ప్రత్యేక ట్రంక్‌లైన్ ఏర్పాటుచేసి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం అధికారులను ఆదేశించడం తెలిసిందే.

వెంటనే అందుకు ప్రణాళికలు రూపొందించాల్సిందిగా కూడా ఆదేశించిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఈ టెండర్లు పిలిచింది. రెండు పనులుగా వేర్వేరుగా కన్సల్టెన్సీ సర్వీసులను కోరుతూ వీటిని పిలిచారు. గంగుబాయి బస్తీ, బుద్ధనగర్ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ఒకటి, కృష్ణకాంత్ పార్క్ మధురానగర్, హర్ష మెస్, మైత్రివనం, ఆదిత్య ట్రేడ్ సెంటర్–సత్యం థియేటర్ వరకు మేజర్ నాలా పారే ప్రాంతాలకు మరో పనిగా పిలిచారు. పెద్ద వానలు కురిసినప్పుడు పరిసర ప్రాంతాలు ముంపు బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన సర్వే, ఇన్వెస్టిగేషన్‌తో పాటు సమస్యల పరిష్కారానికి తగిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందించాల్సిందిగా పేర్కొన్నారు. ఎంపికయ్యే ఏజెన్సీ నెలరోజుల్లోగా పని పూర్తిచేయాలి. పనులు చేసేందుకు ముందుకొచ్చే ఏజెన్సీలు గురువారం (రేపు) మధ్యాహ్నం 2 గంటల్లోగా బిడ్లు దాఖలు చేయాలి. అరగంట తర్వాత టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లు తెరుస్తారు.




అమీర్‌పేట్‌లోని ఓ ప్రాంతాన్ని ముంచెత్తిన వరద (ఫైల్)

అర్హతలున్న వారికి..
టెండర్లలో పాల్గొనేందుకు సంబంధిత ఏజెన్సీలు తగిన అర్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆమేరకు.. గడచిన ఐదేళ్లలో కనీసం ఏదైనా ఒక మేజర్ వరద కాలువ, బాక్స్‌డ్రెయిన్, ఓపెన్ చానెల్స్‌కు ఇలాంటి సేవలందించిఉండాలి. నగరంలో కనీసం 500 చదరపుకిలోమీటర్ల పరిధిలో ఎస్ఎన్‌డీపి లేదా సివరేజి స్కీమ్‌లకు డీపీఆర్‌లు చేసి ఉండటంతో పాటు గడచిన ఐదేళ్లలో కనీసం రూ. 1000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు డీపీఆర్ చేసి ఉండాలి. వీటితోపాటు ఇతరత్రా నిబంధనలు పొందుపరిచారు.

డీపీఆర్‌లో భాగంగా పనులు పూర్తిచేసేందుకు అయ్యే అంచనా వ్యయం, సదరు ప్రాంతాల్లో వర్షపాతం తీవ్రత సర్వే, పారే వరద, సివరేజి నెట్‌వర్క్ వంటి వివరాలు పొందుపరచడంతోపాటు ప్రపంచంలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, పనులు వేగంగా జరిగేందుకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వినియోగిస్తున్న విధానాలు, ఆర్థిక అంశాల్ని పరిగణనలోకి తీసుకొని సమర్థంగా పని చేసేందుకు అనువైన విధానాలు తదితరమైన వాటి గురించి తెలియజేయాల్సి ఉంటుంది. పనులు చేసేందుకయ్యే నిధుల్ని జీహెచ్‌ఎంసీయే అందజేస్తుంది.

ఇంకా..
డీపీఆర్‌లో భాగంగా సదరు ప్రాంతాల్లోని నాలాలు, వరదలు వచ్చే ప్రాంతాలు, ప్రస్తుత పరిస్థితులు, వరదనీరు పారకుండా అడ్డుగా ఉన్న ఆక్రమణల గుర్తింపు, ఆస్తులు తొలగించాల్సి వస్తే పునరావాస ప్రణాళిక, ఐదు సంవత్సరాల వర్షపాతం ఆధారంగా వరద డిశ్చార్జి వివరాల వంటివి కూడా ఉంటాయని అధికారులు తెలిపారు. ఇంకా సదరు ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి లైన్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్లు, తదితరమైనవి తొలగించాల్సి ఉంటే ఆవివరాలు అందించాల్సి ఉంటుందని, సంబంధిత విభాగాల సమన్వయంతో పనులు చేస్తామని పేర్కొన్నారు.

జూపార్కులో ఏనుగుల దినోత్సవం



ఏనుగులకు ఆహారం తినిపిస్తున్న జూ అధికారులు

చార్మినార్/బహదూర్‌పురా: వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని జూ పార్కు క్యూరేటర్ వసంత అన్నారు. మంగళవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని నెహ్రూ జూలాజికల్ పార్కులో ఘనంగా నిర్వహించారు. ఓపెన్ ఎంక్లోజర్‌లో ఉన్న ఏనుగులను మావటీలు మూడు కిలోమీటర్ల వరకు నడిపిస్తూ ఆకులు, కొమ్మలు తినేందుకు వీలు కల్పించారు. యానిమల్ కీపర్లు వన్యప్రాణుల కోసం పండ్లు కూరగాయలు బియ్యం రాగితో వండిన 5 కిలోల బరువున్న 4 ప్రత్యేక కేకులను తయారుచేసి వనజ, ఆశా, సీత, విజయ్ ఏనుగులకు ఆహారంగా ఇచ్చారు. కార్యక్రమంలో జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ బర్నోబా, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హకీం, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ క్యూరేటర్లు లక్ష్మణ్, నాజియా తబస్సుం, బయాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, జూ పార్క్ పీఆర్‌ఓ హనీఫ్‌వుల్లా పాల్గొన్నారు.

హుషారుగా విహారం..
నాలుగైదు ఎకరాల్లో ఉన్న ఓపెన్ ఎంక్లోజర్‌లో ఏనుగులు హుషారుగా విహరిస్తూ సందర్శకులను అలరించాయి. కొన్నేళ్లుగా ఓపెన్ ఎంక్లోజర్‌లోనే ఏనుగులు గడిపాయి. గతంలో జూ పార్కులో ఏనుగుల సవారీ ఉండేది. ఏనుగులను గొలుసులతో బంధించవద్దని కోర్టు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. దీంతో అప్పటినుంచి జూలో ఏనుగుల సవారీ (రైడ్)ని నిషేధించి వాటిని ఓపెన్ ఎంక్లోజర్‌లో ఉంచారు. కోర్టులో ఆదేశాల మేరకు ఓపెన్ అండ్ క్లోజర్‌లో ఏనుగులు స్వేచ్ఛగా విహరించే వెసులుబాటు కల్పించారు.

జంట జలాశయాలకు తగ్గిన వరద

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వారం రోజులుగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు వరద ప్రవాహం కొనసాగింది. ఉస్మాన్ సాగర్ జలాశయంలోకి పరీవాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, మొమిన్‌పల్లి, దోబీపేట్ ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు మూసీ నది ద్వారా జలాశయానికి చేరుతోంది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్‌పేట్, నర్కూడ, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు ఈసీ నది ద్వారా జలాశయానికి వస్తోంది. మంగళవారం నాటికి ఉస్మాన్ సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. హిమాయత్‌సాగర్ జలాశయంలోకి వరద నీరు ఈసీ వాగు మీదుగా వస్తుండటంతో రెండు రోజుల క్రితం జలమండలి అధికారులు ఐదు క్రస్టు గేట్లు అడుగు మేర ఎత్తి నీటిని ఈసీ నదిలోకి వదిలారు. మంగళవారం వరద ప్రవాహం తగ్గడంతో నాలుగు క్రస్టు గేట్లను మూసివేసి ఒక గేటు నుంచి మాత్రమే నీటిని దిగువకు వదులుతున్నారు.

హోటళ్లలో అపరిశుభ్రత

సాక్షి, సిటీబ్యూరో: ఆహార కల్తీకి సంబంధించి నగరంలో ఎప్పుడు ఎక్కడ తనిఖీలు జరిగినా లోపాలే కనిపిస్తున్నాయి. ఎంత పేరెన్నికగన్న సంస్థలైనా, ప్రజలు ఎగబడి తింటున్నవైనా అదే తీరు. స్టార్ హోటళ్లు, బేకరీల్లోనూ అదే తంతు. స్వీట్ షాప్స్ అయినా, హోమ్ ఫుడ్స్ అయినా అంతే. నగరంలో పేరెన్నికగన్న, రంజాన్ సమయంలో హలీంకు ప్రసిద్ధి చెందిన పిస్తాహౌస్ రెస్టారెంట్లపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదులతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఫుడ్‌సేఫ్టీ అధికారులను తనిఖీలకు ఆదేశించారు. ఇప్పటి వరకు తనిఖీలు నిర్వహించిన 25 రెస్టారెంట్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులకు అడుగడుగునా ఉల్లంఘనలే కనిపించాయి. 23 శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. అధికారులు గుర్తించిన అంశాల్లో అన్ని రెస్టారెంట్లలోనూ దాదాపుగా ఒకే విధమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి.

శిథిల భవనాలతో జాగ్రత్త!

- సెల్లార్ల తవ్వకాలపై కూడా..
- ప్రమాదాలు జరగకుండా చర్యలు
- టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ కర్ణన్ ఆదేశాలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు, సెల్లార్ తవ్వకాలపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వరుస వర్షాలు, ఇంకా వర్షాలున్నాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో శిథిలావస్థలోని భవనాలు, సెల్లార్ల తవ్వకాలకు సంబంధించి చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్‌తో కలిసి అన్ని సర్కిళ్లు, జోన్లు, ప్రధాన కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులతో వెబెక్స్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను, సెల్లార్ తవ్వకాలను పునఃపరిశీలించి అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్‌లలో పెండింగ్‌లో ఉన్న వాటిపై మరింత దృష్టి పెట్టాలని, అన్ని కేసులలో ఫాలోఅప్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

327 భవనాలకు పునరుద్ధరణ చర్యలు

మొత్తం 685 శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించగా, 327 భవనాలకు మరమ్మత్తులు/పునరుద్ధరణల ద్వారా చర్యలు తీసుకున్నారు. 358 భవనాల్లోని వారికి నిబంధనలను పాటించాలని నోటీసుల జారీ, భవనాలు ఖాళీ చేయడానికి యజమానులకు కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి చర్యలు ప్రారంభించారు. 154 సెల్లార్ తవ్వకాలను గుర్తించగా, వాటిలో 93 నిర్మాణాల వద్ద రిటైనింగ్ గోడల నిర్మాణం పూర్తికాగా, మిగతా చోట్ల రిటైనింగ్ గోడల నిర్మాణం పురోగతిలో ఉంది. 52 అనధికార సెల్లార్లకు నోటీసులు జారీ చేసి, సీఅండ్‌డీ వ్యర్థాలతో వాటిని పూడ్చివేయడానికి చర్యలు చేపట్టారు.

వరంగల్ జాతీయ రహదారికి మోక్షం

- ఉప్పల్ నుంచి నల్ల చెరువు వరకు మరమ్మతులు
- నేషనల్ హైవే అథారిటీ, జీహెచ్ఎంసీల ఆధ్వర్యంలో పనులు


జాతీయ రహదారుల ఎస్ఈ ధర్మారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై వాహనదారులకు ఇక కష్టాలు తీరనున్నాయి. యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతు పనులు సంయుక్తంగా చేపట్టేందుకు ఎన్‌హెచ్ఏ, జీహెచ్ఎంసీలు నిర్ణయించినట్లు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఈ రహదారి దుస్థితి గురించి వివరిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందించిన విషయం విదితమే. దీనిపై మంత్రి చొరవ తీసుకుని ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్లచెరువు చివరి వరకు (జీహెచ్ఎంసీ లిమిట్) ఇరువైపులా జాతీయ రహదారిని జీహెచ్ఎంసీకి అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో యంత్రాంగం కదిలింది. ఇదే విషయాన్ని పరమేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకురావడంతో నేషనల్ హైవే అథారిటీ ఎస్ఈ ధర్మారెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌లు ఈ విషయాన్ని పరిశీలించాలని సూచించినట్లు తెలిసింది.

కాగా ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధం లేకుండా కింది రోడ్డు నిర్మాణం, అభివృద్ధి, మరమ్మతులు వెంటనే చేపట్టాలని, ముఖ్యమంత్రి, మంత్రి ఈ మేరకు ఆదేశాలు ఇచ్చినట్లు ఎస్ఈ ధర్మారెడ్డి తెలిపారు. అతి త్వరలో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ వీటీ కమాన్ నుంచి నల్లచెరువు కట్ట పూర్తి అయ్యే వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాగా ఉప్పల్ రింగు రోడ్డు నుంచి వెంకటేశ్వర టెంపుల్ కమాన్ వరకు జీహెచ్ఎంసీ ఆధీనంలోనే ఉందని, అది వారు చూసుకుంటారని చెప్పారు. ఉప్పల్ చౌరస్తా నుంచి వీటీ కమాన్ వరకు రోడ్డుకు ఇరువైపులా జీహెచ్ఎంసీ పనులను సైతం వెంటనే చేపట్టనుంది. అదే జరిగితే ఇక్కడి ప్రజల దశాబ్దాల కల నేరవేరనుంది. దుమ్ము, ధూళి, గుంతలు, బురద నుంచి ఉపశమనం కలుగనుంది. ముఖ్యంగా ఉప్పల్ వరంగల్ రహదారిపై ట్రాఫిక్ సమస్య తీరనుంది.

25 నుంచి ఓయూ కళాశాల క్రీడల టోర్నమెంట్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని కాలేజీల్లో ఈ నెల 25 నుంచి ప్రారంభంకానున్న అంతర్ కళాశాలల క్రీడాల పోటీల (స్పోర్ట్స్ అండ్ గేమ్స్) టోర్నమెంట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మంగళవారం ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఐసీటీ ఛర్మన్ సెక్రెటరీ ప్రొ. రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేట్ కాలేజీలకు చెందిన క్రీడాకారులు ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రీడాల వివరాలు ఇలా ఉన్నాయి. 25న స్విమింగ్ (మెన్) పోటీలు ఎంసీహెచ్ స్విమింగ్ పూల్ సికింద్రాబాద్‌లో, 29న క్యారమ్స్ ఐఏఎంసీ ఖైరతాబాద్, 13 సెప్టెంబరు క్రాస్ కంట్రీ పోటీలు ఓయూ క్యాంపస్ సింథటిక్స్ ట్రాక్, 19న చెస్ వివేకనంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యానగర్, 23న ఫెన్సింగ్ పోటీలు హిందీ మహా విద్యాలయ నల్లకుంట, 26, 27 టెబుల్ టెన్నిస్ సెయింట్ జోసెఫ్ కాలేజీలో నిర్వహించనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 9885911520, 9848771474 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

నకిలీ డీ-మార్ట్ యాప్‌తో నిలువుదోపిడీ

బాధితుడి కార్డుల నుంచి రూ.1.31 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు నానాటికీ రెచ్చిపోతున్నారు. సామాన్యులు ఎక్కువగా వినియోగించే యాప్స్ పేరుతో నకిలీవి సృష్టిస్తున్నారు. అలా రూపొందించిన లింకుల్లో ఏపీకే ఫైల్స్ ఉంచి నిలువుదోపిడీ చేస్తున్నారు. నిత్యావసర సరుకుల విక్రయానికి పేరెన్నికగన్న డీ-మార్ట్ పేరుతో నకిలీ యాప్ సృష్టించి నగరవాసుల్ని నిండా ముంచుతున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా నేరాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. సరూర్‌నగర్‌కు చెందిన కొండా శ్రీనివాసులుకు ఈ నెల 10న ఓ సందేశం వచ్చింది. తక్కువ ధరకు నిత్యావసర వస్తువులు ఖరీదు చేయడానికి డీ-మార్ట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అందులో ఉంది. అది నిజమైనదే అని భావించిన శ్రీనివాసులు లింక్ క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ లింకులో ఉన్న ఏపీకే ఫైల్ ఆయన ఫోన్‌లో ఇన్‌స్టాల్ ఆయిపోయింది. దీంతో ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఇలా ఆయన ఫోన్ నుంచి క్రెడిట్ కార్డులను ఉపయోగించిన కేటుగాళ్లు మొత్తం 13 లావాదేవీల్లో రూ.1.31 లక్షలు కాజేశారు. ఓటీపీలు సైతం ఆ ఫోన్‌కే రావడంతో వారి పని సులువైంది. ఇలా వరుసగా ఓటీపీలు రావడాన్ని చూసిన బాధితుడు ఆయా కార్డులకు సంబంధించిన కస్టమర్ కేర్ సెంటర్లకు ఫోన్లు చేయించి బ్లాక్ చేయించారు. అప్పటికే పెద్ద మొత్తం కోల్పోయిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని నెంబర్లు, బల్క్ ఎస్సెమ్మెస్‌లు, వాట్సాప్ ద్వారా వచ్చిన సందేశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. వాటిలో ఏవైనా లింకులు ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలని...వాటి చివర డాట్ (.)ఏపీకే అని ఉంటే జాగ్రత్తగా డిలీట్ చేయాలని స్పష్టం చేస్తున్నారు. డిలీట్ చేసే క్రమంలో పొరపాటును వాటిని క్లిక్ చేసినా ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతుందని హెచ్చరిస్తున్నారు.

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ప్రాధాన్యం

హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

సాక్షి, సిటీబ్యూరో: సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలకు రుణాల మంజూరులో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2025–26 ప్రకారం వివిధ రంగాలలో రూ.420682.07 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా, మొదటి త్రైమాసికంలో (జూన్ 2025) రూ.147528.83 కోట్లు (35.07 శాతం)రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్యం రూ.115649.26 కోట్లు ఉండగా, రూ. 36779.17 కోట్లు (31.80 శాతం) మంజూరు చేయటం జరిగిందని అన్నారు. ప్రాధాన్యత రంగ రుణాల లక్ష్యం రూ.121798.10 కోట్లు ఉండగా, రూ. 41585.36 కోట్లు (34.14 శాతం) మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ లక్ష్మీ శ్రావ్య, నాబార్డు డీడీఎం హర్ష రఘురాం, ఎల్‌డీఎం నరసింహమూర్తి, పరిశ్రమల జీఎం పవన్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారులు ఆశన్న, ప్రవీణ్ కుమార్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై ఉద్యమించాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు


మాట్లాడుతున్న బి.వి.రాఘవులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఓటు హక్కును రక్షించుకోలేకపోతే..ప్రజాస్వామ్యాన్ని ఎలా రక్షించుకుంటామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. ప్రస్తుతం దొంగ ఓట్లు, బోగస్ ఓట్లతోపాటు సామూహికంగా నిజమైన ఓట్లను కూడా తొలగిస్తున్నారని విమర్శించారు. అర్హులైన వారి ఓట్లను కూడా తొలగించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం అన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'రాజ్యాంగం–ఎన్నికల కమిషన్–దొంగ ఓట్లు' అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే నిబంధనలు మారుస్తున్నారని అన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ప్రతిపక్షాల నోరుమూయించే ప్రయత్నాలు జరుగుతోందన్నారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీ అనుబంధ పార్టీలాగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా ఓట్లను తొలగిస్తున్నారని, దీనిపై దేశవ్యాప్తంగా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, టి.సాగర్, జి.నాగయ్య, మల్లు లక్ష్మీ, జూలకంటి రంగారెడ్డి, బండారు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులను నిర్బంధించి.. చోరీ

- కేపీహెచ్‌బీలో అర్ధరాత్రి దొంగల బీభత్సం
- 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు అపహరణ


చోరీ జరిగిన నివాసాన్ని పరిశీలించిన పోలీస్ అధికారులు


దొంగల దాడిలో సొమ్మసిల్లిన బాధితురాలు సరస్వతి

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఒంటరిగా వృద్ధులు ఉన్న ఇంట్లోకి అర్ధరాత్రి చొరబడి..వారిపై దాడి చేసి నిర్బంధించారు. వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు సహా ఇతర ఆభరణాలు, బీరువాలోని నగదును అపహరించారు. పక్కనే ఉన్న మరో ఇంటిలో కూడా చోరీకి యత్నించగా ఆ ఇంటి యజమాని అప్రమత్తం కావడంతో పారిపోయారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ చోరీ కేసు వివరాలు పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో రిటైర్డ్ తహశీల్దార్ కొల్లా నాగేశ్వరరావు, సరస్వతి దంపతులు ఎంఐజీ 14లో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి సుమారు 2.30 గంటల సమయంలో ముగ్గురు దొంగలు ఇనుపరాడ్లు, సుత్తి, స్క్రూడైవర్లు వంటి ఆయుధాలతో ఇంటి తలుపులు తెరిచి లోనికి చొరబడి, నిద్ర మత్తులో ఉన్న నాగేశ్వరరావును కొట్టి మంచం మీద అదిమిపట్టారు. నాగేశ్వరరావు అరవడంతో అతని భార్య సరస్వతి మేల్కొని చూడగా ముగ్గురు వ్యక్తులలో ఒకడు ఆమె నోరు మూసి మంచంపై అదిమిపట్టారు. మిగిలిని ఇద్దరు ఇంట్లోని బీరువాలో ఉన్న నగదు, బంగారం ఆభరణాలను తీసుకోవటంతో పాటు సరస్వతి మెడలోని పుస్తెల తాడును, చేతికి ఉన్న బంగారు గాజులను లాక్కున్నారు. ఆమె అరిచేందుకు ప్రయత్నించగా నోటిలో బట్టలు కుక్కి ఆమెను కూడా అరవద్దు అంటూ కొట్టారు. అనంతరం ఇల్లంతా వెతికి ఇంట్లోని సుమారు రూ. 3 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు దోచుకొని వెళ్లిపోయారు. వీరి ఇంటి పక్కనే నివసించే రిటైర్డ్ ఉద్యోగి శ్యాంసుందర్ రెడ్డి ఇంటిలో సైతం దోపిడీ చేసేందుకు యత్నించగా, ఆయన అప్రమత్తమై అరుస్తూ అడ్డుకోవడంతో దోపిడీ దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. ముగ్గురు దొంగలు ఇనుపరాడ్లను ఉపయోగించి తలుపులు తెరిచి దోపిడీకి పాల్పడ్డారని, దొంగలను అరెస్టు చేసేందుకు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నామని, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దొంగల కోసం గాలిస్తున్నామని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పరిశీలించారు.

తాగేందుకు నీళ్లు ఇచ్చారు...

గొంతు, నోరు అదిమి పట్టి రెండు గంటల పాటు నిర్బంధించిన దొంగలు..తమ పరిస్థితి చూసి చివరకు తాగేందుకు మంచి నీళ్లు ఇచ్చారని, లేకపోతే తమ ప్రాణాలు పోయేవని సరస్వతి తెలిపారు. ముగ్గురు దొంగలు ఇంట్లోకి చొరబడి మొదట తన భర్తను కొట్టారని, తర్వాత తన వద్దకు వచ్చి నిర్బంధించారని తెలిపింది.

నేడు, రేపు ఒక్కపూట బడులు

సాక్షి సిటీబ్యూరో: రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నగరంలోని పాఠశాలలకు విద్యాశాఖ ఒంటిపూట సెలవులు ప్రకటించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు అన్నిటింకి ఈ ఆదేశాలు వర్తిస్తాయని విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు. ఈ ఆదేశాల ప్రకారం బుధ, గురువారాల్లో ఉదయం పూట మాత్రమే పాఠశాలలు నడుస్తాయి.

శ్యామలకు నగర సీపీ అభినందన


నగదు రివార్డు అందుకుంటున్న ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామల

సనత్‌నగర్: ఇటీవల సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన బేగంపేట ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామలను నగర పోలీసు కమిషనర్ అభినందించారు. డిస్కస్ త్రో పోటీల్లో బంగారు పతకం, షాట్‌పుట్ పోటీల్లో సిల్వర్ పతకాన్ని గెలుచుకున్న విషయం విదితమే. ఈ మేరకు మంగళవారం ఆమె సీపీ ఆనంద్‌ను కలవగా అభినందించి రూ.10 వేల నగదు రివార్డును కూడా అందజేశారు. ఈ సందరగా శ్యామల మాట్లాడుతూ నగర కమిషనర్ చేతుల మీదుగా రివార్డు అందుకోవడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే పోటీలకు హాజరై పతకాల సాధనకు కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో ఇతర దేశాల్లో జరిగే పోటీలకు పాల్గొనేందుకు తనవంతు ఆర్థిక స హాయం అందించేందుకు కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

15న సీఎం ప్రజావాణికి సెలవు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించే సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం వాయిదా వేశారు. ఈ నెల15న జరగాల్సిన ప్రజావాణిని స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో వాయిదా వేసి..19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి శుక్రవారం కాకుండా వచ్చే మంగళవారం ప్రజావాణి కార్యక్రమానికి రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

గంజాయి, డ్రగ్స్ పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: గంజాయితో పాటు డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ధూల్‌పేట్‌లో నిర్వహించిన దాడుల్లో 1.5 కిలోల గంజాయి, 5 జెల్లీ ఎల్ఎస్డీ, 0.11 డోర్స్, 12.2 ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మహేందర్ సింగ్, అర్జున్ సింగ్, ఎం.అనిల్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. హరిఓం శర్మ, జోడి కృష్ణ, సాజిల్, సుమితా శ్రీధర్ సావెంట్, రోహిత్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో సంఘటనలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తగ్గుల శ్రీకాంత్ స్నేహితుడు శివ అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి అమ్మకాలు సాగిస్తుండగా బీఎన్‌రెడ్డి కాలనీ, సాగర్‌కాంప్లెక్స్ వద్ద ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 1.14 కిలోల గంజాయి, సెల్‌ఫోన్, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి శ్రీకాంత్‌ను అరెస్ట్ చేయడంతో పాటు శివపైన కేసు నమోదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

మణికొండ: ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతూ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా అక్కునూరు గ్రామానికి చెందిన బి.సుస్మిత (18) ఇబ్రహీంబాగ్‌లోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతుంది. నార్సింగిలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో మరో ఇద్దరితో కలిసి ఉంటుంది. సోమవారం రూమ్‌మేట్ అర్చన కిందకు వెళ్లగా..గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. అర్చన తిరిగి వచ్చి తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా లోపల గడియ వేసి ఉంది. దీంతో వార్డెన్ నవీనకు విషయం తెలిపింది. ఇద్దరు వచ్చి డోర్‌ను తెరిచి చూడగా సుస్మిత ఆత్మహత్య విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే 108కు ఫోన్ చేయటంతో వారు వచ్చి ఆమె మృతిచెందినట్టు ధృవీకరించారు. హాస్టల్ నిర్వాహకుడు సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం


మధు (ఫైల్)

మేడ్చల్ రూరల్: బైక్‌పైన వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఏపీలోని తెనాలి జిల్లా వేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన కేసాని మధు(50) బతుకుదెరువు కోసం మేడ్చల్ వలస వచ్చాడు. కేఎల్ఆర్ వెంచర్‌లో నివాసం ఉంటూ మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులకు వెళ్లిన మధు మంగళవారం ఉదయం 8.45 గంటలకు ఇంటికి బైక్‌పై బయల్దేరాడు. మేడ్చల్‌లోని వివేకానంద విగ్రహం వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బైక్ కుడివైపు ఉన్న హ్యాండిల్‌కు తగలడంతో మధు లారీ చక్రాల కిందకు పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: కుటుంబ సమస్యల కారణంగా మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజ్ తెలిపిన వివరాల మేరకు.. మేడ్చల్ జిల్లాలోని గోధుమకుంట గ్రామానికి చెందిన నందరాజ్ గౌడ్ (28) వృత్తిరీత్యా డ్రైవర్. కుటుంబ సమస్యల కారణంగా రెండు సంవత్సరాలుగా రాంపల్లిలోని తన అక్క ఇంట్లో ఉంటున్నాడు. మద్యానికి బానిసైన నందరాజ్ సోమవారం రాత్రి చర్లపల్లి – మౌలాలి రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

గాంధీభవన్ ముట్టడికి నిరుద్యోగుల యత్నం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. రెండు లక్షల ఉద్యోగాల సాధనకై మంగళవారం ఛలో గాంధీభవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ..20 వేల మెగా డీఎస్సీ, జీపీఓలో ఆరు వేల ఉద్యోగాలు, ఆర్థిక శాఖ అనుమతి పొందిన విద్యుత్ శాఖలో 5368 పోస్టులు, 20 వేల పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా గ్రూప్–1, 2, 3 ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ..తాము గాంధీ భవన్‌లో వినతి పత్రం ఇవ్వడానికి వచ్చినట్లు తెలిపారు. విడతల వారిగా వచ్చి నిరుద్యోగులు గాంధీభవన్ ముట్టడికి యత్నించారు. ఈ క్రమంలో నిరుద్యోగులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఓటు వేటలో..

ఉప ఎన్నిక నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ



రోడ్డు పనులకు కొలతలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ ఇంజినీర్లు

- రూ.60 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- అటు రోడ్లు..ఇటు పైపుల నిర్మాణాలు
- అంచనాలు రూపొందిస్తున్న ఇంజినీర్లు
- కోడ్ రాకముందే పూర్తి చేయాలని మంత్రుల ఆదేశం

బంజారాహిల్స్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో మాత్రం ఒక్క సీటు గెలుచుకోలేకపోయింది. ఇప్పుడు ఆ లోటును భర్తీ చేసుకునేందుకు అందివచ్చిన అవకాశంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యం కావడంతో ఆ సీటును ఎలాగైనా సాధించాలనే పట్టుదలతో అధికార పార్టీ పట్టుదలతో ఉన్నది. పక్కా ప్రణాళికలు రూపొందించి సరికొత్త పథకాలతో ముందుకెళ్తోంది. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసి ఓటర్ల ఆదరణను కూడగట్టుకోవాలని ప్రయత్నిస్తున్న హస్తం పార్టీ ఇప్పటికే ముగ్గురు మంత్రులను రంగంలోకి దిప్పింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంపై క్రమంగా పట్టు పెంచుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత 5 వారాలుగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ముమ్మరంగా శంకుస్థాపనలు జరుగుతున్నాయి.

- నియోజకవర్గ పరిధిలోని రహమత్‌నగర్, సోమాజీగూడ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలో ఇప్పటికే రూ.22 కోట్ల వ్యయంతో రోడ్లు, బాక్స్ డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించి ఆమోదం కోసం పంపించారు. ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి.
- వీటికి అదనంగా ఒక్కో డివిజన్‌కు రూ.5 కోట్లు కేటాయించారు. ఇలా ఏడు డివిజన్లకు కలిపి రూ.30 కోట్లు మంజూరు కాగా, ఈ పనులకు జీహెచ్ఎంసీ ఇంజినీర్లు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.
- మొత్తం రూ.52 కోట్లతో నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బాక్స్‌డ్రైన్‌లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టనున్నారు.
- నియోజకవర్గంలో 13 ఉద్యానవనాలు ఉండగా వీటి అభివృద్ధికి రూ. కోటి కేటాయించారు.
- ఈ నిధులతో అన్ని పార్కులు సుందరంగా తీర్చిదిద్దేందుకు ఖర్చు చేయనున్నారు.

రూ.6.43 కోట్లతో జలమండలి ప్రతిపాదనలు

- జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని 7 డివిజన్లలో జలమండలి ఆధ్వర్యంలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేసేందుకు అంచనాలు రూపొందించారు. తాగునీటి పైప్‌లైన్లతో పాటు డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి కొత్తగా రూ.6.43 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి బోర్డు ఆమోదం కోసం పంపించారు. ప్రతి డివిజన్‌లో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు వేయాలని, నిధులకు ఏమాత్రం వెనుకాడవద్దని ఇప్పటికే మంత్రులు జలమండలి అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో మొత్తం 24 పనులు చేపడుతున్నారు.
- యూసుఫ్‌గూడ డివిజన్‌లో కొత్తగా చేపట్టబోయే 2 పనులకు గాను రూ.60 లక్షలు మంజూరయ్యాయి.
- సోమాజీగూడ డివిజన్‌లో 3 వర్క్స్ కోసం రూ.47 లక్షలు మంజూరయ్యాయి.
- వెంగళరావునగర్‌లో 2 వర్క్స్‌కు రూ.58 లక్షలు కేటాయించారు.
- ఎర్రగడ్డ డివిజన్‌లో 5 పనుల కోసం రూ.75 లక్షలు.
- రహమత్‌నగర్ డివిజన్‌లో 11 పనులకు రూ.3.85 కోట్లు మంజూరయ్యాయి.
- బోరబండ డివిజన్‌లో ఒక పని చేపట్టగా రూ.16 లక్షలు మంజూరు చేశారు.
- నియోజకవర్గం మొత్తంగా 24 పనులు చేపట్టగా ఇందులో 13 పనులు తాగునీటి సరఫరాకు సంబంధించి పైప్‌లైన్ల కోసం, మరో 11 పనులు సీవరేజీ పైప్‌లైన్ల కోసం చేపడుతున్నారు.

- కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పార్కులు, కమ్యూనిటీ హాళ్లు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.
- ఇవేగాకుండా ఇంకా ఏమైనా పనులు కావాలని ప్రజలు కోరుకుంటే వాటికి కూడా ప్రతిపాదనలు రూపొందించి తమ వద్దకు తీసుకురావాలని మంత్రులు జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు.
- త్వరలో ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఈ పనులు ముమ్మరంగా చేయాలని, ఎన్నికల కోడ్ రాకముందే రూ.52 కోట్ల పనులను ప్రారంభోత్సవాలు చేయాలని ఆదేశించారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

హిమాయత్‌నగర్ : నారాయణగూడ బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్-ప్రిన్సిపాల్స్ డా.కలువల శ్రీనివాస్ రావ్, డా.రాపోలు శ్రీనివాస్, డా.రామలక్ష్మి, డా.మనోజ్ కుమార్, డా.ఎస్.దీపిక, డా.శ్రీనాథ్ పటేల్, అర్చన మేరి, సైఫుద్దీన్, సిబ్బంది రమేశ్, స్వాతి, సౌమ్య, ముర్తుజా అలీ, సాయికృష్ణ, బాబులాల్ పాల్గొన్నారు.

సోనియా గాంధీతో అజారుద్దీన్ భేటీ



బంజారాహిల్స్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మహమ్మద్ అజారుద్దీన్ ఢిల్లీలో ఏఐసీసీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు సోనియాగాంధీతో మంగళవారం భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ గెలిచేందుకు చేపట్టిన ప్రణాళికలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ అభ్యర్థిగా అధిష్టానం తనకే టికెట్ కేటాయిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

'బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వండి'



కల్యాణ్‌నగర్ అధ్యక్షుడితో వజ్రనాథ్

వెంగళరావునగర్ : త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని ఆ పార్టీ నాయకుడు మాగంటి వజ్రనాథ్ కోరారు. ఈమేరకు కల్యాణ్‌నగర్‌కాలనీలో 23 కాలనీస్ ఫెడరేషన్ చైర్మన్ త్రిపురనేని సత్యనారాయణను ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని మద్దతు ఇవ్వాలని కోరగా త్రిపురనేని స్పందిస్తూ కాలనీల అభివృద్ధికి చేయూతనందించే నాయకులకు తప్పనిసరిగా తమ ఫెడరేషన్ తరఫున మద్దతు ఇస్తామని హామీనిచ్చారు.

రహమత్‌నగర్ : మాగంటి వజ్రనాథ్‌కు తమ మద్దతు ఉంటుందని రహమత్‌నగర్ డివిజన్ ముస్లింలు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే, తన సోదరుడు గోపీనాథ్ ఆశయ సాధన కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. మైనార్టీ నాయకుడు సయ్యద్ ఒమర్, బీఆర్ఎస్ నాయకులు బస్వరాజ్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి మాత్ర వేస్తున్న నర్సు

బంజారాహిల్స్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మాత్రలు వేసుకోలేని చిన్నారుల కోసం వైద్యారోగ్య శాఖ సిబ్బంది మంగళవారం ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడమే కాకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఫిలింనగర్‌లోని గౌతంనగర్ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు షేక్‌పేట, బంజారాహిల్స్ సెక్టార్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులందరికీ మాత్రలు వేశారు.

బీజేఆర్ కాలేజీలో బీమా రంగంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ్ కుమార్

హిమాయత్‌నగర్ : నారాయణగూడ బాబూ జగ్జీవన్ రామ్ (బీజేఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వాణిజ్య, నిర్వహణ విభాగం, యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో కలిసి 'బీమా రంగంలో అవకాశాలు, పెట్టుబడులు' అనే అంశంపై మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ఈయేడు బీకాంలో 2 కొత్త కోర్సులు ప్రారంభించామన్నారు. కామర్స్ విభాగాధిపతి డా.నర్సింహులు, బీబీఏ విభాగాధ్యక్షుడు డా.సి.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి



మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల కార్యదర్శి జయేశ్ రంజన్

బంజారాహిల్స్: మారుతున్న పరిస్థితులు, టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తుండాలని ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ సూచించారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ తరగతుల ప్రారంభోత్సవానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నో సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతుందని అయినా కూడా మానవ మేధస్సు లేకుండా ఏ టెక్నాలజీ కూడా పని చేయదన్నారు. ఈ మధ్య పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగులను తీసివేస్తున్నారని ఇదంతా తాత్కాలికమేనని భవిష్యత్‌లో వేలాది ఉద్యోగాలు పెరుగుతాయన్నారు. విద్యార్థులు పాజిటివ్ థింకింగ్‌తో చదవాలని సూచించారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, రిజిస్ట్రార్ నరసింహరావు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



అభివాదం చేస్తున్న ఎంపీలు మల్లు రవి, కిరణ్‌కుమార్

హిమాయత్‌నగర్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంటులో బిల్లు ఆమోదించి, 9వ షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలో చేపట్టిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాపోలు ఆనంద్ భాస్కర్, జాతీయ బీసీ మేధావుల సంఘం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడినట్లు తెలిపారు.

15న డయాలసిస్ ప్రీమియర్ లీగ్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: ఉమ్మీద్ చారిటబుల్ ట్రస్ట్, సాప్ మెడికల్స్, సాప్ కిడ్నీ సెంటర్ల సంయుక్తాధ్వర్యంలో ఈనెల 15న యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో 'డయాలసిస్ ప్రీమియర్ లీగ్' నిర్వహించనున్నట్లు ప్రముఖ నెఫ్రాలజీ వైద్యుడు డాక్టర్ షోయబ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అక్వీ అహ్మద్, ఎం.డీ.ఖాదర్, శివకుమార్‌తో కలిసి మంగళవారం లీగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డయాలసిస్ రోగుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారం, చెస్, క్విజ్ పోటీలు, స్పూన్ రేస్ తదితర గేమ్స్ ఉంటాయని తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామని ఉచితంగా రిజిస్ట్రేషన్, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 9281443868 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

17న ఉచితంగా కృత్రిమ అవయవాలు అందిస్తాం

పంజగుట్ట: ఉదయ్‌పూర్‌కు చెందిన నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఈనెల 17న రాష్ట్రంలోని 780 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు, కాళ్లు అందజేయనున్నట్లు సంస్థాన్ మీడియా, పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ భగవాన్ ప్రసాద్ గౌర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అల్కా చౌదరి, సామాజిక కార్యకర్త జస్మత్ భాయ్ పటేల్‌తో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంపాపేట్ లోని మినర్వాగార్డెన్స్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జర్మన్ టెక్నాలజీతో బరువు తక్కువగా, ఎక్కువ రోజులు ఉండేలా కృత్రిమ అవయవాలు రూపొందించామని అవి అమర్చడంతో పాటు అది ఎలా అమర్చుకోవాలో, ఎలా నడవాలో అన్ని తమ టెక్నికల్ టీం వారికి శిక్షణ ఇస్తుందని తెలిపారు. అలాగే కార్యక్రమం రోజు భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ క్యాంపు కార్యాలయం వద్ద బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెంకటేశ్వర కాలనీ, బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని 8 మంది బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం మంజూరైనట్లు తెలిపారు.

17న తెలంగాణ గంగ తెప్పోత్సవం

ఖైరతాబాద్: ఈనెల 17న తెలంగాణ గంగ తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఖైరతాబాద్ వాసవీ సేవాకేంద్రంలో మంగళవారం తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని సంఘాల సభ్యులంతా సాగర తీరంలోని గంగమ్మ ఆలయానికి భారీగా గంగపుత్రులు తరలిరావాలన్నారు. మహేందర్ బాబు మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో గంగ తెప్పోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ, ఉపాధ్యక్షుడు గుండు జగదీష్ బాబు, అదనపు ప్రధాన కార్యదర్శి బైరు బాబూరావు, కోశాధికారి కాపరనేని లింగం, కార్యనిర్వాహక అధ్యక్షులు మంగళపల్లి రాజు, మామిడి సురేశ్ కుమార్, శివరత్నం, శంకర్ పిల్లి, శ్రీరాం తాగూర్, అల్లం రాజు, కొప్పు పద్మ, అరుణ్ జ్యోతి, విశాల్ కుమార్, మురళితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు



అరెస్టయిన నేతలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12 ఎమ్మెల్యే కాలనీ పెద్దమ్మ తల్లి సన్నిధిలో కుంకుమార్చన, అమ్మవారికి బోనం సమర్పిస్తామని పలు హిందూత్వ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆలయం చుట్టూ దారులను అష్టదిగ్బంధనం చేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఎస్‌బీటీ నగర్‌కు చెందిన పలువురు నేతలను ముందస్తు అరెస్టు చేసి బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించారు. అంతకముందే ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు బీజేపీ నాయకురాలు మాధవీలత, కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ తదితరులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆలయం వద్దకు ఎవరూ రాకుండా ఎస్‌బీటీనగర్ చర్చి, ఎమ్మెల్యే కాలనీ, రోడ్డునంబర్-12 తదితర ప్రాంతాల దారులన్నీ మూసివేశారు.

హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోన్న రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి చింతల వెంకన్న, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, ధర్మ ప్రసార్ రాష్ట్ర కో-కన్వీనర్ సుభాష్‌చందర్ విమర్శించారు. పలు హిందూ సంఘాల నాయకుల అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారి విగ్రహాన్ని అపవిత్రం చేసి, విగ్రహాన్ని తరలించి, మందిరాన్ని ధ్వంసం చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులు, అక్రమ కేసులు తమకు కొత్త కాదని, లక్ష్యం చేరేవరకు వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అగ్రసేన్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్ : అగ్రసేన్ జయంతిని ఘనంగా నిర్వహించడంతో పాటు సభ్యత్వ నమోదుపై విస్తృత ప్రచారం చేయాలని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2025-27 కాలానికి కేంద్ర కమిటీ సభ్యులు, శాఖల ఆఫీస్ బేరర్ల రెండో ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఈనెల 14న సాయంత్రం 7 గంటలకు సికింద్రాబాద్ ప్యారడైజ్‌లోని అగర్వాల్ సమాజ్ బాంకెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అగర్వాల్ సమాజ్ సభ్యులకు తమ ఉద్యోగులకు ప్రివిలేజ్ కార్డులు, ఎన్నికలు, ఓటు హక్కు, తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

నేడు పోస్టాఫీస్‌లో జీరో అకౌంట్స్ ప్రారంభం

పంజగుట్ట: ఖైరతాబాద్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో ఈనెల 13న ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో మహిళలకు జీరో అకౌంట్ ఓపెన్ చేయనున్నట్లు జాతీయ యువజన అవార్డు గ్రహీత కె.భగవాన్ దాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖాతాతో పాటు అప్పుడే పుట్టిన పిల్లలకు కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పథకాలైన (సుకన్య సంమృద్ధి యోజన), పోస్టాఫీస్ ప్రత్యేక జీవిత బీమా, యాక్సిడెంట్ బీమా, బ్యాంకులాగే పోస్టాఫీస్ సేవలు, పథకాల రిజిస్ట్రేషన్ విషయాలపై అవగాహన ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు కొనసాగుతుందని మరిన్ని వివరాలకు 9848044052 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'చంద్రసాగర్-అమ్రాబాద్' ఎత్తిపోతలను వెంటనే చేపట్టాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రొ.జి.హరగోపాల్

హిమాయత్‌నగర్ : పాలమూరు జిల్లాలోని 'చంద్రసాగర్-అమ్రాబాద్' ఎత్తిపోతల పథకాన్ని వెంటనే చేపట్టాలని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 3 నుంచి 30 వరకు చేపట్టనున్న ప్రచార కరపత్రాలను వేదిక ప్రతినిధులు రాజేంద్రబాబు, అశ్విని పీ.బిస్వామి, ఆర్.సుధాకర్, రఘుపతిరావు, ఎ.మల్లయ్యతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పథకం చేపడితే అమ్రాబాద్, పదర మండలాల్లోని అన్ని గ్రామాలకు నల్లమల అడవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసులు, చెంచులకు తాగునీటితో పాటు 30 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. గతంలో ఈ పథకాన్ని చేపట్టాలని నాటి సీఎం కేసీఆర్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా



సైరన్ తొలగింపును పరిశీలిస్తున్న ఏసీపీ మోహన్‌కుమార్

బంజారాహిల్స్: మద్యం తాగి వాహనాలు నడిపిన 94 మందిని నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా 19 మందికి జైలు శిక్ష, జరిమానా, మరో 75 మందికి ఒక్కొక్కరికీ 3100 చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపారు. ఒకరికి 16 రోజులు, ఇద్దరికి 10 రోజులు, 14 మందికి 6 రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. అదేవిధంగా సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అధిక శబ్దం కలిగించే సైరన్లు ఏర్పాటు చేసుకుని వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుని జరిమానా విధించినట్లు, అలాగే అధిక శబ్దంతో వాహనాలు నడుపుతూ దొరికిన 43 వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఫిలింనగర్ వడ్డెర నేతలకు రాష్ట్రస్థాయి పదవులు



నియామక పత్రాలు అందుకుంటున్న ఫిలింనగర్ నేతలు

ఫిలింనగర్: ఫిలింనగర్ వడ్డెర సంఘంలోని పలువురు నేతలకు రాష్ట్రస్థాయి పదవులు వరించాయి. మంగళవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సంపంగి రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం మహిళా కార్యదర్శిగా పల్లపు పద్మ, గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా దేరంగుల తిరుపతి, హైదరాబాద్ జిల్లా వడ్డెర యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వరికుప్పల కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు చేతుల మీదుగా వీరు నియామక పత్రాలు అందుకున్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సంపంగి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు తమను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్నాయి కానీ న్యాయం చేయడం లేదన్నారు. వడ్డెరులను ఎస్టీల్లో చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ఉద్యమాలు, నిరసనలు చేపడుతామన్నారు.

సీతారం ఏచూరికి ఘన నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

వెంగళరావునగర్ : మధురానగర్‌కాలనీలో ఏచూరి 73వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆలిండియా నాయకుడు వి.నాగేశ్వరరావు హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మస్థలిలో మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, క్షుద్రపూజలను ఖండిస్తూ ప్రజలందరూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాపర్తి అశోక్, పాపారావు, జితిన్ ప్రసాద్, రమణ, ముత్తయ్య, రమేశ్, తిరుపాల్, ఆసిఫ్, లక్ష్మణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్ సమావేశం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-45 లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో మంగళవారం మోడల్ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల కట్టుబొట్లు, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. ఆయా రాష్ట్రాల భాషలో ప్రశ్నలు అడిగారు. ఆయా రాష్ట్రాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు దేశంపై అవగాహన, సృజన పెరుగుతుందని స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తెలిపారు.

15 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



బంజారాహిల్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్-హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో బంజారాహిల్స్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లోని శ్రీరాధా గోవిందా ఆలయంలో శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు బుధవారం తెలిపారు. భారతీయ సనాతన సంప్రదాయాలను, ఆధ్యాత్మికతను ప్రతిబింబించే హరేకృష్ణ చాలెంజ్, కృష్ణ కిడ్స్, జప క్లబ్, సాంప్రదాయ నృత్య-గాన సేవల వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి తమలపాకుల పూజ



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14 నందినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించారు. శ్రావణంలో వచ్చే మంగళవారం పూర్వాభద్ర నక్షత్రం సంకటహర చతుర్థి స్వామివారికి ఎంతో ప్రత్యేకమైనదని అర్చకుడు శేషశైలాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీలత, మాదాల కష్ణ, దీపికా, సతీశ్ రెడ్డి, గోపిక సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు 750 గ్రాముల రజత కవచాలను అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు కిరణ్ కుమారాచార్యులు, ఆలయ చైర్మన్ దశరథ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, బుధవారం, 13, ఆగస్టు, 2025



షెహర్.. బస్కింగ్ హుషార్

సిటీలో ఊపందుకుంటున్న బస్కింగ్ కల్చర్

వీధివీధినా అనూహ్య ప్రదర్శనల ట్రెండ్ సెట్టర్	విధి విధానాలు రూపొందితే.. మరింత ఊపు	పర్యాటకానికి మేలు, స్థానిక కళల వృద్ధికి వీలు

ఒక ఆహ్లాదకర సాయంత్రం, ట్యాంక్ బండ్ పరిసరాల్లో ఒక వర్ధమాన గాయకుడు ప్రేక్షకులకు వీనుల విందు చేయవచ్చు.. దుర్గం చెరువు తీగల వంతెన సమీపంలో ఒక బీట్‌బాక్సర్ తన ప్రతిభ చూపించ వచ్చు.. మరొక ఖాళీ రోడ్డు మీద ఓ సాక్సాఫోన్ ఆర్టిస్ట్ స్వరాలు చిలకరించ వచ్చు.. రూ.వందలు, వేలు ఖర్చు పెడితే లేదా ఎంట్రీ ఉంటే కానీ ఆస్వాదించలేని కళా ప్రదర్శనలు బహిరంగ ప్రదేశాల్లో ఉచితంగా అందుబాటులోకి రావడం ఒకప్పుడైతే ఊహాజనితమేమో కానీ.. ఇప్పుడు నగరంలో కళ్ల ముందు కనిపించే వాస్తవం. మెట్రో నగరాల్లో ఇప్పటికే బాగా ఊపుమీదున్న బస్కింగ్ కల్చర్ నగరంలోనూ ఊపందుకుంటోంది. - సాక్షి, సిటీబ్యూరో



బెంగళూర్‌లో జోరుగా..

బస్కింగ్ ఒకవైపు కళాకారులకు నేరుగా ప్రేక్షకులతో కలిసే అవకాశం ఇస్తే, మరోవైపు పట్టణ సంస్కృతిలో ఒక ప్రత్యేక వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఈ కల్చర్‌కు ప్రత్యేకంగా పేరొందిన నగరంగా బెంగళూరు నిలుస్తోంది. అక్కడ ఎంజీ రోడ్, చర్చ్ స్ట్రీట్, బ్రిగేడ్ రోడ్ వంటి ప్రదేశాలలో వీధి సంగీతకారులు, బీట్‌బాక్సర్లు, ఫ్లూటిస్టులు తరచూ కనిపిస్తారు. అలాగే ముంబై (బాంద్రా, మెరైన్ డ్రైవ్), ఢిల్లీ(కనాట్ ప్లేస్), గోవా, పుదుచ్చేరి కూడా బస్కింగ్ కల్చర్‌కు బాగా పేరొందాయి. కొన్ని నగరాల్లో బస్కింగ్‌ను షరతులతో అనుమతిస్తున్నారు. అయితే మరికొన్ని చోట్ల ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా పరిమితులకు లోబడి చేసుకోవచ్చు.



మన దగ్గరా ఊపు..

విభిన్న రకాల కళలు, కళాకారులు పెరుగుతున్న మన నగరం కూడా బస్కింగ్ ఇటీవలే వేళ్లానుకుంటోంది. నగరంలోని మారథాన్స్ సందర్భం గా నిర్వహించే మ్యూజికల్ ఈవెంట్స్, అలాగే ఇటీవల నగరవ్యాప్తంగా మెట్రో స్టేషన్స్ లో నిర్వహించిన సంగీతోత్సవాలు బస్కింగ్ ట్రెండ్‌కు అద్దం పడతాయి. 'ది అర్బన్ నాగా' పేరిట ప్రదర్శన ఇచ్చే అనంత్ అగర్వాల్, కొంత కాలంగా బహిరంగ ప్రదేశాలలో బీట్‌బాక్సింగ్ చేస్తున్నారు. 'నా సెట్‌లు ఎక్కువ ఆకస్మికంగా ఉంటాయి వీటికి ప్రజల నుంచి ప్రతిస్పందన బాగుం టోంది.' అంటూ చెబుతున్నారు. అనుమతులతో సంబంధం లేకుండా నిర్వహించినా, ఎప్పుడూ తాను తీవ్రమైన ఇబ్బం దులను ఎదుర్కోలేదని, ఎవరికీ ఇబ్బంది కలిగించనంత కాలం ఇది సమస్యాత్మకం కాదు' అంటారాయన.

రెడీమేడ్ స్ట్రీట్ షోస్‌కి పేరొందిన బెంగళూర్, ముంబై







బస్కింగ్ అంటే రోడ్డుపై లేదా పబ్లిక్ ప్రదేశంలో ప్రజల కోసం ప్రజల చేత ప్రజల వలన.. అన్నట్టుగా కళలను ప్రదర్శించడం. అది సంగీతం, నృత్యం, ఇంద్రజాలం, పెయింటింగ్ ఇంకా ఏదైనా కావొచ్చు. ఆ ప్రదర్శనను చూసిన వారు ఇష్టపడి డబ్బు(టిప్స్ లేదా డొనేషన్స్) ఇవ్వడం కూడా జరుగుతుంటుంది. వీటినే స్ట్రీట్ పెర్ఫార్మెన్స్ అని కూడా అంటారు.

యూరప్‌లో క్లాప్..

యూరప్‌లో శతాబ్దాల క్రితమే ఈ కల్చర్ ప్రారంభమైంది. ఇండియాలో బస్కింగ్ సంప్రదాయం ఓ రకంగా చాలా పాతది అని చెప్పొచ్చు. వీధి నాటకాలు, జానపద గాయకులు, తోలు బొమ్మలాట బృందాలు, హరిదాసులు. వంటివి భారతీయ బస్కింగ్‌కి చిహ్నాలు అనే చెప్పొచ్చు. ప్రస్తుతం రోడ్ మ్యూజీషియన్స్, లైవ్ పెయింటర్స్, మైమ్ ఆర్టిస్టులు, డ్యాన్సర్స్ బస్కింగ్‌కు బాగా పేరొందారు. ఈ ప్రదర్శనలకు టికెట్ కౌంటర్లు లేదా వేదికలతో సంబంధం లేదు. చాలా సహజంగా, అక్కడికక్కడే మొదలై ముగిసే రెడీమేడ్ ప్రదర్శనలు ఇవి.

అనుమతులు, అవగాహన అవసరం..

నగరంలో బస్కింగ్ ప్రదర్శనకారులు వీధి ప్రదర్శనలు ఇప్పటికీ అరుదే. దీనికి కారణం నగరంలో సాధారణంగా ఏ కార్యక్రమానికైనా ముందస్తు అనుమతి అవసరం. తాము ట్యాంక్ బండ్‌లో ప్రదర్శనకు ప్రయత్నించి విఫలమయ్యామని క్రియేటివ్ హౌజ్ ఎస్ఆర్‌బీ వ్యవస్థాపకురాలు శ్రియగుప్తా గుర్తు చేశారు. తమ వాయిద్యాలు కూడా సీజ్ చేశారన్నారామె. ఇది ఇక్కడ మాత్రమే కాదు దేశవ్యాప్తంగానూ ఉన్న సమస్య. ఇటీవల పాండిచ్చేరిలో ఒక ఫ్రెంచ్ బస్కర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 'లిఖితపూర్వక అనుమతి ఉన్నప్పటికీ, ఏదో ఒక అడ్డంకి వస్తుంటుంది' అని నగరంలో డ్రాగ్ యాక్ట్స్ చేసే పాత్రుని చిదానంద శాస్త్రి అంటున్నారు. అయితే చాలా మందికి బస్కింగ్ అనే పదం ఇప్పటికీ కొత్తగా అనిపిస్తుంది. దీనిపై ప్రజలు, ప్రభుత్వాల్లో సైతం అవగాహన పెరగాల్సి ఉందనేది కళాకారుల మాట. 'సెక్యూరిటీ గార్డులకు మేం ఏమి చేస్తున్నామో అర్థం కాలేదు. అర్థమయ్యేలా చెప్పడానికి పుణ్యకాలం కాస్తా గడచిపోతుంది' అని శాస్త్రి చెబుతున్నారు. దేశంలో చాలాచోట్ల బస్కింగ్ చట్టబద్ధం కాదు. అలాగని ఇది పూర్తిగా నేరంగా కూడా చూడటం లేదు. ఈ నేపథ్యంలో దీనిని చట్టబద్ధం చేయాలని పలువురు భావిస్తున్నాను. కొన్ని నిబంధనలు, ప్రత్యేక ప్రదేశాలు వీటికి కేటాయిస్తే.. కొన్ని దేశాల్లో మాదిరిగా బస్కర్లకు లైసెన్స్‌లు మంజూరు చేస్తే నగరంలో బస్కింగ్ కల్చర్ స్థానిక కళలను మెరిపిస్తుం దని అంటు న్నారు.

ఆర్ట్ ఇన్‌స్టలేషన్..



కళ వెలికితీసేలా..



వారంతా గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో మొదటి సంవత్సరంలో చేరిన భావి ఇంజినీర్లు.. వారిలోని కళ, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఆర్ట్ విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని 'రైజ్ టుగెదర్' పేరుతో నిర్వహించారు. ప్రతి విద్యార్థిచేత రంగురంగుల కాగితాలతో విమానాలు, పూల తరహా డిజైన్లను తయారు చేయించారు. అందరూ రూపొందించిన వాటిని ఒక్కచోట చేర్చి వినూత్న ఆకృతిలో అందరినీ ఆకట్టుకునేలా ప్రదర్శించారు. ఈ ఆకృతిని తిలకించిన పలువురు మెచ్చుకున్నారు. ఇదే తరహాలో గతేడాది కూడా ఓ ఆకృతిని ఆకట్టుకునేలా రూపొందించారు. కార్యక్రమాన్ని ఆర్ట్ ఫ్యాకల్టీ షాజిల్ పడియూర్ పర్యవేక్షించారు. - రాయదుర్గం





రారాండోయ్.. గణేశుడి చిత్రం వేసేద్దాం..

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఈ నెల 22న గణేశ్ పెయింటింగ్ కాంపిటీషన్ నిర్వహించ నున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలుగా అందించను న్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు: 90309 04040, 91000 22958, 76618 72327.

బూమ్‌బాక్స్ కోసం మేబి ట్రాక్ రెడీ



సాక్షి, సిటీబ్యూరో: యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్‌తో కలిసి సమర్పించే సంగీత వేడుక రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ నగరంలో ఇటీవల నిర్వహించిన సంగతి తెలిసిందే.. ఈ కార్యక్రమం ఆదరణ పొందడంతో మరోసారి బూమ్‌బాక్స్ ఈవెంట్ నిర్వహణకు బ్రాండ్ సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఒరిజినల్స్ పేరిట కొన్ని ట్రాక్స్‌ను కూడా రూపొందిస్తోంది. ఈ విష యాన్ని బ్రాండ్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మెలొడీని, హిప్‌హాప్‌ను మేళవించే ఒక విలక్షణమైన ఫార్మాట్‌లో పెహ్లె జైసీ బాత్ నహీ, హూడీ, మొహబ్బత్, ఇమ్తిహాన్ వంటి విజయవంతమైన ట్రాక్స్ తర్వాత మేబిని విడుదల చేశా మన్నారు. ఈ పాటను గాయకుడు అర్మాన్ మలిక్ గాయని ఇక్కాల కాంబినేషన్‌తో రూపొందిందని, త్వరలో నిర్వ హించే సంగీత వేడుకలో ఈ వెరైటీ ట్రాక్స్ వీనుల విందు చేస్తాయని వివరించారు.

స్లాట్ పరీక్ష డిసెంబర్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయంగా పేరొందిన నగరంలోని సింబయాసిస్ యూనివర్సిటీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే లా అడ్మిషన్ టెస్ట్(ఎస్ఎల్ఏటీ) 2026 కోసం రిజిస్ట్రేషన్లు ఇప్పుడు అధికారి కంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ పరీక్ష వచ్చే డిసెంబర్ 20(శనివారం), డిసెంబర్ 28(ఆదివారం) జరుగుతుందని, సింబయాసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్సిటీ) ఆధ్వర్యంలో నగరం తో దేశవ్యాప్తంగా 68 నగరాల్లో నిర్వహించనున్నట్లు తెలియజే శారు. అదనపు వివరాలు, దరఖాస్తు చేసేందుకు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.





భాగ్యనగరంలో భళ్లే.. భళ్లే..

సాక్షి, సిటీబ్యూరో: పంజాబీ సెన్సేషన్ పర్మిష్ వర్మ నగరానికి వస్తున్నారు. చార్ట్-టాపింగ్ హిట్స్ హై-ఎనర్జీ ప్రదర్శనలకు పేరుగాంచిన పర్మిష్, సిటీలోని మ్యూజిక్ లవర్స్‌కు మరచి పోలేని ట్రీట్ అందించనున్నారు. భారతీయ హిప్-హాప్‌లో డేరింగ్ శైలికి పేరొందిన స్మోక్‌తో ఈ ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఈ నెల 29న కొండాపూర్‌లోని క్వేక్ ఎరీనాలో ఆయన సంగీత కార్యక్రమం ఉంటుందని, రాత్రి 7గంటల నుంచి 3గంటల పాటు కొనసాగు తుంది. హిప్‌హాప్, పంజాబీ సంగీతం, హిందీ ట్రాక్స్‌తో ఆయన అలరించనున్నారు.

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన సిటీ సెయిలర్లు

యువ సెయిలర్లు.. మెరిశారు..

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ వేదికపై నగరానికి చెందిన 14 ఏళ్ల యువ సెయిలర్లు దండు వినోద్, నిరుడు బద్రీనాథ్ సత్తాచాటారు. చెక్ రిపబ్లిక్‌లోని లేక్ లిప్నోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఏడు యూరోపియన్ దేశాలు, ఆస్ట్రేలియా, భారత్ నుంచి వచ్చిన 104 బోట్లతో కూడిన అంతర్జా తీయ బృందాలను వినోద్, బద్రీనాథ్ అండర్ 17 క్యాడెట్ క్లాస్‌లో ఆశ్చర్యపరిచారు. మొత్తం 12 రేసుల్లో రెండు సింగిల్ డిజిట్ స్థానాలను, అందులో ఒక రేసులో రెండో స్థానాన్ని కూడా సాధించారు. ఓవరాల్‌గా 14వ స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకున్నారు. సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వీరు యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. హెడ్ కోచ్ సుహీమ్ షేక్, మాజీ జాతీయ చాంపియన్ అయ్యాజ్ షేక్ పర్యవేక్షణలో కేవలం రెండు నెలల కఠిన శిక్షణతోనే క్యాడెట్ క్లాస్‌లో ప్రపంచ చాంపియన్ షిప్‌కు అర్హత సాధించడం విశేషం. 2026 జులైలో ఇటలీలో జరగబోయే తదుపరి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆసియా క్రీడల కోసం 29 ఈఆర్, ఇంటర్నేషనల్ 420 వంటి పెద్ద బోట్లలో శిక్షణ కోసం సన్నద్ధమవుతున్నారు.



నైపుణ్యం మెరుగుపర్చుకునే అవకాశం

2000వ సంవత్సరం వరకు భారత్‌లో బాగా ప్రాచుర్యం పొందిన అండర్-17 క్యాడెట్ క్లాస్ సెయిలింగ్ బోట్‌ను సుహీమ్ కోచ్ చొరవతో ఇటీవల తిరిగి ప్రవేశపెట్టడం విజయానికి ఒక ప్రధాన కారణమైంది. ఇది యువ సెయిలర్లకు డబుల్ హ్యాండర్ విభాగంలో నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశాన్ని కల్పించింది. మాజీ జాతీయ క్యాడెట్ పుష్పరాజన్ ముత్తు ఈ బోట్‌ను అద్భుతమైన ఆవిష్కరణగా అభివర్ణించాడు. మొదటిసారి సెయిలింగ్ చేసేవారికి చాలా ఉత్తమమైన బోట్ అని హెడ్ కోచ్ సుహీమ్ షేక్ చెప్పారు.

క్లుప్తంగా...

కాళేశ్వరం రక్షణకు ఏం చేశారు?

నివేదిక అందజేయాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం రక్షణకు ఏ చర్యలు తీసుకున్నారో నివేదిక అందజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలేదంటూ చెరుకు సుధాకర్ 2020లో దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. కాళేశ్వరం రక్షణకు తీసుకున్న చర్యలపై నివేదిక అందజేయాలని 2023, సెప్టెంబర్‌లో ధర్మాసనం ఆదేశాలు జారీ చేసినా.. ఇప్పటివరకు సమర్పించలేదన్నారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ పొట్టిగారి శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నివేదిక, తాజా వివరాలను అందజేయడానికి కొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

రెండు వారాల్లో ఏపీపీల భర్తీ నోటిఫికేషన్

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రవ్యాప్తంగా 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ (ఏపీపీ) భర్తీకి రెండు వారాల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. ఈ వాదనలను నమోదు చేసుకున్న న్యాయస్థానం.. సెప్టెంబర్ 2కు విచారణ వాయిదా వేసింది. ఆలోగా నోటిఫికేషన్ వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పరిధిలో 118 ఏపీపీ పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ఆర్థిక శాఖ జూన్‌లో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 262 ఏపీపీ పోస్టులు ఖాళీగా ఉండగా, 118 పోస్టులకు అనుమతి లభించింది. జూన్‌లో ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినా నోటిఫికేషన్ జారీ చేయ లేదంటూ రామంతపూర్‌కు చెందిన బొడ్డుపల్లి శ్రీనివాసులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది జి.జితేందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఏపీపీ పోస్టులు భర్తీ కాక ట్రయల్ కోర్టుల్లో విచారణలు మందకొడిగా సాగుతున్నాయన్నారు.ఏజీపీ సురేంద్రకుమార్ వాదనలు వినిపిస్తూ.. పోస్టుల భర్తీ నోటిఫికేషన్ రెండు వారాల్లో జారీ చేస్తామని చెప్పారు.

భౌ.. భౌ..!



- దేశవ్యాప్తంగా వీధుల్లో కుక్కల బెడద
- 11 సెకన్లకో కుక్క కాటు కేసు నమోదు
- 2024లో దేశంలో 37 లక్షలకుపైగా కేసులు
- చర్చకు తెరలేపిన 'సుప్రీం' ఆదేశాలు

వీధి కుక్కల దాడిలో బాలుడి మృతి.. పిచ్చి కుక్క కరిచి పది మందికి గాయాలు.. ఇలాంటి వార్తలు నిత్యం మనకు కనిపిస్తుంటాయి, వినిపిస్తుంటాయి. వీధి కుక్కల ముప్పు ఒక్క ప్రాంతానికో, నగరానికో పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. కుక్కకాటు సంఘటనలు మూడేళ్లలో 70 శాతం పెరిగాయంటే సమస్య తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలోని అన్ని కుక్కలను ఎనిమిది వారాల్లోగా షెల్టర్లకు తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశవ్యాప్తంగా ఈ అంశం చర్చకు వచ్చింది.

\- సాక్షి, స్పెషల్ డెస్క్


చాలామంది రాత్రుళ్లు వీధుల్లో నడవడానికి, బైక్ మీద వెళ్లడానికి భయపడతారు. ఉదయం మార్నింగ్ చేసేటప్పుడు చాలామంది కర్రలు పట్టుకుంటారు. వీటన్నింటికీ కారణం.. గ్రామ సింహాలు. బైక్ మీద వేగంగా వెళ్తుంటే కుక్కలు వెంటపడి, కరిచి లేదా వారు కిందపడి ఎంతో మంది గాయపడిన సంఘటనలు ఉన్నాయి. మనదేశంలో కుక్కల ప్రతాపం చవిచూడని ఊరు ఉండదంటే అతిశయోక్తి కాదు.

దేశవ్యాప్తంగా కుక్క కాటు సంఘటనలు

2022	21,89,909
2023	30,52,521
2024	37,15,713

సుమారు 70 శాతం పెరిగాయి

కుక్కకాటు సంఘటనలు 2024లో దేశంలో 37 లక్షలకుపైగా నమోదయ్యాయి. మూడేళ్లలో ఈ ఘటనలు 69.6 శాతం పెరిగాయి. ఈ ఏడాది జనవరిలోనే 4.29 లక్షల కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దేశవ్యాప్తంగా రేబీస్ అనుమానిత కేసులు భారీగా తగ్గుతూ వచ్చాయి. 2022తో పోలిస్తే గత ఏడాది ఈ కేసులు 78 శాతం క్షీణించాయి. కానీ మరణాలు మాత్రం ఊహించని స్థాయిలో అధికం అయ్యాయి. రెండేళ్లలో ఎనిమిది రెట్లకుపైగా పెరిగి జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. గత ఏడాది వీధి కుక్కల దాడి కారణంగా రేబీస్‌తో భారత్‌లో 180 మంది మరణించగా.. వీరిలో అత్యధికంగా మూడింట రెండొంతులు దక్షిణాది రాష్ట్రాల నుంచే ఉండడం గమనార్హం.



11 సెకన్లకు ఒకటి..

భారతదేశంలో 6 కోట్లకు పైగా వీధి కుక్కలు ఉన్నాయని అంచనా. వీటిలో చాలా తక్కువ మాత్రమే సహజ మరణాలకు గురవుతాయని నిపుణులు చెబుతున్నారు. అంటే వ్యాధులతో మరణించేవే అధికం అన్నమాట. దేశంలో ప్రతి 11 సెకన్లకు ఒకరిని కుక్క కరిచిన సంఘటనలు నమోదవుతున్నాయి. దాదాపు 5,000 ఘటనలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. కుక్కల ద్వారా ప్రజలకు 60కి పైగా వ్యాధులు వ్యాపిస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం కుక్కల దాడి వల్ల రేబీస్ సోకి గత ఏడాది 180 మంది ప్రాణాలను బలిగొంది. ఈ వీధి కుక్కలు భారతీయ రోడ్లు, పొలాల్లో రోజూ 15,000 టన్నులకు పైగా మలం, 8 మిలియన్ గ్యాలన్ల మూత్రం విడుదల చేస్తున్నాయి. ఇది ఒక ప్రధాన ఆరోగ్య, పర్యావరణ సమస్య అన్నది వైద్యుల మాట. ఇక, పెంపుడు కుక్కలు దేశంలో 3 కోట్లకుపైచిలుకు ఉంటాయని నివేదికలు చెబుతున్నాయి.

ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా రేబీస్ అనుమానిత కేసులు, మరణాల సంఖ్య

సంవత్సరం	కేసులు	మరణాలు
2022	4,885	22
2023	2,223	121
2024	1,079	180

2024లో దక్షిణాదిలోనే రేబీస్ మరణాలు అధికం

తమిళనాడు	43
కర్ణాటక	42
ఆంధ్రప్రదేశ్	39

భారతదేశంలో 6 కోట్లకు పైగా వీధి కుక్కలు ఉన్నాయని అంచనా.	దేశంలో ప్రతి 11 సెకన్లకు ఒకరిని కుక్క కరిచిన సంఘటనలు నమోదవుతున్నాయి.	దాదాపు 5,000 ఘటనలు ప్రాణాంతకంగా మారుతున్నాయి.

కుక్కల ద్వారా ప్రజలకు 60కి పైగా వ్యాధులు వ్యాపిస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సీడీఓ ప్రతిష్ట పునరుద్ధరణ

- విభాగంలోకి ఇకపై ఐఐటీ, ఎన్‌ఐటీ ఇంజనీర్లు: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ప్రతిష్టను మళ్లీ పునరుద్ధరించి సాగునీటి ప్రాజెక్టు డిజైన్ల రూపకల్పనలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. సీడీఓ ఆధునికీకరణ, బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సీడీఓ విభాగాన్ని బలోపేతం చేసే అంశంపై మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్షించారు. తక్షణమే సీడీఓలో నైపుణ్యం గలిగిన ఇంజనీర్లను నియమించాలని ఆదేశించారు. ఖాళీల భర్తీకి శాఖలో అత్యంత నిపుణత, అర్హత కలిగిన ఇంజనీర్లను సీడీఓకి బదిలీ చేయాలని చెప్పారు. ఐఐటీ, ఎన్‌ఐటీల్లో చదివిన ఇంజనీర్లను శాఖలో భర్తీ చేశామని, అలాంటి వారి నైపుణ్యం వాడుకోవడానికి సీడీఓ వంటి విభాగాలు సరైన చోటన్నారు.

యుద్ధప్రాతిపదికన సమీకరించుకోండి..: వందేళ్ల కింద నిజాంసాగర్‌కి డిజైన్ల నుంచి భారీ ప్రాజెక్టులకు సాంకేతిక నైపుణ్యత అందించడం ద్వారా దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సీడీఓ విభాగం ప్రతిష్ట మసకబారిందని ఉత్తమ్ ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిన ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ)తో పాటు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికల్లో సీడీఓ పనితీరుపై తీవ్ర ఆక్షేపణలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో అత్యుత్తమ డిజైన్లను అందించేందుకు అవసరమైన అత్యాధునిక సాఫ్ట్‌వేర్, పరికరాలను యుద్ధప్రాతిపదికన సీడీఓ కోసం సమీకరించాలని ఆదేశించారు. డిజైన్లలో నైపుణ్యం గల రిటైర్డ్ లేదా సర్వీసులో ఉన్న ఉద్యోగులను కన్సల్టెంట్లుగా నియమించుకోవాలని, నైపుణ్యాన్ని చాటుకున్న రిటైర్డ్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణలో సవాళ్లను ముందే పసిగట్టగలిగే నిపుణుల సేవలు అవసరమన్నారు. నెల్లికల్లు, డిండి, ఇతర ప్రాజెక్టుల డిజైన్లు పెండింగ్‌లో ఉన్నా యని అధికారులు చెప్పగా, వాటికి సరైన డిజైన్లను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

రూ.2 కోట్లు స్వాహా!

- స్వయం సహాయక సంఘాలకు కుచ్చుటోపీ
- పోలీసుల అదుపులో వీబీకే, బ్యాంకు ఉద్యోగి



యాచారం ఎస్‌బీఐలో ఆందోళన చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

యాచారం: ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లతో రూ.2 కోట్లు స్వాహా చేసిన ఘటన యాచారంలో వెలుగు చూసింది. డ్వాక్రా మహిళా సంఘాలకు చెల్లించాల్సిన ఈ మొత్తాన్ని ఓ విలేజ్ బుక్‌కీపర్ (వీబీకే).. బ్యాంకు అధికారులతో కుమ్మక్కై కాజేసినట్టు తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చౌదర్‌పల్లి గ్రామంలో 62 స్వయం సహాయక సంఘాలున్నాయి. 30 గ్రూపులను పర్యవేక్షిస్తున్న వీబీకే వరలక్ష్మి గతంలో యాచారం ఎస్‌బీఐ మేనేజర్‌గా పనిచేసిన ఝాన్సీరాణి సహకారంతో ఈ అవినీతికి పాల్పడినట్టు మహిళలు ఆరోపించారు. ఏళ్లు గడుస్తున్నా అప్పు తీరకపోవడంతో అనుమానం వచ్చిన మహిళలు బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. తమకు ఇచ్చిన రుణాలకు, బ్యాంకులో ఉన్న అప్పులకు వ్యత్యాసం ఉండటంతో వివరాలు సేకరించగా, లక్షలాది రూపాయలు ఇతర ఖాతాల్లో జమ అయినట్టు గుర్తించారు. ఈ విషయమై నాలుగు రోజులుగా వీబీకేతోపాటు బ్యాంకు సిబ్బందిని అడిగినా స్పందన లేదు.

యాచారం ఎస్‌బీఐకి తాళం: మోసపోయామని తెలుసుకున్న మహిళలు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంకు ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యాలయానికి తాళం వేసి, సాగర్‌రోడ్డుపై బైఠాయించారు. ఈ సమయంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కాన్వాయ్‌ని ఆపి, సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన బ్యాంకులోకి వెళ్లి సిబ్బందిని నిలదీశారు. ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. అక్రమాలకు పాల్పడిన వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని సీఐ నందీశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం చౌదర్‌పల్లి వీబీకే వరలక్ష్మి, ఎస్‌బీఐ ఉద్యోగి ఈశ్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిధుల స్వాహాపై సమగ్ర విచారణ జరపాలని డీఆర్‌డీఓ శ్రీలత అధికారులను ఆదేశించారు. యాచారం ఏపీఎం రవీందర్‌కు ఫోన్ చేసి మందలించారు.

అవగాహనతోనే మత్తు రహిత తెలంగాణ సాధ్యం

టీఓటీ శిక్షణలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య



సాక్షి, హైదరాబాద్: అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చగలమని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. యువతలో మాదకద్రవ్య దుర్వినియోగం, నివారణ, అవగాహన, పునరావాసంపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో 400 మంది ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనర్ల శిక్షణలో ఇంపాక్ట్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు, హైదరాబాద్ నగర భద్రతా మండలి నుంచి కౌన్సెలర్లు, ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ సభ్యులు, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) అధికారులు పాల్గొన్నారు. అన్ని విద్యాసంస్థలు తమ విద్యార్థులను మాదకద్రవ్య నిరోధక సైనికులుగా నమోదు చేసుకోవాలని, వారి క్యాంపస్‌లలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేందుకు సహకరించాలని సందీప్ శాండిల్య కోరారు. కార్యక్రమంలో ఎస్పీ సీతారాం, అడిషనల్ ఎస్పీ కృష్ణమూర్తి, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు, ఇంపాక్ట్ అడ్వైజర్ శ్రీధర్ వీరమల్ల, అలాగే ఈగల్ డీఎస్పీలు సైదులు, శంకర్‌యాదవ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగర వార్తలు


ఎంఓయూలపై ఆరోపణలు నిరాధారం

\- జేఎన్‌టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి



బాలానగర్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, జర్మనీ దేశంలోని విశ్వవిద్యాలయాలతో చేసుకున్న ఎంఓయూలపై వస్తున్న ఆరోపణలన్నీ నిరాధారమైనవని జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం వర్సిటీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ నుంచి 6 ఎంఓయూ కోర్సులు నడుస్తాయన్నారు. ఈ ఏడాది జర్మనీలోని రోట్లింజన్, కాసెల్ విశ్వవిద్యాలయాలతో ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. వీటిపై అనేక వదంతులు వస్తున్నాయని అన్నారు. రోట్లింజన్ వర్సిటీ ఎంఓయూ ప్రకారం.. విద్యార్థులు మూడేళ్లపాటు జేఎన్‌టీయూలో, ఒకటిన్నర సంవత్సరం జర్మనీ దేశంలో చదువుతారని తెలిపారు. కాసెల్ వర్సిటీ ఎంఓయూ ప్రకారం.. ఒక సెమిస్టర్ జేఎన్‌టీయూలో, 3 సెమిస్టర్లు జర్మనీలో చదువుతారని తెలిపారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఏమైనా అనుమానాలు ఉంటే తమ దగ్గరకు వస్తే సమాధానం చెబుతామని అన్నారు. సమావేశంలో రెక్టార్ కె.విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినీ కార్మికుల వేతనాలు పెంచాలి



సినిమా పరిశ్రమలోని వివిధ విభాగాల కార్మికులతో కరుణాకర్‌రెడ్డి

ఫిలింనగర్: సినీ కార్మికుల న్యాయమైన వేతన పెంపు డిమాండ్‌ను ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ పరిష్కరించాలని తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఫిలింనగర్‌లోని ఫిలిఛాంబర్‌లో తెలుగు చలనచిత్ర మండలి సెక్రటరీ దామోదర్ ప్రసాద్‌ను కార్మికులతోపాటు కలిశారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం మూడేళ్లకోసారి వేతన సవరణ చేసి 30 శాతం పెంచాలని ఉన్నప్పటికీ నిర్మాతలు దాని ఊసే ఎత్తడం లేదని అన్నారు. పెరిగిన ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సినీపెద్దలు, నిర్మాతలు కార్మికుల పక్షాన ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ సి.మూర్తి, కోశాధికారి ఠాగూర్, తెలంగాణ సినిమా మీడియా స్టంట్ డైరెక్టర్స్, స్టంట్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు రాము పెరుమాల, బి.దుర్గాప్రసాద్, బి. నరేష్, సి.శ్రీనివాస్, ఎం.ఫరీద్, సతీష్ కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కారు.. కళ తప్పాయి..

- సినీ కార్మికుల సమ్మెబాట..
- వెలవెలబోయిన స్టూడియోలు

బంజారాహిల్స్: సినీ కార్మికులు కదం తొక్కారు. స్టూడియోలు కళ తప్పాయి. వేతనాల పెంపు కోసం 24 వేల మంది సినీ కార్మికులు పది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. తెలుగు ఫిలిం ఫెడరేషన అనుబంధ 24 క్రాఫ్ట్‌లకు చెందిన కార్మికులంతా నిబంధనల ప్రకారం 30 శాతం వేతనాలు పెంచాలంటూ విధులు బహిష్కరించారు. ఫిలిం ఫెడరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఫిలిం చాంబర్‌కు, ఫిలిం ఫెడరేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చలు ఎప్పటికప్పుడు విఫలమవుతున్నాయి. ఫలితంగా చాలా సినిమాల షూటింగ్ చిత్రీకరణ నిలిచిపోయింది. తెలుగు చిత్రసీమ దాదాపుగా స్తంభించడంతో స్టూడియోలన్నీ వెలవెలబోతున్నాయి. ప్రతిరోజూ షూటింగ్‌లకు కళకళలాడే బంజారాహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియో, ఫిలింనగర్‌లోని రామానాయుడు స్టూడియో, జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ ఏడెకరాల స్టూడియో అమీర్‌పేటలోని సారథి స్టూడియోలు బోసిపోయాయి. అవుట్‌డోర్‌లో షూటింగ్‌ల ఊసేలేదు. అటు కార్మికులు తమ డిమాండ్ల విషయంలోనూ, ఇటు నిర్మాతలు తమకు విధించిన షరతులపరంగాను మెట్టు దిగకపోవడంతో పది రోజులుగా సమస్య సాగుతూనే ఉంది. కార్మిక శాఖాధికారుల సమక్షంలో జరిగిన చర్చల్లో కూడా ఫలితం తేలడంలేదు. ఇంకో వైపు విడుదలకు సిద్ధమవుతున్న పలు సినిమాలపై సమ్మె ప్రభావం తీవ్రంగా కనిపిస్తున్నది. అగ్రహీరోల సినిమా చిత్రీకరణలకు వారంరోజులుగా బ్రేక్ పడింది. కొత్త సినిమాలు కూడా ఈ వారంలో 16కుపైగా ప్రారంభోత్సవాలు కావాల్సి ఉండగా ఇవన్నీ వాయిదా పడ్డాయి.



షూటింగ్‌ల్లేక వెలవెలబోతున్న అన్నపూర్ణ స్టూడియో

పని లేకపోవడంతో...

తెలుగు సినీ కార్మికులు ఎక్కువగా బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంకటగిరి, ఫిలింనగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. జూనియర్ ఆర్టిస్టులు, వారిని సప్లయ్ చేసే ఏజెంట్లు, మేకప్ ఆర్టిస్టులు, క్యాస్టూమర్లు, లైట్‌మెన్లు, ప్రొడక్షన్ అసిస్టెంట్లు, డ్రైవర్లు ఇలా ప్రధాన విభాగాల కార్మికులంతా ఈ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వీరికి సంబంధించిన కార్మిక యూనియన్లు కూడా ఇక్కడే ఉన్నాయి. పది రోజులుగా షూటింగ్‌లు లేకపోవడంతో వందలాది మంది కార్మికులు రోడ్లెక్కి హోటళ్ల వద్ద సమ్మె గురించి చర్చించుకుంటున్నారు. సమ్మె ఎప్పుడు విరమిస్తారా అని వీరంతా ఎదురు చూస్తున్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో అకృతి ఎలైట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

31న బీసీల యుద్ధభేరి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎల్.శ్రావణి, తంగెళ్లమూడి నందగోపాల్‌తో కలిసి బీసీల యుద్ధభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 31న రవీంద్రభారతిలో బీసీల యుద్ధభేరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదని, చట్టపరమైన హక్కుగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లు పెంచే విషయంలో ఘర్షణ వైఖరి అవలంబించకుండా సాధించే మార్గాలు పరిశీలించాలని సూచించారు. అఖిల పక్ష సమావేశాలు, బీసీ సంఘాల సమావేశాలు, న్యాయ నిపుణులు, అడ్వకేట్‌లతో సమావేశాలు జరిపి పరిష్కార మార్గాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, శ్రావణి, పి.సుధాకర్, జిల్లాపెల్లి అంజి, చెరుకు మణికంఠ, కరుణ, కవిత, పగిళ్ల సతీష్, హరి తిలక్ సింగ్, శివ, బాలయ్య ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.




బీసీల యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

ప్రమాదకర కరెంటు లైన్లు తొలగించాలి

టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ బస్తీల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు తోడు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్‌పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా బస్తీలు, కాలనీల్లోని ఇళ్ల ముందు ప్రమాదకరంగా ఉన్న ఎల్‌టీ నెట్‌వర్క్ ఓవర్‌హెడ్ లైన్లను ఎయిర్ బంచెడ్ కేబుల్‌తో మార్చిడికి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్, అవసరానికి మించి కుప్పలుతెప్పలుగా కిందికి వేలాడుతూ అపాయకరంగా పరిణమించిన కేబుళ్లను తొ లగించాలని ఆదేశించారు. బంజారాహిల్స్ సర్కిల్‌లోని మోతీనగర్, ఇందిరానగర్ బస్తీ, హెచ్‌ఎఫ్‌నగర్ బస్తీ, బోరబండ సైట్-2 బస్తీల్లోని వీధుల్లో కాలినడకన తిరుగుతూ ఎల్‌టీ నెట్‌వర్క్‌ను తనిఖీ చేశారు. సంస్థ పనితీరు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు దగ్గరగా ఉన్న ఓవర్ హెడ్ లైన్ స్థానంలో ఏబీ కేబుల్‌ను అమర్చడం పట్ల బస్తీవాసులు సంతోషం వ్యక్తంచేశారు. సీఎండీ వెంట సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ నర్సింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కరుణాకర్, డివిజనల్ ఇంజనీర్ భీమా నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



మౌలాలి రైల్వే డిపోలో జీఎం తనిఖీ

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం మౌలాలీలోని ట్రైన్ సెట్ మెయింటెనెన్స్ డిపోను తనిఖీ చేశారు. ఆయనతోపాటు హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. డిపోలో చేపడుతున్న వందే భారత్ రైళ్లు, ఎంఎంటీఎస్, ఈఎంయూల తనిఖీ, నిర్వహణ షెడ్యూళ్లను జీఎం సమీక్షించారు. డిపోలోని ఇతర సౌకర్యాలను కూడా పరిశీలించారు. పిట్ వీల్ లేత్, ఫ్లాష్ బట్ వెల్డింగ్ ప్లాంట్ లను తనిఖీ చేసి కార్యాచరణ సామర్థ్యాన్ని అంచనా వేశారు. సిబ్బందితో కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణహిత వాతావరణాన్ని ప్రోత్సహించడానికి మొక్కలు నాటారు. అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో చర్చించారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పంజగుట్ట: రాబోయే కాలం దివ్యాంగులకు స్వర్ణయుగమని, వారి సమస్యలనుప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేస్తానని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్థానిక సంస్థల్లో వికలాంగుల రిజర్వేషన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో 'హక్కులు-రాజకీయ రిజర్వేషన్లు- సంక్షేమం'అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు.పార్లమెంట్ యాక్ట్ ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు ఐదు శాతం నిధులు కేటాయించాలని, కానీ ఒక్క శాతం కూడా కేంద్రం ఇవ్వడం లేదని అన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రంతో మాట్లాడి దివ్యాంగులకు మూడు వేల రూపాయలు పింఛన్ ఇచ్చేలా ఒత్తిడి తేవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలను 40 శాతం వైకల్యమున్న వారికి కూడా అమలు చేస్తూ ట్రై సైకిల్స్ కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మొదటి సంతకం దివ్యాంగ సోదరి రేవతికి ఉద్యోగం ఇచ్చారని, 2367 దివ్యాంగుల స్వయం ఉపాధి గ్రూపులు ఏర్పాటు చేసి ఒక్కోదానికి 15 వేల చొప్పున ఇచ్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వికలాంగుల పట్ల సానుకూలంగా ఉన్నారని, వారికి స్థానిక సంస్థల్లో కూడా రిజర్వేషన్లు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో సాధన కమిటీ చైర్మన్ షఫీ అహ్మద్, వైస్ చైర్మన్ మల్లికార్జున్, ఎన్‌పీఆర్‌డీ వ్యవస్థాపకుడు తుడుం రాజేందర్, కార్యదర్శి యాదగిరి, భానుప్రకాష్, సోమేశ్వర్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరుతున్నారా.. జర జాగ్రత్త!

\- ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి, సిటీబ్యూరో: 'బీజేపీలో చేరాలనుకునే నాయకులారా.. ఒకసారి ఆలోచించుకోండి, జర జాగ్రత్త' అంటూ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వీడియో విడుదల చేశారు. 'బీజేపీలో చేరిన తరువాత మీ కార్యకర్తలకు ఏ పదవీ ఇప్పించుకోలేరు. మీకు టికెట్ గ్యారంటీ ఉండదు'అని హెచ్చరించారు. చేరినప్పుడు మొదటి వరుసలో సీటు, తరువాత చివరి సీటులో కూర్చుంటారని పేర్కొన్నారు. 11 ఏళ్ల అణచివేతను ఎదుర్కొన్నానని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న కార్యకర్తల కోసం ఏమీ చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. 'విజయశాంతి, జితేందర్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి లాంటి నేతలు బీజేపీలో చేరారు. ఏమైంది? పార్టీని విడిచి వెళ్లిపోయారు'అని పేర్కొన్నారు. హిందుత్వానికి, దేశానికి మంచిపనులు చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అంటూనే 'తెలంగాణ మా పార్టీ. మేం ఏం చెబితే అదే జరుగుతుంది'అని అనుకునే వారి వల్లే పార్టీ సర్వనాశనం అవుతోందని ఆరోపించారు. బీజేపీ తెలంగాణను పాలిస్తుందన్నారు.

క్లుప్తంగా...

మంత్రులతో ముఖాముఖి రేపటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రతి బుధవారం గాంధీ భవన్‌లో జరుగుతున్న మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం వాయిదా పడింది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నందున.. కార్యక్రమాన్ని గురువారానికి వాయిదా వేస్తున్నట్టు టీపీసీసీ వర్గాలు తెలిపాయి. రోజూ అందుబాటులో ఉండే ప్రజా ప్రతినిధుల కార్యక్రమం కూడా బుధవారానికి బదులు గురువారం జరగనుందని మంగళవారం ఒక ప్రకటనలో గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

నేడు ఈడీ విచారణకు మంచు లక్ష్మి

- ఇప్పటికే ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి స్టేట్‌మెంట్స్ రికార్డ్ చేసిన ఈడీ



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో సినీ నటి మంచు లక్ష్మి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరు కానున్నారు. ఈడీ అధికారులు ఇచ్చిన నోటీసుల ప్రకారం బుధవారం ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి రానున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన సెలబ్రిటీలకు జూలై 21న ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో జూలై 30న ప్రకాశ్‌రాజ్, ఈ నెల 6న విజయ్ దేవరకొండ, 11న హీరో దగ్గుబాటి రానా ఈడీ ముందు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 13న మంచు లక్ష్మి విచారణకు హాజరు కావాల్సి ఉంది. బెట్టింగ్ యాప్స్ కేసులో నమోదైన వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) రిజిస్టర్ చేసిన సంగతి తెలిసిందే. లోన్ యాప్స్ ప్రచారకర్తలుగా వ్యవహరించిన మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చింది. ఈ క్రమంలోనే విచారణకు షెడ్యూల్ సిద్ధం చేసింది. మంచు లక్ష్మి విచారణ అనంతరం మరికొంతమంది సెలబ్రిటీలను ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పారిమ్యాచ్ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ సోదాలు

- హైదరాబాద్ సహా 15 ప్రాంతాల్లో ఈడీ ముంబై జోనల్ యూనిట్ తనిఖీలు
- మ్యూల్ బ్యాంకు ఖాతాలతో విదేశాలకు రూ.2వేల కోట్ల మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: అక్రమ బెట్టింగ్ యాప్‌ల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. పారిమ్యాచ్ పేరుతో నిర్వహించిన ఒక అక్రమ బెట్టింగ్ యాప్‌పై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా.. ఈడీ ముంబై జోనల్ యూనిట్ అధికారులు మంగళవారం హైదరాబాద్ సహా ముంబై, ఢిల్లీ, జైపూర్, మధురై, సూరత్‌లోని దాదాపు 15 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. ముంబైలోని సైబర్ పోలీస్ స్టేషన్‌లో 2024లో నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా.. మనీలాండరింగ్ కింద ఈడీ అధికారులు ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. అక్రమ బెట్టింగ్ యాప్ ద్వారా కొల్లగొట్టిన సొమ్మును.. సైబర్ నేరగాళ్లు పెద్ద సంఖ్యలో మ్యూల్ బ్యాంక్ ఖాతాలతో విదేశాలకు తరలించినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఇలా పలు లేయర్ల ద్వారా మొత్తం రూ.2వేల కోట్లను క్రిప్టో వాలెట్లలోకి తరలించినట్లు ఆధారాలు సేకరించారు. ఇందులో కొంత మొత్తాన్ని తమిళనాడులోని ఒక ప్రాంతంలో ఏటీఎంల ద్వారా విత్‌డ్రా చేసినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. కాగా, హైదరాబాద్‌కు చెందిన కొందరు బహుళ చెల్లింపు అగ్రిగేటర్లు, డొమెస్టిక్ మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లకు ఈ మొత్తం కుంభకోణంతో సంబంధం ఉన్నట్టు ఆధారాలు లభించడంతోనే.. నగరంలోనూ పలు చోట్ల ఈడీ అధికారులు సోదాలు చేపట్టినట్టు తెలిసింది.

పోలీసు రాజ్యంలో పచ్చ మూకల రిగ్గింగ్





ఓటు వేయడానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కనంపల్లె గ్రామస్తులు

బందిపోట్లను తలపిస్తూ నిర్బంధాలు.. తాలిబన్లను తలపిస్తూ బెదిరింపులు

- అత్యంత దుర్మార్గంగా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నిక పోలింగ్
- పులివెందులలో ఒక్క చోట కూడా వైఎస్సార్‌సీపీ ఏజెంట్ లేకుండా జరిగిన ఎన్నికలివి
- బయటి ప్రాంతాల నుంచి వచ్చి బూత్‌ల ముందే రౌడీలు తిష్ట వేసినా పట్టించుకోని పోలీసులు
- ఓటేయడానికి ముగ్గురు నలుగురుగా కలిసి వస్తున్న వారిని పోలీసులే కొట్టి వెనక్కు పంపిన దుస్థితి
- ఒక్కో బూత్‌ను టీడీపీ పెద్ద లీడర్లు పంచుకుని ఊళ్లపై దండయాత్ర
- పులివెందుల జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డి ఇంటి చుట్టూ 200 మంది టీడీపీ గూండాలు తిష్ట
- ఇంటి ముందు షామియానా వేసుకుని వంట చేసుకుని తింటూ అభ్యర్థి బయటకు రాకుండా కాపలా
- ఓటు వేయలేకపోయిన జెడ్పీటీసీ అభ్యర్థి, ఆయన జనరల్ పోలింగ్ ఏజెంట్
- ప్రతి ఊళ్లో 300-400 మంది గూండాల మోహరింపు.. స్థానికులకు బెదిరింపులు
- పిండారీలు, థగ్గులు, బందిపోట్లు తమ ముందు దిగదుడుపేనని చాటిన టీడీపీ కాలకేయులు
- పోలీసుల పహారాలో పెదబాబు, చినబాబు పన్నిన కుట్ర అమలు చేసిన టీడీపీ గూండాలు
- పోలింగ్ ప్రారంభానికి 2.30 గంటల ముందే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అరెస్టు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డితోపాటు కీలక నేతలు గృహ నిర్బంధం
- వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను బూత్‌లలోకి వెళ్లనివ్వకుండా అడ్డగింత
- స్లిప్పులు లాక్కుని.. టీడీపీ మూకలతో దొంగ ఓట్లు వేయించిన రౌడీలు
- రౌడీ మూకలకు ఎక్కడికక్కడ పూర్తిగా సహకరించిన ఖాకీలు
- ఈ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యానికే కళంకం అంటున్న రాజకీయ విశ్లేషకులు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, కడప: పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు.. ఐసిస్, తాలిబన్, హమాస్ తీవ్రవాదులు.. పిండారీలు, థగ్గులు వంటి బందిపోట్లు కలగలిసినా తమ ముందు దిగదుడుపేనని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో పెదబాబు, చినబాబు సారథ్యంలోని టీడీపీ కాలకేయులు చాటిచెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యాయత్నాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, ప్రలోభాలు మొదలు.. ఎన్ని అడ్డదారులు తొక్కినా ఆ రెండు జెడ్పీటీసీ స్థానాల్లో తమ అభ్యర్థులకు ఘోర పరాజయం తప్పదని తమ అంతర్గత సర్వేల్లో తేలడంతో పెదబాబు, చినబాబు నిస్సిగ్గుగా బరితెగించారు. ఎలాగైనా సరే.. పులివెందుల జెడ్పీటీసీ స్థానంలో గెలిచి తీరాల్సిందేనని తమ కాలకేయ సైన్యానికి దిశా నిర్దేశం చేశారు. అత్యంత క్రూరులైన పచ్చ కాలకేయులకు కొంత మంది పోలీసు అధికారులను పెదబాబు, చినబాబు జత చేశారు. దీంతో మంగళవారం పోలింగ్ సందర్భంగా టీడీపీ కాలకేయ సైన్యం ఆకాశమే హద్దుగా చెలరేగింది. విచక్షణ మరచి పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది.

పోలీసులే ముందుండి అరాచకం

స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాల్సిన పోలీసులే అరాచకానికి తెరతీశారు. పోలింగ్ ప్రారంభానికి 2.30 గంటల ముందే అంటే మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకే వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డిలను పోలీసులు నిర్బంధించారు. పులివెందుల జెడ్పీటీసీ స్థానం పరిధిలో 15 పోలింగ్ బూత్‌లు ఉంటే, ఏ ఒక్క బూత్‌లోకి కూడా వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. పోలింగ్ బూత్‌కు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెళ్తున్న ఓటర్లను పోలీసులే అడ్డుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని మహిళా ఓటర్లు కాళ్లు పట్టుకున్నా పోలీసులు కనికరించలేదు. తమ కళ్లెదుటే స్లిప్పులను ఓటర్ల నుంచి టీడీపీ గూండాలు లాక్కుని దౌర్జన్యం చేసినా ప్రేక్షక పాత్ర వహించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, నాయకులపై టీడీపీ గూండాలు అత్యంత పాశవికంగా దాడులు చేస్తున్నా పోలీసులు కనీసం నిలువరించే ప్రయత్నం కూడా చేయలేదు. సోమవారం రాత్రికే జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, సరిహద్దు జిల్లాల నుంచి టీడీపీ గూండాలు, రౌడీలు ఒక్కో పోలింగ్ బూత్ వద్దకు 300 నుంచి 400 మంది వరకు చేరుకుని, అక్కడే తిష్టవేశారు. పోలింగ్ బూత్‌లను హైజాక్ చేసి.. మంగళవారం ఉదయం 7 గంటలకే ఆ రౌడీలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి యథేచ్ఛగా దొంగ ఓట్లు వేసుకున్నారు.. రిగ్గింగ్ చేశారు. చివరకు పులివెందుల జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి.. అతని జనరల్ ఏజెంట్ ఎం.బాలరామిరెడ్డిని ఓటు వేయనివ్వకపోగా.. వారి ఓట్లను కూడా దొంగగా వేసుకున్నారంటే టీడీపీ గూండాల దౌర్జన్యం, పోలీసుల అరాచకం ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1951 అక్టోబర్ 25న తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు.. అంటే 74 ఏళ్ల దేశ ఎన్నికల చరిత్రలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నిక పోలింగ్ అంత దుర్మార్గంగా మరో ఎన్నిక జరగలేదని ఎన్నికల నిర్వహణలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఓ రిటైర్డు ఐఏఎస్ అధికారి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకే ఈ ఉప ఎన్నిక కళంకంగా నిలిపోతుందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

రాజ్యమేలిన రౌడీయిజం

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ రౌడీయిజం రాజ్యమేలింది. మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇంటికి పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐలు వెంకటరమణ, ఉలసయ్య, చాంద్‌బాషా నేతృత్వంలో భారీగా ఎస్‌ఐలు, పోలీసులు చేరుకున్నారు. సుమారు గంటసేపు తర్జనభర్జనలు పడ్డ తర్వాత బలవంతంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసి, కడప వైపు తీసుకెళ్లారు. 'పోలీసులకు సహకరిస్తాం, హౌస్ అరెస్టు చేసుకోండి, ఎక్కడికీ వెళ్లను, పైగా జ్వరం వస్తోంది' అని చెప్పినా పోలీసులు అత్యంత కిరాతకంగా లాక్కువెళ్లి వాహనంలోకి బలవంతంగా తోశారు. ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయడం.. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డితోపాటు కీలక నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడంతో పెదబాబు, చినబాబు పన్నిన కుట్ర అమలుకు మార్గం సుగమమైంది. పోలీసుల ఏకపక్ష చర్యల కారణంగా కేడర్ పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లలేకపోయింది. దాంతో మరింతగా రెచ్చిపోయి టీడీపీ నేతలు ఏకపక్షంగా పోలింగ్ నిర్వహించుకున్నారు.

అత్యంత దుర్మార్గంగా పోలింగ్

- పులివెందుల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంతరెడ్డి ఇంటి చుట్టూ మంగళవారం తెల్లవారుజామునే 200 మందికిపైగా జమ్మలమడుగు, కమలాపురం నుంచి వచ్చిన టీడీపీ గూండాలు చేరుకుని సాయంత్రం వరకు అక్కడే తిష్ట వేసి పార్టీ చేసుకున్నారు. హేమంతరెడ్డిని ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకున్నారు.
- పులివెందుల జెడ్పీటీసీ స్థానం పరిధిలో 15 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించినప్పటికీ.. ఎక్కడా వైఎస్సార్‌సీపీ ఏజెంటు కూర్చునేందుకు భద్రత కల్పించలేదు. టీడీపీ నేతల దౌర్జన్యానికి, వారిపై గ్రామస్తులు తిరుగుబాటు చేయకుండా పోలీసులు పహారా కాశారు.
- రాగిమానుపల్లె, అచ్చవెళ్లి, ఎర్రిపల్లె, యర్రబల్లె-1, యర్రబల్లె-2, ఈ.కొత్తపల్లె పంచాయతీల పరిధిలో 15 పోలింగ్ బూత్‌లు ఉండగా, ఏ ఒక్కచోట కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోలింగ్ ఏజెంటును కూర్చోనివ్వలేదు. హేమంతరెడ్డి సొంతూరు తుమ్మలపల్లి, బాలరామిరెడ్డి సొంతూరు నల్లపురెడ్డిపల్లెలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ గూండాలు వందల మంది పోలింగ్ కేంద్రం వద్ద మకాం వేశారు. పోలింగ్ బూత్‌కు వెళ్లేందుకు ఆస్కారం లేకుండా అడ్డగించారు. వస్తే దాడి చేస్తామని హెచ్చరికలు పంపారు. పోలీసులను రక్షణ కల్పించాలని కోరినా ఫలితం లేకుండా పోయింది.
- పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లుగా కూర్చునేందుకు పోలీసులు, టీడీపీ గూండాలు అనుమతించలేదని తెలిసి మహిళలు సాహసం చేశారు. తాము పోలింగ్ ఏజెంట్లుగా కూర్చుంటామని ఎర్రిపల్లెకు చెందిన అన్నారెడ్డి మమత, మునేశ్వరీ, గంగాభవానీ వెళ్లారు. టీడీపీ రౌడీలు అడ్డగించినా లెక్కచేయకుండా పోలింగ్ బూత్‌లోకి వెళ్తుంటే.. పోలీసులు అడ్డుతగిలి బెదరగొట్టి వెనక్కు పంపారు.
- నల్లగొండువారిపల్లెకు చెందిన సంధ్య నల్లపురెడ్డిపల్లెలో ఏజెంటుగా కూర్చునేందుకు వచ్చినా పోలీసులు అదే రీతిలో బెదరగొట్టారు. 'ఎవ్వరూ ఏజెంటుగా లేకపోతే, మీరొచ్చి ఏమి చేద్దామని? నోరు మూసుకొని పోండి' అంటూ టీడీపీ రౌడీ మూక బెదిరించింది. విశ్వ ప్రయత్నం చేసినా పోలీసులు సహకరించకపోవడంతో వారు వెనుతిరిగి వెళ్లారు.

ఎక్కడికక్కడ ఓటర్ల అడ్డగింత

- స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటర్లకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాల్సిన పోలీసులే అరాచకానికి తెగబడ్డారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ఓటర్లను పోలీసుల పహారాలో టీడీపీ రౌడీమూకలు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఓటర్ల నుంచి ఓటరు స్లిప్పులు లాక్కుని వారికి వెనక్కి పంపించేశారు.
- అవే ఓటరు స్లిప్పులను ఇతర ప్రాంతాల నుంచి రప్పించిన టీడీపీ రౌడీలకు ఇచ్చి దొంగ ఓట్లు వేయించారు. టీడీపీ వర్గీయులైన వారిని మాత్రమే ఓటు వేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ముందస్తు పథకం ప్రకారం క్యూలైన్లలో టీడీపీ గూండాలను బారులు తీరేలా చేసి.. పూర్తిగా ఏకపక్షంగా సైక్లింగ్ చేసుకుంటూ.. దొంగ ఓట్లు వేసుకున్నారు.. రిగ్గింగ్ చేసుకున్నారు.
- పోలింగ్ బూత్‌ల వద్దనున్న బీఎల్‌ఓల నుంచి ఓటర్ల వివరాలు తీసుకుని.. కడప పార్లమెంట్ టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి పీఏ సుదర్శన్‌రెడ్డి దగ్గరుండి స్లిప్‌లు రాయిస్తూ దొంగ ఓట్లను ప్రోత్సహించారు. ఎర్రిబల్లిలో టీడీపీ నేత పుత్తా లక్ష్మిరెడ్డి, కమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ రాఘవరెడ్డి, జమ్మలమడుగు జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మల్లికార్జున, సర్పంచ్ పుల్లారెడ్డి, గూడెంచెరువు శివారెడ్డి, చిన్నదండ్లూరు రామచంద్రయ్య, కల్వటాల రాజన్న, కంబాలదిన్నె కుళాయి, బీమగుండం రాజగోపాల్, నవాబుపేల మర్రి ప్రకాశం, రామస్వామిరెడ్డి, ద్వారకచర్ల జనార్దన్‌రెడ్డి.. కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ వర్గీయులంతా 15 పోలింగ్ బూత్‌ల్లో ఇష్టారాజ్యంగా దొంగ ఓట్లు వేశారు.
- ఈ ఉప ఎన్నికల్లో టీడీపీ గూండాలు మీడియానూ వదలలేదు. ఏకపక్ష పోలింగ్‌పై ఎలాంటి కవరేజ్ లేకుండా జాగ్రత్తపడ్డారు. ఈ క్రమంలో 'రికార్డు చేయవద్దని చెబుతుంటే అర్థం కాలేదా..' అని గద్దిస్తూ కర్నూలు నుంచి వచ్చిన ఎన్టీవీ ప్రతినిధి కెమెరాను యర్రబల్లెలో ధ్వంసం చేశారు. 'సాక్షి' ప్రతినిధులకు అడుగడుగునా ఆటంకం కలిగిస్తూ.. భౌతిక దాడులు చేసేందుకు యత్నించారు. పచ్చ మూకల రౌడీయిజంతో మంగళవారం పులివెందుల మండలం అట్టుడికింది.



కాల్చి పడేస్తా... నా కొడకల్లారా... అంటూ పులివెందులలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కార్యకర్తలను బెదిరిస్తున్న డీఎస్పీ



తుమ్మలపల్లెలో జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి ఇంటి పక్కనే టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన షామియానా



నల్లపురెడ్డిపల్లిలో దొంగ ఓట్లు వేసేందుకు స్లిప్పులు పంపిణీ చేస్తున్న దేవగుడి గ్రామానికి చెందిన టీడీపీ నేత భూపేష్‌రెడ్డి పీఏ సుదర్శన్‌రెడ్డి

నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న బుధవారం ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, జరుగుతున్న పరిణామాలపై ఆయన మీడియాతో మాట్లాడతారు.



పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద దొంగ ఓటు వేసేందుకు లైనులో నిల్చున్న టీడీపీ నేత జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లి పొన్నతోట

ఓట్ల దొంగలు!

పులివెందులలో గెలుపు కోసం బాబు సర్కారు అడ్డదారులు

- దేశమంతా నిర్ఘాంతపోయేలా ప్రజాస్వామ్యం ఖూనీ.. పోలింగ్ కేంద్రాల్లో యథేచ్ఛగా దొంగ ఓట్లతో అక్రమాలు
- జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు నుంచి దొంగ ఓటర్ల దిగుమతి
- ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి ప్రోద్బలంతో పోలింగ్ కేంద్రాల ఆక్రమణ
- 15 కేంద్రాల్లోనూ దొంగ ఓట్ల దందా.. బూత్ క్యాప్చరింగ్‌లు.. రిగ్గింగ్‌లు
- పోలింగ్ కేంద్రాల బయటే తిష్టవేసిన టీడీపీ గూండాలు
- ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి స్లిప్పులు లాక్కుని బెదిరింపులు

పోలీసుల పహారాలో 'అధికారిక రిగ్గింగ్'



- టీడీపీ గూండాగిరీకి పోలీసుల గులాంగిరీ
- చెక్‌పోస్టులతో పులివెందుల అష్టదిగ్బంధం
- ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- యథేచ్ఛగా దొంగ ఓట్లతో రిగ్గింగ్.. డీఐజీ కోయా ప్రవీణే రింగ్‌మాస్టర్.. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి అక్రమ నిర్బంధం
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై పోలీసుల దండయాత్ర
- 'కాల్చిపారేస్తా.. నా కొడకా'అని డీఎస్పీ మురళీ రౌడీయిజం

మీ కాళ్లు పట్టుకుంటాం.. మా ఓట్లు ఏమయ్యాయ్?

- పులివెందుల మండల ఓటర్ల ఆక్రోశం, ఆందోళన, నిలదీత
- జెడ్పీటీసీ ఉప ఎన్నికలో ఓటు వేయనివ్వని పచ్చ తాలిబన్లు
- అసలు ఓటర్లు పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల వద్దకు రానివ్వకుండా బెదిరింపులు
- వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్ రెడ్డి సైతం ఓటేయలేకపోయిన దుస్థితి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మెడికల్ కౌన్సెలింగ్ మరింత ఆలస్యం

- సుప్రీంకోర్టు తీర్పు రాకపోవటం, సాంకేతిక సమస్యలే కారణం
- ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్‌లోనూ గందరగోళం
- కౌన్సెలింగ్‌కు మరో వారం రోజులు పట్టే అవకాశం
- రెండు రకాల ర్యాంకర్ల జాబితాలు సిద్ధం చేస్తున్న కాళోజీ వర్సిటీ
- జీఓ 33 ప్రకారం ఒకటి, ఇంటర్ ఇతర ప్రాంతాల్లో చదివిన వారితో మరొకటి!
- పీడబ్ల్యూడీ, ఎన్‌సీసీ కోటాలో బోనస్ మార్కులపై కసరత్తు



సాక్షి, హైదరాబాద్: మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జూలై చివరి నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, పలు సాంకేతిక కారణాలు, కోర్టు కేసుల నేపథ్యంలో ఇంకా రిజిస్ట్రేషన్ల దగ్గరే ఆగిపోయింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) కౌన్సెలింగ్ షెడ్యూళ్లను పలుమార్లు మార్చడం, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ స్థానికత అంశంపై సుప్రీంకోర్టు తుది తీర్పు కోసం వేచి చూస్తుండడంతో రాష్ట్ర కోటా అడ్మిషన్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కావడానికి మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని వర్సిటీ అధికారులు అంచనా వేస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు సన్నద్ధం

'స్థానికత'అంశంపై రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 33పై సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. కాళోజీ వర్సిటీ తొలి విడత కౌన్సెలింగ్ ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించాలని భావించినప్పటికీ.. తీర్పు రాకపోవడంతో షెడ్యూల్‌ను ప్రకటించలేదు. కాగా, కాళోజీ వర్సిటీ 33 జీవోకు అనుగుణంగా 9, 10వ తరగతులతోపాటు ఇంటర్మీడియెట్ తెలంగాణలో చదివిన వారిని స్థానికులుగా పరిగణిస్తూ ఒక ర్యాంకర్ల జాబితా రూపొందించాలని నిర్ణయించింది. ఇంటర్మీడియెట్ ఇతర ప్రాంతాల్లో చదివిన విద్యార్థులను కూడా కలుపుకొని మరో ర్యాంకర్ల జాబితా రూపొందించాలని భావిస్తోంది.

ఎంసీసీ కౌన్సెలింగ్ సైతం ఆలస్యమే!

ఎంసీసీ ఆధ్వర్యంలో జరగాల్సిన ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లో చాయిస్ ఫిల్లింగ్, లాకింగ్ ప్రక్రియలో సాంకేతిక లోపాలు తలెత్తాయని తెలిసింది. వెబ్‌సైట్ స్తంభించడం, ఆప్షన్లను సబ్‌మిట్ చేసే సమయంలో లోపాలు రావడంతో ఇప్పటివరకు నాలుగుసార్లు షెడ్యూల్‌ను పొడిగించారు. జూలై 21 నుంచి 30 వరకు తొలి విడత కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా, పలు వాయిదాల తరువాత ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించారు. కాగా, పీడబ్ల్యూడీ, ఎన్‌సీసీ కోటా విద్యార్థులకు బోనస్ మార్కులు కలిపే అంశంపై వర్సిటీ కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రం నుంచి 79 మంది పీడబ్ల్యూడీ కోటాలో ఉండగా, వీరికి నిమ్స్, సరోజినీ దేవి ఆస్పత్రుల్లో సోమ, మంగళవారాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ కేటగిరీలో 467 మంది ఉండగా, వీరికి సర్టిఫికేట్ల వెరిఫికేషన్, బోనస్ మార్కులు కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాంకర్ల జాబితా తుది రూపు దాల్చిన తర్వాతే వెబ్ ఆప్షన్లు, సీటు కేటాయింపు షెడ్యూల్ ప్రకటించనున్నట్లు వర్సిటీ తెలిపింది.

ఫాల్కన్ కేసులో నిందితుడికి ఈడీ కస్టడీ

సాక్షి, హైదరాబాద్: ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కాంటింగ్ స్కీమ్ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు అమర్‌దీప్‌కుమార్ సోదరుడైన సందీప్‌కుమార్‌ను బుధవారం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఈడీ కస్టడీలో విచారించేందుకు అనుమతిస్తూ నాంపల్లిలోని పీఎంఎల్‌ఏ స్పెషల్ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈడీ అధికారులు బుధవారం నుంచి సందీప్‌కుమార్‌ను కస్టడీకి తీసుకోనున్నారు. ఈడీ అభ్యర్థన మేరకు కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ సీఐడీ కేసులో బెయిల్‌పై విడుదలైన సందీప్‌కుమార్‌ను జూలై 31న ఈడీ అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించింది. చంచల్‌గూడ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సందీప్‌కుమార్‌ను కస్టడీకి తీసుకునేందుకు కోర్టు అనుమతి కోరింది. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ ఆఫీస్‌కు తరలించి మూడు రోజుల పాటు ప్రశ్నించనున్నారు. బ్రిటానియా, అమెజాన్, గోద్రేజ్ సహా ప్రముఖ కంపెనీల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఫాల్కన్ క్యాపిటల్ రూ.792 కోట్లు మోసం చేసిన సంగతి తెలిసిందే. సైబరాబాద్ ఈఓడబ్ల్యూ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది.

ఏటీఆర్ నుంచి 5 గ్రామాల తరలింపు

- కేంద్ర పర్యావరణ శాఖ సలహా కమిటీ ఆమోదం
- రెండు దశల్లో 1,253 కుటుంబాల తరలింపు
- 1,500 హెక్టార్ల అటవీ భూమి డీ-నోటిఫికేషన్‌కు కేంద్రం ఓకే

సాక్షి, న్యూఢిల్లీ: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)లో ఉన్న 5 గ్రామాలను తరలించేందుకు 1,501.88 హెక్టార్ల రిజర్వ్ అటవీ భూమిని డీ-నోటిఫై చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ సలహా కమిటీ 'ఇన్-ప్రిన్సిపుల్'ఆమోదం తెలిపింది. ఈ తరలింపు ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందమని, వన్యప్రాణి ప్రదేశాల సమగ్రత, మానవ-వన్యప్రాణి ఘర్షణ తగ్గింపు, పర్యావరణ రక్షణ మెరుగుదల కోసం ఈ చర్య అవసరమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం, మొత్తం 27 జాతుల 1,54,977 చెట్లను నరికివేయాల్సి ఉంటుంది. బాచారం రిజర్వ్ ఫారెస్ట్‌లోని 465 నుంచి 473 కంపార్ట్‌మెంట్లలో ఈ భూభాగం ఉంది. కొల్లంపెంట, తాటిగుండ్లపెంట, సర్లపల్లి, కుడిచింతల బైలు, వటవర్లపల్లి గ్రామాల తరలింపునకు ఈ భూమి వినియోగించనున్నారు.

రెండు దశల్లో తరలింపు:
గ్రామాల తరలింపు ప్రక్రియను రెండు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో సర్లపల్లి (ఫేజ్-1), కుడిచింతల బైలు, కొల్లంపెంట, తాటిగుండ్లపెంట గ్రామాల్లోని 417 కుటుంబాల తరలింపునకు 546 హెక్టార్లు అవసరం. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ.62.55 కోట్లు ఖర్చు అవుతుందని నాగర్‌కర్నూల్ డీఎఫ్‌ఓ నివేదికలో తెలిపారు. రెండో దశలో (ఫేజ్-2) వటవర్లపల్లి, సర్లపల్లి (ఫేజ్-2) గ్రామాల 836 కుటుంబాల తరలింపునకు 955.88 హెక్టార్లు అవసరం. వీటి మొత్తం ఖర్చు రూ.125.4 కోట్లు. ఈ గ్రామాల తరలింపునకు అవసరమైన అన్ని అనుమతులు పొందినట్లు డీఎఫ్‌ఓ వివరించారు.

భూమి లభ్యత సమస్య
నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ నివేదిక ప్రకారం జిల్లా పరిధిలో ప్రభుత్వ రెవెన్యూ భూమి అందుబాటులో లేకపోవడంతో కోర్ ఏరియాకు 8 కి.మీ. దూరంలో రిజర్వ్ సరిహద్దు వెలుపల భూమిని ఎంపిక చేశారు. ఈ తరలింపు అనంతరం ఖాళీ అయ్యే భూమి హక్కులన్నీ రద్దుచేసి రక్షిత ప్రాంతంగా నోటిఫై చేస్తారు. అయితే, గత జూలైలో పర్యావరణ-గిరిజన హక్కుల సంఘాలు ఎన్‌టీసీఏ 2024 సెప్టెంబర్ 13న ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ కేంద్ర పర్యావరణ శాఖకు లేఖ రాశాయి. వేగంగా గ్రామాలను తరలించటం బలవంతపు పునరావాసానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 13-8-2025



నారీ స్వారీ!

● పహారా హుషార్

శారీరక దృఢత్వం భావోద్వేగాలను బ్యాలెన్స్ చేసుకోగల మానసిక బలాన్ని పెంచి... కరిగిపోని కాన్ఫిడెన్స్‌ను ఇస్తుంది! అది జీవన దృక్పథాన్నే మార్చేస్తుంది! ఇలాంటి అద్భుతాలను క్రియేట్ చేసే కొలువులున్నాయి.. వాటిల్లో రాణించే అమ్మాయిలున్నారు! ఆ ఫోర్సే.. మౌంటెడ్ పోలీస్.. పదిమంది నారీమణులతో కూడిన ఆ అశ్వదళం హైదరాబాద్‌ను పహారా కాస్తోంది.. సెల్ఫ్ ప్రొటెక్షనే కాదు.. శాంతిభద్రతల పర్యవేక్షణలోనూ స్త్రీ శక్తిని చాటుతోంది!

ఇంట్లో ఆడపిల్ల వీధి చివరన ఉన్న ఫ్రెండ్ ఇంటికి వెళ్లాలన్నా తమ్ముణ్ణి తోడు ఇచ్చే పంపే కాలానికిక చెల్లు ఏమో అనిపిస్తోంది.. హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాల్లో గుర్రాల మీద గస్తీ తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న అశ్వదళ మహిళా పోలీసులను చూస్తుంటే! నిజానికి వాళ్లను మహిళా పోలీస్ అంటే వాళ్లనలా తీర్చిదిద్దిన వాళ్ల దళాధిపతులు .. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షితామూర్తి ఒప్పుకోరు. 'జాబ్‌కి జెండర్ ఏంటీ.. శక్తిసామర్థ్యాలు ప్రామాణికం కానీ..' అంటారు. అందుకే తొలిసారిగా.. ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) పోలీస్‌లోని పదిమంది అమ్మాయిలను అశ్వదళంలోకి ఆహ్వానించి.. వారికి గుర్రపు స్వారీలో శిక్షణనిప్పించి విధులను అప్పగించారు. వీళ్ల ప్రతి శుక్రవారం మక్కా మసీదు, చార్మినార్ దగ్గర, రోజు విడిచి రోజు లేక్ డ్యూటీలు చేస్తున్నారు. ర్యాలీలు, పండగలు, గణేశ నవరాత్రులు, శోభాయాత్రలు వంటి సందర్భాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు.

శక్తి చూపించింది.. ఆత్మవిశ్వాసాన్ని పెంచింది..

ఈ దళంలోని పదిమంది అమ్మాయిలది భిన్న నేపథ్యం. కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరినప్పటికీ మౌంటెడ్ పోలీస్ అంటే వాళ్లెవరికీ తెలియదు.. ఆ ఫోర్స్ గురించి నోటీస్ వచ్చేదాకా. ఏఆర్ పోలీస్‌లో రెండువందల మందికి పైగా మహిళలుంటే మౌంటెడ్ పోలీస్‌లో చేరడానికి పదిమంది మాత్రమే ముందుకు వచ్చారు. మౌంటెడ్ పోలీస్ అంటే ఏంటో రీసెర్చ్ చేశారు. 'ట్రైనింగ్ టఫ్‌గా ఉంటుంది.. ఫిట్‌నెస్ చాలా అవసరం.. ఆసక్తి ఉంటేనే రండి' అని ట్రైనర్ చెప్పాక దాన్నో సవాలుగా తీసుకున్నారు. శిక్షణలో గుర్రాల మీద నుంచి పడ్డారు. దెబ్బలు తగిలాయి. అయినా వెనుకడుగు వేయలేదు. గుర్రాలను మాలిమి చేసుకోవడంలో కొన్ని మెళకువలను కనుగొన్నారు. గుర్రాలు చెప్పినట్టు వినడం మొదలెట్టాయి. అలా శిక్షణలోని ఆంతర్యాన్ని పసిగట్టి.. తదనుగుణంగా ముందుకు సాగారు. ఆ ట్రైనింగ్ వాళ్ల ఆత్మస్థయిర్యాన్నే కాదు.. ఫిజికల్ ఫిట్‌నెస్‌నూ పెంచింది. జీవన దృక్పథాన్నే మార్చింది. విధి నిర్వహణలో వాళ్లు గుర్రాలను మచ్చిక చేసుకోవడం దగ్గర్నుంచి, తమ కమాండ్స్‌తో వాటిని చెప్పు చేతల్లో పెట్టుకోవడం మొదలు.. జనసమ్మర్దంలో పరిస్థితిని అదుపు తప్పకుండా చూసుకోవడం వరకు మగవాళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా సామర్థ్యాన్ని చాటుకుంటున్నారు. ఈ దళంలో పెళ్లయి, ఇద్దరు పిల్లలున్న కానిస్టేబుల్ అఖిల కూడా ఉన్నారు. ఆమెతో పాటు మరో ఇద్దరు సభ్యులు సుభద్ర, హవంతిక ఈ కొత్త కొలువు గురించి వివరించారు. మగవాళ్లకే పరిమితమైన కొలువుల్లోకి మహిళలు వస్తే.. పనిప్రదేశంలో విమెన్ ఫ్రెండ్లీ వాతావరణం ఏర్పడుతుందని ఈ అశ్వదళం నిరూపించింది.

– సరస్వతి రమ
– ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

కష్టాలు, సవాళ్లంటే గౌరవం ఏర్పడింది..

ఎస్సై కావాలని, గృహ హింస మీద మహిళలకు అవగాహన కల్పించాలనేది నా లక్ష్యం. దానికోసమే రీసెంట్‌గా డిస్టెన్స్‌లో డిగ్రీ పూర్తి చేశాను. ముందు కానిస్టేబుల్ నోటిఫికేషన్ పడేసరికి ఇందులో చేరిపోయాను. కొత్త పనులు చేయడమన్నా, నేర్చుకోవడమన్నా చాలా ఇష్టం. అందుకే మౌంటెడ్ పోలీస్ గురించి చెప్పగానే అందులో చేరడానికి అందరికన్నా ముందుగా నేను చెయ్యెత్తాను. అయితే నాకు రెండు డెలివరీలూ సిజేరియనే అవడంతో మౌంటెడ్ పోలీస్‌కి కావల్సినంత ఫిజికల్ ఫిట్‌నెస్ లేక ట్రైనింగ్ మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. వెనక్కి వెళ్లిపోతే మిగిలిన అమ్మాయిలు నిరుత్సాహపడతారేమో అనిపించింది. ఫిట్‌నెస్ మీద శ్రద్ధ పెట్టాను. కాన్ఫిడెన్స్ వచ్చింది. లైఫ్ పట్ల అప్పటిదాకా నాకున్న దృక్పథమే మారిపోయింది. లేనిదాని గురించి దిగులుపడే బదులు ఉన్నదాని గురించి పాజిటివ్‌గా ఎలా ఆలోచించాలో తెలుసుకున్నాను. జీవితంలోని కష్టాలు, సవాళ్లంటే గౌరవం ఏర్పడింది

– అఖిల



ఉత్సాహం.. ప్రోత్సాహం..

చిన్నప్పటి నుంచీ విలక్షణంగా... విభిన్నంగా ఉండాలనే తపన. అందుకే ఈ పోలీస్ జాబ్‌లోకి వచ్చాను. అది రొటీన్ అయిపోతోందనుకుంటున్నప్పుడే మౌంటెడ్ పోలీస్ నోటిఫికేషన్ వచ్చింది. గుర్రపు స్వారీ కష్టమని మా నాన్న వద్దన్నారు. కానీ ఆయన్ని ఒప్పించి ట్రైనింగ్‌లో చేరాను. నన్ను డ్యూటీలో చూసిన మా బంధువులు 'నీ బిడ్డ ఠీవిగా భలే డ్యూటీ చేస్తోంద'ని తనతో చెబుతున్నారని మా నాన్న నాతో షేర్ చేసుకుంటున్నప్పుడు ఆయన కళ్లల్లో కనిపించే గర్వం చెప్పలేని సంతోషాన్నిస్తుంది. ఐపీఎస్ కావాలనే నా లక్ష్యానికి తగిన ప్రోత్సాహాన్నిస్తుంది.

– మర్రి హవంతిక



బ్యాలెన్సింగ్ నేర్చుకున్నాను..


చిన్నప్పటి నుంచీ నాకు టఫ్ టాస్క్స్ అంటే ఇష్టం. అందుకే కరాటే, టైక్వాండో నేర్చుకున్నాను. స్పోర్ట్స్‌లో కూడా ముందుండేదాన్ని. ఆ స్పిరిటే నన్ను పోలీస్ జాబ్ వైపు, మౌంటెడ్ పోలీస్ వైపు మళ్లేలా చేసింది. ఈ కొలువు నాకో కొత్త చాలెంజ్. గుర్రపు స్వారీతో లైఫ్ బ్యాలెన్సింగ్‌ను నేర్చుకున్నాను. నా భవిష్యత్ లక్ష్యం గ్రూప్ వన్ ఆఫీసర్.

– సుభద్ర



● బెగ్గింగ్ మాఫియా

ధనం వద్దు ఆహారం ఇద్దాం



దానం చేస్తే పుణ్యం వస్తుందంటారు. చిన్నపిల్లలను ఎండలో మాడ్చి, వానలో తడిపి చేయించే భిక్షాటనలో దానం చేస్తే వచ్చేది పాపమా పుణ్యమా? చంటిపిల్లలతో ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర చేయించేది భిక్షాటన కాదు బెగ్గింగ్ మాఫియా అంటారు స్ట్రీట్ ఆర్టిస్ట్ స్వాతి. సంవత్సర రోజులుగా 'చైల్డ్ బెగ్గింగ్' నిరోధానికి ఆమె తన భర్త విజయ్‌తో కలిసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మ్యూరల్స్ ద్వారా, పోస్టర్స్ ద్వారా చైతన్యం తెస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన 'ఆగస్ట్ ఫెస్ట్'లో వీరి పోస్టర్ ప్రదర్శన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌ను ఆకట్టుకుంది. డబ్బు దానానికి బదులు ఆహారం ఇవ్వడమే ఈ మాఫియాకు విరుగుడు అంటున్న స్వాతితో సంభాషణ...



'మేము ఒక అబ్జర్వేషన్ చేశాం. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ, విప్రో సర్కిల్ దగ్గర ట్రాఫిక్ సిగ్నల్ పడితే ఒక బిచ్చగాడు చిల్లర లేదంటే క్యూఆర్ కోడ్ చూపించాడు. అక్కర కొద్దీ అడుక్కునే వారు క్యూఆర్ కోడ్ వాడరు. దీనినో బిజినెస్‌గా మార్చినవారే వాడతారు. భిక్షాటన చుట్టూ ఎన్నో విషయాలు ఉన్నాయి. కాని వాటిలో పసిపిల్లల్ని బాధ్యులను చేయడం పట్లే మా అభ్యంతరం. 18 ఏళ్లలోపు పిల్లలు తల్లిదండ్రుల సంరక్షణలో, విద్యా హక్కుతో ఉండాలి. అలా లేకపోతే వారి గురించి ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్క పౌరుడికీ ఉంది. ఈ దేశ పౌరులుగా మేము ప్రశ్నిస్తున్నాం' అంటారు స్ట్రీట్ ఆర్టిస్ట్ స్వాతి. ఖమ్మంకు చెందిన స్వాతి స్ట్రీట్ ఆర్ట్, మ్యూరల్స్‌లో పారిస్‌లో శిక్షణ పొందారు. భర్త విజయ్‌తో కలిసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎన్నో వాల్ మ్యూరల్స్ వేశారు. ఆడపిల్లల విద్య కోసం ప్రచారం చేశారు. ఇప్పుడు 'ఐ యామ్ నాట్ యాన్ ఆబ్జెక్ట్ ఫర్ బెగ్గింగ్' (భిక్షాటనకు నేనొక వాహకాన్ని కాదు) పేరుతో పసిపిల్లలతో చేసే భిక్షాటనను వ్యతిరేకిస్తూ ప్రజల్లో చైతన్యం కోసం సంవత్సరం రోజులుగా స్ట్రీట్ ఆర్ట్‌తో, పోస్టర్స్‌తో క్యాంపెయిన్ చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్‌లలో వాల్ మ్యూరల్స్ వేశారు.

వాళ్లు ఎందుకు నిద్రపోతుంటారు?

'పిల్లల్ని మనం ఎంతో శ్రద్ధతో సంరక్షణ చేస్తాం. వారికి మంచి ఆహారం, నీరు అందేలా చూస్తాం. కాని ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర పిల్లలు ఎంత ప్రమాదకరంగా ఉంటారో మనం చూసి కూడా స్పందించం. వాహనాల మధ్య పిల్లలు తిరుగుతుంటారు... కొందరు స్త్రీలు నెలల బిడ్డలను చంకన వేసుకుని వారిని చూపించి బిచ్చం అడుగుతుంటారు. కాని గమనించి చూస్తే వీరిలో చాలామంది ఎండైనా, వానైనా నిద్రపోతుంటారు. వారెందుకు నిద్ర పోతుంటారు? వారికి కెమికెల్స్ ఏవో ఇస్తారు నిద్ర పోవడానికి. వైటనర్స్ వాడతారు. డ్రగ్స్ ఇస్తారు. ఇలాంటి పిల్లలు పెద్దయ్యి తిరిగి డ్రగ్స్ అమ్మే స్థితికి చేరుతారు. దేశంలో మిస్సవుతున్న పిల్లలు భిక్షాటనకు పావులుగా మారుతున్నారు. ఆంధ్రా పిల్లల్ని మరో రాష్ట్రంలో, మరో రాష్ట్రంలోని వారిని తెలంగాణలో ఇలా గ్రూపులుగా చేసి వ్యవస్థీకృతంగా భిక్షాటన చేయిస్తున్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారో ఎందుకు కనుక్కోరు? ప్రభుత్వాలు, పౌరులు ఎందుకు పట్టించుకోరు? ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఎండలో చంటి పిల్లలు మాడుతుంటే మనం 100కు డయల్ చేస్తే అలా నలుగురు ఫోన్ చేసినా పోలీసులు పట్టుకెళతారు. ఆ పనీ చేయం. వేల మంది పిల్లలు మన దేశంలో ఇలా ఎంతకాలం బిచ్చమెత్తుకోవాలి. అందుకే మా వంతు బాధ్యతగా ఈ క్యాంపెయిన్ చేస్తున్నాం. ఆగస్టు 9 హైదరాబాద్‌లో జరిగిన ఆగస్ట్ ఫెస్ట్‌లో క్రియేటివ్ ఫోరమ్ కింద మా పోస్టర్స్ ప్రదర్శన చేశాం. మంచి స్పందన వచ్చింది' అని తెలిపారు స్వాతి.

రోజుకు 60 వేలు

'హైదరాబాద్‌లో ఒక ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఒక గ్రూప్ ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు భిక్షాటన చేస్తే ఎంత సంపాదిస్తారో తెలుసా? 60 వేలు. అవును... ఒకసారి సిగ్నల్ పడితే 300 వాహనాలు ఆగుతాయి. అలా పీక్ అవర్స్‌లో రోజుకు 250 సార్లు సిగ్నల్స్ పడతాయి. ఒక రోజులో ఒక సిగ్నల్ పాయింట్ నుంచి 60 వేల వాహనాలు వెళతాయి. రూపాయి రెండ్రూపాయలు ఇప్పుడు ఎవరి దగ్గరాలేవు. పది రూపాయల లెక్కన వీరిలో పది శాతం మంది దానం చేసినా రోజులో 60 వేల రూపాయలు వస్తాయి. ఇలా సిటీలోని అన్ని సిగ్నల్ పాయింట్స్ దగ్గరి నుంచి ఎంత వసూలవుతుందో... ఇది ఎంత పెద్ద వ్యాపారమో ఊహించుకుంటే భయం వేస్తుంది. ఇంత పెద్ద వ్యాపారాన్ని చేయించడానికి పసిపిల్లల కోసం ఎన్నెన్ని దారుణాలు చేస్తున్నారో మనం అర్థం చేసుకోవాలి. ఈ మాఫియాను ఆపాలి' అంటారు స్వాతి.

డబ్బును దానం చేయవద్దు

'నిజంగా దానం చేయాలంటే ఆహారాన్ని దానం చేయాలి. అదే కదా అవసరం. డబ్బు దానం చేస్తే డబ్బుతో ఏదైనా చేయొచ్చు. మత్తు పదార్థాలు, మద్యం కొనొచ్చు. డబ్బు కోసం దారుణాలు చేయొచ్చు. ఆహారాన్ని డబ్బుగా మార్చలేరు. అందుకే దానం చేస్తే ఆహారం ఇవ్వాలి. అలాగే చంటి పిల్లలు ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర కనపడితే పోలీసులకు చెప్పాలి. ఇంత వరకూ సిటీలో కనిపించే గ్యాంగులు ఇప్పుడు టౌన్ల వరకూ వెళ్లాయి. ఇంకా ఎంత దూరం వెళతాయో చెప్పలేము. కాబట్టి పిల్లల్ని కాపాడటానికి పౌరులుగా మనమంతా ముందుకు రావాలి. మేము మా సొంత నిధులతో చేయదగ్గది చేస్తున్నాం. సపోర్ట్ చేస్తామని వాళ్లు వీళ్లు అడుగుతున్నారు. దాని కంటే కూడా ఈ చైతన్యాన్ని ముందుకు తీసుకెళ్లగలగడమే మాకు ఇవ్వగల సపోర్ట్' అని తెలిపారు స్వాతి.

● నేడు వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ డే

తీపి గురుతుగా వారు మన మధ్యే

'ఉన్నోళ్లు పోయినోళ్ల తీపి గుర్తులు' అనే ఆత్రేయ పాట అవయవ దానానికి సరిగ్గా సరిపోతుంది. అవయవదానంపై ఉన్న అపోహలు మెల్లగా తొలగిపోతున్నాయి. 'అవయవదానం అంటే పుణ్యాలలో కెల్లా పుణ్యం' అనే భావన పెరుగుతోంది...



గుజరాత్‌లోని వల్సాద్ పట్టణంలో...

పదహారు సంవత్సరాల అనమ్మ అహ్మద్, శివమ్ మిస్త్రీకి రాఖీ కట్టింది. ఈ దృశ్యం చూస్తున్నవారు భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. అన్నాచెల్లెళ్ల పాటలు పాడారు.

రాఖీ కట్టడం అనేది సాధారణ దృశ్యమే కదా, వారు ఎందుకంత భావోద్వేగానికి గురయ్యారు?

కాస్త వెనక్కి వెళితే...

ముంబైకి చెందిన అనమ్మ అహ్మద్ చేతుల్లో ఒకటి రియా అనే అమ్మాయిది. శివమ్ మిస్త్రీ సోదరి అయిన రియా గత సంవత్సరం అనారోగ్యంతో చనిపోయింది. ఆమె చేతిని సూరత్‌లోని ఒక స్వచ్ఛంద సంస్థ సహాయంతో అనమ్మ అహ్మద్‌కు ట్రాన్స్‌ప్లాంట్ చేశారు.

'అనమ్మ చేతులను తాకినప్పుడల్లా రియాను చూసినట్లుగానే ఉంటుంది. మా కుటుంబంలోని ఒకే ఒక ఆడబిడ్డ దురదృష్టవశాత్తు చనిపోయింది. అయితే, అనమ్మతో మాట్లాడినప్పుడు నా బిడ్డ బతికే ఉన్నట్లు అనిపిస్తుంది' అంటాడు రియా, శివమ్ తండ్రి బాబీ మిస్త్రీ.

ఇక అనమ్మ అహ్మద్ విషయానికి వస్తే....

హైటెన్షన్ ఎలక్ట్రిక్ వైర్ తాకి ఆమె కుడి చెయ్యి పూర్తిగా దెబ్బతిన్నది. ఎడమ చెయ్యి 20 శాతం సామర్థ్యంతో మాత్రమే పనిచేసేది. సర్జరీతో ఎడమ చెయ్యి మెరుగుపడింది.

రెండు సంవత్సరాల తరువాత... వల్సాద్‌లో...

నాలుగవ తరగతి చదువుతున్న రియా భరించలేని తలనొప్పితో అనారోగ్యానికి గురైంది. వాంతులు చేసుకుంది. ఎన్నో ఆస్పత్రుల తరువాత తల్లిదండ్రులు రియాను సూరత్‌లోని 'కిరణ్ హస్పిటల్'లో చేర్పించారు. ఆ హాస్పిటల్‌లోనే రియా 'బ్రెయిన్ డెడ్' వార్త విని కుటుంబసభ్యులు కుప్పకూలిపోయారు.

ఆ సమయంలో 'డొనేట్ లైఫ్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రియా కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమె ఆర్గాన్స్ డొనేట్ చేసేవిధంగా ఒప్పించారు. 'స్టేట్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్'లో రిజిస్టర్ అయిన తరువాత రియా కుడి చేతిని అనమ్మ అహ్మద్‌కు అమర్చారు. కిడ్నీ, కాలేయాలను అవసరార్థుల కోసం దానం చేశారు.

ఇటీవల శివమ్ మిస్త్రీకి రాఖీ కట్టడానికి తల్లిదండ్రులతో కలిసి ముంబై నుంచి వల్సాద్ వెళ్లింది అనమ్మ అహ్మద్. ఆమెను చూసిన శివమ్ కుటుంబసభ్యులు రియాను చూసినట్లుగా అనిపించి భావోద్వేగానికి గురయ్యారు. అనమ్మ కుడి చేయిని ప్రేమగా తడిమారు.

'రాఖీ పండగ రోజు నేను ఏదో పని మీద బయటికి వెళ్లాను. త్వరగా ఇంటికి రావాల్సిందిగా నా భార్య ఫోన్ చేసింది. నేను ఇంటికి వెళ్లేసరికి అనమ్మ, ఆమె తల్లిదండ్రులు, మా బంధువులు, స్నేహితులు ఉన్నారు. శివమ్‌కు రాఖీ కట్టడానికి వచ్చాం అని అనమ్మ తండ్రి అఖిల్ అహ్మద్ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. కళ్లనీళ్లు ఆగలేదు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు' అని ఆ రోజును గుర్తు తెచ్చుకున్నాడు రియా తండ్రి బాబీ మిస్త్రీ.

'అనమ్మ శివమ్‌కు రాఖీ కడుతున్నప్పుడు, స్వయంగా రియానే కడుతున్నట్లు అనిపించింది. రియాకు ఇష్టమైన గులాబ్ జామ్‌ను అనమ్మకు తినిపించాను. ప్రతి సంవత్సరం రాఖీ పండగ ఇలాగే జరుపుకోవాలనుకుంటున్నాం' అంటుంది రియా తల్లి త్రిష మిస్త్రీ.



మాది ఒకే కుటుంబం

నాకు అన్నదమ్ములు లేరు. తనకు ఉన్న ఒక్కగానొక్క సోదరికి శివమ్ దూరం అయ్యాడు. అందుకే శివమ్ నాకు సోదరుడు. ప్రతి సంవత్సరం నా సోదరుడికి రాఖీ కట్టడానికి వస్తాను. నన్ను వేరే పట్టణం, కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయిగా వారు చూడలేదు. తమ ఇంటి బిడ్డగానే చూశారు. నాలో రియను చూసుకున్నారు.

– అనమ్మ అహ్మద్

● లీగల్

డీఆర్‌టీలో వేలానికి వచ్చిన ఇల్లు కొనచ్చా?

ఇటీవలే ఒక జాతీయ బ్యాంకు వారు జారీ చేసిన పత్రికా ప్రకటనలో ఇల్లు వేలం పాట ద్వారా అమ్మకానికి పెడుతున్నట్లు చూశాను. అందులో ఏవేవో కేసు నంబర్లు కూడా ఉన్నాయి. ఆ ఇంటికి వెళ్లి చూడగా మాకు బాగా నచ్చింది. ఆ ఇంటి పూర్వ యజమాని లోను కట్టలేక పోవటం వలన బ్యాంకు వారు డీఆర్‌టీలో కేసు వేయడం ద్వారా ఇల్లు వేలానికి వచ్చిందని తెలిసింది. ఇలాంటి ఇంటిని వేలంపాటలో కొంటే ఏమైనా సమస్యలు వస్తాయా? తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

– కిషోర్ కుమార్, వరంగల్

మీరు చూసిన ప్రకటన డీఆర్.టీ (డెట్ రికవరీ ట్రిబ్యునల్) కేసుకు సంబంధించి అయి ఉండవచ్చు. ఎవరైనా ఇంటి లోను/ఆస్తిపై లోను తీసుకొని తిరిగి కట్టలేని పక్షంలో దశలవారీగా బ్యాంకు వారు తగిన నోటీసులు జారీ చేసి, అప్పటికి కూడా బకాయిలు చెల్లించకపోతే ఆస్తి/ఇంటి పొజిషన్ తీసుకోవడానికి చర్యలు చేపడతారు. అఖిఊఅఉ ఐ చట్టం ప్రకారం పొజిషన్ తీసుకోవడానికి సైతం బ్యాంకు వారికి ఎటువంటి కోర్టు ఆర్డర్ అవసరం లేదు. పొజిషన్ పొందిన బ్యాంకు వారు వేలంపాట వరకు వస్తే, అలాంటి ఆస్తిని/ఇంటిని వేలంపాటలో పాల్గొని, కొనుగోలు చేసే ముందు అన్ని పత్రాలను, కోర్టు ఉత్తర్వులను, బ్యాంకు వారి పొజిషన్ విధానం మొదలైన వాటిని క్షుణ్ణంగా చూసుకొని కొనుక్కున్నవారికి సాధారణంగా ఎటువంటి ఆటంకాలు రాకపోవచ్చు. వేలంపాట సమయంలోనే మీరు బ్యాంకు సూచించినంత (సుమారు 25%) డిపాజిట్ రూపంలో జమ చేయాల్సి ఉంటుంది. మిగతా డబ్బులు చెల్లించడానికి మీకు గరిష్ఠంగా మూడు నెలల సమయం వరకు ఇవ్వవచ్చు. అయితే ఇలాంటి ఆస్తిని కొనుగోలు చేసేటప్పుడు చూసుకోవలసిన కొన్ని అంశాలు...

1) ఇంకా ఏమైనా కోర్టు కేసులు – ముఖ్యంగా డీ.ఆర్.టీ. లో ఏమైనా పెండింగ్ ఉన్నాయా
2) బ్యాంకు వారికి పూర్తి పొజిషన్ ఉందా లేక సింబాలిక్ పొజిషన్ ఉందా
3) కొనుగోలు దారునికి పొజిషన్ ఎన్నాళ్ళకు ఇవ్వవచ్చు?
4) ఎన్కంబరెన్స్ సర్టిఫికెట్ ద్వారా సదరు ఆస్తిపై ఇంకెవరికైనా హక్కులు ఉన్నాయా లేదా
5) ఏదైనా సంస్థకు ఆస్తి పన్ను, బిల్లులు వంటివి ఏమైనా బకాయిలు ఉన్నాయా
6) ఆస్తి/ఇంటి పై అనుమతులు లేని కట్టడాలు / మార్పులు ఏమైనా చేశారా? (చేస్తే బ్యాంకు వారి తగిన మార్పులు, సవరణలు చేసి ఇవ్వాలి)

పైన సూచించిన అంశాలు మాత్రమే కాకుండా ఇంటి పత్రాలను, కోర్టుపత్రాలను, బ్యాంకు లావాదేవీ పత్రాలను, పత్రికా ప్రకటనలను కూడా మీకు దగ్గరలోని అనుభవజ్ఞులైన ఒక లాయర్ గారి దగ్గరికి తీసుకువెళ్లి అభిప్రాయం తీసుకుంటే మంచిది. మీకు ఏమైనా సందేహాలు ఉంటే బ్యాంకు వారిని అదనపు పత్రాలు ఇవ్వవలసిందిగా కోరవచ్చు.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
ఆగస్టు 12న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,710	బంగారం (24 క్యారెట్లు)	1,02,850	బంగారం (24 క్యారెట్లు)	1,01,400	బంగారం (24 క్యారెట్లు)	1,02,850	బంగారం (24 క్యారెట్లు)	1,00,250	బంగారం (24 క్యారెట్లు)	1,01,400
బంగారం (22 క్యారెట్లు)	93,450	బంగారం (22 క్యారెట్లు)	92,950	బంగారం (22 క్యారెట్లు)	92,950	బంగారం (22 క్యారెట్లు)	95,740	బంగారం (22 క్యారెట్లు)	92.230	బంగారం (22 క్యారెట్లు)	92,950
వెండి	1,17,000	వెండి	1,17,000	వెండి	1,25,000	వెండి	1,17,000	వెండి	1,17,000	వెండి	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



అర్జున్-కీమెర్ ఆరో రౌండ్ గేమ్ 'డ్రా'

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ మాస్టర్స్ కేటగిరీలో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో మంగళవారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను అర్జున్ 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఇతర గేముల్లో జోర్డెన్ వాన్ ఫొరీస్ట్ (నెదర్లాండ్స్) 51 ఎత్తుల్లో నిహాల్ సరీన్ (భారత్)పై, అవండర్ లియాంగ్ (అమెరికా) 61 ఎత్తుల్లో ప్రణవ్ (భారత్)పై గెలిచారు. రే రాబ్సన్ (అమెరికా)-కార్తికేయన్ మురళీ (భారత్) గేమ్ 123 ఎత్తుల్లో... విదిత్ గుజరాతి (భారత్)-అనీశ్ గిరి (నెదర్లాండ్స్) గేమ్ 109 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. ఆరో రౌండ్ తర్వాత కీమెర్ 4.5 అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 3.5 పాయింట్లతో అర్జున్ రెండో స్థానంలో ఉన్నాడు. ఇదే టోర్నమెంట్ చాలెంజర్స్ కేటగిరీలో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక తొలి విజయం అందుకుంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలితో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హారిక 80 ఎత్తుల్లో గెలిచింది.

'డబుల్ సెంచరీ' చిరస్మరణీయం

నాలుగోసారి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఎంపికైన శుబ్‌మన్ గిల్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రతీ నెలా ప్రకటించే 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'కు ఈసారి భారత టెస్టు జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన అతడిని జూలై నెల అవార్డుకు అర్హుడిగా మార్చింది. ఐదు టెస్టుల ఈ సిరీస్‌లో మొత్తం 754 పరుగులు చేసిన గిల్... అవార్డుకు పరిగణనలోకి తీసుకున్న జూలై నెలలో 3 టెస్టుల్లో కలిపి 567 పరుగులు సాధించాడు. ఇందులో బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో చేసిన 269, 161 (మొత్తం 430) పరుగుల ప్రదర్శన గిల్ కెరీర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఐసీసీ అవార్డుకు ఎంపికైనందుకు సంతోషం వ్యక్తం చేసిన గిల్... ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో తాను ఆడిన 269 పరుగుల ఇన్నింగ్స్ ఎప్పటికీ తనకు మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించాడు. 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కెప్టెన్‌గా తొలి టెస్టు సిరీస్‌లో ప్రదర్శనకుగాను నాకు గుర్తింపు దక్కడం దీనిని మరింత ప్రత్యేకంగా మార్చింది. బర్మింగ్‌హామ్‌లో చేసిన డబుల్ సెంచరీ ఎంతో ప్రత్యేకమైంది. ఎప్పటికీ మర్చిపోలేనిది. ఇంగ్లండ్‌తో సిరీస్ కెప్టెన్‌గా నేను ఎంతో నేర్చుకునే అవకాశం కల్పించింది. ఇరు జట్లు చాలా బాగా ఆడాయి. ఆటగాళ్లందరికీ కూడా ఇది చిరస్మరణీయం. ముున్ముందు ఇదే తరహా ప్రదర్శనను కొనసాగిస్తాను' అని గిల్ స్పందించాడు.

4 ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు పొందడం గిల్‌కిది నాలుగోసారి. 2023 జనవరిలో, సెప్టెంబర్‌లో...2025 జనవరిలో, జూలైలో గిల్‌కు ఈ అవార్డు దక్కింది. అత్యధికసార్లు ఈ అవార్డు నెగ్గిన భారత క్రికెటర్‌గా గిల్ నిలిచాడు.

క్వార్టర్ ఫైనల్లో దివ్య



ముంబై: మహిళల స్పీడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ర్యాపిడ్ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో దివ్య 10-3తో చైనా గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ మూడో ర్యాంకర్ లె టింగ్జిపై విజయం సాధించింది. ఇద్దరి మధ్య 13 గేమ్‌లు జరిగాయి. దివ్య ఎనిమిది గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయింది. 16 మంది ప్లేయర్ల మధ్య నాకౌట్ పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది. రేపు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ హు ఇఫాన్ (చైనా)తో దివ్య తలపడుతుంది.



బ్రెవిస్ బీభత్సం

56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్స్‌లతో 125 నాటౌట్

- ఆస్ట్రేలియాపై టి20లో చెలరేగిన సఫారీ బ్యాటర్
- 53 పరుగులతో దక్షిణాఫ్రికా ఘన విజయం

డార్విన్: దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ మెరుపు ప్రదర్శనతో చెలరేగిపోయాడు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టి20లో అతను ఫోర్లు, సిక్సర్లతో సత్తా చాటి ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. ఈ క్రమంలో బ్రెవిస్ దక్షిణాఫ్రికా తరఫున టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 53 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికాకు టి20ల్లో ఇదే అత్యధిక స్కోరు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డెవాల్డ్ బ్రెవిస్ (56 బంతుల్లో 125 నాటౌట్; 12 ఫోర్లు, 8 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగాడు. అనంతరం ఆసీస్ 17.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది. టిమ్ డేవిడ్ (24 బంతుల్లో 50; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా... మిగతావారంతా విఫలమయ్యారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలవగా, చివరి టి20 శనివారం జరుగుతుంది.

బౌండరీలతోనే 96 పరుగులు...

ఐదో ఓవర్లో దక్షిణాఫ్రికా స్కోరు 44/2 వద్ద ఉన్నప్పుడు క్రీజ్‌లోకి వచ్చిన బ్రెవిస్ చివరి వరకు నిలిచాడు. తాను ఎదుర్కొన్న మూడో బంతికి తొలి ఫోర్ కొట్టిన అతను అదే జోరు కొనసాగిస్తూ ఒక దశలో 24 బంతుల్లో 44 పరుగులు చేశాడు. ఆ తర్వాత మ్యాక్స్‌వెల్ ఓవర్లో వరుసగా 6, 6, 4, 6 బాదడం ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచింది. ఈ ఓవర్లో అతను 56 పరుగుల వద్ద ఉన్నప్పుడు లాంగాన్‌లో ఇచ్చిన క్యాచ్‌ను కునెమన్ వదిలేయడం కూడా కలిసొచ్చింది. 25 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న బ్రెవిస్‌కు శతకం చేసుకునేందుకు మరో 16 బంతులు మాత్రమే సరిపోయాయి. హాజల్‌వుడ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదిన తర్వాత డ్వార్‌షుయిస్ ఓవర్లో కొట్టిన మూడో ఫోర్‌తో 41 బంతుల్లోనే బ్రెవిస్ శతకం పూర్తయింది. ఛేదనలో డేవిడ్‌కు ఇతర ఆసీస్ బ్యాటర్లెవరూ సహకారం అందించలేదు. ఒకదశలో 9.3 ఓవర్లలో 106/3తో ఉన్నా...ఆ తర్వాత జట్టు తడబడింది.

125 టి20ల్లో దక్షిణాఫ్రికా తరఫున బ్రెవిస్ స్కోరు (125) అత్యధికం. డుప్లెసిస్ (119)ను అతను అధిగమించాడు.

2 దక్షిణాఫ్రికా తరఫున ఇది రెండో ఫాస్టెస్ట్ (41 బంతుల్లో) సెంచరీ. ప్రస్తుతం డేవిడ్ మిల్లర్ (35 బంతుల్లో) పేరిట ఈ రికార్డు ఉంది.

1 అతి పిన్న వయసులో అంతర్జాతీయ టి20 శతకం బాదిన దక్షిణాఫ్రికా బ్యాటర్‌గా (22 ఏళ్ల 105 రోజులు) నిలిచిన బ్రెవిస్... రిచర్డ్ లెవీ (24 ఏళ్ల 36 రోజులు) రికార్డును సవరించాడు.

పార్లమెంట్‌లో క్రీడా బిల్లు పాస్

ఆమోదించిన ఉభయసభలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో జాతీయ క్రీడా బిల్లు పాసయ్యింది. సోమవారం లోక్‌సభ ఆమోదించిన బిల్లును 24 గంటల్లోనే మోదీ సర్కారు మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లును ఎగువ సభ ఆమోదించింది. అలాగే సవరించిన జాతీయ డోపింగ్ నిరోధక బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఈ రెండు బిల్లులను రాష్ట్రపతి నోటిఫై చేయగానే చట్టంగా మారతాయి. రాజ్యసభలో బిహార్ ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు చర్చకు పట్టుబడుతున్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశ పెట్టింది. క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సభలో మాట్లాడుతూ '20 దేశాల్లో క్రీడా చట్టం అమలవుతోంది. ఈ 21వ శతాబ్దిలో మన దేశంలో క్రీడా చట్టం ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ బిల్లును ప్రవేశపెడుతున్నాం' అని అన్నారు. అనంతరం బిల్లుపై దాదాపు 2 గంటలకు పైగానే చర్చ జరిగింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, ఎన్సీపీ ఎంపీ ప్రఫుల్ పటేల్, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, ఎంపీ పీటీ ఉష తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం క్రీడారంగంలో పారదర్శకత పెంచేందుకు ఉద్దేశించిన ఈ బిల్లు ఉభయ సభల ఆమోదం పొందడం పట్ల కేంద్ర క్రీడాశాఖ మంత్రి మాండవీయ హర్షం వ్యక్తం చేశారు.

చట్టరూపం దాల్చనున్న బిల్లు స్వరూపమిది...

- ఈ బిల్లులో అత్యంత కీలకమైంది జాతీయ క్రీడల బోర్డు (ఎన్‌ఎస్‌బీ) ఏర్పాటు. జాతీయ సమాఖ్యలకు గుర్తింపు, లేదంటే రద్దులాంటి విశేషాధికారాలు బోర్డుకు ఉంటాయి. సకాలంలో ఎన్నికలు, సక్రమంగా జట్ల ఎంపికలు చేసేలా చూస్తుంది. బోర్డు గుర్తించిన సమాఖ్యలకే కేంద్రం నిధులు విడుదల చేస్తుంది.
- కొత్త బిల్లు ప్రకారం జాతీయ స్పోర్ట్స్ ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు అవుతుంది. సమాఖ్యలో కుమ్ములాటలు, జట్ల ఎంపికల్లో వివాదాలను పరిష్కరించే అధికారం ఈ ట్రిబ్యునల్‌కే కల్పించారు. ఈ ట్రిబ్యునల్ తీర్పులపై కేవలం సుప్రీం కోర్టులోనే సవాలు చేసే అవకాశముంటుంది. దిగువ కోర్టుల్లో ఇకమీదట కేసుల విచారణ ఉండదు.
- క్రీడా పాలకులు ఏళ్లతరబడి తిష్టవేసేందుకు వీలుండదు. అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు గరిష్టంగా 12 ఏళ్ల పాటు పదవుల్లో కొనసాగవచ్చు. కాగా గరిష్ట వయసును 70 నుంచి 75కు పెంచారు. అయితే సదరు సమాఖ్యకు సంబంధించిన అంతర్జాతీయ సమాఖ్య నియమావళికి లోబడే ఈ పరిమితి ఉంటుంది.



మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అందరూ చూడాల్సిన సినిమా యూనివర్సిటీ

- త్రివిక్రమ్ శ్రీనివాస్



● త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆర్. నారాయణ మూర్తి

''యూనివర్సిటీ-పేపర్ లీక్' చిత్రంలో ఓ సన్నివేశం ఉంది. 'అన్నం తినే టైమ్‌లో పుస్తకం చదివితే మంచిది కదా? ముద్ద నేను కలిపి పెడతాను నువ్వు చదువుకో' అంటూ ఓ తల్లి తన బిడ్డకు చెబుతుంది. అంటే చదువు విషయంలో పిల్లల మీద మనం ఎంతో ఒత్తిడి పెంచుతున్నాం. పిల్లల భవిష్యత్ గురించి పెద్ద వాళ్ల వర్తమానాన్ని తాకట్టు పెట్టేస్తున్నారనే పాయింట్ నాకు బాగా నచ్చింది.. అందరూ తప్పక చూడాల్సిన సినిమా 'యూనివర్సిటీ'' అని డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ తెలిపారు. ఆర్.నారాయణ మూర్తి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ-పేపర్ లీక్'. స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించిన అనంతరం **త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ–** ''తన అభిప్రాయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో నారాయణ మూర్తిగారికి ఉన్న నిబద్ధత, సిన్సియారిటీని ఎవరూ ప్రశ్నించలేరు. ఆయనలా రాజీ పడకుండా బతకడం అందరి వల్ల కాదు.. నా వల్ల కూడా కాదు. నేను చాలా సార్లు రాజీ పడ్డాను. ఆ విషయంలో నాకు కొంత అసూయ కూడా ఉంది. 'యూనివర్సిటీ' లాంటి సినిమాలు ఎందుకు బతకాలి? అంటే.. నారాయణ మూర్తిగారు మరిన్ని సినిమాలు తీయాలి. ఓ క్యారెక్టర్‌కి ఆయన్ని అనుకున్నాను. కానీ, ఆ పాత్ర ఆయన చేయరని, నారాయణమూర్తిగారిని పారితోషికంతో కొనలేరంటూ నా సన్నిహితులు అన్నారు. నారాయణ మూర్తిగారు చెబితేనే జనాలు ఎందుకు వింటారు? అంటే డబ్బుల కోసం ఆయన సినిమాలు చేయరు'' అన్నారు. **ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ–** ''ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విద్యను విముక్తి చేసి, జాతీయం చేయాలి, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలంటూ చాటి చెప్పేదే మా సినిమా'' అన్నారు.

అందరికీ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం

- అనిల్ వల్లభనేని

తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 30శాతం పెంచాలంటూ 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి బంద్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ బంద్ మంగళవారంతో తొమ్మిదోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' అధ్యక్షుడు అనిల్ వల్లభనేని ఫిల్మ్ ఛాంబర్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ–''వేతన పెంపు కోసం తొమ్మిది రోజులుగా చిత్రీకరణలు ఆపాం. నేటి మధ్యాహ్నం మూడు గంటలకు ఫిల్మ్ ఛాంబర్‌తో సమావేశం అవుతున్నాం. మా డిమాండ్స్ గురించి, చిన్న నిర్మాతల గురించి, పని పరిస్థితుల పైన కూడా మాట్లాడతాం. నేడు జరిగే చర్చల్లో అంతిమంగా అందరికీ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు.

కేరళ అమ్మాయి.. ఢిల్లీ అబ్బాయి



● సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఇటు దక్షిణాది, అటు ఉత్తరాది చిత్రాలతో జోరుగా దూసుకెళుతున్నారు. ఆమె నటించిన తాజా హిందీ చిత్రం 'పరమ్ సుందరి'. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన ఈ సినిమాకి తుషార్ జలోటా దర్శకత్వం వహించారు. రెంజీ పనీకర్, సిద్ధార్థ్ శంకర్, మన్‌జోత్ సింగ్, సంజయ్ కపూర్, ఇనాయత్ వర్మ ఇతర పాత్రలు పోషించారు. దినేష్ విజన్ సమర్పణలో మాడాక్ ఫిల్మ్స్‌పై దినేష్ విజన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'పరమ్ సుందరి' ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. సుందరి పాత్రలో జాన్వీ కపూర్, పరమ్ పాత్రలో సిద్ధార్థ్ మల్హోత్రా నటించారు. కేరళ అమ్మాయితో ఢిల్లీ అబ్బాయి ప్రేమలో పడితే ఎలా ఉంటుంది? అనే ప్రేమకథా నేపథ్యంలో రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందినట్లు ట్రైలర్ చూస్తే అర్థం అవుతోంది. ట్రైలర్ చివర్లో.. 'కేరళ మలయాళం మోహన్‌లాల్, తమిళ్‌నాడు తమిళ్ రజనీకాంత్, ఆంధ్ర తెలుగు అల్లు అర్జున్, కర్నాటక కన్నడ యశ్... అంటూ మోహన్‌లాల్, రజనీకాంత్, అల్లు అర్జున్, యశ్ వంటి హీరోలను జాన్వీకపూర్ ఇమిటేట్ చేయడం ట్రైలర్‌లో హైలెట్‌గా నిలుస్తోంది. ఇదిలా ఉంటే... తెలుగులో రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమాలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.


చిత్తూరు పిల్లా...



● లావణ్య, దేవ్ మోహన్

లావణ్యా త్రిపాఠి, దేవ్ మోహన్ జంటగా నటించిన చిత్రం 'సతీ లీలావతి'. 'భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి)' సినిమాల ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్‌పై నాగమోహన్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఓరి పిల్లా.. చిత్తూరు పిల్లా...' అంటూ సాగే పాటని మంగళవారం విడుదల చేశారు మేకర్స్. 'గంపెడంత ఆశ పెట్టుకుంటే కొంప ముంచి పాయెరో... బాహుబలిలాంటి ఈ బావని బద్నాము చేసిందిరో... ఓరి పిల్లా.. చిత్తూరు పిల్లా...' అంటూ వివాహం నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు వనమాలి సాహిత్యం అందించగా, నూతన్ మోహన్, కృష్ణ తేజస్వి పాడారు. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''సతీ లీలావతి' చిత్రంలో 'ఓరి పిల్లా.. చిత్తూరు పిల్లా...' అంటూ వివాహం నేపథ్యంలో సాగే పాట పెళ్లి సంబరాల్లో సందడి చేస్తుంది. మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. అతి త్వరలో విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


డేట్ చేంజ్



● విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని హీరోగా నటించిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'భద్రకాళి'. వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. అరుణ్ ప్రభు దర్శకత్వంలో విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్-మీరా విజయ్ ఆంటోని సమర్పణలో రామాంజనేయులు జవ్వాజి నిర్మించారు. ఈ సినిమాని సెప్టెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా సెప్టెంబరు 19న విడుదల చేయనున్నట్లు కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సినిమాకు సంగీతం: విజయ్ ఆంటోని.


ప్రపంచానికి వినిపించాల్సిన తెలుగు కథ!



● సత్యదేవ్

సత్యదేవ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'రావు బహదూర్'. 'కేరాఫ్ కంచర పాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాల ఫేమ్ వెంకటేష్ మహా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటంతో పాటు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జీఎమ్‌బీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో ఏ ప్లస్ యస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర ఈ సినిమా నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రం నుంచి సత్యదేవ్ ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ''ఓ నటుడిగా 'రావు బహదూర్'లాంటి సినిమా దొరకడం అరుదు. ఈ చిత్రం కోసం నిజంగానే రావు బహదూర్‌గా బతికాను'' అని తెలిపారు సత్యదేవ్. '' రాజవంశం నేపథ్యంలో సాగే సైకలాజికల్ డ్రామా ఇది. ప్రపంచానికి వినిపించాల్సిన తెలుగు కథ'' అన్నారు వెంకటేష్ మహా. ''ఈ నెల 15న మా సినిమా నుంచి 'నాట్ ఈవెన్ ఏ టీజర్' అనే స్పెషల్ వీడియో థియేటర్స్‌లో రిలీజ్ అవుతుంది. ఆ తర్వాత ఈ నెల 18న ఈ వీడియో డిజిటల్‌లో వస్తుంది. 2026 వేసవిలో తెలుగుతో పాటుగా, ఇతర భాషల్లో సబ్ టైటిల్స్‌తో గ్లోబల్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: స్మరణ్ సాయి.

డొక్కా సీతమ్మ బయోపిక్



● వి. సముద్ర, శివిక

వి. సముద్ర, శివిక, కుసుమ, సుప్రియ, నవీన్ మట్టా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'అన్నపూర్ణ తల్లి బువ్వమ్మ'. గోరి బ్రదర్స్ మీడియా, బ్లాక్ అండ్ వైట్ మూవీ మార్క్ పతాకాలపై సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో సిరాజ్, ఖాదర్ గోరి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డొక్కా సీతమ్మ పాత్రధారి శివిక మాట్లాడుతూ– ''నా తొలి చిత్రం ఇది. నటిగా లాంచ్ కావడానికి ఇంతకన్నా మంచి చిత్రం, టీమ్ దొరకదు. సీతమ్మగారి పాత్రకు నేను న్యాయం చేశాననే అనుకుంటున్నాను'' అని తెలిపారు. వి. సముద్ర మాట్లాడుతూ– ''డొక్కా సీతమ్మగారి జీవిత కథ ఈ సినిమా. ఈ చిత్రంలో సీతమ్మగారి భర్తగా నటించడం నా అదృష్టం. నేను ఎంతోమంది స్టార్స్‌లను డైరెక్ట్ చేశాను. కానీ, ఈ సినిమాలో నటించడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ''మంచి సినిమా తీశాం. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మకంగా చెప్పగలను'' అని తెలిపారు సురేశ్ లంకలపల్లి. ''అన్నపూర్ణ తల్లి బువ్వమ్మ' పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని నిర్మాతలు తెలిపారు.

యూత్‌ఫుల్ మ్యానిప్యులేటర్



● బి.గోపాల్, వీజే సాగర్, కల్యాణ్

నేటితరం యువతీ యువకుల జీవనశైలి ఇతివృత్తంగా రూపొందిన సినిమా 'మ్యానిప్యులేటర్'. కల్యాణ్, ప్రియా పాల్, సోఫియా ఖాన్, ఊహ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించారు. వీజే సాగర్ దర్శకత్వం వహించారు. సి. రవిసాగర్, వీజే సాగర్ నిర్మాణ సారథ్యంలో సీఆర్ ప్రొడక్షన్స్, వీజే ఫిల్మ్ ఫ్యాక్టరీపై ఈ సినిమా రూపొందింది. ప్రముఖ దర్శకుడు బి. గోపాల్ ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని, యూనిట్‌కి మంచి పేరు రావాలని ఆకాంక్షించారు. ''క్యారెక్టర్ ఓరియంటెడ్ కాన్సెప్ట్‌తో పక్కా యూత్‌ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'మ్యానిప్యులేటర్' రానుంది. ఈ సినిమాతో 43మంది నూతన నటీనటులు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ఐదు విభిన్నమైన పాటలున్నాయి. త్వరలోనే ఈ సినిమా ఆడియోలాంచ్, విడుదల తేదీ వంటి వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
368	98
80,235	24,487

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,652	△	267
డోజోన్స్	44,454	△	479
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,149	▽	19
డాక్స్	24,059	▽	23
షాంఘై	3,666	△	18
నికాయ్	42,718	△	898

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.10	88.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.50	119.46
€	యూరో	ఎస్‌బీఐ	100.90	103.65
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.66	60.16
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.06	58.31
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.89	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.49	23.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.98	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.33	13.15

క్లాసిక్ లెజెండ్స్.. యెజ్డీ రోడ్‌స్టర్ 2025


ప్రారంభ ధర రూ.2.09 లక్షలు



ముంబై: ప్రీమియం బైకుల సంస్థ క్లాసిక్ లెజెండ్స్ 'యెజ్డీ రోడ్‌స్టర్ 2025 మోడల్'ను ఆవిష్కరించింది. బేసిక్ వేరియంట్ ధర రూ.2.09 లక్షలుండగా, టాప్ ఎండ్ షాడో బ్లాక్ వేరియంట్ ధర రూ.2.26 లక్షలు. టర్న్ ఇండికేటర్లు, టెయిల్ సెక్షన్ డిజైన్ అప్డేట్ చేశారు. మొత్తం అయిదు కలర్ల ఆప్షన్‌లో లభిస్తుంది. 334 సీసీ సింగిల్-సిలిండర్, లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 28.6 హార్స్‌పవర్, 30 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజిన్ 6-స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తుంది. సస్పెన్షన్ పరంగా ముందు భాగంలో టెలిస్కోపిక్ ఫోర్కులు, వెనక భాగంలో ట్విన్ షాక్ అబ్జార్బర్లున్నాయి. బ్రేకింగ్ వ్యవస్థలో భాగంగా 320 ఎంఎం డిస్క్, వెనక భాగంలో 240 ఎంఎం డిస్క్ ఉంది. దేశీయ మార్కెట్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఆర్‌ఈ క్లాసిక్ 350, హోండా సీబీ350 బైకులతో ఈ మోడళ్లు పోటీపడనున్నాయి. ''అంతర్జాతీయ స్థాయి నెట్‌వర్క్‌ను నిర్మిస్తున్నాము. ప్రస్తుత వాణిజ్య సుంకాల అనిశ్చితుల నేపథ్యంలో అమెరికాలో మోడళ్ల ఆవిష్కరణ వాయిదా వేశాము'' అని క్లాసిక్ లెజెండ్స్ ఎండీ, సహ వ్యవస్థాపకుడు అనుపమ్ థరేజా తెలిపారు.

అదానీ కన్నా అంబానీ డబుల్...

- కుటుంబ సంపద రూ. 28 లక్షల కోట్లు
- హురున్–బార్‌క్లేస్ నివేదిక
- 300 సంపన్న ఫ్యామిలీల సంపద రూ. 140 లక్షల కోట్లు



ముంబై: దేశీయంగా కుబేర కుటుంబాల జాబితాలో రూ. 28 లక్షల కోట్ల సంపదతో అంబానీ ఫ్యామిలీ అగ్రస్థానం దక్కించుకుంది. రెండో స్థానంలోని అదానీ కుటుంబానికన్నా (రూ. 14.01 లక్షల కోట్లు) ఇది రెట్టింపు. కాగా గతేడాది దేశీయంగా 300 అత్యంత సంపన్న కుటుంబాల సంపద విలువ ఏకంగా రూ. 140 లక్షల కోట్ల (1.6 ట్రిలియన్ డాలర్లు) స్థాయికి చేరింది. ఇది మన స్థూల దేశీయోత్పత్తికన్నా (జీడీపీ) 40 శాతం అధికం. అంబానీల ఫ్యామిలీ సంపద .. జీడీపీలో సుమారు 12 శాతంగా ఉంటుంది. బార్‌క్లేస్‌తో కలిసి హురున్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం అంబానీ కుటుంబ సంపద గత ఏడాది వ్యవధిలో 10 శాతం పెరిగింది. దేశీయంగా అత్యంత విలువైన తరతరాల ఫ్యామిలీ బిజినెస్‌ల జాబితాలో అగ్రస్థానంలో నిల్చింది. ఇక తొలి తరం ఎంట్రప్రెన్యూర్ ప్రారంభించిన కుటుంబ వ్యాపారాల విభాగంలో అదానీ కుటుంబం తొలి స్థానం దక్కించుకుంది.

రిపోర్టులో మరిన్ని విశేషాలు..

- కుమార మంగళం బిర్లా కుటుంబ సంపద గత ఏడాది వ్యవధిలో 20 శాతం వృద్ధి చెంది రూ. 6.47 లక్షల కోట్లకు పెరిగింది. తరతరాల వ్యాపార కుటుంబాల జాబితాలో మూడో స్థానం నుంచి రెండో స్థానానికి చేరింది.
- రూ. 5.70 లక్షల కోట్ల సంపదతో (21 శాతం వృద్ధి) జిందాల్ కుటుంబం మూడో స్థానంలో నిల్చింది.
- సంపద 21 శాతం క్షీణించి రూ. 5.64 లక్షల కోట్లకు పరిమితం కావడంతో బజాజ్ కుటుంబం నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.
- టాప్ 300 కుటుంబాలు గతేడాది రోజుకు రూ. 7,100 కోట్ల మేర సంపద సృష్టించాయి. 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 8,700 కోట్లు) ఉన్న ఫ్యామిలీల సంఖ్య 37 మేర పెరిగి 161కి చేరింది.
- జాబితాలోని నాలుగో వంతు వ్యాపారాలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టు కాలేదు.
- ముంబైలో అత్యధికంగా 91 సంపన్న కుటుంబాలు ఉన్నాయి. నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో (ఎన్‌సీఆర్) ఈ సంఖ్య 62గా, కోల్‌కతా 25గా ఉంది.
- టాప్ కుటుంబాలు గతేడాది వివిధ కార్యక్రమాల కోసం రూ. 5,100 కోట్లు విరాళంగా ఇచ్చాయి.
- 71 కుటుంబాలకు ప్రత్యేక ఫ్యామిలీ ఆఫీసులు ఉన్నాయి.

టారిఫ్ ఒడిదుడుకులు కొన్నాళ్లే..

- మన ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర కరెక్షన్ రాకపోవచ్చు
- యూనియన్ ఏఎంసీ ఎండీ మధు నాయర్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికా టారిఫ్‌ల వల్ల నెలకొన్న ఒడిదుడుకుల ప్రభావం మనపై స్వల్పకాలికంగానే ఉంటుందని యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ మధు నాయర్ చెప్పారు. దీర్ఘకాలికంగా చూసినప్పుడు, భారీ రుణభారం ఉన్న అమెరికా, ప్రస్తుతంతో పోలిస్తే కాస్త బలహీనపడొచ్చని ఆయన చెప్పారు. పరిస్థితులు క్రమంగా స్థిరపడి భారత్‌లాంటి దేశాలకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు. మన మార్కెట్లలో తీవ్ర స్థాయిలో కరెక్షన్ రాకపోవచ్చన్నారు. విదేశీ ఇన్వెస్టర్ల సంగతి అలా ఉంచితే, భారత ఆర్థిక మూలాలు మెరుగ్గా ఉన్న నేపథ్యంలో దేశీయంగా మార్కెట్లలోకి పెట్టుబడుల ప్రవాహం పటిష్టంగా ఉంటోందని నాయర్ చెప్పారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు, ఈపీఎఫ్ నిధులు, రిటైల్ ఇన్వెస్టర్లు, యులిప్స్ వంటి మార్గాల్లో ప్రతి నెలా రూ. 50,000 కోట్ల మేర పెట్టుబడులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

రూ. లక్ష కోట్ల ఏయూఎం లక్ష్యం

రాబోయే అయిదేళ్లలో రూ. లక్ష కోట్ల ఏయూఎం (నిర్వహణలోని ఆస్తుల పరిమాణం) స్థాయిని సాధించాలని నిర్దేశించుకున్నట్లు నాయర్ చెప్పారు. ప్రస్తుతం ఇది సుమారు రూ. 23,000 కోట్లుగా ఉన్నట్లు వివరించారు. అధిక వృద్ధి సాధన దిశగా ప్రస్తుత పథకాలపై మరింతగా దృష్టి పెట్టడంతో పాటు కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నట్లు నాయర్ తెలిపారు. సెప్టెంబర్ 1న డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్‌ను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అలాగే, అర్థయ పేరిట స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్)ను నవంబర్‌లో అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. ప్రస్తుతం కన్జూమర్ డిస్క్రిషనరీ, టెలికం, క్యాపిటల్ గూడ్స్/ఇండస్ట్రియల్స్ రంగాలు పెట్టుబడులకు ఆకర్షణీయంగా ఉండగా ఇంధన, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలు కాస్త ప్రతికూలంగా ఉన్నాయని నాయర్ చెప్పారు.

మరింత దిగొచ్చిన ధరలు


- జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.55%
- 2017 జూన్ తర్వాత కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: కూరగాయలు, ఆహారోత్పత్తులు, ధాన్యాల ధరలు మరింత కిందకు దిగొచ్చాయి. ఫలితంగా జూలై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి అయిన 1.55 శాతానికి పడిపోయింది. 2017 జూన్ నెలలో నమోదైన 1.46 శాతం తర్వాత ఇదే అత్యంత కనిష్ట రిటైల్ ద్రవ్యోల్బణం. ఈ ఏడాది జూన్ నెలలో ద్రవ్యోల్బణం 2.1 శాతంతో పోల్చి చూసినా 0.55 శాతం తక్కువగా నమోదైంది. 2024 జూన్ నెలలో ఇది 3.6%గా ఉంది. ఈ వివరాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ విడుదల చేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు పెరిగిపోయిన తరుణంలో రిటైల్, ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం అన్నది వినియోగదారులతో పాటు విధాన నిర్ణేతలకూ ఉపశమనం కలిగిస్తుందన్నది విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.

- ఆహార విభాగంలో ద్రవ్యోల్బణం (కన్జూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్/సీఎఫ్‌పీఐ) మైనస్ 1.76 శాతానికి క్షీణించింది. జూన్‌లో ఇది మైనస్ 1.01గా ఉంది. 2019 జనవరి తర్వాత ఆహార విభాగంలో అతి తక్కువ ద్రవ్యోల్బణం ఇది. వరి, గోధుమ, చక్కెర, పప్పులు, ధాన్యాలు, కూరగాయలు, గుడ్లు తదితర ఉత్పత్తులు ఈ విభాగం కిందకు వస్తాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం జూలై నెలకు 1.18 శాతంగా నమోదైంది. జూన్‌లో ఇది 1.72 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంత ఆహార ద్రవ్యోల్బణం మైనస్ 1.74 శాతానికి పతనమైంది.
- పట్టణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.05 శాతానికి తగ్గింది.

హిందాల్కో లాభం రూ. 4,004 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 30 శాతం జంప్‌చేసి రూ. 4,004 కోట్లకు చేరింది. అత్యుత్తమ ప్రొడక్ట్ మిక్స్, వ్యయ నియంత్రణ ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 3,074 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 13 శాతం ఎగసి రూ. 64,232 కోట్లను తాకింది. అల్యూమినియంకు అధిక ధరలు లభించడం ఇందుకు దోహదపడింది. గత క్యూ1లో రూ. 57,013 కోట్ల టర్నోవర్ అందుకుంది. యూఎస్ అనుబంధ సంస్థ నోవెలిస్ 1 శాతం అధికంగా 963 కేటీ షిప్‌మెంట్స్‌ను సాధించినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో హిందాల్కో షేరు 0.7% నీరసించి రూ. 667 వద్ద ముగిసింది.

అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు

- ఇంట్రాడేలో తీవ్ర ఒడిదుడుకులు
- సెన్సెక్స్ 368 పాయింట్ల పతనం



ముంబై: అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలతో దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం అరశాతం మేర నష్టపోయాయి. భారత్, అమెరికాల జూలై రిటైల్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. ఫలితంగా సెన్సెక్స్ 368 పాయింట్లు నష్టపోయి 80,235 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు పతనమై 24,487 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 833 పాయింట్ల పరిధిలో 80,164 వద్ద కనిష్టాన్ని, 80,998 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 24,465 – 24,702 శ్రేణిలో ట్రేడైంది. చైనాతో వాణిజ్య ఒప్పందానికి అమెరికా మరో 90 రోజుల విరామం, యూఎస్ జూలై ద్రవ్యోల్బణ ప్రకటన నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- హైవే ఇన్ఫ్రాస్ట్రక్చర్ షేరు లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్ తాకింది. ఇష్యూ ధర (రూ.70)తో పోలిస్తే బీఎస్ఈలో 67% ప్రీమియంతో రూ.117 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 75% ఎగసి రూ.123 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి., అక్కడే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.881 కోట్లుగా నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
సమగ్ర భూ సంస్కరణలు చేపట్టాల్సిందే | రూ.5.82 లక్షల కోట్ల రుణాల మాఫీ

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–తెలంగాణ చరిత్ర » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– జనరల్ ఇంగ్లిష్

జాబ్ పాయింట్

ఎస్‌బీఐలో 6,589 జూనియర్ అసోసియేట్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్–సేల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 6,589 (రెగ్యులర్–5,180+బ్యాక్‌లాగ్–1,409).
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం/సెమిస్టర్ విద్యార్థులు తాత్కాలికంగా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ 31.12.2025 నాటికి లేదా అంతకుముందు గ్రాడ్యుయేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. » వయసు: 01.04.2025 నాటికి 20 ఏళ్ల నుంచి 28 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు రూ.24,050 నుంచి 64,480.
- » ఎంపిక విధానం: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష,స్థానిక భాషా పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.08.2025.
- » వెబ్‌సైట్: https://bank.sbi/web/careers/currentopenings

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 35 షిప్ డ్రాఫ్ట్స్‌మెన్ ట్రైనీ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో వివిధ విభాగాల్లో షిప్ డ్రాఫ్ట్స్‌మెన్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 35.
- » విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిప్లొమాలో ఉత్తీర్ణులై ఉండాలి. » వయసు: 22.08.2025 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
- » స్టైపెండ్:నెలకు రూ.14,000 నుంచి 20,000
- » ఎంపిక విధానం: ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.08.2025.
- » వెబ్‌సైట్: https://cochinshipyard.in

రైట్స్ లిమిటెడ్, గుడ్‌గావ్‌లో రెసిడెంట్ ఇంజనీర్ పోస్టులు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ వెస్ట్రన్ రీజియన్ ఒప్పంద ప్రాతిపదికన రెసిడెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 08.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(సివిల్,మెకానికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » వయసు: 23.08.2025 నాటికి 40 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు రూ.30,627.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష ద్వారా.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.08.2025.
- » హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది: 26.08.2025.
- » రాతపరీక్ష తేది: 30.08.2025.
- » పరీక్ష కేంద్రాలు: ఢిల్లీ/గుడ్‌గావ్/ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బిలాయ్.
- » వెబ్‌సైట్: https://www.rites.com

డిజిటల్ ఇండియా కార్పొరేషన్, న్యూఢిల్లీలో 33 పోస్టులు

న్యూఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 33.
- » పోస్టుల వివరాలు: హెడ్ సెమ్స్–07, సీనియర్ కన్సల్టెంట్–12, కన్సల్టెంట్–14.
- » అర్హత: పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంబీఏ) ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » వయసు: 55 ఏళ్లు మించకూడదు.
- » ఎంపికవిధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.08.2025.
- » వెబ్‌సైట్: https://dic.gov.in

హెచ్‌సీఎస్‌ఎల్‌లో సూపర్‌వైజర్, మేనేజర్ పోస్టులు

హౌరాలోని హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌సీఎస్‌ఎల్) సూపర్‌వైజర్,అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 02.
- » పోస్టుల వివరాలు: సూపర్‌వైజర్–1, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ప్రాజెక్ట్స్–ఆపరేషన్స్)–1.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(హిందీ), పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 26.08.2025 నాటికి సూపర్‌వైజర్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.08.2025.
- » వెబ్‌సైట్: https://cochinshipyard.in

హెచ్‌సీఎస్‌ఎల్‌లో జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

హౌరాలోని హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌సీఎస్‌ఎల్).. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 05.
- » పోస్టుల వివరాలు: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్(మెకానికల్)–03, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్)–02.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 26.08.2025నాటికి 35 ఏళ్లు ఉండాలి.
- » వేతనం:నెలకు రూ.23,500 నుంచి రూ.77,000
- » ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.08.2025.
- » వెబ్‌సైట్: https://cochinshipyard.in

హెచ్‌సీఎస్‌ఎల్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

హౌరాలోని హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌సీఎస్‌ఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 03.
- » పోస్టుల వివరాలు:ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్)–02, ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఎలక్ట్రానిక్స్)–01.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిగ్రీ(మెకానికల్, ఎలక్ట్రానిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » వయసు: 26.08.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.08.2025.
- » వెబ్‌సైట్: https://cochinshipyard.in

ఐబీలో కొలువుల పిలుపు

పదో తరగతి ఉత్తీర్ణతతోనే కేంద్రంలో కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ).. సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 4,987 పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ చేపట్టనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 37 అనుబంధ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ)ల్లో ఈ పోస్టులను భర్తీ చేస్తారు. ఈ నేపథ్యంలో.. ఐబీ సెక్యూరిటీ అసిస్టెంట్ /ఎగ్జిక్యూటివ్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్ 2025
» మొత్తం 4,987 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్
» మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ

- నోటిఫికేషన్: సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్ 2025.
- పోస్టుల సంఖ్య: 4,987(అన్ రిజర్వ్‌డ్–2471, ఓబీసీ–1015, ఎస్సీ–574, ఎస్టీ–426, ఈడబ్ల్యూఎస్–501).
- పోస్టుల వివరాలు: సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్(ఇవి జనరల్ సెంట్రల్ సర్వీస్, గ్రూప్ సి నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ పోస్టులు).

అర్హతలు

గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి తత్సమాన విద్యార్హత ఉత్తీర్ణత ఉండాలి. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన నివాస ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దీంతోపాటు సంబంధిత రాష్ట్రం/ఎస్ఐబీ ప్రాంత భాషలో మాట్లాడటం,రాయడం, చదవడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ క్షేత్రంలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. దేశంలో ఎక్కడైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలి.

వయసు

17.08.2025నాటికి 18–27ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

వేతనాలు

లెవెల్–3లో నెలకు రూ.21,700 –రూ.69,100 వేతన శ్రేణి అందుతుంది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ అలవెన్సులు లభిస్తాయి.

ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియలో భాగంగా టైర్–1లో వంద మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఆన్‌లైన్ టెస్టు ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన వారికి 50 మార్కులకు టైర్–2 డిస్క్రిప్టివ్ టెస్టు, అంతిమంగా టైర్–3లో 50 మార్కులకు ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్టు నిర్వహిస్తారు. టైర్–1, టైర్–3లో అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.

వంద మార్కులకు టైర్ 1 పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలి దశలో వంద మార్కులకు ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుంది. ఇందులో మల్టిపుల్ ఛాయిస్ తరహా ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. జనరల్ అవేర్ నెస్‌లో 20 ప్రశ్నలు–20 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలు –20 మార్కులకు, న్యూమరికల్/అనలిటికల్/లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్‌పై 20 ప్రశ్నలు–20 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 20 ప్రశ్నలు –20 మార్కులకు, జనరల్ స్టడీస్‌పై 20 ప్రశ్నలు–20 మార్కులకు అడుగుతారు. పరీక్ష వ్యవధి ఒక గంట. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కు తగ్గిస్తారు.

ఈ పరీక్షలో కనీస అర్హత మార్కులతోపాటు నిర్దేశిత కటాఫ్ పొందిన వారిని టైర్–2కు ఎంపిక చేస్తారు. టైర్–1లో అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 30 మార్కులు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 25 మార్కులు సాధించాలి.

50 మార్కులకు టైర్ 2 పరీక్ష


టైర్–1లో కనీస అర్హత మార్కులతోపాటు నిర్దేశిత కటాఫ్ పొందిన అభ్యర్థులను టైర్–2కు ఎంపిక చేస్తారు. నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరిస్తారు. ఖాళీలను అనుసరించి ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున టైర్–2కు ఎంపిక చేస్తారు.

టైర్–2లో 50 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్టు ఉంటుంది. ఇందులో అభ్యర్థి ఎంచుకున్న భాష నుంచి ఇంగ్లిష్‌లోకి, లేదా ఇంగ్లిష్ నుంచి అభ్యర్థి ఎంచుకున్న భాషలోకి అనువాదం చేయాల్సి ఉంటుంది. దీనికోసం 500 పదాల ప్యాసేజ్‌ను ఇస్తారు.

పరీక్ష సమయం ఒక గంట. టైర్–2 అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణలోకి తీసుకోరు. కాని 50 మార్కులకు నిర్వహించే టైర్–2 పరీక్షలో అర్హత పొందాలంటే..కనీసం 20 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

తుది ఎంపిక ఇలా

టైర్–2లో అర్హత పొందిన అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ మూడో దశ టైర్–3లో ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. ఒక్కో పోస్టుకు ఐదుగురిని చొప్పున ఎంపిక చేస్తారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. టైర్–1లో వంద మార్కులకు,టైర్–3 లో 50 మార్కులకు అభ్యర్థులు సాధించిన సంయుక్త స్కోర్ ఆధారంగా తుది మెరిట్ లిస్టును రూపొందిస్తారు. ఈ మెరిట్ లిస్టులో నిలిచిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి తుది ఎంపిక ఖరారు చేస్తారు.



జాబ్స్ ఇన్ఫో

ప్రిపరేషన్ ఇలా

- టైర్–1 పరీక్షలోని ఇంగ్లిష్ విభాగంలో రాణించేందుకు గ్రామర్‌తోపాటు వొక్యాబులరీపైనా పట్టు సాధించాలి. సెంటెన్స్ కరెక్షన్, క్లోజ్ టెస్ట్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, జంబుల్డ్ సెంటెన్సెస్, మిస్‌స్పెల్ట్ వర్డ్స్ తదితరాలపై ప్రశ్నలు వచ్చే అవకాశముంది. అదేవిధంగా టైర్–2లోని డిస్క్రిప్టివ్ టెస్ట్‌లోని అనువాదంలో స్కోర్ చేసేందుకు సైతం ఇంగ్లిష్‌పై పట్టు కలిసొస్తుంది.
- టైర్–1 పరీక్షలో కీలకమైన క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో మంచి మార్కుల కోసం అర్థమెటిక్, నంబర్ సిరీస్, సింప్లిఫికేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. 8, 9, 10వ తరగతి గణితం పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత సాధ్యమైనన్ని గత ప్రశ్నలు, మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, డేటా సఫిషియన్సీ అంశాలపై పట్టు సాధించాలి.
- జనరల్ స్టడీస్ విభాగం కోసం భారత చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీకి సంబంధించిన ప్రాథమిక అంశాలతోపాటు జాతీయ, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్‌ను తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 26.07.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 17.08.2025
- వెబ్‌సైట్: http://www.mha.gov.in

పురుగూ.. పుట్రా దేనిదెంత పాత్ర

మంచిర్యాల జిల్లా అడవుల్లో కీటక జాతులపై సర్వే

- ఈగలు, దోమల వంటి జీవుల అధ్యయనం
- జీవ వైవిధ్యంలో ప్రతి జీవి పాత్ర కీలకమే
- జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్



ఆకుపచ్చ సాలెపురుగు



రెడ్ కాటన్ స్టైనర్



కీటకాలను గుర్తిస్తున్న డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నిపుణులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జీవ వైవిధ్యంలో భారీ జీవుల నుంచి కంటికి కనిపించని సూక్ష్మజీవుల వరకు అన్నీ కూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి. అయితే, పెద్ద జంతువుల సంరక్షణపైనే అధికంగా దృష్టి పెట్టి, చిన్న జీవరాశులపై పట్టింపు కరువవుతోంది. గతంలో కవ్వాల్ టైగర్ రిజర్వు (కేటీఆర్)లో చిన్న జీవరాశులను గుర్తించే సర్వే నిర్వహించి జంతువులు, పక్షులు, సీతాకోక చిలుకల్లోనూ విభిన్న రకాలను గుర్తించారు. తాజాగా చిన్న పురుగుల నుంచి కీటక జాతుల వరకు అన్నింటినీ గుర్తించి వాటి వైవిధ్యతను తెలుసుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారులు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్)కు చెందిన నిపుణులు కలిసి సాలెపురుగు, ఈగలు, దోమలు, చీమలు, సీతాకోక చిలుకలు, లార్వాలు, బొంతపురుగులు, పురుగులపై అధ్యయనం చేస్తున్నారు. నేల, చెట్లు, బండ రాళ్లు పెరిగే శైవలాలు, శిలీంధ్రాలు, కీటకాలన్నింటిని రికార్డు చేస్తున్నారు. కీటకాలు చేసే శబ్దాలను రికార్డ్ చేస్తూ వాటి ఫొటోలను చిత్రీకరిస్తున్నారు.

వేలాది చిన్న జీవరాశులు

అడవుల్లోని సూక్ష్మ, చిన్న జీవులను గుర్తించేందుకు బయోబ్లిడ్జ్ ఈ నెల 9, 10వ తేదీల్లో ప్రత్యేక సర్వే నిర్వహించింది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట రేంజ్ పరిధి పాతమంచిర్యాల, గఢ్‌పూర్ అటవీ సెక్షన్లలో రెండు రోజులపాటు ప్రత్యేక సర్వే చేపట్టారు. గాంధారి సఫారీ రోడ్ నుంచి గాంధారి ఖిల్లా, సల్పవాగు, ర్యాలీవాగు, తలమల వాగు పరిసర ప్రాంతాల్లో మూడు బృందాలుగా కీటకాల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఒక్కో బృందం ఐదు కిలోమీటర్ల చొప్పున మొత్తం 15 కి.మీ వరకు అడవుల్లో కలియదిరిగారు. కేవలం ఒక మీటర్ పరిధిలోనే అనేక చిన్న జీవరాశులు, వాటి ఆవాసాలను గుర్తించి వందలాది జీవరాశుల వివరాలు క్రోడీకరించారు. నిశాచర జీవులను గుర్తించేందుకు యూవీ లైట్ బ్యాటరీలను ఉపయోగించి ఓ తెరను కట్టి వాటిని ఆకర్షించారు. ఇతర రేంజ్‌లలోనూ సర్వేకు సిద్ధమయ్యారు.

జీవరాశుల ప్రాధాన్యత గుర్తించేందుకే..



చిన్న జీవరాశులను కాపాడుకోవడం కూడా చాలా ముఖ్యం. పర్యావరణంలో ఒక్కోజీవి పాత్ర ఒక్కో తీరుగా ఉంటుంది. అడవు ల్లో ఉన్న అనేక కీటక జాతులను సైతం గుర్తించి నమోదు చేస్తే, వాటి సంరక్షణకు వీలవుతుంది. భవిష్యత్ తరాలకు ఈ జీవుల ప్రాధాన్యత తెలుస్తుంది.

– శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీ అధికారి, మంచిర్యాల

ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి
- అటవీ నిఘా కెమెరాలు ఐసీసీసీతో అనుసంధానం
- అటవీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని, మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు.. అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున వీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మన దగ్గర అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణవాసులు పులుల సందర్శన కోసం ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అటవీ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్‌లో జూను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకున్న అవకాశాలపై అధ్యయనం చేయాలని పేర్కొన్నారు.

అటవీ జంతువుల దాడి బాధితులకు తక్షణ పరిహారం

అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం అవసరమైతే సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు తీసుకోవాలని చెప్పారు. అడవుల్లో వన్యప్రాణుల కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు, ఉద్యోగాల భర్తీపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పీసీసీఎఫ్ డా. సి.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



గంటన్నరపాటు ఎదురు చూసినా రాని 108

పురుగు మందు తాగిన యువతిని బైక్‌పై ఆస్పత్రికి తరలింపు

గార్ల: పురుగు మందు తాగిన ఓ యువతిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లేందుకు గంటన్నరపాటు ఎదురుచూసినా 108 వాహనం రాకపోవడంతో, బాధితురాలికి సెలైన్ బాటిల్ పెట్టుకొని బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుగులోత్ మేఘమాల (18) ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూం క్లీన్‌చేసే యాసిడ్ తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇరుగుపొరుగు వారు గమనించి ఆ యువతిని బైక్‌పై గార్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేయించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న 108 వాహనం రమ్మంటే కాసేపు డ్రైవర్ లేడని, కాసేపు మరమ్మతుకు గురైందని సిబ్బంది పొంతన లేని సమాధానం చెప్పారు. దీంతో వారు మరో 108 వాహనానికి ఫోన్ చేశారు. గంటన్నర అయినా రాకపోవడంతో గత్యంతరం లేక మేఘమాలకు సెలైన్ బాటిల్ పెట్టించి తన బాబాయ్ బైక్‌పై ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో 108 వాహనం వచ్చింది. దీంతో అంబులెన్స్ సిబ్బంది తీరుపై యువతి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, యువతి పురుగుల మందు తాగడానికి గల కారణాలు తెలియరాలేదు.

తిరుగుడు చింత.. ఏమిటీ వింత

- వేరు పురుగు కారణమన్న ఏరువాక శాస్త్రవేత్త



స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో నీల గట్టయ్య అనే వ్యక్తి ఇంటి ఆవరణలోని చింతమొక్క దానికదే సవ్య, అపసవ్య దిశల్లో తిరుగుతోంది. ఈనెల 11న ఇది గమనించిన గట్టయ్య.. గాలికి తిరుగుతోందనుకుని పెద్దగా పట్టించుకోలేదు. కాగా, మంగళవారం అదే దృశ్యం కనిపించడంతో.. కుటుంబ సభ్యులకు చూపించారు. దీంతో చుట్టుపక్కల వారు చింత మొక్క తిరగడాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. దీనిపై ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సాధారణంగా ఇలాంటి పరిస్థితి వేపమొక్కల్లో కనిపిస్తుందన్నారు. వేరు పురుగు ఆంగ్ల అక్షరం సీ ఆకారంలో ఉండి.. వేరుకు చుట్టుకుని అటూ ఇటూ కదిలిస్తుందని వివరించారు. ఈ చింతమొక్కకు కూడా అదే కారణమై ఉంటుందని అభిప్రాయపడ్డారు. సాధారణంగా 'మెమోజా బుడిక' అనే మొక్కను ముట్టుకోగానే ముడుచుకుంటుందని.. కాసేపటికి సాధారణ స్థితికి వస్తుందని తెలిపారు. ఈ చింతచెట్టు తిరగడానికి వేరుపురుగు కారణమై ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

క్లినికల్ ట్రయల్స్... ఎగ్ డొనేషన్స్!

- డాక్టర్ నమ్రత ఏజెంట్ల నెట్‌వర్క్‌కు మూలాలు ఇవే
- చట్టం నుంచి తప్పించుకోవడానికే వేర్వేరు చోట్ల దందా
- 'సృష్టి'పై ఇప్పటివరకు 9 కేసులు నమోదు
- డాక్టర్లు, నర్సులు, ఏజెంట్లు సహా 25 మంది అరెస్టు
- తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసు సిట్‌కు బదిలీ: డీసీపీ సాధన



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాధన

సాక్షి, హైదరాబాద్: సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత ఏజెంట్ల నెట్‌వర్క్‌ను నార్త్‌జోన్ పోలీసులు ఛేదించారు. ఈ నెట్‌వర్క్‌కు క్లినికల్ ట్రయల్స్ చేసే క్యాంపులతోపాటు అండాన్ని డొనేట్ చేసే మహిళలే మూలమని గుర్తించారు. డాక్టర్ నమ్రతపై గతంలో 15 కేసులు ఉండగా, తాజాగా 9 కేసులు నమోదైనట్లు డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ప్రకటించారు. ఈ కేసుల్లో ఇప్పటివరకు 25 మంది నిందితులను అరెస్టు చేశామని, వీరిలో డాక్టర్లు, నర్సులు, ఏజెంట్లు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఏసీపీ పి.సుబ్బయ్యతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్, కొండాపూర్‌లతో పాటు విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, రాజమండ్రి, భువనేశ్వర్, కోల్‌కతాలో సెంటర్లు నిర్వహిస్తున్న నమ్రత.. దేశవ్యాప్తంగా ఏజెంట్ల నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుందని తెలిపారు.

ఆ క్యాంపుల్లో ఏర్పడిన పరిచయాలతోనే...

వివిధ ఔషధాలు, నూతన వైద్య విధానాలపై అధికారికంగానే క్లినికల్ ట్రయల్స్ జరుగుతుంటాయి. ఇలాంటి క్యాంపులకు వెళ్లే నమ్రత లేదా ఆమె ఉద్యోగులు పురుష వలంటీర్లను ట్రాప్ చేసి ఏజెంట్లుగా మార్చుకున్నారు. అలాగే ఐవీఎఫ్ కేంద్రాల్లో అండం (ఎగ్) డొనేషన్ కోసం వచ్చిన మహిళల్ని తమ దారిలోకి తెచ్చుకుంటున్నారు. వీరిని ఏజెంట్లు గా చేసుకుంటున్నారు. నమ్రతకు ప్రధాన ఏజెంట్‌గా వ్యవహరించిన ధనశ్రీ సంతోషి వివిధ ప్రాంతాల్లో సబ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంది. వీరి ద్వారానే పేద గర్భిణులను గుర్తించి నమ్రత వాడుకుంది.

నకిలీ డీఎన్‌ఏ రిపోర్టులు సృష్టించి...

ఐవీఎఫ్ కోసం సికింద్రాబాద్‌లోని సృష్టి సెంటర్‌కు వచ్చే దంపతుల్లో ఖర్చు పెట్టగలిగేవారిని సరోగసీ వైపు మళ్లించే నమ్రత..వారిని విశాఖపట్నం పంపించి పరీక్షలు చేయించేది. వారి అండం, వీర్యంతోనే సరోగసీ జరుగుతున్నట్లు నమ్మించి.. డెలివరీ సమయానికి ఒప్పందం చేసుకున్న పేద గర్భిణులను తీసుకువచ్చి డెలివరీ చేయించి, ఆ శిశువు సరోగసీ ఒప్పందం చేసుకున్న దంపతులకే పుట్టినట్లు నమ్మించి అప్పగించేది. కన్న తల్లిదండ్రులకు నామమాత్రపు మొత్తం చెల్లిస్తూ శిశువును దత్తత ఇస్తున్నట్లు చెప్పేది. ఇందుకోసం నకిలీ డీఎన్‌ఏ రిపోర్టులు సృష్టించేది. ఈ శిశువుల జనన రిజిస్ట్రేషన్ తదితరాలన్నీ విశాఖలోనే నిర్వహించేవారు. బాధితుల నుంచి నమ్రత రూ.1.6 కోట్లు వసూలు చేసిందని పోలీసులు గుర్తించారు. సరోగసీ పేరుతో ముగ్గురు శిశువుల్ని విక్రయించిన నమ్రత.. మరో కేసులో మాత్రం డెలివరీ సమయంలో శిశువు చనిపోయినట్లు నమ్మించి ఏమాత్రం సంబంధం లేని మృత శిశువును చూపించింది. మరోసారి సరోగసీ చేయాలంటే అదనంగా రూ.15 లక్షలు డిమాండ్ చేసింది. ఈ కేసులో మొత్తం 25 మంది అరెస్టు చేశారు. వీరిలో వైద్యులైన నమ్రత, సదానందం, విద్యుల్లత, ఉషా దేవి, రవిపై ఉన్న 9 కేసుల దర్యాప్తును సీసీఎస్ అధీనంలోని సిట్ బదిలీ చేశారు.

ఆడబిడ్డల ఆచరణకు ప్రతిరూపం మహిళా మార్ట్

'మహిళా మార్ట్' సాక్షి కథనంపై 'ఎక్స్'లో సీఎం



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు ఖమ్మం పూర్వ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో ఏర్పాటుచేసిన మహిళా మార్ట్‌లో అమ్మకాలు నానాటికీ పెరుగుతున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తుండటంతో ఆదరణ లభిస్తోంది. ఈ మేరకు మహిళామార్ట్‌లో లభిస్తున్న ఉత్పత్తులు, మార్కెటింగ్ తదితర అంశాలపై మంగళవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'మహిళా మార్ట్.. బిజినెస్ భేష్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'ప్రజాప్రభుత్వ సంకల్పం.. అధికారుల కార్యాచరణ, ఆడబిడ్డల ఆచరణకు ప్రతిరూపం ఖమ్మంలో దిగ్విజయంగా నడుస్తున్న ఈ మహిళామార్ట్. అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు.. రాష్ట్రంలో ప్రతీ టౌన్‌లో ఇలాంటి మహిళామార్ట్‌లు ఏర్పాటు కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ఈ కథనం క్లిప్పింగ్‌ను జత చేస్తూ సీఎం పోస్ట్ చేశారు.

రూ.13.3 కోట్ల విలువ చేసే గంజాయి పట్టివేత

- హైడ్రోఫోనిక్ గంజాయి స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ అధికారులు
- బ్యాంకాక్ నుంచి తీసుకొచ్చిన మహిళా ప్రయాణికురాలి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఒక మహిళా ప్రయాణికురాలి వద్ద పెద్దమొత్తంలో గంజాయి పట్టుబడింది. బ్యాంకాక్ నుంచి భారీ మొత్తంలో హైడ్రోఫోనిక్ గంజాయి తరలిస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి వస్తున్న భారతీయ మహిళా ప్రయాణికురాలిని సోమవారం అడ్డుకున్నారు. ఆమె బ్యాగేజీని తనిఖీ చేయగా 13.3 కిలోల బరువున్న ఆకుపచ్చని ముద్దపదార్థం ఉన్న 20 ప్యాకెట్లు బయటపడ్డాయి. పరీక్ష చేయగా అది గంజాయిగా నిర్ధారణ అయ్యింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 13.3 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ఆమెను అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్టు తెలిపారు.

హైడ్రోఫోనిక్ గంజాయి అంటే? :

హైడ్రోఫోనిక్ అనేది మట్టి అవసరం లేకుండా పోషక ద్రావణాలతో నీటిలో మొక్కలను పెంచే ఒక వ్యవసాయ పద్ధతి. ఈ పద్ధతిలో మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు నీటిలో కరిగి ఉంటాయి.. మొక్కలు ఆ నీటిని నేరుగా గ్రహిస్తాయి. ఈ పద్ధతిలో విదేశాల్లో పండించిన గంజాయికి డిమాండ్ ఎక్కువగా ఉంది. అత్యంత నాణ్యత ఉండటంతో ఈ రకం గంజాయి కిలో రూ.కోటి వరకు పలుకుతుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు.

5 రోజుల్లో రూ.140 కోట్ల ఆదాయం

- 3.07 కోట్ల టికెట్ల జారీ.. జీరో టికెట్లే 2.09 కోట్లు
- ఐదు రోజుల్లో 2.10 కోట్ల కి.మీ తిరిగిన బస్సులు
- రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీకి రికార్డు రెవెన్యూ



సాక్షి, హైదరాబాద్: టీఎస్ఆర్టీసీ ఆదాయ ఆర్జనలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. కేవలం ఐదు రోజుల్లో రూ.140 కోట్ల ఆదాయాన్ని సాధించింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం నుంచి సోమవారం వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ఉండటంతో బస్సుల్లో అధిక రద్దీ ఉంటుందని ముందుగానే ఊహించి స్పేర్ బస్సులు సహా అన్ని బస్సులను రోడ్డెక్కించింది. సిబ్బందికి సెలవులు, వీక్లీ ఆఫ్‌లు రద్దు చేసి అందరూ విధుల్లో ఉండేలా చూసింది. విశ్రాంతి లేకుండా ఆర్టీసీ సిబ్బంది బస్సులను నడిపి ఐదు రోజుల్లో 3.07 కోట్ల మంది (రిపీటెడ్ ప్యాసెంజర్స్)ని గమ్యస్థానాలకు చేర్చారు. ఐదు రోజుల్లో ఏకంగా 2.10 కోట్ల కిలోమీటర్ల మేర బస్సులు తిరిగాయి. సగటున ఒక్కో బస్సులో 110 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. కొన్ని రకాల సెస్‌లు కూడా కలిపితే ఆదాయం మొత్తం రూ.160 కోట్లకు చేరుకోవటం విశేషం. గత ఏడాది రాఖీ పౌర్ణమితో పోలిస్తే ఈసారి దాదాపు రూ.40 కోట్లు అధికంగా ఆదాయం లభించింది.

మహిళలే అధికం..

ఐదు రోజుల్లో 3.07 కోట్ల టికెట్లు జారీ కాగా, ఇందులో ఉచిత ప్రయాణాలకు సంబంధించిన జీరో టికెట్లు 2.09 కోట్లు కావటం విశేషం. ఈ జీరో టికెట్ల మొత్తం విలువ రూ.76 కోట్లుగా నమోదైంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది. రాఖీ పౌర్ణమి పండుగ రోజైన శనివారం 66.40 లక్షల మంది ప్రయాణించటం ద్వారా సంస్థకు రూ.33.40 కోట్ల ఆదాయం సమకూరింది. సోమవారం 68.45 లక్షల మంది ప్రయాణించగా రూ.32.61 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది రాఖీపౌర్ణమి రోజున 62.86 లక్షల మంది ప్రయాణించగా, టికెట్ల రూపంలో రూ.31.86 కోట్ల ఆదాయం సమకూరింది. 2023లో ఈ మొత్తం రూ.22.65 కోట్లు మాత్రమే కావటం విశేషం.

కర్రీ పఫ్‌లో పాము

- బిత్తరపోయిన కొనుగోలుదారు
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



జడ్చర్ల: ఆకలిగా ఉందన్న పిల్లల కోసం ఒక మహిళ బేకరీలో కొని తీసుకొచ్చిన కర్రీ పఫ్ తింటుండగా.. అందులో పాము కనిపించడంతో హడలిపోయారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన ఈ సంఘటనపై సీఐ కమలాకర్ కథనం మేరకు.. పట్టణంలోని జౌళీనగర్‌లో నివాసం ఉంటున్న శ్రీశైలమ్మ మంగళవారం సాయంత్రం కూతురు, కొడుకు కోసం శ్రీలక్ష్మి అయ్యంగార్ బేకరీలో పిల్లలకు ఒక ఎగ్ పఫ్, కర్రీ పఫ్ కొనుగోలు చేశారు. ఇంటికి తీసుకెళ్లిన తర్వాత కర్రీ పఫ్‌ను తింటుండగా.. పంటికి ఏదో గట్టిగా తగిలింది. దీంతో అనుమానం వచ్చి కర్రీ పఫ్‌ను తెరిచి చూసి బిత్తరపోయారు. నిశితంగా పరిశీలించగా అందులో చనిపోయిన చిన్న పాము కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయాందోళన చెందిన తల్లి శ్రీశైలమ్మ.. కర్రీ పఫ్‌ను తీసుకుని సంబంధిత బేకరీ దగ్గరకు వెళ్లి విషయం చెప్పారు. అయితే ఇవన్నీ మామూలేనని.. తమకు వచ్చిన కూరగాయల్లో చనిపోయిన పాము ఉండి ఉంటుందని బేకరీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో బాధితురాలు తన భర్త శ్రీశైలంతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చామని సీఐ తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

విద్యుత్ స్పాట్ బిల్లర్లకు మరింత ఉపాధి

ప్రస్తుతం 15 రోజులే పని.. రూ.12 వేల రాబడి

మిగతా రోజుల్లోనూ పని.. దినసరి వేతనానికి నిర్ణయం • టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 850 మందికి లబ్ధి



మీటర్ రీడింగ్ తీస్తున్న స్పాట్ బిల్లర్

ఖమ్మం వ్యవసాయం: విద్యుత్ స్పాట్ బిల్లర్లకు ఉపాధిని మరింత మెరుగుపరచాలని టీజీ ఎన్పీడీసీఎల్ నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే సమయంలో స్పాట్ బిల్లర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సంస్థ సీఎండీ వివిధ స్థాయి అధికారులకు సూచనలు చేశారు. విద్యుత్ మీటర్ల రీడింగ్ నమోదు చేసి బిల్లులు జారీ చేసే పనిని.. సంస్థ పలు ఏజెన్సీలకు అప్పగించింది. సదరు ఏజెన్సీలు రీడర్లను నియమించి ఒక్కొక్క మీటర్‌కు రూ.3.14 చొప్పున చెల్లిస్తున్నాయి. తద్వారా రీడర్లకు నెలలో 15 రోజులు మాత్రమే పని ఉంటుండగా.. సుమారు రూ.12 వేల రాబడి ఉంటోంది. మిగిలిన రోజుల్లో వీరికి పని లేకపోగా.. వచ్చే ఆదాయం సరిపోక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యాన తమకు కనీస వేతనం అమలు చేయాలని స్పాట్ బిల్లర్లు ఆందోళన చేస్తుండటంతో విద్యుత్ కార్మిక సంఘాలు బాసటగా నిలుస్తున్నాయి. మరోపక్క సంస్థ సేవలు పెరగడం, ఉన్న ఉద్యోగులు, సిబ్బందిపై పనిభారం పడుతుండటంతో అదనపు సిబ్బంది సేవలు అవసరమయ్యాయి. తద్వారా స్పాట్ బిల్లర్ల సేవలను అవసరమైన పనులకు వినియోగించుకోవాలని ఎన్పీడీసీఎల్ నిర్ణయించింది. సదరు పనుల విధివిధానాలు, అందుకు వేతన చెల్లింపు (పీస్ వర్క్)పై స్పష్టతనిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్పీడీసీఎల్ పరిధిలో సుమారు 850 మందికి పైగా స్పాట్ బిల్లర్లు పనిచేస్తుండగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 150 మంది వరకు ఉంటారు. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో వీరికి ఉపాధి మెరుగుపడి, ఆదాయం పెరగనుంది.

మిగతా రోజుల్లో కూడా..

విద్యుత్ స్పాట్ బిల్లర్లు నెల ఆరంభం నుంచి సుమారు 15 రోజుల వరకు విద్యుత్ మీటర్ల రీడింగ్ తీస్తారు. ఇది పూర్తయ్యే సరికి 17వ తేదీ వస్తుంది. ఆపై ప్రతినెల 18వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అదనపు సేవలకు అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా పనిచేయని, కాలిపోయిన మీటర్లను మార్చడం, మీటర్లకు సీల్ వేయడమే కాక తప్పుడు కేటగిరీలతో విద్యుత్ వినియోగించుకుంటున్న అనుమానిత సర్వీసులను గుర్తించాల్సి ఉంటుంది. అంతేకాక నిర్మాణ పనుల్లో అనుమతి లేకుండా వినియోగిస్తున్న సర్వీసులు, కేటగిరీ - 2, 3కి సంబంధించి పెండింగ్ బిల్లుల(3 నెలలకు మించినవి)ను గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక గృహజ్యోతిలో 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించుకుంటూ బిల్లులు చెల్లించని సర్వీసులు, మీటరు లేకుండా విద్యుత్ పొందుతున్న వారి గుర్తింపు, అనుమతులు లేకుండా స్తంభాలను వినియోగించుకుంటున్న కేబుల్, ఇంటర్‌నెట్ సంస్థలను గుర్తించడమే కాక ఇళ్లలో ఉన్న మీటర్లను బయటకు మార్చే పనులను స్పాట్ బిల్లర్లతో చేయించనున్నారు.

దినసరి చెల్లింపు విధానం

స్పాట్ బిల్లర్లు నిర్వహించే అదనపు పనులకు దినసరి వేతనం చెల్లించాలని సంస్థ నిర్ణయించింది. రోజుకు 8 మీటర్ల (పనిచేయని, కాలిపోయిన, మరో చోటికి)ను మార్చేందుకు అవకాశం కల్పించారు. నిత్యం 86 మీటర్లకు సీల్ వేయడం, నిత్యం 86 మీటర్లను పర్యవేక్షించే పనులకే అనుమతి ఇవ్వనుండగా.. ఈ పనుల కేటాయింపును సెక్షన్ అధికారులు నిర్ణయిస్తారు. ఇదే సమయాన బిల్లులు, బకాయిల వసూళ్లకు ఎట్టి పరిస్థితుల్లో స్పాట్ బిల్లర్లను వినియోగించరాదని సంస్థ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కాగా, స్పాట్ బిల్లర్లకు అప్పగించే పనులను మూడు నెలల పాటు పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించి.. ఆ తదుపరి పొడిగింపుపై నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. రోజువారీ చెల్లింపులపై త్వరలోనే స్పష్టత రానుంది.

ఆర్టిజన్లుగా గుర్తిస్తే మేలు



స్పాట్ బిల్లర్లకు ఉద్యోగ రక్షణ కల్పించాలి. నెలలో 15 రోజులు మీటర్ రీడింగ్ పనిచేస్తున్న మాకు మిగిలిన రోజుల్లోనూ పనులు అప్పగిస్తూ ఉపాధి మెరుగుపరిచే నిర్ణయం మంచిదే. ఇదే సమయాన ఆర్టిజన్లుగా గుర్తించి మిగతా ప్రయోజనాలు అందేలా చూడాలి.

– వీరయ్య, స్పాట్ బిల్లర్, ఖమ్మం

కనీస వేతనాలు అమలు చేయాలి



స్పాట్ బిల్లర్లకు కార్మిక చట్టం, కనీస వేతన చట్టం అమలు చేయాలి. నెలంతా పూర్తి స్థాయిలో పని కల్పించాలనే నిర్ణయం హర్షణీయం. అయితే, ఉపాధికి అనుగుణంగా వేతన సౌకర్యాలూ మెరుగుపరచాలి. సంఘాల ఆందోళనలతోనే బిల్లర్లకు ఉపాధి అవకాశాలు కొంత మెరుగయ్యాయి.

– ఎం.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీయూఈఈయూ

రజిత మరణం తీరని లోటు: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కవయిత్రి, అభ్యుదయ స్త్రీవాద రచయిత్రి అనిశెట్టి రజిత మరణంపై బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొని, పీడిత వర్గాలపై సామాజిక బాధ్యతతో కూడిన సాహిత్యాన్ని అందించిన వరంగల్ బిడ్డ అనిశెట్టి రజిత మరణం.. తెలంగాణకు తీరని లోటని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ గొప్ప ప్రజాస్వామిక సాహితీవేత్తను కోల్పోయిందని, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అనిశెట్టి రజిత మరణంపై ఎమ్మెల్సీ కె.కవిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

చంద్రబాబును మోదీ ప్రలోభపెట్టారు

కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ ఆరోపణ



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రలోభపెట్టి, మద్దతు తీసుకుని ప్రధాని మోదీ గెలిచారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మోదీ వంద శాతం ప్రజల ఓట్లతో ప్రధాని కాలేదన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చామల విలేకరులతో మాట్లాడారు. 'నరేంద్ర మోదీ వందశాతం ప్రజలతో ఓట్లు వేయించుకుని ప్రధాని కాలేదు. మేనేజ్‌మెంట్ పాలిటిక్స్ చేసి ప్రధాని అయ్యారు. ఇందులో భాగంగానే ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ప్రలోభాలకు గురిచేసి, సపోర్ట్ చేయించుకుని గెలిచారు. దేశవ్యాప్తంగా ఆయన (మోదీ)కు ఓట్లు వేసి గెలిపించలేదు. బీజేపీకి వేసిన ఓట్లు ముప్పై శాతమే. ప్రజల్లో వ్యతిరేకత ఉందని గమనించి ఎలక్షన్ కమిషన్‌ను అడ్డుపెట్టుకుని మోదీ ముందుకు వెళ్తున్నారని దీన్నిబట్టి అర్థమవుతోంది' అని చామల వ్యాఖ్యానించారు.

కేసీఆర్ హయాంలో క్రీడలకు ప్రాధాన్యం

రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ హయాంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రోత్సాహంతో గోపీచంద్, పీవీ సింధు, సానియా మిర్జా, నిఖత్ జరీనా, సిరాజ్, మిథాలీరాజ్, సాధుల మేఘన, ఆకుల శ్రీజ తదితరులు అంతర్జాతీయ వేదికలపై ప్రతిభను కనబరిచారని ఆయన గుర్తు చేశారు. దేశంలో గ్రామీణ క్రీడాకారుల్ని గుర్తించి.. వారిని ప్రపంచ వేదికలకు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. 'జాతీయ క్రీడా పాలన బిల్లు - 2025, ఉత్ప్రేరకాల నిరోధక బిల్లు -2025లను మంగళవారం రాజ్యసభలో యువజన, క్రీడల శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ ప్రవేశపెట్టారు. బిల్లులకు బీఆర్‌ఎస్ తరఫున ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. హైదరాబాద్ నగరంలో డోపింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని, క్రీడాకారులకు పోషకాహారాన్ని అందించాలని కోరారు.

రేవంత్.. ఖజానా చోరీపై దృష్టి పెట్టాలి

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్




సాక్షి, హైదరాబాద్: బిహార్‌లో మరోసారి ఓటమి పాలవడం ఖాయమని తెలిసి, ఇండీ కూటమికి భవిష్యత్తు లేదని ఓటు చోరీ గురించి డ్రామా చేస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. ఈ డ్రామాలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా 'ఓటు చోరీ గురించి మాట్లాడతాం, ప్రజల్లోకి వెళ్తాం' అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనలో ఖజానా చోరీ, కుంభకోణాలు రోజురోజుకూ బయటపడుతున్నాయని, ఈ ఖజానా చోరీ అంశంపై ఆయన దృష్టి పెడితే మంచిదని హితవుపలికారు. ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను గందరగోళంలో పడేయడం సరికాదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని గృహ నిర్బంధంలో పెట్టడం ఫాసిజానికి తార్కాణమని ప్రభాకర్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల నాయకులు నిరసనలు తెలపడం సహజమని, వీటి విషయంలో పోలీసులు మితిమీరి అధికార దుర్వినియోగానికి పాల్పడటం దుర్మార్గ వైఖరిని తెలియజేస్తోందన్నారు.

విద్యార్థినుల అస్వస్థతపై నివేదిక ఇవ్వండి

'ఉయ్యాలవాడ'పై సర్కార్‌ను ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం ఉయ్యాలవాడలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో గత నెలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అస్వస్థతకు కారణాలు, ఎంతమంది ప్రభావానికి గురయ్యారు లాంటి వివరాలతో సమర్పించాలని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని, ప్రైవేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణకు కమిటీని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. చట్టప్రకారం స్వచ్ఛమైన, పౌష్టికాహారం అందించాలని, కానీ ప్రభుత్వం సరిగా అమలు చేయని కారణంగానే విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ఎం.రామకృష్ణ వాదనలు వినిపిస్తూ.. రెండు వారాలు సమయమిస్తే వివరాలు అందజేస్తామని చెప్పారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేసింది.



'ఉస్మానియా'పై సమగ్ర నివేదిక సమర్పించండి

గోషామహల్‌కు తరలింపుపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలించే పనులపై సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 26కు వాయిదా వేసింది. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించడాన్ని సవాల్ చేస్తూ స్థానికుడు జి.రాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. స్టేడియం, ఇతర భూమిని వైద్యారోగ్య శాఖకు ఈ ఏడాది జనవరి 30న బదిలీ చేయడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. ఆస్పత్రి నిర్మాణం కోసం ఆ స్థలాన్ని వినియోగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏకపక్షమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 45ను కొట్టివేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు వారం సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఏజీ వినతిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను వాయిదా వేస్తూ, ఈలోగా నివేదిక అందజేయాలని ఆదేశించింది.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపగా.. బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. హోరాహోరీగా సాగిన ఈ కాల్పుల్లో.. డీఆర్‌జీ విభాగానికి చెందిన ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గంగులూరుకు తరలించి.. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తీసుకెళ్లారు. కాగా, వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

పీఆర్ ఆర్‌డీ సిబ్బందికి సెలవులు రద్దు

డైరెక్టర్ సృజన ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: భారీవర్షాలు, వరదల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది విధుల్లో ఉండాలని ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారు. సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అందరూ విధుల్లో చేరాలని సూచించారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులు ఉండవని ఆమె స్పష్టం చేశారు. గ్రామం నుంచి మండలం, జిల్లా స్థాయి వరకు అందరూ విధులకు హాజరై అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. జిల్లాల్లో తమ కిందిస్థాయి సిబ్బంది మొత్తం విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీవోలు, డీపీవోలకు సృజన ఆదేశాలిచ్చారు.

గృహనిర్మాణ శాఖకు ముగ్గురు రెవెన్యూ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ముగ్గురు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వం గృహనిర్మాణ శాఖకు కేటాయించింది. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారిగా ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవిని.. తెలంగాణ గృహనిర్మాణ మండలి కార్యదర్శిగా, వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ.. అశోక్ చక్రవర్తిని గృహనిర్మాణ సంస్థ హైదరాబాద్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, డిప్యూటీ కలెక్టర్ హరికృష్ణను హనుమకొండ ప్రాజెక్టు డైరెక్టర్‌గా డిప్యుటేషన్‌పై నియమించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

త్వరలోనే ఉద్యోగ ప్రకటన: టీపీసీసీ నేత దయాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమంతా ఉద్యోగాల భర్తీ కోసం పూర్తి స్థాయిలో నిమగ్నమైందని టీపీసీసీ నేత చనగాని దయాకర్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ కూడా ఉద్యోగాల భర్తీ విషయంలో పారదర్శకంగా ఉన్నారని చెప్పారు. దయాకర్ మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. డబ్బు సంపాదనకు అలవాటు పడిన కొందరు రాజకీయ శిఖండులు.. నిరుద్యోగులు, ప్రభుత్వానికి మధ్య అగాధాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఏజెంట్లయిన కొందరు.. ఆ పార్టీ ప్రోత్సాహంతో గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారని దయాకర్ ఆరోపించారు.

నిరుద్యోగులు పెయిడ్ ఆర్టిస్టులు కాదు: రాకేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామనే హామీని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న నిరుద్యోగులను బీఆర్‌ఎస్ పెయిడ్ ఆర్టిస్టులు అంటూ కించ పరుస్తోందని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఊరూరా తిరిగి ప్రచారం చేసిన గొంతులను అణచివేస్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో రాకేశ్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ కేలండర్‌పై ప్రశ్నించేందుకు గాంధీభవన్‌కు వెళ్లిన నిరుద్యోగులను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. డిస్ట్రిబ్యూషన్ సెలక్షన్ కమిటీకి డీఎస్సీ పర్యాయపదంలా మారిందని, గ్రూప్–1లో అవకతవకలు, గురుకుల సీట్ల అమ్మకాలపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన జాబ్ కేలండర్ జాబ్‌లెస్‌గా తయారైందన్నారు.

దేవాలయ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు: మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవటంతోపాటు గతంలో కబ్జాకు గురైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఆలయ భూముల పరిరక్షణ ప్రధాన ఉద్దేశంగా రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌కు ఆమె మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. త్వరలో ప్రజలకు ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తామని, తొలుత రీజినల్ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లు ఈఓలుగా ఉండే దేవాలయాల్లో ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ జీతాలతో పనిచేస్తున్న అర్చక ఉద్యోగులకు త్వరలో ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. తదుపరి ధూపదీప నైవేద్య పథకం అర్చకులను కూడా దాని పరిధిలోకి తెచ్చే ఆలోచన ఉందని వెల్లడించారు. ఎనిమిది మంది అర్చకుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను, గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యూటీ చెక్కులను ఈ సందర్భంగా ఆమె అందించారు. ప్రధాన దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించామని చెప్పారు.

లోక్‌సభలో తెలంగాణం

నూతన వేరుశనగ పరిశోధనా కేంద్రం అవసరం లేదు

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రఘువీర్ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం



రఘువీర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: నల్లగొండలో నూతన వేరుశనగ పరిశోధనా కేంద్రం అవసరం లేదని కేంద్ర వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే గుజరాత్‌లోని జూనాగఢ్‌లో జాతీయ స్థాయి ఐసీఏఆర్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్రౌండ్‌నట్ రీసర్చ్ (ఐఐజీఆర్) పనిచేస్తోందని, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ప్రాంతీయ కేంద్రం దక్షిణాది రాష్ట్రాల వేరుశనగ పరిశోధన అవసరాలను తీర్చుతోందని తెలిపింది. తెలంగాణలో వేరుశనగపై ఏఐసీఆర్‌పీ ఆన్ గ్రౌండ్ నట్ ప్రాజెక్ట్ కింద పీజేటీఎస్ఏయూ, హైదరాబాద్‌లో పరిశోధనలు జరుగుతున్నాయని... నల్లగొండ జిల్లా సహా రాష్ట్రానికి అనువైన అధిక దిగుబడి వంగడాలు, సాంకేతికతలు అందిస్తున్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

పశువుల కోసం వెటర్నరీ కేవీకే ప్రతిపాదన లేదు



శివరాజ్ సింగ్ చౌహాన్

నల్లగొండలో 2011 నుంచి కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే) పనిచేస్తోందని, ఇది రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో శాస్త్రీయ సలహాలు అందిస్తోందని చెప్పారు. పశుసంవర్ధకుల కోసం ప్రత్యేక వెటర్నరీ కేవీకే ఏర్పాటు ప్రస్తుతానికి లేదని కేంద్రమంత్రి వివరించారు. అంతేగాక ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ కోసం దేశంలో రెండు జాతీయ స్థాయి సంస్థలు ఉత్తరప్రదేశ్‌లోని ఐసీఏఆర్–ఐఐఎఫ్ఎస్ఆర్, బిహార్‌లోని ఐసీఏఆర్–ఎంజీఐఎఫ్ఆర్ఐ వివిధ ప్రాంతాలకు అనుకూల ఐఎఫ్ఎస్ మోడళ్లను అభివృద్ధి చేశాయని తెలిపారు. తెలంగాణలో రాజేంద్రనగర్‌లో ప్రధాన కేంద్రం, రుద్రూర్‌లో ఉపకేంద్రం, రంగారెడ్డిలో ఆన్‌ఫార్మ్ పరిశోధనా కేంద్రం పనిచేస్తున్నాయని చెప్పారు. ఆరు ప్రోటోటైప్ మోడళ్లలో మూడింటిని రైతుల భాగస్వామ్యంతో రూపొందించి, రాష్ట్రంలోని వివిధ జోన్లకు సిఫారసు చేసినట్లు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

తెలంగాణలో 16 కేవీకేలు, 7 ఐసీఏఆర్ సంస్థలు

దేశవ్యాప్తంగా 113 పరిశోధనా సంస్థలు, 731 కేవీకేలు, 66 రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్నాయని, తెలంగాణలో మాత్రం 16 కేవీకేలు, 7 ఐసీఏఆర్ సంస్థలు, 3 రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని కేంద్రమంత్రి వివరించారు. ఇవి నల్లగొండ వంటి వెనుకబాటు జిల్లాలకు కూడా పరిశోధన, విద్య, విస్తరణ సేవలను అందిస్తున్నాయని శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించారు.

తెలంగాణలో మందగమనంలో పీఎంజీఎస్‌వై పనులు

ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద తెలంగాణలో రహదారి పనులు నెమ్మదించాయని కేంద్రం వెల్లడించింది. 2024–25లో రూ.132.57 కోట్లు మంజూరై, కేవలం 152.89 కి.మీ. రహదారులు మాత్రమే పూర్తయ్యాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాశ్వాన్ తెలిపారు. కాగా తెలంగాణలో గత ఏడాది 492.94 కి.మీ రహదారులు పూర్తయ్యాయని, అప్పట్లో రూ.296.96 కోట్లు కేటాయించామని కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో కేంద్రమంత్రి వివరించారు. అయితే రహదారుల నిర్మాణానికి భూసేకరణ, అడవుల అనుమతులు, కాంట్రాక్టర్ల లోపం, ఎన్నికల కోడ్ వంటి కారణాలు ఆలస్యానికి దారితీశాయని కేంద్రం స్పష్టం చేసింది.

ఐరిస్ కెమెరా టెక్నాలజీపై ప్రతిపాదనలే లేవు..

మానసిక వికలాంగుల గుర్తింపు, భద్రత కోసం తెలంగాణలో ఐరిస్ కెమెరా టెక్నాలజీ వినియోగంపై కేంద్రానికి ఎలాంటి ప్రతిపాదనలు లేవని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇస్తూ, ఈ విషయంలో వరంగల్‌లో పైలట్ ప్రాజెక్టులు లేదా అమలు ప్రణాళికలు లేవని, నిధులు లేదా సాంకేతిక సహాయం ప్రతిపాదించలేదని పేర్కొన్నారు.

ఎంఎన్ఆర్ఈజీఎస్ లబ్ధిదారులు 29.72 లక్షలు



రఘునందన్‌రావు

2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు 7 వరకు తెలంగాణలో 29.72 లక్షల మంది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద ఉపాధి పొందారని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయమంత్రి కమలేశ్ పాశ్వాన్ తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో లబ్ధిదారుల సంఖ్య 2024–25లో 42.44 లక్షలు, 2023–24లో 40.62 లక్షలు, 2022–23లో 45.45 లక్షలుగా ఉన్నట్టుగా బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో కేంద్రమంత్రి వివరించారు. అంతేగాక పథకం నిధులను ఇతర పథకాలకి మళ్లించారన్న నివేదికలు తమ దృష్టికి రాలేదని కేంద్రం స్పష్టం చేసింది. వేతన చెల్లింపులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతున్నాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ఎస్ఆర్ఈ కింద పెండింగ్ బకాయిలు లేవు..

గత నాలుగేళ్లుగా తెలంగాణకు భద్రతా వ్యయాల పథకం (ఎస్ఆర్ఈ) కింద కేంద్ర వాటా (60%) తిరిగి చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆరోపణలను కేంద్ర హోంశాఖ ఖండించింది. 2019–20 నుంచి 2023- 24 కాలానికి సంబంధించిన ఎటువంటి బకాయిలు లేవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇస్తూ, ఎస్ఆర్ఈ పథకం కింద వామపక్ష ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్పీఓలు) తప్పనిసరిగా మాజీ సైనికులు లేదా మాజీ పోలీసులే కావాలన్న నిబంధనను 2024–25 ఆర్థిక సంవత్సరం నుంచి సడలించామని తెలిపారు. ప్రత్యేక పోలీసు అధికారుల సంఖ్యను ప్రస్తుత వామపక్ష ప్రభావిత ప్రాంతాల పరిస్థితుల ఆధారంగా నిర్ణయిస్తామని చెప్పారు.


పసుపు ఎగుమతుల్లో తెలంగాణ వాటా తక్కువ


ప్రపంచ పసుపు ఎగుమతుల్లో భారత్ 58–66% వాటా కలిగి ఉందని కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. 2024–25లో భారత్ నుంచి 1.76 లక్షల టన్నుల పసుపు ఎగుమతై, 341.54 మిలియన్ అమెరికన్ డాలర్లు ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కేరళ ప్రధాన ఎగుమతి రాష్ట్రాలుగా నిలవగా, తెలంగాణ నుంచి కేవలం 2.64 మిలియన్ డాలర్ల విలువైన పసుపు మాత్రమే ఎగుమతైందని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్రమంత్రి వెల్లడించారు. కాగా 2020 నుంచి బంగ్లాదేశ్, యూఏఈ, అమెరికా, మలేసియా, మొరాకో ప్రధాన దిగుమతి దేశాలుగా ఉన్నాయని తెలిపారు. పసుపు నాణ్యత పెంపు, విలువ జోడింపు, అంతర్జాతీయ మార్కెట్ల విస్తరణ కోసం 'జాతీయ పసుపు బోర్డ్' ఏర్పాటు చేసి, రైతులు–ఎగుమతిదారులకు శిక్షణ, సర్టిఫికేషన్ సదుపాయాలు, బయ్యర్–సెల్లర్ మీట్స్ నిర్వహిస్తున్నట్టు కేంద్ర మంత్రి వివరించారు.

మంటపాలు శిథిలం.. మెట్ల దారి అధ్వానం!


శిథిలావస్థలో ఉన్న మంటపం

పెనుకొండ: రాచరిక వైభవానికి సాక్షిగా నిలిచిన సత్యసాయి జిల్లా పెనుకొండ కోటలోని పలు మంటపాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ మంటపాలకు వెళ్లేందుకు గగన్‌మహల్ వెనుక మెట్ల దారి నిర్మించారు. 500 ఏళ్ల క్రితం దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో కొండపైకి వెళ్లే ప్రజలు అత్యవసర సమయంలో ఈ మంటపాల్లో తలదాచుకునేవారు. ప్రస్తుతం మెట్లదారి మొత్తం ముళ్ల కంపల మయమైంది. శిథిలావస్థకు చేరుకున్న దాదాపు 20 మంటపాలను అభివృద్ధి చేయడంతో పాటు, మెట్ల దారిని మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.


మెట్ల దారిలో శిథిలావస్థకు చేరుకున్న మంటపం


కూలడానికి సిద్ధంగా ఉన్న మంటపం


మెట్ల దారిలో చెట్ల మధ్య ఉన్న ఓ మంటపం

క్లుప్తంగా...

షెడ్యూలు ప్రకారమే పోలవరం పనులు
జలవనరుల మంత్రి రామానాయుడు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులు షెడ్యూలు ప్రకారమే జరుగుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మంగళవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 2025 డిసెంబర్ నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వరదల సమయంలో డీవాటరింగ్ చేస్తూ శరవేగంగా పనులు చేస్తున్నామని.. ఎగువ కాఫర్ డ్యాంను బలోపేతం చేసేలా నిర్మిస్తున్న బట్రస్ డ్యాం నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని చెప్పారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు.

కడప సెంట్రల్ జైలుపై విచారణకు కమిటీ

సాక్షి, అమరావతి: కడప సెంట్రల్ జైలులో వైద్య శిబిరం నిర్వహించి.. ఖైదీలను బెదిరించారంటూ వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ విషయంపై ఇప్పటికే రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ విచారణ జరిపి హోం శాఖకు నివేదిక సమర్పించారు. మెడికల్, పోలీస్ తదితర విభాగాల ప్రమేయం ఉందని హోం శాఖ నిర్ధారణకు రావడంతో.. సమగ్ర విచారణ కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో వైఎస్సార్ కడప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కె.నాగరాజు, విజయవాడ జైలు సూపరింటెండెంట్ మహ్మద్ ఇర్ఫాన్, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. నివేదికను హోం శాఖకు సమర్పించాలని పేర్కొన్నారు.

15 నుంచి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ఈనెల 15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన వివిధ శాఖల కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయంలో ప్లాస్టిక్‌కు బదులుగా స్టెయిన్‌లెస్ స్టీల్, గాజు గ్లాసుల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. సచివాలయంలో 4 ఆర్వో ప్లాంట్లు, 32 బాటిల్ డిస్పెన్సింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు ఇండెంట్ పెట్టొద్దని స్పష్టం చేశారు.

'మా సమస్యలను పరిష్కరించండి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మేకలు, గొర్రెల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం కోరింది. ఈ మేరకు ఏపీ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పునర్నియమితులైన డాక్టర్ దామోదర నాయుడిని సంఘం రాష్ట్రాధ్యక్షుడు మోనపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో సంఘం నేతలు మంగళవారం విజయవాడలో కలిశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రుణాల మంజూరులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని డైరెక్టర్‌కు చెప్పారు. త్వరలోనే రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసి గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిద్దామని డైరెక్టర్ చెప్పినట్లు రామకృష్ణ తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో 77 ఎఫ్ఎస్‌టీపీల ఏర్పాటు

సాక్షి, అమరావతి: స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా రూ.115.50 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 77 ఎఫ్ఎస్‌టీపీ (మలం బురద ట్రీట్‌మెంట్ ప్లాంట్లు)లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయా ప్లాంట్ల ఏర్పాట్లకు టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ పనులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు.

ఆయుష్షు పోస్తున్న అవయవ దానం

- అవయవ దానంలో ఏపీ టాప్
- పదేళ్లలో 358 మంది నుంచి అవయవాలు తొలగింపు
- 1,148 మందికి కొత్త జీవితం
- నేడు అవయవ దాన దినోత్సవం



ఆరిలోవ: అవయవ దానంలో రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉంది. జీవన్ దాన్ పేరిట 2015లో అవయవ దాన కార్యక్రమం ప్రారంభమైంది. రోడ్డు, ఇతర ప్రమాదాలకు గురైన వారిలో బ్రెయిన్ డెడ్ అవుతున్న వ్యక్తుల అవయవాలను ఇతరులకు అమర్చి జీవం పోస్తున్నారు. గుండె, కాలేయం, మూత్ర పిండాలు, కార్నియా తదితర అవయవాలను అవసరమైన వారికి అమర్చి కొత్త జీవితం అందిస్తున్నారు. ఇలా సేకరించిన వివిధ అవయవాలను గడచిన పదేళ్లలో 1,148 మందికి అమర్చి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 358 మంది బ్రెయిన్ డెడ్ అయిన వారినుంచి అవయవాలు తొలగించారు. వాటిలో 634 మందికి కిడ్నీలు, 271 మందికి లివర్, 88 మందికి గుండె, 151 మందికి ఊపిరితిత్తులు, ముగ్గురికి పాంక్రియాస్, ఒకరికి స్మాల్ బౌల్ అవయవాలను అమర్చారు.


విమ్స్‌లో ప్రత్యేక సర్జరీలు

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో అవయవ దానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఇటీవల మొదటిసారిగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి ప్రభుత్వ ఆస్పత్రులకు ఆదర్శంగా నిలిచింది. ఇంతవరకు విమ్స్‌లో నాలుగు బ్రెయిన్ డెడ్ కేసులకు సర్జరీలు నిర్వహించి అవయవాలను స్వీకరించారు. విమ్స్ ఆస్పత్రిని ఆదర్శంగా తీసుకొని కేజీహెచ్ తదితర ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా బ్రెయిన్ డెడ్ కేసులను గుర్తించి అవయవాలను స్వీకరించగలిగితే మరింత మందికి ప్రాణాలు కాపాడవచ్చని జీవన్‌దాన్ ప్రతినిధులు చెబుతున్నారు.

అవయవాల కోసం 5 వేలమంది ఎదురుచూపు

రాష్ట్రంలో జీవన్‌దాన్ కింద 5 వేల మంది అవయవాలు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికులు కిడ్నీ కోసమే దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అవయవాలు స్వీకరించటం కోసం 81 ఆస్పత్రులు మాత్రమే పేర్లను నమోదు చేసుకున్నాయి. వాటిలో సగం ఆస్పత్రులు ఇంతవరకు ఒక్క బ్రెయిన్ డెడ్ కేసునూ ప్రకటించలేదని జీవన్‌దాన్ ప్రతినిధులు చెప్తున్నారు.

మరింతమంది ముందుకు రావాలి



అవయవ దానం చేయడానికి మరింతమంది ముందుకు రావాలి. రాష్ట్రంలో 358 మంది నుంచి 1,148 అవయవాలు స్వీకరించాం. వాటిని అవసరమైన వారికి అమర్చాం. ప్రస్తుతం సమారు 5 వేల మంది అవయవాలు అవసరమైన వారు ఉన్నారు. అవయదానంపై ప్రజల్లో మరింతగా అవగాహన కలిగించాల్సి ఉంది. అవయదానం చేసిన వారి మృతదేహానికి అంత్యక్రియలు జరుపుకోవడం కోసం రూ.10 వేల అందించి ప్రభుత్వ అధికారుల చేత ఘన నివాళులు అర్పిస్తున్నాం. విమ్స్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశాం. త్వరలోనే అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు స్వీకరించే కార్యక్రమం చేపట్టనున్నాం.

– డాక్టర్ కె.రాంబాబు, కో–ఆర్డినేటర్, జీవన్‌దాన్, విమ్స్ డైరెక్టర్

రేషన్ బియ్యం రవాణాపై సిట్ సభ్యులుగా పదిమంది
హోంశాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రేషన్ బియ్యం రవాణాపై నమోదు చేసిన అక్రమ కేసు విచారణకు చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో పదిమందిని సభ్యులుగా నియమించారు. ఇప్పటికే సిట్ చీఫ్‌గా ఐజీ ఆకే రవికృష్ణను నియమించిన ప్రభుత్వం ఇప్పుడు పదిమంది అధికారులు, సిబ్బందిని నియమించింది. డీఎస్పీ వై.శ్రీనివాసరావు, సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్.ఐ. టి.వి.ఎస్.ఎన్.శ్యామ్‌సుందర్, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లను సభ్యులుగా నియమిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ అక్రమ కేసులో తాము చెప్పినట్టుగా దర్యాప్తు నివేదిక ఇవ్వాలని గతంలో సిట్ చీఫ్‌గా ఉన్న ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్‌పై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. అందుకు ఆయన సమ్మతించకుండా దీర్ఘకాలిక సెలవు పెట్టారు. అనంతరం కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు.

మద్యం అక్రమ కేసు సిట్‌కు మరో రూ.కోటి

మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసును విచారిస్తున్న సిట్‌కు ప్రభుత్వం అదనంగా రూ.కోటి మంజూరు చేసింది. ఈమేరకు హోం శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

'సచివాలయ' ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు
చైర్మన్‌గా బూరాడ మధుబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తోన్న 19 శాఖల సంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటైంది. విజయవాడలో మంగళవారం ఆయా సంఘాల కార్యవర్గ సభ్యులు సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధుబాబు, అసోసియేట్ చైర్మన్‌గా జగదీష్ బాబు, సెక్రటరీ జనరల్ జి.రాజ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పిల్లి హరీష్, ట్రెజరర్ గా సురేంద్ర, పబ్లిసిటీ సెక్రటరీగా నరసింహారావు, కో చైర్మన్లుగా వెంకటేశ్వర్లు, సంగయ్య, యేసురత్నం, రవి, సురేష్ ఎన్నికయ్యారు. వచ్చే రెండు నెలల్లో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను ఐక్యం చేస్తూ జోన్ల వారీగా మహాసభలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పీ–4 కార్యక్రమంలో భాగంగా బలవంతంగా గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను మార్గదర్శులుగా మారమని చెప్పడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

'స్వచ్ఛాంధ్ర' అవార్డులకు సర్వే

సాక్షి, అమరావతి : స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలకనుగుణంగా స్వచ్ఛత ప్రమాణాలు పాటించే సంస్థలకు ఈ ఏడాది 'స్వచ్ఛాంధ్ర అవార్డు'లను అందించనున్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రులు, పర్యాటక ప్రదేశాలు, పరిశ్రమలు, బస్ స్టేషన్లు, పార్కులు, దేవాలయాలు, రైల్వే స్టేషన్లు తదితర సంస్థలకు ర్యాంకింగ్ ఆధారంగా అక్టోబర్ 2న పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఆయా సంస్థలు జిల్లాల వారీగా సెల్ఫ్ అసెస్‌మెంట్స్ సమర్పించాక బెస్ట్ ప్రాక్టీస్ చేసిన వాటిని ఎంపిక చేస్తారు. వీటిని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న స్వతంత్ర సంస్థతో సర్వే చేయించి ర్యాంకింగ్ ఇవ్వనున్నారు. దీనికి అనుగుణంగా అవార్డులను ప్రదానం చేస్తారు. టెండర్ ప్రక్రియ ద్వారా స్వతంత్ర ఏజెన్సీని ఎంపిక చేయనున్నట్టు ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ నెల 16న ఆయా సంస్థల ర్యాంకులు ప్రకటించి, వచ్చే నెల 10 నుంచి 20వ తేదీ వరకు ఫీల్డ్ అసెస్‌మెంట్ చేస్తారు. అనంతరం సెప్టెంబర్ 25 నాటికి ర్యాంకింగ్స్ తుది జాబితా రూపొందించి, అక్టోబర్ 2న అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీని ఆదేశించారు.

పొల్లూరు.. సరిలేరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ముందుచూపు ఫలితం

తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్దదిగా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం గుర్తింపు పొందనుంది. 460 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ కేంద్రంలో రెండో దశలో చేపట్టిన రెండు యూనిట్ల నిర్మాణ పనులు వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తిచేసే లక్ష్యంతో ఏపీ జెన్‌కో అధికారులు వేగవంతం చేశారు. ఇవి పూర్తయితే ఉత్పాదన సామర్థ్యం 690 మెగావాట్లకు పెరగనుంది.

- 460 మెగావాట్ల నుంచి 690 మెగావాట్ల ఉత్పాదన లక్ష్యంగా జలవిద్యుత్ కేంద్రం అడుగులు
- వచ్చే మార్చి నాటికి పూర్తిచేసేలా శరవేగంగా పనులు


పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నిర్మాణ పనులు

మోతుగూడెం: లోయర్ సీలేరు కాంప్లెక్స్‌లోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం ఆధునీకీకరణ పనులు వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేసే లక్ష్యంతో శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పటివరకు 115 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయి. వీటితోపాటు మరో రెండు యూనిట్ల నిర్మాణానికి ప్రాజెక్ట్ ప్రారంభం (1977)లోనే గ్రౌండ్ లెవెల్, స్ట్రక్చర్ సివిల్ పనులు పూర్తి చేశారు.

గత ప్రభుత్వంలో రూ.536 కోట్ల కేటాయింపు

రాష్ట్ర విభజన తరువాత డిమాండ్‌కు తగినంత విద్యుత్ ఉత్పత్తి లేకపోవడంతో అధిక ధరలకు ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుచూపుతో ఇదే ప్రాజెక్ట్‌లో ఉత్పత్తి సామర్థ్యం పెంచే లక్ష్యంతో ప్రణాళికపరంగా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అదనంగా అదే సామర్థ్యంతో 5,6 యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందుకు రూ.536 కోట్లు వెచ్చించింది. రెండేళ్ల క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖల నుంచి అనుమతులు రావడంలో జాప్యం జరిగింది. దీనిపై ప్రత్యేకదృష్టి సారించిన గత ప్రభుత్వం నిర్మాణ పనులను వేగవంతం చేసింది. రెండు యూనిట్లకు సంబంధించి ఇప్పటివరకు సివిల్, పెన్‌స్టాక్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి.

- ఐదో యూనిట్‌కు సంబంధించి సివిల్ పనులు ఫ్లోర్ శ్లాబ్ వరకు జరిగాయి. కీలకమైన స్పారల్ కేసింగ్, స్టీరింగ్ ఎరెక్షన్ పనులు పూర్తయినట్టు జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.
- ఆరో యూనిట్‌కు సంబంధించి సివిల్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వాల్వు హౌస్ నుంచి టెర్మినల్ యాంకర్ వరకు పెన్‌స్టాక్ పైపులైను నిర్మాణం పూర్తయింది. జనరేటర్ అసెంబ్లింగ్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. బీహెచ్ఈఎల్ అధికారుల నిరంతర పర్యవేక్షణలో జరుగుతున్నాయి.
- ఐదు, ఆరు యూనిట్లకు సంబంధించి కీలకమైన విడి భాగాలు కంపెనీ నుంచి పవర్ హౌస్‌కు అనుకున్న సమయానికి వచ్చేలా ఏపీ జెన్‌కో అధికారులు ఏర్పాట్లు చేశారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా వచ్చే మార్చినాటికి పనులు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రాజెక్ట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ తెలిపారు. పనులకు అంతరాయం లేకుండా నిరంతరాయంగా జరిగేలా బీహెచ్ఈఎల్, పీఎస్ కంపెనీ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నాం.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయకపోవడంపై పిటిషన్
వివరాలు సమర్పించాలని ఉద్యాన వర్సిటీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ధ్యానముద్ర కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని విశ్వవిద్యాలయ వర్గాలు మార్చుకోవడాన్ని సవాలు చేస్తూ మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు కోసం తన నుంచి రూ.4 లక్షల విరాళం తీసుకుని పనులు కూడా మొదలుపెట్టిన విశ్వవిద్యాలయ అధికారులు అకస్మాత్తుగా పనులు ఆపేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. వైఎస్సార్ విగ్రహం స్థానంలో రైతు దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారని తెలిపారు. ఈ విషయంలో అధికారులు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయకూడదని ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని ఆయన కోర్టును కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం పూర్తి వివరాలను సమర్పించాలని విశ్వవిద్యాలయం అధికారులను ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

కేంద్రం సహకారంతో నూతన హాస్టల్ భవనాలు
మంత్రి డీబీవీ స్వామి వెల్లడి

సాక్షి, అమరావతి: కేంద్రం సహకారంతో రాష్ట్రంలో నూతన హాస్టల్ భవనాల నిర్మాణం చేపడతామని రాష్ట్ర మంత్రి డీబీవీ స్వామి చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం ఆయన రీజినల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో హాస్టల్స్ కోసం రూ.300 కోట్లు కేటాయించామని, ఆ నిధులలో వసతి గృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు, భవనాల నిర్మాణానికి రూ.100 కోట్లకు పైగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.50 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఈ ఏడాది నుంచి పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు కార్పెట్, టవల్స్, బెడ్ షీట్స్ అందిస్తున్నామన్నారు. త్వరలో విశాఖ, తిరుపతిలో రీజనల్ వర్క్ షాపులను ఏర్పాటు చేస్తామన్నారు.

'స్వాతంత్య్ర పోరాటంలో ఉర్దూ భాష పాత్ర'పై పోటీలు
రాష్ట్ర మంత్రి ఫరూక్ వెల్లడి

సాక్షి, అమరావతి: 'భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉర్దూ భాష పాత్ర' అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ఉర్దూ అకాడమీ నేతృత్వంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, విద్యా శాఖల సంయుక్త నిర్వహణలో భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉర్దూ భాష పాత్ర అంశంపై పోటీలను ఈ నెల 13, 14వ తేదీల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతోపాటు మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రదానం చేస్తామని వెల్లడించారు.

ఓటర్లను అడ్డుకోవడం దారుణం
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సీపీఎం నేత శ్రీనివాసరావు

కదిరి టౌన్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఓటు వేయడానికి వెళుతున్న ఓటర్లకు అడ్డుపడి.. వారు ఓటు వేయకుండానే పోలీసులు వెనక్కి పంపడం, వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను బయటకు పంపి.. వారిపై దాడులు చేయడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపాలని కోరారు.

ఉద్యాన వర్సిటీతో అవగాహనా ఒప్పందాలు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో 4 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. బయోఫాక్ ఇన్పుట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) డా. కేఎల్ఎన్ రెడ్డి, మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్, జినోమిక్స్ సీఎఆర్ఎల్, ప్రైవేట్ లిమిటెడ్(పులివెందుల) ప్రెసిడెంట్ సీఈవో డాక్టర్ రత్నగిరి పోలవరపు, సిస్ఇన్నోవా ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్(విజయవాడ) ఎండీ మహేష్‌లతో వర్సిటీ వీసీ డాక్టర్ గోపాల్ పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఉద్యానవన సాగు, మొక్కల ఆరోగ్యం, పంట కోత తర్వాత సాంకేతికత బలోపేతం, డ్రోన్లు, జీపీ ఆధారిత పద్ధతులు, ఇమేజ్ ప్రాసెసింగ్, నానో–టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించేందుకు ఆయా సంస్థలు ఉద్యాన వర్సిటీకి సహకారం అందించనున్నాయి.

ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ

సాక్షి, అమరావతి: వైద్య శాఖలో పనిచేసే ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ, ఆరు నెలల ప్రసూతి సెలవులు మంజూరు చేస్తూ మంగళవారం వైద్య శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఆశాలు పనిచేసిన కాలానికి సంవత్సరానికి గరిష్టంగా రూ.5వేలు చొప్పున పదవీ విరమణ చేసే ప్రతి ఒక్కరికి రూ.1.50 లక్షలు చెల్లించాలని నిర్ణయించినట్టు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వెల్లడించారు. అలాగే, పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచినట్టు వివరించారు. ఒక్కో ప్రసవానికి 6 నెలలు చొప్పున మొదటి 2 ప్రసవాలకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తామన్నారు. కాగా, ఆశా వర్కర్లు పోరాడి తమ డిమాండ్లను సాధించుకోవడం గర్వకారణమని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పేర్కొంది. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబును మంగళవారం కలిసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి ఎ.కమల, రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపినట్టు యూనియన్ నేతలు ప్రకటన విడుదల చేశారు.

డీస్లడ్జింగ్ వాహనాల పరిశీలన కమిటీలు


సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సఫాయి కర్మచారులకు గతంలో ఇచ్చిన 114 డీస్లడ్జింగ్ వాహనాల నిర్వహణను పరిశీలించేందుకు, అవసరమైతే ప్రత్యామ్నాయ లబ్ధిదారులను ఎంపికచేసేందుకు ప్రభుత్వం జిల్లాస్థాయి కమిటీలను నియమించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి జిల్లాలోను జాయింట్ కలెక్టర్ (జేసీ) చైర్మన్‌గా, సాంఘిక సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) మెంబర్ కన్వీనర్‌గా ఉండే కమిటీలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ, జిల్లా సహకార అధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ, మునిసిపల్ కమిషనర్, అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. డీస్లడ్జింగ్ యంత్రాల సమర్థ వినియోగం, వాయిదాల చెల్లింపు, ఇతర సమస్యలు ఉన్న వాటిని గుర్తించి ఈ కమిటీలు ప్రత్యామ్నాయ లబ్ధిదారులను ఎంపిక చేస్తాయి.

సాగుబడి

ఆశ్లేష కార్తె: ఆగస్ట్ 16 వరకు
మఖ కార్తె: ఆగస్ట్ 17 నుంచి



World Geographical indications, 2023



విలక్షణత, వారసత్వ గుర్తింపు కలిగి ఉన్న విశిష్ట ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు ఉంటే బాగుంటుంది. ఆ గుర్తింపును బట్టి ఆ ఉత్పత్తి ఏ భౌగోళిక ప్రాంతానికి చెందినదో తెలుస్తుంది. తద్వారా ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాలు చేకూరతాయి. ఇందు కోసమే భౌగోళిక సూచిక (జాగ్రఫికల్ ఇండికేషన్స్-జీఐ)లు కేటాయించే ప్రక్రియ అంతర్జాతీయంగా అమల్లో ఉంది. జీఐ ఉన్న ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర కూడా వస్తుంది. భారత్‌లో 2004 నుంచి జీఐల కేటాయింపు మొదలైంది. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన ఎక్కువగా ఉన్న అధికాదాయ, ఉన్నత మధ్యతరహా ఆదాయ దేశాల్లో ఎక్కువ జీఐలు నమోదవుతున్నాయి. చైనా, యూరోపియన్ యూనియన్‌లో ఫ్రాన్స్ వంటి దేశాలు ఇప్పటికే వేల కొలదీ ఉత్పత్తులకు జీఐలు ఇచ్చాయి. జీఐ జాబితాలో వైన్స్, స్పిరిట్స్‌ది అగ్రస్థానం. తర్వాతే వ్యవసాయ, ఆహారోత్పత్తులు. 2024 నాటికి మన 643 ఉత్పత్తులకు మాత్రమే జీఐ గుర్తింపు ఉంది. తెలుగు రాష్ట్రాల్లో మరీ తక్కువ. చేతి వృత్తి కళాకారులు తయారు చేసే ఉత్పత్తులు, వ్యవసాయోత్పత్తులు మన దేశంలో ఎక్కువగా జీఐ గుర్తింపు పొందాయి. ఇతర రంగాల్లో విలక్షణ ఉత్పత్తులపై మనం ఇంకా దృష్టి సారించాల్సి ఉందంటున్నారు నిపుణులు. ప్రాంతీయ వారసత్వ సుసంపన్నతను పరిరక్షించుకోవటానికి, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి జీఐ గుర్తింపును సోపానంగా మార్చుకోవాలి. జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులను ప్రధాన మార్కెట్లలోకి అందుబాటులోకి తెచ్చే మౌలిక సదుపాయాల కల్పనపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.. ఈ ఏఐ యుగంలో జీఐ లోకంలో అభివృద్ధి మార్గాలేమిటో తొంగి చూద్దాం రండి..!

GI జోష్..!

మేధో సంపత్తి (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ- ఐపీ) హక్కులు అనేవి మానవ మేధస్సు నుంచి వెలువడే ఉత్పత్తులను, వాటి సృష్టికర్తల ప్రయోజనాలను కాపాడే ప్రపంచవ్యాప్త చట్టబద్ధత కలిగిన ఒక వ్యవస్థలో భాగం. ఈ మేధో ఆస్తులను ఉపయోగించుకునే హక్కు, నియంత్రించే హక్కు ఎవరికి ఉంది? ఎవరి నుంచి అనుమతి ఎలా పొందవచ్చో జీఐ తెలియజేస్తుంది. ట్రేడ్‌మార్క్‌లు, భౌగోళిక సూచికలు.. రెండూ ఐటెంటిఫయ్యర్లుగా, డిఫరెన్షియేషన్ టూల్స్‌గా పనిచేస్తాయి. ట్రేడ్‌మార్క్‌లు ఉత్పత్తి వ్యాపార మూలాన్ని సూచిస్తాయి. అయితే జీఐలు దాని భౌగోళిక మూలాన్ని సూచిస్తాయి.

భౌగోళిక సూచికలు (జీఐలు) నిర్దిష్ట ప్రాంతాలకు సంబంధించిన ఉత్పత్తులకు ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీఓ) మార్గదర్శకాలకు అనుగుణంగా చట్టపరమైన రక్షణను అందిస్తాయి. ఉత్పత్తుల ప్రత్యేక లక్షణాలను, వారసత్వాన్ని జీఐలు ఎత్తి చూపుతాయి. సాంప్రదాయ ఉత్పత్తులను రక్షించడానికి, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడానికి, మార్కెట్‌లో ఉత్పత్తి నాణ్యతను నిర్ధారించడానికి సాధనాలుగా పనిచేస్తున్నందున జీఐల ప్రాముఖ్యత పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా వైన్‌లు, స్పిరిట్‌లు జీఐలలో అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి. భారతదేశంలో జీఐ రంగంలో వ్యవసాయ వస్తువులు, హస్తకళల ఉత్పత్తులదే పైచేయి.

భారతదేశ మేధో సంపత్తి చట్టం నాలుగో షెడ్యూల్ ప్రకారం, వస్తువులను 34 తరగతులుగా వర్గీకరించారు. దీనిలో 31వ తరగతి వ్యవసాయ, ఉద్యానవన, అటవీ ఉత్పత్తులు, ఇతర తరగతులలో చేర్చని ధాన్యాలు, జంతువులు, తాజా పండ్లు, కూరగాయలు, విత్తనాలు, మొక్కలు, పువ్వులు, జంతువుల ఆహార పదార్థాలు, పులియబెట్టిన పదార్థాలు, మాల్ట్ ఉన్నాయి.

పర్మిజియానో రెగ్జియానో, షాంపైన్ వంటి మద్యం ఉత్పత్తులతో యూరోపియన్ యూనియన్ (ఈయూ) జీఐ వ్యవస్థలో ముందంజలో ఉంది.

పూర్వం నుంచి ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్ జీఐ ఉత్పత్తుల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అయితే, చైనా, భారత్ వంటి దేశాలు జీఐలను ఆర్థిక అభివృద్ధి సాధనాలుగా గుర్తించటంలో, ఉపయోగించడంలో ఇటీవల కాలంలో గణనీయమైన పురోగతి సాధించాయి. పెద్దగా ప్రసిద్ధి చెందని వ్యవసాయ, ఆహార ఉత్పత్తులకు ప్రపంచ ఖ్యాతిని తేవటంలో, పోటీని పెంచటంలో జీఐలు ఉపయోగపడతాయి. వియత్నాం, దక్షిణ కొరియా, ఇండోనేషియా వంటి దేశాలు ప్రపంచ మార్కెట్లలో తమ ఉత్పత్తుల విలక్షణతను చాటి చెప్పటానికి జీఐలను ఎక్కువగా ఉపయోగించుకున్నాయి. వియత్నాంలో స్థిరమైన గ్రామీణ అభివృద్ధికి జీఐలు సానుకూలంగా దోహదపడ్డాయి.

1999 చట్టంతో శ్రీకారం

ప్రపంచవ్యాప్తంగా సమాజాల సాంస్కృతిక పరిరక్షణ, ఆర్థిక వృద్ధికి జీఐలు కీలకమైన సాధనాలుగా మారాయి. మన దేశ జీఐ ప్రయాణం భౌగోళిక వస్తువుల సూచికలు (రిజిస్ట్రేషన్ మరియు రక్షణ) చట్టం-1999తో ప్రారంభమైంది. ఇది 2004లో 20 ఏళ్ల క్రితం అమల్లోకి వచ్చింది. మొదటి జీఐ ట్యాగ్ డార్జిలింగ్ టీకి లభించింది. అప్పటి నుండి భారతదేశం జీఐ రిజిస్ట్రేషన్లలో వేగవంతమైన వృద్ధిని సాధించాం. ప్రధానంగా సాంప్రదాయ వస్తువులను రక్షించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పెంపొందించడం జీఐ ట్యాగ్‌ల ద్వారా కొంతమేరకు సాధ్యపడుతోంది. స్థానిక సమాజాలు తరచుగా పర్యావరణ అనుకూలమైన సాంప్రదాయ పద్ధతులను పరిరక్షించటంపై దృష్టి సారించడంతో జీఐ గుర్తింపు అటువంటి ఉత్పత్తి పద్ధతులను వెలుగులోకి తెస్తోంది.

సవాళ్లెన్నో..

జీఐ వ్యవస్థకు ఈ సానుకూల పరిణామాలు ఉన్నప్పటికీ, భారతదేశంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఉత్పత్తిదారులు, వినియోగదారులలో జీఐలపై అవగాహన, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, తక్కువగా ఉంది. జీఐలను నమోదు చేయడం, అమలు చేయడం సంక్లిష్టంగా ఉండటంతో పాటు ఇది ఖరీదైన వ్యవహారంగా మారిపోవటం చిన్న ఉత్పత్తిదారులకు ప్రతిబంధకాలుగా మారాయి. అయితే, ఆశావహ భవిష్యత్తు కూడా కనిపిస్తోంది. స్థానిక ఆర్థిక వ్యవస్థలను, సుస్థిరతను ప్రోత్సహించడంలో జీఐ పాత్రకు గుర్తింపు పెరుగుతోంది. అంతేకాకుండా, భౌగోళిక గుర్తింపు ఉన్న ఉత్పత్తుల ట్రేసబిలిటీ, ధృవీకరణను పెంపొందించడానికి డిజిటల్ టెక్నాలజీలను వాడుకుంటే.. అది మార్కెట్ విస్తరణకు కొత్త అవకాశాలను తెరుస్తుంది.

వాణిజ్య ఒప్పందాల్లో రక్షణ అవసరం

మన దేశంలో ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర ఉత్పత్తులకు జీఐ గుర్తింపు పొందటంలో ముందంజలో ఉన్నాయి. అయితే, ఇతర దేశాలతో పోల్చితే జీఐల నమోదు ప్రక్రియ మన దేశంలో ఊపందుకోలేదని చెప్పొచ్చు. చిన్నస్థాయి ఉత్పత్తిదారులకు సులువుగా అర్థమై, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకోగలిగేలా జీఐ ప్రక్రియను సరళీకృతం చేయాలన్న వాదన ఉంది. అయితే, జీఐ గుర్తింపు ఇవ్వటంతోనే రైతులకు ఒరిగేదేమీ ఉండదు. రిజిస్ట్రేషన్ తర్వాత మద్దతు అవసరం. అప్రమత్తంగా ఉండాల్సిన ఒక విషయమేమిటంటే.. జీఐ గుర్తింపులు పొందటం గుత్తాధిపత్యానికి దారితీసే పరిస్థితులను ఒక కంట కనిపెట్టాలి. ఎందుకంటే, ఆ ధోరణి చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టదాయక పరిస్థితులకు దారితీసే ముప్పు ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల్లో జీఐ ఉత్పత్తులకు తగిన రక్షణ ఉండేలా పాలకులు రక్షణాత్మక జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే అంతర్జాతీయ మార్కెట్లలో మన జీఐ ఉత్పత్తులు రాణించగలుగుతాయి. చిన్నస్థాయి ఉత్పత్తిదారుల సవాళ్లను అంతర్జాతీయ, జాతీయ శక్తులు పరిష్కరించి, సాంకేతిక అభివృద్ధిని జోడించినప్పుడే జీఐ ద్వారా ఆర్థికాభివృద్ధిని అందిపుచ్చుకోవటం సాధ్యమవుతుంది. ఆర్థికాభివృద్ధితో పాటు ప్రాంతీయ విలక్షణ సాంస్కృతిక వారసత్వంతో ముడిపడిన మన సంప్రదాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు, ప్రాభవం లభిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే ఔషధ గుణాలున్న దేశీ పంట ఉత్పత్తులకు జీఐ ఇచ్చి, వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తే మన రైతులకు, దేశానికి మంచి ఆదాయం చేకూరుతుంది.

Table 1. Global scenario on Geographical Indications Registered Global (2017–23)

Categories	2017	2018	2019	2020	2021	2022	2023	Total	% change over 2017
Agricultural Commodities	55675	19684	56541	61611	62870	67318	68984	337008 (38.01)	23.90
Handicrafts	5395	1063	2173	2044	1882	2116	2260	11538 (1.3)	-58.11
Wines and spirits	112783	24971	98543	103091	99592	103712	98923	528832 (59.64)	-12.29
Services	51	17	29	31	25	10	14	126 (0.01)	-72.55
Others	23729	2063	1920	2038	695	989	1499	9204 (1.04)	-93.68
Total	197633	47798	159206	168815	165064	174145	171680	886708 (100.00)	-13.13



643 ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు

2004వ సంవత్సరంలో 3 భౌగోళిక గుర్తింపులతో భారత్ జీఐ ట్యాగ్‌ల నమోదు ప్రారంభమైంది. 2024లో ఇది 643కు చేరింది. 2023-24లో అత్యధికంగా జీఐ పొందిన హస్తకళాకృతులు 85 కాగా, వ్యవసాయ ఉత్పత్తుల సంఖ్య 48. ఆహారోత్పత్తులు 19 మాత్రమే. 2004-2024 మధ్యకాలంలో జీఐ గుర్తింపు పొందిన వాటిలో హస్తకళాకృతులు 54%, వ్యవసాయ ఉత్పత్తులు 31%, తయారీ, సహజ వస్తువులు 8%, ఆహారోత్పత్తులు 7% ఉన్నాయి. ఉత్తర భారత దేశానికి చెందిన జీఐ గుర్తింపు ఉన్న బాస్మతి బియ్యానికి అధిక ధర వస్తుంది, సాధారణ బాస్మతి బియ్యంతో పోల్చితే. అదేవిధంగా కేరళలో జీఐ గుర్తింపు పొందిన దేశీ బియ్యం రకాల సాగుదారులకు అధికాదాయం వస్తోంది. మన దేశంలో గత 20 ఏళ్లలో మొత్తం 643 ఉత్పత్తులు భౌగోళిక గుర్తింపులు పొందగా, అందులో 200 వ్యవసాయోత్పత్తులే. ఆహారోత్పత్తులు 47, హస్తకళాకృతులు 343, మానుఫ్యాక్చర్డ్, నేచురల్ గూడ్స్ 53 ఉన్నాయి. అత్యధిక జీఐలు పొందిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్ 74 (11.51%). ఇందులో ఎక్కువ భాగం హస్తకళాకృతులే. తమిళనాడులో జీఐ పొందిన 59 (9.18%) ఉత్పత్తుల్లో హస్తకళాకృతులు, ఆహారోత్పత్తులే ఎక్కువ. మహారాష్ట్రలో 49 (7.62%), కర్ణాటకలో 44 (6.84%), కేరళలో 35 (5.44%) వస్తువులకు 2024లో జీఐ లభించింది.

ప్రపంచ వ్యాప్తంగా 8,86,708 ఉత్పత్తులకు జీఐ

2017-23 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా 8,86,708 ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించింది. 2017లో అత్యధికంగా జీఐల నమోదు జరిగింది. ఆ తర్వాత కాలంలో హస్తకళాకృతులు, వైన్స్, స్పిరిట్స్, సేవలు, తదితర అన్ని విభాగాల్లోనూ తగ్గుదల నమోదైంది. అయితే, వ్యవసాయ సంబంధ ఉత్పత్తుల సంఖ్య మాత్రం 2017-2023 మధ్య 23.9% పెరిగింది. ఈ కాలంలో జీఐ గుర్తింపు పొందిన వైన్స్, స్పిరిట్స్ 59.64% (5,28,832) ఉండగా, వ్యవసాయ ఉత్పత్తులు 3,37,008 (38.01%) ఉన్నాయి. హస్తకళాకృతులు 11,538 (1.3%) ఉన్నాయి. 2023లో అత్యధికంగా చైనా 9,785 జీఐలతో అగ్రస్థానంలో ఉండగా, అమెరికా 763తో 49వ స్థానంలో, భారత్ 530తో 52వ స్థానంలో ఉంది.

2023 నాటికి ఎన్ని జీఐలు?


ర్యాంక్	దేశం	జీఐలు
1.	చైనా	9,785
2.	జర్మనీ	7,586
3.	హంగేరీ	7,290
9.	ఫ్రాన్స్	6,098
20.	ఈయూ	5,376
34.	యూకే	4,157
37.	వియత్నాం	2,133
47.	ఇజ్రాయేల్	931
48.	కెనడా	860
49.	అమెరికా	763
52.	భారత్	530

జీఐ గుర్తింపు పొందిన తెలంగాణ ఉత్పత్తులు: 17 ఉత్పత్తుల్లో 1 వ్యవసాయం, 1 ఆహారోత్పత్తి, 15 హస్తకళాకృతులు ఉన్నాయి. పోచంపల్లి ఇక్కత్, కరీంనగర్ సిల్వర్ ఫిల్‌గ్రీ, నిర్మల్ బొమ్మల - క్రాఫ్ట్, నిర్మల్ ఫర్నీచర్, నిర్మల్ పెయింటింగ్స్, గద్వాల చీరలు, హైదరాబాద్ హలీం, చేర్యాల పెయింటింగ్స్, పెంబర్తి మెటల్ క్రాఫ్ట్, సిద్ధిపేట గొల్లభామ చేనేత చీరలు, నారాయణపేట చేనేత చీరలు, బనగానపల్లె మామిడి, ఆదిలాబాద్ డోక్ర, వరంగల్ దుర్రీస్, తాండూరు కంది.

తెలుగు రాష్ట్రాల్లో 20 లోపే..

గత 20 ఏళ్లలో దేశంలో 2024 నాటికి 643 ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు వస్తే ఆంధ్రప్రదేశ్‌లో 19, తెలంగాణలో 17 ఉత్పత్తులకు మాత్రమే జీఐ గుర్తింపు దక్కింది.





ఆంధ్రప్రదేశ్ జీఐ ఉత్పత్తులు: 19 ఉత్పత్తుల్లో 4 వ్యవసాయం, 1 ఆహారోత్పత్తి, 11 హస్తకళాకృతులు, 3 మానుఫ్యాక్చర్డ్-నేచురల్ ప్రొడక్ట్స్ ఉన్నాయి. శ్రీకాళహస్తి కలంకారీ, కొండపల్లి బొమ్మలు, మచిలీపట్నం కలంకారీ, బుడితి బెల్ - బ్రాస్ క్రాఫ్ట్, ఏపీ లెదర్ పప్పెట్రీ, ఉప్పాడ జాందాని చీరలు, తిరుపతి లడ్డు, గుంటూరు సన్న మిరప, వెంకటగిరి చీరలు, బొబ్బిలి వీణ, మంగళగిరి చీరలు-వస్త్రాలు, ధర్మవరం చేనేత పట్టు చీరలు- పావడాలు, బందరు లడ్డు, ఉదయగిరి వుడెన్ కట్లెరీ, బనగానపల్లి మామిడి, దుర్గి స్టోన్ కార్వింగ్స్, ఏటికొప్పాక బొమ్మలు, ఆళ్లగడ్డ స్టోన్ కార్వింగ్స్, అరకు వ్యాలీ అరబిక కాఫీ.

– నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాక్షి సాగుబడి డెస్క్

సమగ్ర భూ సంస్కరణలు చేపట్టాల్సిందే

స్టాంప్ డ్యూటీలో ఏకరూపత తేవాలి

- తద్వారా తయారీ కేంద్రంగా భారత్
- ప్రభుత్వానికి సీఐఐ సూచనలు



న్యూఢిల్లీ: భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చేందుకు సమగ్ర భూ సంస్కరణలను చేపట్టాలంటూ భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కీలక సూచనలు చేసింది. సమన్వయంతో, ఏకాభిప్రాయంతో కూడిన సంస్కరణలు అమలు చేసేందుకు, దేశవ్యాప్తంగా 3–5 శాతం మధ్య ఒకే స్టాంప్ డ్యూటీని అమలు చేసేందుందుకు వీలుగా జీఎస్‌టీ మాదిరి కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని కోరింది. రక్షణాత్మక ధోరణి, వాణిజ్య యుద్ధాలు సవాలును విసురుతున్నాయంటూ.. భారత్‌లో స్థిరమైన విధానాలు, బలమైన పారిశ్రామిక సామర్థ్యాలు, దేశీయంగా అతిపెద్ద వినియోగ మార్కెట్, యువ శ్రామిక శక్తి, విశ్వసనీయ భాగస్వామిగా చాలా దేశాల్లో ఉన్న గుర్తింపు.. ఇవన్నీ భారత్‌ను పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా మార్చగలవని సీఐఐ తెలిపింది. ప్రతీ రాష్ట్రంలోనూ సమగ్ర భూ నిర్వహణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, భూ వినియోగ మార్పిడిని పూర్తిగా డిజిటలైజ్ చేయడంతోపాటు స్టాంప్ డ్యూటీని 3–5 శాతం మధ్య స్థిరీకరణ చేయాలని సూచించింది. స్పష్టమైన భూ యాజమాన్యం దిశగా రాష్ట్రాలు చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఈ చర్యల ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు చేరువ కావొచ్చని అభిప్రాయపడింది.

సమ్మిళిత వృద్ధి..

భారత్‌లో తయారీకి ఊతమివ్వడమే కాకుండా, ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచే దిశగా బలమైన భూ సంస్కరణలు అమలు చేయాలని సీఐఐ కోరింది. గ్రామీణాభివృద్ధి సామర్థ్యాలను వెలికితీయడం ద్వారా సమ్మిళిత వృద్ధిని సాధించొచ్చంటూ కీలక సూచనలు చేసింది.

- భూ చట్టాల నిర్వహణ ప్రస్తుతం రాష్ట్రాల పరిధిలో ఉంది. కనుక కేంద్రం–రాష్ట్రాల మధ్య సహకారానికి వీలుగా జీఎస్‌టీ కౌన్సిల్ మాదిరి ఏర్పాటు చేయాలి. సమన్వయం, ఏకాభిప్రాయం ఆధారంగా ఈ సంస్థ సంస్కరణలు చేపట్టాలి.
- ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్ (ఐఐఎల్‌బీ) ఏర్పాటు ప్రశంసనీయమేనంటూ, ఇందులో ఉన్న సవాళ్లను ప్రస్తావించింది. ప్రస్తుతం ఇది కేవలం సమాచార సాధనంగానే పనిచేస్తోంది. రాష్ట్రాల మధ్య భూముల కేటాయింపు అధికారాలు సైతం ఉండాలి. దీనివల్ల పారదర్శకత పెరిగి, భూముల సమీకరణ సులభతరం అవుతుంది.
- రాష్ట్రాల స్థాయిల్లోనూ ఒకటికి మించిన అధికార యంత్రాంగాలు ఉండడాన్ని అవరోధంగా పేర్కొంది. దీన్ని అధిగమించేందుకు ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేయాలి. భూములు కేటాయింపు, మార్పిడి, వివాదాల పరిష్కార అధికారాలు దీనికి ఉండాలి.
- భూ మార్పిడి విధానం డిజిటైజేషన్ చేయాలి. డిజిటల్ సంతకం పెట్టిన సర్టిఫికెట్‌లు, క్యూఆర్ కోడ్ ఆధారిత మూడో పక్షం ధ్రువీకరణతో పారదర్శకత తీసుకురావచ్చు. అవినీతిని తొలగించొచ్చు.
- దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో స్టాంప్ డ్యూటీలు వేర్వేరుగా ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా 3–5 శాతం మధ్యలో ఏకే విధమైన రేటును అమలు చేయాలి.

స్వల్పంగా తగ్గిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

- ఆగస్ట్ 11 నాటికి రూ.6.64 లక్షల కోట్లు
- 10 శాతం పెరిగిన రిఫండ్‌లు



న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల రూపంలో ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (ఏప్రిల్1 నుంచి ఆగస్ట్ 11 వరకు) రూ.6.64 లక్షల కోట్లు వసూలైంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.6.91 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. 3.95 శాతం మేర తగ్గినట్లు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి విడుదల చేసిన గణాంకాలతో స్పష్టమవుతోంది. రిఫండ్‌లు పెరగడం ఇందుకు కారణం. వ్యక్తులు, కంపెనీలు, వ్యాపార సంస్థలు చెల్లించే పన్నులు ప్రత్యక్ష పన్నుల కిందకు వస్తాయి. కార్పొరేట్ సంస్థల నుంచి నికర పన్నుల ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 3 శాతం పెరిగి రూ.2.29 లక్షల కోట్లుగా నమోదైంది. వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, సంస్థల నుంచి వచ్చిన ఆదాయం 7 శాతానికి పైగా పెరిగి రూ.4.12 లక్షల కోట్లుగా ఉంది. రూ.22,362 కోట్లు సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూపంలో వసూలైంది. ఇదే కాలంలో రిఫండ్‌లు 10 శాతం పెరిగి రూ.1.35 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్‌లకు ముందు స్థూల పన్ను వసూళ్లు రూ.7.99 లక్షల కోట్లుగా ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-8-2025

విశాఖ	515–00
చిత్తూరు	548–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510–00
విజయవాడ	520–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,511.20	2.03
MARUTI	12,847.00	1.98
HEROMOTOCO	4,644.00	1.79
M&M	3,236.00	1.56
NTPC	340.15	1.19

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	853	-2.83
TRENT	5,368.00	-1.39
HINDUNILVR	2,484.00	-1.37
NESTLEIND	1,090.00	-1.36
ETERNAL	305.3	-1.33

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	8,035
ఎన్‌ఎస్‌ఈ	79,109
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,30,795
ఎఫ్‌ఐఐ	- 3,399
డీఐఐ	+ 3,508

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.27	$ 63.96
బ్రెంట్	66.18	$ 66.63

రూ.5.82 లక్షల కోట్ల రుణాల మాఫీ

ఐదేళ్లలో ప్రభుత్వరంగ బ్యాంకుల్లో



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్‌లు (పీఎస్‌బీలు) గడిచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో రూ.5.82 లక్షల కోట్ల మొండి రుణాలను (వసూలు కాని/ఎన్‌పీఏలు) మాఫీ (రద్దు) చేశాయి. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి స్వయంగా రాజ్యసభకు ఈ విషయాన్ని లిఖిత పూర్వకంగా వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.91,260 కోట్లను మాఫీ చేసినట్టు చెప్పారు. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2023–24) రూ.1.15 లక్షల కోట్లుగా ఉన్నట్టు తెలిపారు. అత్యధికంగా 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ.1.33 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశాయి. 2021–22లో రూ.1.16 లక్షల కోట్లు, 2022–23లో రూ.1.27 లక్షల కోట్ల చొప్పున మాఫీ చేసినట్టు మంత్రి వెల్లడించారు. ఇలా మాఫీ చేసిన మొత్తం నుంచి గత ఐదు సంవత్సరాల్లో వసూలైన మొత్తం రూ.1.65 లక్షల కోట్లుగా ఉంది. అంటే మొత్తం మాఫీ రుణాల్లో వసూలైంది 28 శాతమే. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఎన్‌పీఏలకు బ్యాంక్‌లు ప్రొవిజన్లు చేయాల్సి ఉంటుంది. ఇలా నూరు శాతం కేటాయింపుల తర్వాత నిబంధనల కింద పుస్తకాల్లో మాఫీ చేసినట్టు చూపిస్తాయి. అయినా, వాటి వసూలుకు బ్యాంకులు చర్యలు చేపడుతూనే ఉంటాయి. మాఫీ చేసినప్పటికీ రుణ గ్రహీతలపై చెల్లింపుల బాధ్యత ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

ఫార్మా విభాగంలోకి సెల్సియస్ లాజిస్టిక్స్

రూ. 50 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కోల్డ్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ సంస్థ సెల్సియస్ లాజిస్టిక్స్ తాజాగా ఫార్మా ఉత్పత్తుల రవాణా విభాగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం సెల్సియస్‌ప్లస్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఔషధాలు, టీకాలు, ఇన్సులిన్, ఇతరత్రా ఉత్పత్తులను అత్యంత సురక్షితంగా రవాణా చేయడంపై ఇది దృష్టి పెడుతుందని సంస్థ సీఈవో స్వరూప్ బోస్ చెప్పారు. వాహనాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రాథమికంగా రూ. 50 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఫార్మా లాజిస్టిక్స్, కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి 40 మంది వరకు స్పెషలైజ్డ్ సిబ్బందిని నియమించుకుంటున్నట్లు పేర్కొన్నారు. పలు దిగ్గజ ఫార్మా సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకోవడంతో పాటు 2025 ఆఖరు నాటికి 100కు పైగా నగరాలకు విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని బోస్ తెలిపారు. ఈ ఏడాది సుమారు రూ. 250 కోట్లు సమీకరించినట్లు చెప్పారు.

రూ. 150 కోట్లతో ఏఐఎన్యూ విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏషియా హెల్త్‌కేర్ హోల్డింగ్స్ (ఏహెచ్‌హెచ్)లో భాగమైన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్యూ) హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోనూ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు వైజాగ్, చెన్నై, సిలిగురిలో ఏడు ఆస్పత్రులు ఉండగా, త్వరలో ఇంకో అయిదు ఆస్పత్రులను ప్రారంభించనుంది. అధునాతన సాంకేతికతతో, అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఏఐఎన్‌యూ చైర్మన్ మల్లికార్జున చెప్పారు. విస్తరణపై ఈ ఏడాది రూ. 150 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఏహెచ్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విశాల్ బాలి తెలిపారు. కొత్తగా పుణె, కోయంబత్తూర్, పుణె తదితర నగరాల్లో హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విస్తరణ పూర్తయితే ఇప్పుడు 550గా ఉన్న పడకల సామర్థ్యం 850కి పెరుగుతుందని పేర్కొన్నారు. కొత్తగా గ్యాస్ట్రోఎంట్రాలజీ, పాథాలజీ డయాగ్నోస్టిక్స్ తదితర స్పెషాలిటీ విభాగాలపైనా దృష్టి పెడుతున్నట్లు బాలి చెప్పారు. వచ్చే ఏడాది వ్యవధిలో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో మరో హాస్పిటల్ ఏర్పాటు చేయనున్నట్లు ఈడీ పూర్ణచంద్రా రెడ్డి తెలిపారు.

వచ్చే ఐదేళ్లలో 20 వేల కొత్త కొలువులు

పీడబ్ల్యూసీ ఇండియా ప్రణాళికలు



న్యూఢిల్లీ: కన్సల్టెన్సీ దిగ్గజం పీడబ్ల్యూసీ ఇండియా వచ్చే ఐదేళ్ల వ్యవధిలో కొత్తగా 20,000 ఉద్యోగాలు కల్పించనుంది. దీనితో సంస్థలో మొత్తం సిబ్బంది సంఖ్య 50,000కు చేరనుంది. విజన్ 2030ని ప్రకటించిన సందర్భంగా పీడబ్ల్యూసీ ఇండియా చైర్‌పర్సన్ సంజీవ్ కృషన్ ఈ విషయం తెలిపారు. వచ్చే ఐదేళ్లలో వార్షికాదాయాల్లో 5% టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాలపై ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించారు. అలాగే డిజిటల్ పరివర్తన, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీలాంటి వ్యాపార విభాగాల పై దృష్టి పెట్టనున్నట్లు సంజీవ్ చెప్పారు. సిబ్బంది, భాగస్వాములకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు ఆదాయాల్లో 1 శాతం భాగాన్ని వెచ్చిస్తున్నట్లు వివరించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోకి కూడా కార్యకలాపాలు విస్తరిస్తూ, హైరింగ్ చేపడుతున్నామని సంజీవ్ చెప్పారు. ప్రధానంగా ఆర్థిక సేవలు, హెల్త్‌కేర్, ఆటో, టెక్నాలజీ, మీడియా వంటి ఆరు విభాగాలపై ఫోకస్ పెడుతున్నట్లు వివరించారు.


సిట్రోయెన్ నుంచి సీ3ఎక్స్ కార్ల శ్రేణి

ధర రూ. 5.25 లక్షల నుంచి ప్రారంభం



హైదరాబాద్: ఫ్రెంచ్ కార్ల తయారీ దిగ్గజం సిట్రోయెన్ సరికొత్తగా సీ3 ఎక్స్–సిరీస్ వాహనాల శ్రేణిని ఆవిష్కరించింది. వీటి ధర రూ. 5.25 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా బుకింగ్స్ మొదలయ్యాయని, సెప్టెంబర్ మొదటి వారం నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయని సంస్థ తెలిపింది. ఈ కార్లలో ప్రాక్సీ సెన్సార్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, క్రూయిజ్ కంట్రోల్, 360 డిగ్రీ కెమెరా సిస్టం, 26 సెం.మీ. టచ్ స్క్రీన్, తదితర ఫీచర్లు ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీలో ఉంటాయని వివరించింది. సీ3 లీటరుకు 19.3 కి.మీ. మైలేజీనిస్తుంది.

'అగ్రిగేటరు'గా పేటీఎం పేమెంట్స్‌కి ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటరుగా సేవలందించేందుకు పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్‌కి (పీపీఎస్‌ఎల్) ఆర్‌బీఐ నుంచి అనుమతి లభించింది. అలాగే, కొత్త వ్యాపారులను చేర్చుకోవడంపై మూడేళ్ల క్రితం విధించిన నిషేధాన్ని కూడా ఎత్తివేసింది. పీపీఎస్‌ఎల్ మాతృ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ ఈ విషయాలు వెల్లడించింది. పేమెంట్ అగ్రిగేటరు లైసెన్సు కోసం 2020 మార్చిలో కంపెనీ దరఖాస్తు చేసుకున్నప్పటికీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల ఉల్లంఘనపరమైన సమస్యల కారణంగా పర్మిషన్ల రాకలో జాప్యం జరిగింది. తాజాగా వన్97 కమ్యూనికేషన్స్ నుంచి చైనా కంపెనీ ఆలీబాబా గ్రూప్ నిష్క్రమించిన పక్షం రోజుల్లోనే అనుమతులు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.1,256 కోట్లు

- ఒక్క నెలలోనే 40 శాతం డౌన్
- ఈ ఏడాది రూ.9,277 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి జూలైలో రూ.1,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జూన్ నెలలో పెట్టుబడులు రూ.2,081 కోట్లతో పోల్చి చూస్తే ఏకంగా 40 శాతం తగ్గాయి. ఈ ఏడాది మే నెలలోనూ బంగారం ఈటీఎఫ్‌లు రూ.292 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం. పసిడి ధరలు ఆల్‌టైమ్ గరిష్టాల్లో ఉండడంతో ఇన్వెస్టర్లు కొంత అప్రమత్త ధోరణితో వ్యవహరించినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ వరుసగా మూడో నెలలోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నికరంగా పెట్టుబడులు వచ్చినట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసిన గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. అంతకుముందు వరుసగా రెండు నెలల్లో.. ఏప్రిల్‌లో రూ.6 కోట్లు, మార్చిలో 77 కోట్ల చొప్పున గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి ఇన్వెస్టర్లు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు ఏడు నెలల్లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నికరంగా వచ్చిన పెట్టుబడులు రూ.9,277 కోట్లుగా ఉన్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలోకి పసిడికి సైతం చోటు కల్పిస్తున్నట్టు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. జూలై చివరికి గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం పెట్టుబడులు రూ.67,634 కోట్లకు పెరిగాయి. జూన్ చివరికి ఉన్న రూ.64,777 కోట్లతో పోల్చి చూస్తే 4.4 శాతం వృద్ధి చెందాయి.

78.69 లక్షల ఫోలియోలు

గోల్డ్ ఈటీఎఫ్‌లలో మొత్తం ఫోలియోలు (ఇన్వెస్టర్ పెట్టుబడి ఖాతా) జూలై చివరికి 78.69 లక్షలకు చేరాయి. 2.15 లక్షల కొత్త ఫోలియోలు నమోదయ్యాయి. ''బంగారం గత రెండేళ్లలో బలమైన పనితీరు చూపించినప్పటికీ దీన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం ఇన్వెస్టర్లకు కష్టమే. చాలా మంది ఇన్వెస్టర్లు హెడ్జింగ్ దృష్ట్యా బంగారానికి కొంత పెట్టుబడులు కేటాయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం గరిష్ట స్థాయిల్లో ఉన్న దృష్ట్యా అప్రమత్తత అవసరం''అని జెర్మిట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈవో సంతోష్ జోసెఫ్ సూచించారు. స్థూల ఆర్థిక అనిశ్చితులు, అంతర్జాతీయంగా వడ్డీ రేట్లలో అస్థిరతలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పోర్ట్‌ఫోలియో వైవిధ్యం దృష్ట్యా బంగారానికి డిమాండ్ కొనసాగుతున్నట్టు మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ పేర్కొన్నారు.

క్యూ1 ఫలితాలు

ఎన్‌ఎండీసీ ఆదాయం 23% అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ ఆదాయం రూ. 6,634 కోట్లకు ఎగిసింది. గత క్యూ1లో నమోదైన రూ. 5,378 కోట్లతో పోలిస్తే 23 శాతం పెరిగింది. లాభం రూ. 1,984 కోట్ల నుంచి స్వల్పంగా క్షీణించి రూ. 1,969 కోట్లకు పరిమితమైంది. మెరుగైన నిర్వహణ సామర్థ్యాలతో క్యూ1లో పటిష్టమైన పనితీరు సాధించామని, ఆదాయం రెండంకెల స్థాయిలో పెరిగిందని సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. అత్యాధునిక సాంకేతికతలతో నిలకడగా భారీ స్థాయిలో ఉత్పత్తిని సాధిస్తున్నామని ఆయన వివరించారు. సమీక్షాకాలంలో ముడి ఇనుము ఉత్పత్తి 30 శాతం వృద్ధితో 9.19 మిలియన్ టన్నుల (ఎంటీ) నుంచి 11.99 ఎంటీకి చేరిందని చెప్పారు. అమ్మకాలు 10.07 ఎంటీ నుంచి 14 శాతం వృద్ధి చెంది 11.52 ఎంటీకి చేరినట్లు ముఖర్జీ పేర్కొన్నారు.

కర్ణాటక బ్యాంక్ లాభం క్షీణత ▸ రూ. 290 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ కర్ణాటక బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 27 శాతం క్షీణించి రూ. 290 కోట్లకు పరిమితమైంది. వడ్డీ ఆదాయం మందగించడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 400 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,557 కోట్ల నుంచి రూ. 2,620 కోట్లకు బలపడింది. అయితే వడ్డీ ఆదాయం రూ. 2,278 కోట్ల నుంచి రూ. 2,261 కోట్లకు స్వల్పంగా తగ్గింది. నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) 3.54 శాతం నీరసించి 2.82 శాతానికి దిగివచ్చాయి. నిర్వహణ లాభం రూ. 559 కోట్ల నుంచి రూ. 467 కోట్లకు క్షీణించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.54 శాతం నుంచి 3.46 శాతానికి స్వల్పంగా తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.66 శాతం నుంచి 1.44 శాతానికి దిగివచ్చాయి. ప్రొవిజన్లు రూ. 40 కోట్ల నుంచి రూ. 111 కోట్లకు పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 17.64 శాతం నుంచి 20.46 శాతానికి బలపడింది.

ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 172 వద్ద ముగిసింది.

ఎంఆర్‌ఎఫ్ లాభం స్లోడౌన్ ▸ రూ. 500 కోట్లు



న్యూఢిల్లీ: టైర్ల తయారీ దేశీ దిగ్గజం ఎంఆర్‌ఎఫ్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 500 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 571 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 7,196 కోట్ల నుంచి రూ. 7,676 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఎంఆర్‌ఎఫ్ షేరు బీఎస్‌ఈలో 1% నీరసించి రూ. 1,40,562 వద్ద ముగిసింది.

ఆయిల్ ఇండియా లాభం ఫ్లాట్ ▸ రూ. 2,047 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఆయిల్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం స్వల్ప వృద్ధితో రూ. 2,047 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,016 కోట్లు ఆర్జించింది. స్టాండెలోన్ నికర లాభం మాత్రం రూ. 1,467 కోట్ల నుంచి రూ. 813 కోట్లకు క్షీణించింది. చమురు ధరలు 22 శాతం క్షీణించడం ప్రభావం చూపింది. ఈ కాలంలో ముడి చమురు బ్యారల్‌కు 66.2 డాలర్లు మాత్రమే లభించగా.. గత క్యూ1లో 84.89 డాలర్లు ఆర్జించింది. చమురు ఉత్పత్తి 1.69 మిలియన్ టన్నుల నుంచి 1.68 మిలియన్ టన్నులకు తగ్గింది. నామ్‌రూప్–బోరట్ ఓఏఎల్‌పీ బ్లాకులో హైడ్రోకార్బన్ డిస్కవరీ సాధించగా.. రాజస్తాన్‌లోని జైసల్మీర్ జిల్లాలోని డీఎస్ఎఫ్ బ్లాకులో గ్యాస్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది. అనుబంధ సంస్థ నుమాలీగఢ్ రిఫైనరీ 7,99,000 టన్నుల చమురును శుద్ధి చేసినట్లు వెల్లడించింది. గత క్యూ1లో ఇది 7,64,000 టన్నులు మాత్రమే.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.4 శాతం పుంజుకుని రూ. 424 వద్ద ముగిసింది.

జైడస్ లైఫ్ లాభం ఓకే ▸ రూ. 1,467 కోట్లు



న్యూఢిల్లీ: ఔషధ రంగ దిగ్గజం జైడస్ లైఫ్‌సైన్సెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 3 శాతం వృద్ధితో రూ. 1,467 కోట్లను తాకింది. దేశ, విదేశాలలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,420 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,207 కోట్ల నుంచి రూ. 6,574 కోట్లకు బలపడింది. దీనిలో దేశీ బిజినెస్ 6% మెరుగుపడి రూ. 2,374 కోట్లకు చేరగా.. ఫార్ములేషన్ల నుంచి 8% అధికంగా రూ. 1,519 కోట్లను తాకింది. కన్జూమర్ వెల్‌నెస్ విభాగం 2 శాతం వృద్ధితో రూ. 855 కోట్లయ్యింది. ఈ బాటలో యూఎస్ ఫార్ములేషన్ల బిజినెస్ 3 శాతం అధికమై రూ. 3,182 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.3 శాతం పుంజుకుని రూ. 958 వద్ద ముగిసింది.

గ్రాన్యూల్స్ లాభం రూ. 113 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఫార్మా సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభం రూ. 113 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో నమోదైన రూ. 135 కోట్లతో పోలిస్తే 16 శాతం క్షీణించింది. మరోవైపు, ఆదాయం స్వల్పంగా మూడు శాతం పెరిగి రూ. 1,179 కోట్ల నుంచి రూ. 1,210 కోట్లకు చేరింది. బొంతపల్లి ఏపీఐ ప్లాంటు, వర్జీనియాలోని జీపీఐ, జీనోమ్ వేలీలోని గ్రాన్యూల్స్ లైఫ్ సైన్సెస్‌లో ఎఫ్‌డీఏ తనిఖీలు పూర్తయ్యాయని, స్వల్ప అబ్జర్వేషన్లు మాత్రమే ఉన్నాయని సంస్థ సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు.


అపోలో హాస్పిటల్స్ లాభం రూ. 433 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ (కన్సాలిడేటెడ్) లాభం రూ. 433 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ1లో నమోదైన రూ. 305 కోట్లతో పోలిస్తే 42 శాతం ఎగిసింది. ఇక ఆదాయం 15 శాతం వృద్ధి చెంది రూ. 5,086 కోట్ల నుంచి రూ. 5,842 కోట్లకు చేరింది. విభాగాలవారీగా చూస్తే హెల్త్‌కేర్ సర్వీసెస్ ఆదాయం 11 శాతం పెరిగి రూ. 2,637 కోట్ల నుంచి రూ. 2,935 కోట్లకు పెరిగింది. అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టయిల్ ఆదాయం 19 శాతం వృద్ధితో రూ. 366 కోట్ల నుంచి రూ. 435 కోట్లకు ఎగిసింది. వచ్చే అయిదేళ్లలో రూ. 7,600 కోట్లతో 4,300 పడకలను జోడించనున్నట్లు సంస్థ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి తెలిపారు.

మంగళవారం బీఎస్‌ఈలో సంస్థ షేరు స్వల్పంగా తగ్గి రూ. 7,236.60 వద్ద ముగిసింది.

జేఎమ్ ఫైనాన్షియల్ లాభం హైజంప్ ▸ రూ. 454 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ జేఎమ్ ఫైనాన్షియల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 166 శాతం జంప్‌చేసి రూ. 454 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 171 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,093 కోట్ల నుంచి రూ. 1,121 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 849 కోట్ల నుంచి భారీగా తగ్గి రూ. 529 కోట్లకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 3.4 శాతం జంప్‌చేసి రూ. 160 వద్ద ముగిసింది.

సెప్టెంబర్ వరకు బిన్నీనే

బీసీసీఐ అధ్యక్షుడిగా కొనసాగనున్న మాజీ క్రికెటర్




బెంగళూరు: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడిగా రోజర్ బిన్నీ తన పూర్తి పదవీకాలం కొనసాగనున్నారు. 2022 అక్టోబర్‌లో ఎంపికైన ఆయన ఈ ఏడాది సెప్టెంబర్ వరకు బోర్డు అధ్యక్షుడిగా ఉంటారు. గత నెల 19న బిన్నీకి 70 ఏళ్లు పూర్తయ్యాయి. నిబంధనల ప్రకారం ఆయన వెంటనే తప్పుకోవాల్సి ఉంది. అయితే తాజాగా మంగళవారం 'నేషనల్ స్పోర్ట్స్ బిల్' పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. దీని ప్రకారం క్రీడా సంఘాల ఆఫీస్ బేరర్ల వయోపరిమితిని 75 ఏళ్లకు పెంచారు. బీసీసీఐ కూడా ఒక క్రీడా సమాఖ్యగా ఈ బిల్లు పరిధిలోకి రావడంతో ఈ నిబంధన కూడా దానికి వర్తించనుంది. దీంతో బిన్నీ కొనసాగేందుకు మార్గం సుగమమైంది. సెప్టెంబర్ చివర్లో జరిగే ఏజీఎంలోనే కొత్త అధ్యక్షుడి ఎన్నికపై బీసీసీఐ ముందుకు వెళుతుంది. ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు తీసుకోకపోయినా... 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌లో మన జట్టు దేశానికి ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో బీసీసీఐ కూడా కొత్త బిల్లు పరిధిలోకి వచ్చింది. అయితే బోర్డు నుంచి ఎలాంటి సమాచారం కోరకుండా దానిని ఆర్టీఐ పరిధి నుంచి తప్పిస్తూ సవరణ చేర్చిన తర్వాతే ఈ బిల్లును ప్రవేశ పెట్టారు. పార్లమెంట్‌లో ఇప్పుడే బిల్లు పాస్ అయింది కాబట్టి దానిని పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాత లోటుపాట్లపై చర్చిస్తామని బీసీసీఐ న్యాయ నిపుణుల బృందం అభిప్రాయపడింది.

రెండో ర్యాంక్‌కు దీప్తి

ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రెండో స్థానానికి చేరింది. తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి 732 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచింది. ఆస్ట్రేలియాకు చెందిన అనాబెల్ సదర్లాండ్ 736 పాయింట్లతో అగ్రస్థానానికి చేరింది. అనాబెల్ 'టాప్' ర్యాంక్ దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మ (387 పాయింట్లు) మూడో స్థానంలో స్థిరంగా కొనసాగుతోంది. ఇక బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానం కోల్పోయి రెండో ర్యాంక్‌కు పరిమితమైంది. మంధాన 728 పాయింట్లతో రెండో స్థానానికి చేరగా... ఇంగ్లండ్ ప్లేయర్ నటాలియా సీవర్ బ్రంట్ (731) 'టాప్'నకు దూసుకెళ్లింది. 10 స్థానాలు మెరుగు పర్చుకున్న భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 11వ ర్యాంక్‌లో నిలిచింది.



రొనాల్డో నిశ్చితార్థం

వాషింగ్టన్: జగద్విఖ్యాత ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన ప్రియసఖి జార్జినా రోడ్రిగ్వెజ్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. సుదీర్ఘకాలంగా జార్జినాతో ఉన్న అనుబంధాన్ని 40 ఏళ్ల రొనాల్డో వివాహబంధంగా మార్చుకునేందుకు ఉంగరాలు మార్చుకున్నారు. ఈ మేరకు అర్జెంటీనా సంతతికి చెందిన స్పెయిన్ మోడల్ 31 ఏళ్ల జార్జినా ఇన్‌స్టాగ్రామ్‌లో తమ ఎంగేజ్‌మెంట్ ముచ్చటను పంచుకుంది. 2016లో మాడ్రిడ్‌లోని ప్రముఖ గుచి స్టోర్‌లో రోడ్రిగ్వెజ్‌తో అయిన తొలి పరిచయం తదనంతరం ప్రణయ బంధానికి దారి తీసింది. ఈ జంటకు ఇద్దరు కుమార్తెలున్నారు. 2022లో కవల శిశువుల్లో మగబిడ్డ పుట్టగానే కన్నుమూశాడు. అయితే రొనాల్డోకు అంతకుముందే ముగ్గురు పిల్లలున్నారు. వీరిలో రొనాల్డో జూనియర్ అండర్–15 టోర్నీలో పాల్గొంటున్నాడు. ప్రస్తుతం ఈ ముగ్గురి ఆలనపాలన కూడా జార్జినానే చూస్తోంది.



వెస్టిండీస్ జట్టు (ఫైల్)

విండీస్ క్రికెట్‌కు వంద సలహాలు

దేశవాళీ క్రికెట్‌పై మరింత దృష్టి

- నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట
- రీజియన్‌కు ఒక హై పెర్ఫార్మెన్స్ సెంటర్
- పడిపోతున్న ప్రమాణాలు పెంచుకునేందుకు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు చర్యలు
- దిగ్గజ ఆటగాళ్లతో అత్యవసర సమావేశం
- పలు సూచనలు చేసిన రిచర్డ్స్, లారా, లాయిడ్

సెయింట్ జోన్స్: ఒకప్పుడు క్రికెట్ ప్రపంచాన్ని శాసించిన వెస్టిండీస్... ఇటీవలి కాలంలో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేక విమర్శల పాలవుతోంది. జాతీయ జట్టు తరఫున కరీబియన్లు కలిసికట్టుగా కదంతొక్కగా చాన్నాళ్లయింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో మెరుపులు మెరిపిస్తున్న విండీస్ ప్లేయర్లు జాతీయ జట్టు తరఫున మాత్రం కనీస ప్రభావం చూపలేకపోతున్నారు. జట్టులో సమష్టితత్వం లోపించిన నేపథ్యంలో... తిరిగి విండీస్ జట్టులో జవసత్వాలు నింపేందుకు క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ) చర్యలకు పూనుకుంది. ఇటీవల ఆస్ట్రేలియాతో టెస్టుల్లో 27 పరుగులకే వెస్టిండీస్ జట్టు ఆలౌట్ కావడంతో ఆ దేశ బోర్డు... మాజీ ఆటగాళ్లతో అత్యవసర సమావేశం నిర్వహించింది. ఇందులో సుమారు వంద విషయాలను గుర్తించింది. అందులో దేశవాళీ క్రికెట్ ప్రమాణాలు పెంపొందించడం నుంచి మొదలుకొని... యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేసేంత వరకు పలు అంశాలు ఉన్నాయని బోర్డు వెల్లడించింది. ట్రినిడాడ్ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో దిగ్గజ ఆటగాళ్లు వివ్ రిచర్డ్స్, బ్రియాన్ లారా, క్లయివ్ లాయిడ్, డెస్మండ్ హేన్స్, శివనారాయణ్ చందర్‌పాల్‌తో పాటు ప్రస్తుత విండీస్ జట్టు హెడ్ కోచ్ డారెన్ స్యామీ పాల్గొన్నారు. ఈ భేటీ అనంతరం సీనియర్ ఆటగాళ్లు కీలక సూచనలు చేశారు. వాటిలో ప్రధానమైనవి...

మార్గాలు వెతకాలి

> చాన్నాళ్లుగా వెస్టిండీస్ జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతోంది. రోజు రోజుకూ ప్రమాణాలు పడిపోతున్నాయి. ప్రస్తుతం ఇతర జట్లతో పోల్చుకుంటే మా జట్టు ఎంతో వెనుకబడి ఉంది. గతంలో నైపుణ్యమే ప్రధాన అంశంగా ఉన్న సమయంలో ప్రపంచంలో మేటి జట్టు విండీసే. కానీ కాలం మారింది. సమయంతో పాటు ఆటలోనూ చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు సాంకేతికత పెరిగింది, విశ్లేషణలు ఎక్కువయ్యాయి. వాటిని అందిపుచ్చుకోవాల్సిన అవసరముంది. క్రికెట్‌లోకి కొత్తగా వచ్చిన దేశాలు సైతం ఈ రంగాల్లో ముందంజలో ఉన్నాయి. తిరిగి సత్తాచాటేందుకు మార్గాలు వెతకాల్సిన అవసరముంది.
>
> – లారా, వెస్టిండీస్ మాజీ కెప్టెన్

- మెరుగయ్యేందుకు గుర్తించిన వంద విషయాల్లో ప్రధానమైన ఐదు అంశాలపై మొదట దృష్టి పెట్టాలి. ఆటగాళ్లకు కనీస సౌకర్యాలు, అన్నీ ప్రాంతాల్లో ప్రాక్టీస్ పిచ్‌లు, దేశవాళీ టోర్నమెంట్‌ల బలోపేతం అందులో ప్రధానమైనవి.
- ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఇతర జట్లతో పోల్చుకుంటే వెస్టిండీస్ జట్టు బలహీనంగా ఉండటంతో దాన్ని పటిష్ట పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తొలుత దృష్టి పెట్టాలి.
- వివిధ స్థాయిల్లో నైపుణ్యాల లోపం ఉంది. దేశవాళీల్లో ఇది పెద్దగా ఇబ్బంది పెట్టదు. కానీ అంతర్జాతీయ జట్లతో పోటీపడుతున్న సమయంలో బయటపడుతుంది. అందుకే ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
- దేశవాళీ క్రికెట్‌ను బలోపేతం చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలి. ఒక్క రోజులో మెరుగైన ఫలితాలు సాధ్యం కావు. నిరంతర కృషి అవసరం. ఎప్పటికప్పుడు టోర్నీలు నిర్వహించాలి. స్థానిక టోర్నీల్లో మెరిపిస్తున్న వారిని గుర్తించి వారికి మరింత తోడ్పాటు అందించడంతో పాటు దిశానిర్దేశం చేయాలి. ఆటగాళ్ల ఆలోచనా సరళిలో మార్పు రావాల్సిన అవసరముంది. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గౌరవంతో కూడుకున్న విషయమనేది ప్రతి ఒక్కరూ గుర్తించాలి.
- రీజియన్‌కు ఒకటి చొప్పున హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లు ఏర్పాటు చేయడం. దీంతో ప్రతిభావంతులను గుర్తించడం సులువవుతుంది.


స్యామీ, లారా, లాయిడ్



రోహిత్ శర్మ సన్నద్ధత

వన్డేలకు సిద్ధం కానున్న టీమిండియా కెప్టెన్

ముంబై: భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ కొంత విరామం తర్వాత మళ్లీ క్రికెట్ మైదానంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో ఫిట్‌నెస్‌కు పదును పెడుతున్నాడు. తన మిత్రుడు, వ్యక్తిగత కోచ్ అయిన అభిషేక్ నాయర్‌తో కలిసి అతను మంగళవారం జిమ్ ట్రైనింగ్‌లో పాల్గొన్నాడు. రోహిత్ ఇప్పటికే టెస్టులు, టి20లనుంచి రిటైర్ కావడం, అన్ని ఫార్మాట్లలో కొత్త ఆటగాళ్లు సత్తా చాటుతుండటంతో వన్డేల్లో కూడా అతను కొనసాగే అంశంపై ఇటీవల చర్చ మొదలైంది. 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలనే లక్ష్యంతో రోహిత్ ఉన్నా... ఇప్పటికిప్పుడు దీనిపై ఇంకా స్పష్టత వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో నాయర్ పర్యవేక్షణలోనే రోహిత్ త్వరలోనే నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు దిగే అవకాశం ఉంది. అతను చివరిసారిగా జూన్ 1న ఐపీఎల్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత భారత టెస్టు జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించగా... రోహిత్ కూడా అదే సమయంలో ఇంగ్లండ్‌లోనే సరదాగా సెలవులు గడిపాడు. ఇప్పుడు విరామం తర్వాత మళ్లీ క్రికెట్‌పై దృష్టి పెట్టాడు. భారత్ తమ తర్వాతి వన్డేలో అక్టోబర్ 19న ఆస్ట్రేలియాలో బరిలోకి దిగుతుంది. 2025–26 సీజన్‌లో టీమిండియా మరో 9 వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడనుంది. ఆసీస్ టూర్‌తో పాటు స్వదేశంలోనే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో భారత్ తలపడుతుంది. భవిష్యత్తు సంగతి ఎలా ఉన్నా... ప్రస్తుతానికి రోహిత్ వన్డేల్లో టాప్ బ్యాటర్‌గానే కొనసాగుతున్నాడు. 11,168 పరుగులు మాత్రమే కాదు, 32 సెంచరీలు, మూడు డబుల్ సెంచరీలతో అతనికి ఘనమైన రికార్డు ఉంది. భారత్ ఆడిన తమ చివరి టోర్నీ చాంపియన్స్ ట్రోఫీలో కెప్టెన్‌గా జట్టును విజేతగా నిలపడంతో పాటు ఫైనల్లో రోహిత్ స్వయంగా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన విషయం గమనార్హం.



సౌరవ్ కొఠారి ఓటమి

చెంగ్డూ (చైనా): వరల్డ్ గేమ్స్ పురుషుల స్నూకర్ ఈవెంట్‌లో భారత స్టార్ సౌరవ్ కొఠారి క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలయ్యాడు. గ్రూప్ దశలో అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరిన సౌరవ్ మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో 0–2 (2–67, 1–87)తో జియో గువోడాంగ్ (చైనా) చేతిలో ఓడాడు. కీలక పోరులో జాతీయ చాంపియన్ సౌరవ్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. కనీస ప్రతిఘటన కనబర్చకుండానే పరాజయం పాలయ్యాడు. మరోవైపు హేబాల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత్‌కే చెందిన శివమ్ అరోరా సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో శివమ్ 5–4తో యిప్ కిన్ లింగ్ (హాంకాంగ్)పై విజయం సాధించాడు. సెమీస్‌లో జాంగ్ థాయితో శివమ్ తలపడనున్నాడు. గత నెలలో నిర్వహించిన తొలి కామన్వెల్త్ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన శివమ్... ఈ టోర్నీలోనూ అదే జోరు కొనసాగించాడు.

నేడు ఐఓఏ కీలక భేటీ

- 2030 కామన్వెల్త్ గేమ్స్ బిడ్‌కు ఆమోదం తెలపనున్న సభ్యులు
- కెనడా తప్పుకోవడంతో భారత్‌కు ఆతిథ్య హక్కులు దక్కే చాన్స్!



న్యూఢిల్లీ: 2030 కామన్వెల్త్ క్రీడలను స్వదేశంలో నిర్వహించాలనే ఉద్దేశంతో వేసిన బిడ్‌ను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) బుధవారం ఆమోదించనుంది. అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యమివ్వాలని చాన్నాళ్లుగా ప్రయత్నిస్తున్న భారత్... 2036 ఒలింపిక్స్ నిర్వహణకు సైతం ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో విశ్వక్రీడలకు ముందు కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించి మన సత్తా ప్రపంచానికి చాటాలనుకుంటోంది. ఇప్పటికే ఈ క్రీడలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్నట్లు కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్యకు భారత్ వెల్లడించింది. అహ్మదాబాద్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. బిడ్‌లు దాఖలు చేసేందుకు ఈ నెల 31 తుదిగడువు కాగా... దానికి ముందే ఫైనల్ బిడ్ వేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న భారత ఒలింపిక్ సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ఇతర అంశాలు సైతం సమావేశంలో చర్చకు రానున్నాయి. ఆతిథ్య రేసు నుంచి కెనడా తప్పుకోవడంతో... భారత్‌కే హక్కులు దక్కే అవకాశాలున్నాయి. కామన్వెల్త్ గేమ్స్ డైరెక్టర్ డారెన్ హాల్ నేతృత్వంలోని అధికారుల బృందం మూడు రోజుల పాటు అహ్మదాబాద్‌లో పర్యటించి వేదికలను పరిశీలించింది. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించింది. ఈ నెలాఖరులో కామన్వెల్త్ గేమ్స్‌కు చెందిన మరో ప్రతినిధి బృందం భారత్‌ను సందర్శించనుంది. ఆతిథ్య హక్కుల ప్రకటన ఈ ఏడాది నవంబర్‌లో వెలువడే అవకాశాలున్నాయి. 'కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులు పలు అంశాలతో ముడిపడి ఉంటాయి. క్రీడా సదుపాయాలు, ప్రభుత్వ సహకారం, నిర్ణయాల్లో స్థిరత్వం, ఆకర్షణ ఇలాంటివి కీలకం. 2030 కామన్వెల్త్ ఆతిథ్య హక్కులు భారత్‌కే దక్కుతాయనే నమ్మకముంది' అని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు హర్‌పాల్ సింగ్ పేర్కొన్నారు.

గుకేశ్‌కు మిశ్రమ ఫలితాలు



సెయింట్ లూయిస్ (అమెరికా): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ర్యాపిడ్ ఫార్మాట్‌లో తొలి రోజు మూడు గేమ్‌లు జరిగాయి. లెవాన్ అరోనియన్ (అమెరికా)తో జరిగిన తొలి గేమ్‌లో గుకేశ్ 45 ఎత్తుల్లో ఓడిపోయాడు. అనంతరం గ్రిగోరి ఒపారిన్ (అమెరికా)తో జరిగిన రెండో గేమ్‌లో గుకేశ్ 32 ఎత్తుల్లో... లియామ్ లె (వియత్నాం)తో జరిగిన మూడో గేమ్‌లో గుకేశ్ 42 ఎత్తుల్లో గెలుపొందాడు. మొత్తం పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. గెలిస్తే రెండు పాయింట్లు, 'డ్రా' చేసుకుంటే ఒక పాయింట్ లభిస్తుంది. మూడో రౌండ్ తర్వాత గుకేశ్ నాలుగు పాయింట్లతో వెస్లీ సో (అమెరికా)తో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు.



జూనియర్ మహిళల హాకీ చాంప్ జార్ఖండ్

సాక్షి, కాకినాడ: జూనియర్ మహిళల జాతీయ హాకీ చాంపియన్‌షిప్‌లో జార్ఖండ్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో జార్ఖండ్ అమ్మాయిల జట్టు 2–1తో హరియాణాపై విజయం సాధించింది. ఆట మొదలైన తొలి క్వార్టర్‌లోనే జార్ఖండ్ అమ్మాయిలు రెండు గోల్స్ సాధించారు. పదో నిమిషంలో స్వీటీ డుంగ్‌డుంగ్, రెండు నిమిషాల వ్యవధిలోనే శాంతి కుమారి (12వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. తర్వాత రెండు, మూడు క్వార్టర్లలో జార్ఖండ్ జట్టు 2–0 ఆధిక్యాన్ని కాపాడుకుంది. అయితే ఆఖరి క్వార్టర్‌లో హరియాణా ప్లేయర్ కీర్తి (52వ నిమిషంలో) గోల్ చేయడంతో జార్ఖండ్ ఆధిక్యం 2–1కు తగ్గినా... విజయం మాత్రం దక్కింది. ఫైనల్ పోరుకు ముందు జరిగిన కాంస్య పతక పోరులో ఉత్తర ప్రదేశ్ 2–0 గోల్స్ తేడాతో చత్తీస్‌గఢ్‌పై గెలుపొందింది. యూపీ తరఫున సునీత కుమారి (10వ నిమిషంలో), మనీషా పటేల్ (60వ నిమిషంలో) గోల్ చేయగా... నాలుగు క్వార్టర్లలోనూ చత్తీస్‌గఢ్ అమ్మాయిలు ఒక్క గోల్ అయినా చేయలేకపోయారు.



మంగళవారం జపాన్‌లోని కుమామో ప్రిఫెక్చర్ యట్సుషిరోలో భారీ వర్షానికి రోడ్డుపై ఏర్పడిన గుంతలో ఓ కారు ఇలా ఇరుక్కుపోయింది



రాజస్తాన్‌లోని జైపూర్‌లో వరల్డ్ ఎలిఫెండ్ డే సందర్భంగా ఏనుగులపై స్వారీని ఆస్వాదిస్తున్న పర్యాటకులు



60 ఏళ్ల వయస్సున్న ఈ ఏనుగు పేరు సిటి. ఇండోనేసియాలో మెదాన్ జూ సిబ్బంది మంగళవారం వరల్డ్ ఎలిఫెండ్ డేను పురస్కరించుకుని ఇలా పళ్లు, కాయలను ఆహారంగా అందించారు.

ఢిల్లీ ఎన్నికల్లోనూ ఓట్ల చౌర్యం

ఫలితాలను రద్దు చేయాలి : ఆప్

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన ఢిల్లీ ఎన్నికల్లో ఓట్ల చౌర్యం జరిగిందని ఆమ్ ఆద్మీ పార్టీ 'ఆప్'ఆరోపించింది. ఢిల్లీ ఎన్నికల ఫలితాలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. బీహార్‌లో ఎస్ఐఆర్ మోడల్ 'ఓటు చోరీ'ని చట్టబద్ధం చేసిందని మండిపడింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల జాబితా తారుమారుపై భారత కూటమి నిరసన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, ఇటీవల ముగిసిన ఢిల్లీ ఎన్నికల్లోనూ మోసం జరిగిందని ఆప్ మంగళవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)పై తన దాడిని తీవ్రతరం చేసింది. 'ఢిల్లీ ఎన్నికల్లో మోసం జరిగింది. మేం స్పష్టమైన ఆధారాలను చూపించాం. అయినప్పటికీ ఎన్నికల సంఘం చర్య తీసుకోలేదు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలను ఎందుకు రద్దు చేయడం లేదు?'అని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నియోజకవర్గం నుంచి 42,000 మందికి పైగా ఓటర్ల పేర్లను తొలగించారని కక్కర్ ఆరోపించారు. ఈ అక్రమాలను వివరించే 3,000 పేజీల పత్రాలను ఈసీఐకి సమర్పించానని, కానీ ఎటువంటి స్పందన రాలేదని ఆమె అన్నారు. ఆరోపణలను మరింత ముందుకు తీసుకెళ్తూ, ఢిల్లీ మోడల్ బయటపడిన తర్వాత, ఓటు ట్యాంపరింగ్‌ను చట్టబద్ధం చేయడానికి ఎస్ఐఆర్ పేరుతో ఒక కొత్త వ్యూహాన్ని రూపొందించారని కక్కర్ పేర్కొన్నారు. బీహార్‌లోని వాల్మీకినగర్‌లో నమోదైన దాదాపు 5,000 మంది ఓటర్లు ఉత్తరప్రదేశ్‌లో కూడా ఓటర్లుగా ఉన్నారని కక్కర్ వెల్లడించారు.

ఓట్ల గల్లంతుకు బీజేపీ కుట్ర: అఖిలేశ్



రాంచీ: బిహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ద్వారా ఓట్లను గల్లంతు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ కుట్ర పన్నిందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలోని బిర్సా ముండా ఎయిర్‌పోర్టులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సాధారణ ప్రశ్నలకు సైతం సమాధానాలు ఇవ్వలేని సందర్భాల్లో బీజేపీ చేసే అతిముఖ్యమైన పని కుట్రలు పన్నడమేనని వ్యాఖ్యానించారు. బిహార్ ప్రజలు తమకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిసే, ఎస్ఐఆర్ ద్వారా పెద్ద సంఖ్యలో ఓట్లను తారుమారు చేసేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎస్ఐఆర్ నిజంగా అవసరమే అయితే, ఎప్పుడో ఏడాది క్రితమే చేపట్టి ఉండేవారని, ఎన్నికలకు ముందు ఇప్పుడెందుకు చేస్తారని అఖిలేశ్ ప్రశ్నించారు. ప్రజల హక్కుల్ని కాలరాచిన బీజేపీ, ఇప్పుడు ఓట్ల తారుమారుకు పూనుకోవడం ద్వారా ఓటు హక్కును సైతం లాగేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీ ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీని అఫిడవిట్ వేయాలని ఈసీ కోరడంపై అఖిలేశ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. '2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో 18 వేల ఓట్లు గల్లంతైనట్లు మేం ఫిర్యాదు చేశాం. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఓట్లు కనిపించకుండాపోయాయి. ఫిర్యాదు చేయడంతో పాటు అఫిడవిట్ కూడా వేశాం. అయినా ఈసీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు'అని ఆయన వివరించారు. అనంతరం, అఖిలేశ్ యాదవ్ ఈ నెల 4న తుదిశ్వాస విడిచిన జార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్‌కు స్వగ్రామం నెమ్రాలో నివాళులర్పించారు.

బీఎల్‌ఏను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన అమెరికా

వాషింగ్టన్: బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), మజీద్ బ్రిగేడ్‌లను విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టీఓ)లుగా అమెరికా ప్రకటించింది. బీఎల్ఏని 2019లోనే.. స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ) జాబితాలో చేర్చిన అమెరికా.. తాజాగా మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్ఏలో భాగంగానే భావిస్తున్నట్లు ప్రకటించింది. 2019 నుంచి ఆ రెండు సంస్థలు చేసిన ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఎఫ్‌టీవోలుగా గుర్తిస్తున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. ఈ సంస్థల హింసాత్మక చర్యలు పౌరుల భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడంలో అమెరికా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. 'ఉగ్రవాద సంస్థలను ఇలా గుర్తించడం వల్ల వాటికి లభించే సహాయాన్ని, నిధులను నిరోధించవచ్చు. ఈ సంస్థలకు ఆర్థికంగా, భౌతికంగా లభించే మద్దతును చట్టపరంగా నిలిపివేయడం ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకోవడం ఈ చర్య ప్రధాన ఉద్దేశం'అని ఆయన పేర్కొన్నారు.



పాక్‌పై ఔదార్యం..

పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అమెరికా పర్యటనలో ఉండగానే ఈ ప్రకటన రావడం గమనార్హం. ఆయన చేసిన విజ్ఞప్తితోపాటు బలమైన కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. జూన్‌లో అమెరికా అధ్యక్షుడితో మునీర్ ఒక ప్రైవేట్ విందుకు హాజరైనప్పటి నుంచి పాకిస్తాన్ పట్ల అమెరికా అమితమైన ఔదార్యం చూపుతోంది. బీఎల్ఏని విదేశీ ఉగ్రవాద సంస్థగా ముద్ర వేయడం అందులో భాగం. మునీర్ అమెరికా పర్యటన సందర్భంగానే ఈ ప్రకటన రావడం అతనికి దౌత్యపరమైన విజయాన్ని అందించింది. అయితే.. తమ దేశంలో విధ్వంసక కార్యకలాపాలను నిర్వహించడానికి బీఎల్ఏను భారత్ రెచ్చగొడుతోందని పాకిస్తాన్ ఆరోపిస్తున్న నేపథ్యంలో అమెరికా ఈ ప్రకటన చేయడం పలు ఊహాగానాలకు తావిస్తోంది.

1970 నుంచి..

బీఎల్ఏ ఖనిజ సంపన్న ప్రావిన్స్‌ను ప్రత్యేక దేశంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దాలుగా తిరుగుబాటు చేస్తోంది. 1970వ దశకంలో బీఎల్ఏ ప్రారంభమైంది. పాక్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో మొదట అధికారంలోకి వచ్చినపుడు బలూచిస్తాన్‌లో సాయుధ తిరుగుబాటు మొదలైంది. సైనిక నియంత జియావుల్ హక్ అధికారం చేజిక్కించుకోవడంతో చర్చల తరువాత సాయుధ తిరుగుబాటు ముగిసింది. బీఎల్ఏ అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. మళ్లీ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ పాలనలో 2000 సంవత్సరంలో బలూచిస్తాన్‌లోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ సంస్థలు, భద్రతాదళాలపై వరుస దాడులు చేసింది. 2006లో పాకిస్తాన్ ప్రభుత్వం బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీని తీవ్రవాద సంస్థల జాబితాలో చేర్చింది. ఈ సంస్థ చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ ట్రాన్సిట్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తోంది. ఇటీవలి కాలంలో పాకిస్తాన్‌లో చైనా కార్యకలాపాలను లక్ష్యంగా చేసుకుంది. ప్రస్తుతం బీఎల్ఏ బషీర్ జేబ్ నాయకత్వంలో కొనసాగుతోంది. మజీద్ బలూచ్ అనే మిలిటెంట్ పేరుతో మజీద్ బ్రిగేడ్ ఏర్పడింది.

హింసాత్మక దాడులు..

అమెరికా నిఘా నేత్ర బీఎల్ఏను చాలా ఏళ్లుగా వెంటాడుతూనే ఉంది. అయితే బీఎల్ఏ 2019 తర్వాత అనేక హింసాత్మక దాడులకు పాల్పడింది. మజీద్ బ్రిగేడ్ పేరుతో అనేక దాడులను నిర్వహించింది. 2024లో కరాచీ విమానాశ్రయం సమీపంలో, అలాగే గ్వాదర్ పోర్ట్ అథారిటీ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడులకు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీయే బాధ్యత వహించింది. 2025 మార్చిలో క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేసింది. ఈ దాడిలో 31 మంది పౌరులు, భద్రతా సిబ్బంది చనిపోగా.. 300 మందికి పైగా రైలు ప్రయాణికులను బందీలుగా పట్టుకున్నారు.

2047కల్లా దేశం సర్వతోముఖాభివృద్ధి

ఇస్రో ఛైర్మన్ నారాయణన్

సాక్షి, చెన్నై: 2047 నాటికి భారత్ అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ అన్నారు. తమిళనాడులోని కోయబత్తూరులో మంగళవారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. సమాచార, సాంకేతిక రంగంలో మన దేశం దూసుకెళ్తోందన్నారు. ఇస్రో ఉపగ్రహాల ద్వారా మత్స్యకారులు తమకు అవసరమయ్యే సమాచారాన్ని మాతృభాషలలోనే పొందే సదుపాయం త్వరలో కలుగనుందని వివరించారు. భారత్ అత్యుత్తమ టెక్నాలజీని కలిగి ఉందని, రాకెట్ ఇంజిన్ టెక్నాలజీలోనూ రాణిస్తున్నామన్నారు. అంతరిక్ష పరిశోధనలో రికార్డులు సాధిస్తున్న మనం త్వరలో మరిన్ని రాకెట్ ప్రయోగాలు చేపడతామన్నారు. భవిష్యత్తులో చేపట్టే మానవ సహిత అంతరిక్ష యాత్రలో ఉపయోగపడే అత్యాధునిక సాంకేతికతో కూడిన శక్తివంతమైన ఇంజిన్ పరీక్షలను ముమ్మరం చేశామన్నారు.

'ఓట్ చోరీ'పై 14న కాంగ్రెస్ ర్యాలీలు

న్యూఢిల్లీ: ఓట్ చోరీ వ్యతిరేక ప్రచార కార్యక్రమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 14వ తేదీన కాంగ్రెస్ ప్రత్యేకంగా 'లోక్‌తంత్ర బచావో మషాల్ మార్చ్'లు చేపట్టాలని నిర్ణయించింది. ఓట్ల చోరీ గురించిన మరింత సమాచారం ఆధారాలతో అందుతోందని పేర్కొంది. మంగళవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జిలు, ఇతర విభాగాల అధిపతులతో సమావేశమయ్యారు. ఇందులో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. భేటీ అనంతరం ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జి కన్హయ్య కుమార్ మీడియాతో మాట్లాడారు. ఓట్ చోరీ అంశంపై ఇప్పుడు అతిముఖ్యమైందిగా మారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 'ఒక వ్యక్తి–ఒక ఓటు'కోసం ప్రజల హక్కుల కోసం తుదికంటా పోరాడుతుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 14వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో 'లోక్‌తంత్ర బచావో మషాల్ మార్చ్'లు చేపడతామని వెల్లడించారు. ఆ తర్వాత ఆగస్ట్ 22–సెప్టెంబర్ 7వ తేదీల మధ్య 'ఓటు దొంగలు, గద్దె దిగాలి'అంటూ తమ పార్టీ శ్రేణులు ర్యాలీలు నిర్వహిస్తాయన్నారు. సెప్టెంబర్ 15–అక్టోబర్ 15 తేదీల మధ్య ఓటు హక్కును కాపాడాలనే డిమాండ్‌పై సంతకాల సేకరణ ఉంటుందని కన్హయ్య కుమార్ వివరించారు.

10 వేల బలగాలు.. హైటెక్ నిఘా.. యాంటీ డ్రోన్ వ్యవస్థలు


ఎర్రకోట వద్ద బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు

- స్వాతంత్ర్య వేడుకలకు ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు

న్యూఢిల్లీ: 10 వేల మందికి పైగా భద్రతా బలగాలు, 3 వేల ట్రాఫిక్ సిబ్బంది, హైటెక్ హంగులతో నిఘా..తదితరాలతో స్వాతంత్ర్య దినోత్సవాలకు దేశ రాజధాని ఢిల్లీ సన్నద్ధమవుతోంది. ఎర్రకోట బురుజుల నుంచి ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగం చేయనుండటంతో చారిత్రక కట్టడం వద్ద బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. సీసీటీవీ కెమెరాలతోపాటు, డ్రోన్ డిటెక్షన్ వ్యవస్థలు, ఫేసియల్ రికగ్నిషన్ సాంకేతికతను వేదికతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలపై నిఘా కోసం వినియోగిస్తున్నారు.

మొట్టమొదటి సారిగా అండర్ వెహికల్ సర్వైలెన్స్ సిస్టమ్స్(యూవీఎస్ఎస్)ను ఎర్రకోటలోని ఐదు పార్కింగ్ ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చామని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వాహనాల అడుగుల సంఘ విద్రోహ శక్తులు అమర్చే పేలుడు పదార్థాలు, ఆయుధాలను వీటితో పసిగట్టవచ్చన్నారు. ఇందులో ఉండే కెమెరాలు, స్కానర్లతో వీటిని గుర్తుపట్టి, హెచ్చరికలు పంపుతాయని వివరించారు. స్వాతంత్ర్య వేడుకల ఆహ్వాన పత్రికల జారీ పకడ్బందీగా ఉంటుందని, లేబుల్ వేసిన వాహనాలనే పరిసరాల్లోకి అనుమతిస్తామని ఆ అధికారి తెలిపారు. హెడ్‌కౌంట్ కెమెరాల ద్వారా గుమికూడిన వారిని ట్రాక్ చేయడంతోపాటు వారి వద్ద ఏమైనా అనుమానాస్పద వస్తువులుంటే గుర్తుపట్టేందుకు వీలుంటుందన్నారు. నిషేధిత ప్రాంతాల్లో ఇంట్రూషన్ డిటెక్షన్ కెమెరాలుంటాయన్నారు. కేటాయించిన ప్రాంతాల్లో నిఘాను కట్టుదిట్టం చేయాలని మంగళవారం ఢిల్లీ పోలీస్ కమిషనర్ బీకే సింగ్ ప్రత్యేక పోలీస్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఎర్రకోటలో ఎత్తైన ప్రాంతాల్లో స్నైపర్లను, రూఫ్‌టాప్ సర్వైలెన్స్ బృందాలను మోహరించనున్నారు. బహుళ అంచెల రక్షణతోపాటు రాత్రి పెట్రోలింగ్, కాలినడక గస్తీ, సాధారణ దుస్తుల్లో గస్తీ బృందాలను పెంచి సున్నిత ప్రాంతాలపై నిఘాను ముమ్మరం చేశారు. సోషల్ మీడియా వేదికలపైనా అధికారులు ఓ కన్నేసి ఉంచనున్నారు. ఆన్‌లైన్ ద్వారా బెదిరింపులు, తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ శాంతికి భగ్నం కలిగించే వారిపట్ల సైబర్ బృందాలు అప్రమత్తంగా ఉంటాయి. పారామిలటరీ బలగాలు, ప్రత్యేక కమాండోలు సహా 10 వేల మంది భద్రతా సిబ్బంది, మరో మూడు వేల మంది ట్రాఫిక్ పోలీసులను స్వాతంత్ర్య వేడుకల బందోబస్తులో వినియోగించనున్నారు. వాహనాలను పూర్తి స్థాయిలో తనిఖీలు చేపడతారు. ఉత్సవాల నేపథ్యంలో ఢిల్లీ గగనతలంపై ఆగస్ట్ 2–ఆగస్ట్ 16వ తేదీల మధ్య పారా గ్లైడర్లు, హ్యాంగ్ గ్లైడర్లు, డ్రోన్లు, హాట్ ఎయిర్ బెలూన్లు, రిమోట్‌తో పనిచేసే విమానాల వంటి వాటి వాడకాన్ని నిషేధం విధించారు. వీటిని సంఘ వ్యతిరేక శక్తులు, ఉగ్రవాద సంస్థలు దుర్వినియోగం చేసే ప్రమాదముందని అధికారులు తెలిపారు. వీఐపీలు, సాధారణ ప్రజలు, కీలక ప్రాంతాల రక్షణ కోసం వీటిని నిషేధించామన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ముందు జాగ్రత్తగా మార్కెట్లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినల్స్, ఇతర జనసమ్మర్దం ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. అధికారులు భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, సమీక్షించాలన్నారు. ఆకస్మిక సోదాలు జరపాలన్నారు. ఆగస్ట్ 14వ తేదీ రాత్రి 10 గంటల నుంచి ఢిల్లీలోకి వాణిజ్య వాహనాల ప్రవేశంపై నియంత్రణలు విధించారు. ప్రధాన రైల్వే స్టేషన్లు, అంతర్రాష్ట్ర బస్టాండ్లు, విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్ల వద్ద ప్రత్యేక పోలీసు బృందాలు సోదాలు చేపట్టి, అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రయాణికులతోపాటు వారి బ్యాగేజీలను తనిఖీలు చేయాలని కోరారు.



బెంగాల్ సీఎస్‌కు ఈసీ సమన్లు

కోల్‌కతా: ఓటరు జాబితా రివిజన్‌లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను తొలగించేందుకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం విముఖత చూపడం వివాదాస్పదంగా మారుతోంది. ఈ నిర్ణయానికి కారణాలు తెలిపేందుకు ఢిల్లీకి రావాలంటూ ఎన్నికల కమిషన్ మంగళవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్‌కు నోటీసు జారీ చేసింది. ఈ నెల 13వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా ఢిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయం నిర్వాచన్ సదన్‌లో స్వయంగా హాజరు కావాలని అందులో ఆదేశించింది. ఈసీ సూచించిన విధంగా ఆరోపణలెదుర్కొంటున్న అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం , సస్పెండ్ చేయడం వంటి చర్యలు కఠినంగా ఉన్నాయని, ఇవి బెంగాల్‌లోని అధికారులపై నైతికంగా ప్రభావం చూపుతాయంటూ సోమవారం సీఎస్ మనోజ్ పంత్ ఈసీకి తెలిపారు. బదులుగా ఆరోపణలెదుర్కొంటున్న ఐదుగురు అధికారులను తాత్కాలికంగా ఎన్నికల విధుల నుంచి పక్కనపెడతామని, అంతర్గత దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు. ఈ సమాధానమే ఈసీ, బెంగాల్ సర్కార్ మధ్య మరోసారి అగ్గిరాజేసింది. కాగా, బుధవారం సీఎస్ మనోజ్ పంత్ ఢిల్లీకి వెళతారని బెంగాల్ సెక్రటేరియట్ వర్గాలు తెలిపాయి.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించే యోచన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: హిందువులు పవిత్రంగా భావించే గోవును జాతీయ జంతువుగా ప్రకటిస్తూ చట్టం తీసుకువచ్చే ఎలాంటి ఆలోచన ప్రభుత్వం చేయడం లేదని కేంద్ర కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ వెల్లడించారు. మంగళవారం లోక్‌సభలో బీజేపీ నేత, ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246(3) ప్రకారం జంతు పరిరక్షణ అంశం రాష్ట్రాల పరిధిలో ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల అసెంబ్లీలో చట్టాలు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే, ఆవుల పెంపకం, భద్రత, సంరక్షణ వంటివాటిపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చేపట్టే చర్యలకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద సాయం అందిస్తోందని వివరించారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తయ్యే 23.93 కోట్ల టన్నుల పాలలో ఆవు పాల వాటా 53.12 శాతం వరకు ఉందని వెల్లడించారు.

కశ్మీరీ పండిట్ల హత్యలపై దర్యాప్తు పునఃప్రారంభం

- ఎల్జీ ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించిన ఎస్ఐఏ
- జేకేఎల్ఎఫ్ నేతల ఇళ్లపై దాడులు

శ్రీనగర్: కశ్మీర్ పండిట్ మహిళ సరళా భట్ హత్యకేసును రాష్ట్ర దర్యాప్తు సంస్థ 35 ఏళ్ల తిరిగి విచారణకు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా మంగళవారం మధ్య కశ్మీర్‌లోని అనేక ప్రదేశాల్లో దాడులు నిర్వహించింది. గతంలో నిషేధిత జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జెకెఎల్ఎఫ్)తో సంబంధం ఉన్న అనేక మంది వ్యక్తుల ఇళ్లపై ఏజెన్సీ దాడులు నిర్వహించింది. జేకేఎల్ఎఫ్ మాజీ నాయకుడు పీర్ నూరుల్ హక్ షా అలియాస్ ఎయిర్ మార్షల్ ఇంటిపైనా ఎస్ఐఏ దాడి చేసింది. శ్రీనగర్‌లోని మైసుమా ప్రాంతంలో ఉన్న జేకేఎల్ఎఫ్ మాజీ చీఫ్ యాసిన్ మాలిక్ నివాసంపైనా దాడులు జరిగాయి. వేర్పాటువాద కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు మాలిక్ ప్రస్తుతం తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. సరళా భట్ అనే మహిళ.. 1990 ఏప్రిల్‌లో సౌరాలోని షేర్–ఎ–కశ్మీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని తన హాస్టల్ నుంచి కనిపించకుండాపోయారు. తరువాత శ్రీనగర్ డౌన్‌టౌన్‌లో శవమై కనిపించారు. మృతదేహంపై చాలా రోజుల పాటు సామూహిక అత్యాచారం, బుల్లెట్ గాయాలు, చిత్రహింసలతో సహా క్రూరమైన హింసకు సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ ఘటనలో జేకేఎల్ఎఫ్‌కు సంబంధం ఉన్న కార్యకర్తలు పాల్గొన్నారని భావిస్తున్నారు. 1990ల ప్రారంభంలో కశ్మీరీ పండిట్ల హత్యలపై దర్యాప్తును తిరిగి ప్రారంభించడానికి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) పరిపాలన తీసుకున్న విస్తృత చొరవలో భాగంగా ఈ కేసును తిరిగి విచారించాలని నిర్ణయించారు. దాడులకు సంబంధించిన మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

భారత ప్రభుత్వ మౌనం సిగ్గుచేటు

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులపై ఎంపీ ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ సైన్యం వేలాది మంది పాలస్తీనియన్లను చంపుతుంటే.. భారత ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ విమర్శించారు. ''ఇజ్రాయెల్ ఒక జాతి నిర్మూలనకు పాల్పడుతోంది. ఇది 60,000 మందికి పైగా ప్రజలను హత్య చేసింది. వారిలో 18,430 మంది పిల్లలున్నారు. అనేక మంది పిల్లలతో సహా వందలాది మందిని ఆకలితో చంపింది. ఇంకా లక్షలాది మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఇజ్రాయెల్ నేరాలపై మౌనం వహించడం మరింత నేరం' అని ఆమె ఎక్స్ వేదికగా మంగళవారం పోస్ట్ చేశారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ ఈ విధ్వంసాన్ని కొనసాగిస్తుండగా భారత ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటుని ఆమె పేర్కొన్నారు. సోమవారం గాజా నగరంలోని అల్–షిఫా ఆస్పత్రి సమీపంలో ఇజ్రాయెల్ జరిపిన దాడులో ఐదుగురు జర్నలిస్టులు సహా ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. 'ఐదుగురు అల్‌జజీరా జర్నలిస్టులను దారుణంగా హత్య చేయడం పాలస్తీనా గడ్డపై జరిగిన మరో దారుణమైన నేరం' అని ఆమె మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇజ్రాయెల్ హింస, ద్వేషం... సత్యం కోసం నిలబడిన ఆ జర్నలిస్టుల ధైర్యాన్ని జయించలేవు. అధికారం, డబ్బు కోసం మీడియాలో ఎక్కువమంది బానిసలైన ఈ సమయంలో.. ఈ ధైర్యవంతులు నిజమైన జర్నలిజం అంటే ఏమిటో మనకు గుర్తు చేశారు' అని ఆమె అన్నారు.

దేశం సురక్షితమైన చేతుల్లో ఉంది

అహ్మద్ పటేల్ తనయుడు ఫైజల్ పటేల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రముఖుడు, దివంగత నేత అహ్మద్ పటేల్ కుమారుడు ఫైజల్ పటేల్.. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. ప్రస్తుతం దేశం సురక్షితమైన చేతుల్లో ఉందని కొనియాడారు. తాను కాంగ్రెస్ పట్ల అసంతృప్తిగా ఏమీ లేనని, ప్రజా జీవితం నుంచి విరామం తీసుకున్నానని స్పష్టం చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావిస్తూ ''ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గొప్ప నాయకత్వాన్ని ప్రదర్శించి మనల్ని భారీ సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చారు. ఇది చాలా పెద్ద విషయం. మన సాయుధ దళాల పట్ల నాకు గర్వంగా ఉంది'' అని అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కష్టపడి పనిచేసే నాయకుడిగా ఫైజల్ అభివర్ణించారు. 'కాంగ్రెస్‌లో శశి థరూర్, డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, దీపేంద్ర హుడా, సచిన్ పైలట్ వంటి చాలా తెలివైన నాయకులు ఉన్నారు. వారు చాలా సమర్థులైన నాయకులు. అంతర్గతంగా సమస్యలు ఉన్నాయి. పార్టీని నడుపుతున్న సీనియర్లకు వారి సలహాదారులు సరైనా సలహాలు ఇవ్వడం లేదు' అని ఆయన కాంగ్రెస్ అగ్ర నాయకుల్లో ఒక వర్గంపై పరోక్షంగా దాడి చేశారు.

ప్రధాని మోదీకి ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు ఫోన్

న్యూఢిల్లీ: మధ్య ఆసియా దేశం ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఫోన్‌లో సంభాషణలు జరిపారు. వాణిజ్యం, కనెక్టివిటీ, టెక్నాలజీ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారు. మిర్జియోయెవ్‌తో సంభాషణ ఫలవంతమైందని ప్రధాని మోదీ అనంతరం 'ఎక్స్'లో తెలిపారు. కీలక రంగాల్లో సహకారంతోపాటు భారత్–ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యం దిశగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య అలస్కాలో జరిగే భేటీ నేపథ్యంలో ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు మిర్జియోయెవ్ ప్రధాని మోదీకి ఫోన్ చేశారని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలను చర్చించారని వెల్లడించింది. అధ్యక్షుడు మిర్జియోవ్ ప్రధాని మోదీకి 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారంది.



గ్రీస్‌లోని దక్షిణ ప్రాంత పట్రాస్ నగర సమీపంలోని గ్యాస్ స్టేషన్ సమీపంలోకి వచ్చిన కార్చిచ్చు



స్పెయిన్ ఉత్తర ప్రాంతం కర్కస్టిల్లో వద్ద కార్చిచ్చు కారణంగా తగులబడుతున్న చెట్లు



తుర్కియేలోని వాయవ్య ప్రాంతం కనక్కలె సమీపంలో ఉధృతంగా మారిన కార్చిచ్చు

కర్మ సిద్ధాంత ప్రభావం ఏ మతానికి సంబంధించింది?

ప్రపంచ సామాజిక వ్యవస్థలో ఏదో ఒక రకమైన మతం ఉంది. ఇది సమాజంలో అనాదిగా వేల ఏళ్ల నుంచి మనుగడలో ఉంది. భిన్నత్వంలో ఏకత్వం ప్రత్యేకతగా ఉన్న భారతీయ సమాజ లక్షణాలకు సంబంధించి అత్యంత ప్రధానమైన అంశాల్లో మతం ఒకటి. భారతదేశం బహుళ మతాలతో కూడుకొని ఉంది. అనేక మతాలు ఉన్నప్పటికీ మత సహనంతో విరాజిల్లడం భారతీయ సమాజ విశిష్ట లక్షణం. ఈ లక్షణం పురాతన కాలంలోగానీ, ఆధునిక కాలంలోగానీ మరెక్కడా కనిపించదు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



మతం

మానవుడు తన పుట్టుక నుంచి మరణం వరకు ప్రకృతిలో సంభవించే వివిధ అంశాలు అగమ్యగోచర శక్తి ప్రభావాలే అని నమ్మాడు. తన ప్రశ్నలు, సందేహాలన్నింటికీ ఊహాత్మక భావనల మేరకు సమాధానం వెతుక్కున్నాడు. అంతిమంగా అవన్నీ 'మానవాతీత శక్తి సృష్టి' అనే భావనకు వచ్చాడు. సామాజిక మానవ శాస్త్రవేత్తలు ఈ మానవాతీత శక్తి (సూపర్ పవర్)నే అలౌకిక శక్తిగా విశ్లేషించారు. ఈ అలౌకిక శక్తుల మనుగడకు సంబంధించిన విశ్వాసమే మతంగా ఆవిర్భంచిందని చెప్పవచ్చు.

మతానికి సామాజిక శాస్త్రవేత్తలు ఇచ్చిన నిర్వచనాలు

- మానవాతీత శక్తులపై ఉండే వైఖరులే మతం. – ఆగ్బర్న్
- మానవ జీవితం, స్వభావానికి మార్గం చూపి, వాటిని నియంత్రించే మానవాతీత శక్తులపై ఉన్న విశ్వాసమే మతం. – **జేమ్స్ అండ్ ఫ్రేజర్**
- మానవుడికి, మానవుడికి మధ్య ఉండే సంబంధమే కాకుండా అతీతమైన శక్తితో మానవుడికి ఉండే సంబంధాన్ని తెలియజేసేదే మతం. – మెకైవర్

మతం విశ్వజనీనమైంది. మతం లేని సమాజం లేదు. మానవాతీత శక్తుల్లో విశ్వాసం కలిగి ఉండటమే మతంలోని ప్రధానాంశం.

భారతదేశంలోని ప్రధాన మతాలు

1. హిందూ మతం 2. ఇస్లాం
3. క్రైస్తవం 4. సిక్కు మతం
5. బౌద్ధం 6. జైనం
7. జొరాస్ట్రియన్ (పార్శీ) మతం

2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో వివిధ మతాలవారు	
1. హిందువులు	79.8 శాతం
2. ముస్లింలు	14.2 శాతం
3. క్రైస్తవులు	2.3 శాతం
4. సిక్కులు	1.7 శాతం
5. బౌద్ధులు	0.7 శాతం
6. జైనులు	0.4 శాతం
7. ఇతరులు	0.7 శాతం

హిందూ మతం

'హిందూ' అనే పదం భారతదేశ పశ్చిమ ప్రాంతంలో ప్రవహిస్తున్న 'సింధూ' నది పేరు నుంచి వచ్చిందని భావిస్తున్నారు. కాలక్రమంలో సింధూ అనేది 'హిందూ'గా మారింది. భారతదేశానికి వచ్చిన విదేశీ యాత్రికులు సింధూనదిని 'ఇండస్' అని పిలిచారు. దీని ఆధారంగా భారతదేశానికి 'ఇండియా' అనే పేరు వచ్చింది. భారతీయులందరినీ 'హిందువులు'గా పిలిచారు.

హిందూ మతాన్ని ఒక మతం అని పిలవడం కంటే 'విశ్వాసాల సమ్మేళనం'గా పేర్కొనడం ఉత్తమం. పురాతన కాలం నుంచి భారతీయులకు అనేక విశ్వాసాలు ఉన్నాయి.

ఉదా: పితృదేవతలను పూజించడం, ప్రకృతి శక్తుల ఆరాధన (నదులు, చెట్లు), బహు దేవతారాధన, ఏకేశ్వర ఉపాసన.

ప్రాచీన కాలంలో భారతీయ నాగరిక ఆశయాల్లో అన్ని మానవ విశ్వాసాలు సమ్మిళితమయ్యాయని ఎస్.కె. బోస్ పేర్కొన్నారు. క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాం మాదిరిగా హిందూ మతానికి ఒక ప్రారంభకుడు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు.

హిందూ మతానికి చెందిన వ్యక్తి జీవితమంతా మత విలువలపైనే ఆధారపడి ఉంది. మంచి కార్యాలు చేసినవారు మరణించిన తర్వాత ఉత్తమ జీవితాన్ని పొందుతారు, చెడ్డ పనులు చేసినవారు తర్వాతి జన్మలో అనేక బాధలు అనుభవిస్తారనే నమ్మకంపై హిందూ మత విలువలు ఆధారపడి ఉన్నాయి.

హిందూ మత మౌలిక ధార్మిక గ్రంథాలు రెండు రకాలు. **అవి: 1. శృతులు 2. స్మృతులు.**

1. శృతులు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం'గా పేర్కొంటారు. దీన్ని అత్యంత పవిత్రమైందిగా భావిస్తారు. వీటినే 'అపౌరుషేయాలు' అంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారని అర్థం.

2. స్మృతులు

వేదాంగాలు, పురాణాలు, ఉపవేదాలు, ఇతిహాసాలను 'స్మృతి సాహిత్యం' అంటారు. వీటిని జ్ఞాన సముపార్జులైన రుషులు రాశారు.

పైన పేర్కొన్న అంశాల ద్వారా హిందూ జీవన విధానాన్ని తెలుసుకోవచ్చు. కర్మ సిద్ధాంతం, వర్ణ వ్యవస్థ, ఆశ్రమ వ్యవస్థ, పురుషార్థాలు హిందువులు ఆచరించాల్సిన విధానాల గురించి వివరిస్తాయి.

కర్మ సిద్ధాంతం

హిందూ మతంలోని ప్రతి వ్యక్తిపై కర్మ సిద్ధాంతం ప్రభావం ఉంటుంది. వ్యక్తి చేసే పనులు, మంచి చెడుల ఆధారంగా ప్రస్తుత జీవితం, పునర్జన్మ ఉంటాయని కర్మ సిద్ధాంతం తెలుపుతుంది. 'ప్రతి వ్యక్తిలో ఆత్మ ఉంటుంది. ఇది శాశ్వతమైంది. దీనికి పునర్జన్మ ఉంటుంది. ప్రస్తుత జీవితం గత జీవితంలో చేసిన మంచి – చెడుల ఫలితం' అని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

వర్ణ వ్యవస్థ

ఇది అత్యంత కీలకమైంది. రుగ్వేదంలోని 10వ అధ్యాయంలో పురుషసూక్తం దీని గురించి తెలుపుతుంది. దీని ప్రకారం ఈ సృష్టికర్త బ్రహ్మ. ఆయన తన శరీరం నుంచి ఈ సృష్టిని వర్ణం ఆధారంగా 4 రకాలుగా సృష్టించారని పేర్కొన్నారు. దీన్నే 'దైవాంశ సంభూత సిద్ధాంతం' అంటారు. దీని ప్రకారం బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాల వారిని దైవం (బ్రహ్మ) సృష్టించాడని భావించారు. వీరిలో మొదటి మూడు వర్ణాల వారిని 'ద్విజులు' అంటారు. వీరికి ఉపనయనం, క్రతువులు ఉంటాయి. గాయత్రి మంత్రం ఆచరించడానికి, ఉచ్చరించడానికి వీరికి అర్హత ఉంటుంది. కింది స్థాయిలోని శూద్రులకు ఇవేవి ఉండవు. ఈ వర్ణవ్యవస్థ నుంచి తదనంతర కాలంలో కులాలు, ఉపకులాలు, ఆవిర్భవించాయి. కానీ వీటికి, ప్రస్తుతం ఉన్న కులాలకు చాలా తారతమ్యం ఉంది.

ఆశ్రమ వ్యవస్థ

హిందూ సామాజిక వ్యవస్థలో ప్రతి వ్యక్తి అంతిమ లక్ష్యం 'మోక్షం' పొందడం. ప్రతి హిందువు నాలుగు దశల ద్వారా దీన్ని చేరాలి.

హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం ఆశ్రమం అంటే వ్యక్తి తన జీవిత కాలంలో చేసే ఒక్కో మజిలీ. ఒక వ్యక్తి తర్వాత దశ చేరుకోవడానికి అర్హత పొందే శిక్షణా దశలే ఆశ్రమాలు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త అల్టేకర్ ప్రకారం క్రీ.పూ. 100 నుంచే హిందువుల్లో ఆశ్రమ పద్ధతి అమల్లో ఉంది. నాలుగు రకాల ఆశ్రమాలు ఉన్నాయి. బ్రహ్మను చేరుకోవడానికి ఈ ఆశ్రమాలు నాలుగు మెట్లు కలిగిన నిచ్చెన లాంటివని భీష్ముడు పేర్కొన్నట్లు హిందువులు భావిస్తారు.

i) బ్రహ్మచర్యాశ్రమం: ఒక వ్యక్తి ఉపనయనం తర్వాత మొదటిదశ అయిన బ్రహ్మచర్యాశ్రమంలోకి చేరుకోవచ్చు. తల్లి గర్భం నుంచి జన్మించడం మొదటి జన్మ. ఈవిధంగా పుట్టిన వ్యక్తిని ఎలాంటి లక్ష్యం లేనివాడిగా భావిస్తారు. ఆ తర్వాత బ్రహ్మచర్యాశ్రమంలోకి ప్రవేశింపజేయడానికి ఒక ఉత్సవం నిర్వహిస్తారు. దీన్నే 'ఉపనయనం' అంటారు. అంటే 'మళ్లీ జన్మించినవాడు' అని అర్థం. ఉపనయనం జరిగిన వ్యక్తిని 'ద్విజుడు' అంటారు. మహిళలు, శూద్రులకు ఉపనయనం లేదు.

ఉపనయనంలో ఒక లక్ష్యంలేని, క్రమబద్ధం కాని జీవితాన్ని ఒక నిర్దిష్ట ఆశయం ఉన్న జీవితంగా మారుస్తారు. వర్ణాల ఆధారంగా ఉపనయనం అర్హత నిర్ధారిస్తారు. సాధారణంగా బ్రాహ్మణులకు 8, క్షత్రియులకు 10,వైశ్యులకు 12ఏళ్ల వయసులో దీన్ని నిర్వహిస్తారు. అనివార్య పరిస్థితుల్లో ఇలా జరగకపోతే మరో నాలుగేళ్ల తర్వాత ఉపనయనం చేస్తారు. దీని తర్వాత సంబంధిత వ్యక్తి గాయత్రీ మంత్రం నేర్చుకోవడానికి అర్హత పొందుతాడు. వేదాంగాల్లో భాగమైన కల్పలోని గృహసూత్రంలో 11వ యాగం ఉపనయనం గురించి తెలియజేస్తుంది.

వేదాంగాలు 6 రకాలు. **అవి:**

1. శిక్ష 2. నిరుక్త
3. వ్యాకరణం 4. జ్యోతిషం
5. ఛందస్సు 6. కల్ప

కల్ప 3 రకాలు

1. **గృహసూత్రం:** మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 యాగాల (షోడశ కర్మలు) గురించి తెలుపుతుంది. 11వ యాగం ఉపనయనం గురించి వివరిస్తుంది.
2. **శ్రేతసూత్రం:** చక్రవర్తి ప్రజల కోసం నిర్వహించాల్సిన యాగాల గురించి తెలుపుతుంది.
3. **సుళువ సూత్రం:** హోమగుండాల నిర్మాణం గురించి తెలుపుతుంది.

ఉపనయనం తర్వాత బ్రహ్మచర్య ఆశ్రమం ప్రారంభమవుతుంది. ఈ ఆశ్రమంలో వ్యక్తి ఉపాధ్యాయుడి గృహంలో విద్యార్థిగా ప్రవేశిస్తాడు. గురువు అతడికి వెంటనే విద్య నేర్పటం ప్రారంభించడు. వ్యక్తి ముందుగా గురువు ఇంటి పనులు చేయాలి. గురువు అతడికి పశువులు కాయడం; వంట చెరకు తీసుకురావడం; క్రతువులకు ఏర్పాట్లు చేయడం; తనకు, తన గురువుకు భిక్షను యాచించడం లాంటి పనులు అప్పగిస్తాడు. ఈ సేవల ద్వారా సంతృప్తి పొందితే గురువు వెలుగును (విద్యా) వేదాధ్యయనం ద్వారా బోధించడం మొదలుపెడతాడు. 'విద్' అంటే వెలుగు. జ్ఞానమనే వెలుగులో అజ్ఞానాంధకారాన్ని పారదోలడానికి గురువు వారధి లాంటివారు.

సన్మార్గం కోసం హిందువులకు ఒక బాధ్యతగా వేదాధ్యయనం నేర్పిస్తారు. పుట్టిన ప్రతి వ్యక్తి 3 రుణాలను చెల్లించాలని హిందూ మతం చెబుతోంది. అవి..

ఎ. రుషులకు రుణం చెల్లించడం: వేదాలు వల్లె వేయడం ద్వారా గురువు కంటే ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించి గురువుతో ప్రశంసలు పొందేలా జ్ఞానాన్ని పొందడం. దీంతో రుషి రుణం తీరినట్లవుతుంది.

బి) దైవ రుణం తీర్చడం: యజ్ఞయాగాదుల ద్వారా ఈ రుణం తీర్చుకోవచ్చని హిందూ ధర్మగ్రంథాలు తెలుపుతున్నాయి.

సి) పితృ (తల్లిదండ్రుల) రుణం: జన్మ ఇచ్చిన తల్లిదండ్రులను గౌరవించడం, వృద్ధాప్యంలో వారికి సేవలందించడం ద్వారా వారికి మోక్ష ప్రాప్తి లభించేలా చూడాలి.

ii) గృహస్థ ఆశ్రమం: బ్రహ్మచర్యంలో సంపాదించిన జ్ఞానం ఆధారంగా స్వశక్తితో జీవించడం ప్రారంభించిన తర్వాత వివాహం ద్వారా గృహస్థాశ్రమ ప్రవేశం జరుగుతుంది. హిందువుల్లో వివాహానికి ధర్మ, ప్రజా, రతి అనే మూడు లక్షణాలు ఉన్నాయి.

ధర్మ: సాంఘిక, మతపరమైన బాధ్యతలను నిర్వర్తించడం.

ప్రజా: సంతానాన్ని పొందడం. పురుష సంతానం వాంఛితమైందిగా భావిస్తారు. అతడు తల్లిదండ్రులను పుత్ (నరకం)లో పడకుండా రక్షిస్తాడనే నమ్మకం ఉంది.

రతి: ఇది లైంగిక వాంఛలు, కోరికలను తృప్తి పరుస్తూ సంతానోత్పత్తికి అవసరమైంది.

ఈ మూడు లక్ష్యాలను వ్యక్తి గృహస్థ దశలో సాధిస్తాడు. మనుసంహిత ప్రకారం ఒక గృహస్థు రోజూ 'పంచ మహాయజ్ఞాలు' చేయాలి. అవి.. బ్రహ్మయజ్ఞం, పితృ యజ్ఞం, దైవ యజ్ఞం, భూత యజ్ఞం, నరయజ్ఞం.

బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు పోషణార్థం గృహస్థు ఆశ్రమంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల దీన్ని ఉన్నతమైందిగా భావిస్తారు.

వార్ధక్య ఛాయలు (ముఖంపై ముడతలు, జుట్టు నెరవటం) వచ్చిన తర్వాత లేదా కుమారులకు వివాహమైన అనంతరం గృహస్థు తన ఇంటిని కుమారులకు అప్పగించి భార్య సహాయంతో గృహస్థ ఆశ్రమాన్ని వదిలి వానప్రస్థ ఆశ్రమాన్ని స్వీకరించాల్సి ఉంటుంది.


iii) వానప్రస్థ ఆశ్రమం: ఇది గృహస్థ, సన్యాస ఆశ్రమాలకు వారధి లాంటిది. ఈ ఆశ్రమంలో ఒక వ్యక్తి వెంట భార్య వెళ్లవచ్చు. ఈ దశలోనూ 'పంచ మహాయజ్ఞాలు' నిర్వర్తిస్తారు. దీన్ని ప్రజా జీవనానికి దూరంగా, ప్రశాంత వాతావరణంలో గడపాలి. అందువల్ల అడవిలో ఆశ్రమం నిర్మించుకొని జీవిస్తారు. వ్యక్తి ప్రారంభంలో పచ్చి ఆకులు, వేర్ల సహాయంతో ఆకలి తీర్చుకోవాలి. ఆ తర్వాత నీరు, చివరకు గాలి మాత్రమే సేవించి ఆకలి తీర్చుకోవాలి. శారీరక సుఖాలన్నింటిని వదిలేయాలి. ఈ దశలో అర్థకామాలు ఉండవు. వేదాలు, వేదాంగాలు, స్మృతుల పఠనం ద్వారా ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవడానికి శరీరానికి క్రమశిక్షణ అలవాటు చేయాలి.

సన్యాస ఆశ్రమం స్వీకరించే ముందు భార్యను కుమారులతో కలిసి జీవించడానికి ప్రోత్సహించాలి. వ్యక్తి క్రమంగా తన అభిమానం, కుటుంబం, గ్రామం అనే సంకుచిత పరిధుల నుంచి బయటపడి విశ్వమానవాళిని ప్రేమించాలి. ఇవన్నీ సాధించిన తర్వాత సన్యాసి రూపంలో సంఘ ప్రవేశం చేయాలి.

iv) సన్యాస ఆశ్రమం: ఇది చివరి దశ. ఈ దశలో కఠినమైన జీవితాన్ని గడపాలి. ప్రాపంచిక విషయాల పట్ల అనాసక్తత ప్రదర్శించాలి. మోక్ష సాధనకు ప్రయత్నించాలి. భిక్షాటన ద్వారా మాత్రమే జీవించాలి. సన్యాసి తాను తిరుగాడే ప్రజల నుంచి గొప్ప గౌరవాన్ని పొందాలి. ఆ ప్రజల మనసులు, జీవితాలపై గొప్ప ప్రభావాన్ని చూపాలి. వ్యక్తిగత ఉదాహరణ ద్వారా, మతబోధ ద్వారా మార్గదర్శకంగా ఉండేలా సమాజానికి ప్రోత్సాహం కల్పించాలి. అంటే సన్యాసి ఒక మహత్తర సాంఘిక పాత్రను నిర్వహిస్తాడు.

ఎండోక్రైన్ గ్రంథులపై ప్రభావం చూపే గ్రంథి?

జీవక్రియలను సమన్వయం చేయడంలో అంతస్స్రావక వ్యవస్థ పాత్ర కీలకం. గ్రంథులు, అవి స్రవించే హార్మోన్లను కలిపి అంతస్రావక వ్యవస్థగా పేర్కొంటారు. దీని అధ్యయనాన్ని 'ఎండోక్రైనాలజీ' అంటారు. పీయూష గ్రంథి ఇతర అంతస్స్రావ గ్రంథులను తన ఆధీనంలో ఉంచుకుంటుంది. కాబట్టి దీన్ని మాస్టర్ గ్లాండ్ అంటారు. పారాథైరాయిడ్ గ్రంథి మాత్రం పీయూష గ్రంథి నియంత్రణ లో ఉండదు. మెలనిన్ చర్మానికి, వెంట్రుకలకు రంగునిస్తుంది. మెలనిన్ లోపిస్తే చర్మం తెలుపు రంగులో ఉంటుంది. ఇన్సులిన్ తక్కువైతే రక్తంలో గ్లూకోజ్ శాతం పెరిగి డయాబెటీస్ మెల్లిటస్ (మధుమేహ వ్యాధి) వస్తుంది.



అంతస్స్రావక వ్యవస్థ

మానవ దేహంలో రెండు రకాల గ్రంథులుంటాయి. అవి.. **బహిస్స్రావ గ్రంథులు:** వీటి స్రావకాలను ఎంజైమ్‌లు అంటారు. **అంతస్స్రావ గ్రంథులు:** వీటి స్రావకాలను హార్మోన్లు అంటారు.

అంతస్స్రావ గ్రంథులు, అవి స్రవించే హార్మోన్లను కలిపి అంతస్స్రావక వ్యవస్థగా పేర్కొంటారు. దీని అధ్యయనాన్ని 'ఎండోక్రైనాలజీ' అంటారు. ఎండోక్రైనాలజీ పితామహుడు థామస్ ఎడిసన్. మానవ శరీరంలోని వివిధ భాగాల విధులను సమన్వయం చేయడం అంతస్స్రావక వ్యవస్థ ముఖ్యవిధి. హార్మోన్లు శరీరం లోపల జరిగే మార్పులను నెమ్మదిగా నియంత్రిస్తాయి. ఈ హార్మోన్లను రసాయనిక రాయబారులు అంటారు. ఇవి రక్తం లేదా శోషరసంలోకి విడుదలవుతాయి. అనంతరం లక్ష్య అవయవాల్లోకి చేరి వాటిపై ప్రభావం చూపుతాయి. తొలిసారి గుర్తించిన హార్మోన్ సెక్రిటిన్. ఇది ఆంత్రమూలం నుంచి విడుదలై క్లోమ, పైత్యరసాల స్రావకాన్ని ప్రేరేపిస్తుంది. గాస్ట్రిన్, సొమాటోస్టాటిన్ అనేవి స్థానిక హార్మోన్లు. మిగతా హార్మోన్లు రక్తం ద్వారా ప్రయాణించి లక్ష్య అవయవాలపై ప్రభావం చూపుతాయి.

రసాయనికంగా హార్మోన్లను మూడు తరగతులుగా విభజించవచ్చు.

పెప్టైడ్, ప్రోటీన్ హార్మోన్లు: వాసోప్రెస్సిన్, ఆక్సిటోసిన్, పీయూష గ్రంథి, పారాథైరాయిడ్ గ్రంథి, క్లోమ గ్రంథి, రిలాక్సిన్.

అమైనో హార్మోన్లు: అడ్రినలిన్, మెలటోనిన్, థైరాక్సిన్ అమైనో హార్మోన్లు. కాగా థైరాక్సిన్ అయోడినేటెడ్ అమైనో హార్మోన్.

స్టిరాయిడ్స్ హార్మోన్లు: లైంగిక హార్మోన్లు (ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్, టెస్టోస్టిరాన్), కార్టిసాల్, ఆల్డోస్టిరాన్. స్టిరాయిడ్స్ దేహ నిర్మాణాలను ఉత్తేజపరుస్తాయి. కాబట్టి కృత్రిమ స్టిరాయిడ్లను అథ్లెట్లు అక్రమంగా వాడుతారు.

అంతస్స్రావ గ్రంథులు

పీయూష గ్రంథి

దీనికి పిట్యూటరీ గ్రంథి, మాస్టర్ గ్లాండ్, కింగ్ ఆఫ్ ది గ్లాండ్స్, బ్యాండ్ మాస్టర్ అనే పేర్లు ఉన్నాయి. పీయూష గ్రంథి ఇతర అంతస్స్రావ గ్రంథులను తన ఆధీనంలో ఉంచుకుంటుంది. అందుకే దీన్ని మాస్టర్ గ్లాండ్ అంటారు. పారాథైరాయిడ్ గ్రంథి మాత్రం పీయూష గ్రంథి ఆధీనంలో ఉండదు. పీయూష గ్రంథి మెదడులోని హైపోథాలమస్ కాడకు అంటుకొని ఉండే అతి చిన్న గ్రంథి. దీని బరువు 0.5 నుంచి 1 గ్రాము వరకు ఉంటుంది. ఈ గ్రంథిలో పూర్వ, మధ్య, పర లంబికలు ఉంటాయి. పీయూష గ్రంథి ఉత్పత్తి చేసే హార్మోన్లు..

గ్రోత్ హార్మోన్ (జి.హెచ్): ఇది పెరుగుదలను నియంత్రిస్తుంది. వ్యాయామం చేసే సమయంలో ఎక్కువగా విడుదలవుతుంది. చిన్న పిల్లల్లో ఈ హార్మోన్ ఎక్కువైతే అతి దీర్ఘ కాయత్వం(జైగాంటిజమ్), హార్మోన్ లోపిస్తే మరుగుజ్జుతనం వస్తాయి. పెద్దల్లో ఈ హార్మోన్ ఎక్కువైతే ఆక్రోమెగాళి (చేతులు, కాళ్లు, దవడ ఎముకలు బాగా పెరిగి గొరిల్లా ముఖం వలే కనిపిస్తుంది). ఈ హార్మోన్ లోపిస్తే సైమండ్స్ వ్యాధి (కాచెక్సియా) వస్తుంది.

ల్యుటినైజింగ్ హార్మోన్ (ఎల్.హెచ్): ఈ హార్మోన్ స్త్రీ బీజకోశాల నుంచి ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల విడుదలను ప్రోత్సహిస్తుంది. పురుషుల్లో ముష్కాల నుంచి టెస్టోస్టిరాన్ విడుదలకు తోడ్పడుతుంది.

ఫాలికిల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (ఎఫ్.ఎస్.హెచ్): ఇది స్త్రీలలో అండాల అభివృద్ధి, పురుషుల్లో శుక్రజననాన్ని ప్రోత్సహిస్తుంది.

ప్రొలాక్టిన్: దీన్ని లాక్టోజెనిక్ హార్మోన్/ మాతృత్వ హార్మోన్ అని కూడా అంటారు. ఇది ప్రసవానంతరం పాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది.

థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్(టి.ఎస్.హెచ్): ఇది థైరాయిడ్ గ్రంథిని ప్రేరేపించి థైరాక్సిన్ విడుదలకు తోడ్పడుతుంది.

మెలనోసైట్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (ఎమ్.ఎస్.హెచ్): ఈ హార్మోన్ చర్మంలో ఉండే మెలనోసైట్ కణాల నుంచి మెలనిన్ విడుదలకు తోడ్పడుతుంది. మెలనిన్ చర్మానికి, వెంట్రుకలకు రంగునిస్తుంది. మెలనిన్ లోపిస్తే చర్మం తెలుపు రంగులో ఉంటుంది. దీన్ని ఆల్బునిజం అంటారు.**ఉదా:** అమెరికన్లు, ఆస్ట్రేలియన్లు. మెలనిన్ ఎక్కువైతే చర్మం బాగా నలుపు రంగులో ఉంటుంది. దీన్ని టానింగ్ అంటారు.

ఉదా: టాంజానియా, కెన్యా ప్రజలు.

ఆక్సిటోసిన్ (బర్త్‌హార్మోన్): ఇది గర్భాశయ కండరాల్లో సంకోచాలు కలిగించి సుఖ ప్రసవానికి తోడ్పడుతుంది. బాలింతల్లో పాల విడుదలకు సహకరిస్తుంది.

వాసోప్రెస్సిన్: దీన్ని అతిమూత్ర నిరోధక హార్మోన్ అంటారు. ఈ హార్మోన్ లోపిస్తే అతి మూత్ర(డయాబెటీస్ ఇన్సిపిడస్) వ్యాధి వస్తుంది. ఈ రోగి మూత్రంలో గ్లూకోజ్ (చక్కెర) ఉండదు.

థైరాయిడ్ గ్రంథి

ఈ గ్రంథికి అవటు గ్రంథి, ఆడమ్స్ ఆపిల్, హెచ్ గ్రంథి, సీతాకోక చిలుకలాంటి గ్రంథి అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇది అతిపెద్ద వినాళ గ్రంథి. సుమారు 25 గ్రాముల బరువుంటుంది. మెడలో వాయునాళానికి దగ్గర (స్వరపేటిక కింద) ఉంటుంది. ఇది రెండు లంబికలు కలిగి హెచ్ ఆకారంలో కనిపిస్తుంది. ఈ గ్రంథి థైరాక్సిన్, కాల్సిటోసిన్ హార్మోన్లను విడుదల చేస్తుంది.

- థైరాక్సిన్ హార్మోన్‌లో ఉండే మూలకం అయోడిన్ (I_2).
- అయోడిన్ మూలకం రక్తంలో ఆక్సిజన్ రవాణాను అధికం చేస్తుంది.
- థైరాక్సిన్ ఉత్పత్తికి అయోడిన్ అవసరం.
- సముద్ర కలుపు మొక్కలు (సీ వీడ్స్/కెల్ప్‌లు), చేపలు, రొయ్యలు, పీతల్లో అయోడిన్ అధికంగా ఉంటుంది. ఆహారంలో అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ గ్రంథి ఉబ్బి, థైరాక్సిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఈ వ్యాధిని హైపోథైరాయిడిజమ్ లేదా సరళ గాయిటర్, విస్తరించిన అవటు గ్రంథి, అయోడిన్ లోప గాయిటర్ అని అంటారు.
- అయోడిన్‌ను ఉప్పులో సోడియం అయోడైడ్ రూపంలో కలుపుతారు.
- అయోడిన్‌కు ఉత్పతనం చెందే లక్షణం ఉంటుంది. కాబట్టి అయోడైజ్‌డ్ సాల్ట్‌ను గాలి చొరబడని ప్యాకెట్లు,డబ్బాల్లో భద్రపరుస్తారు.

థైరాక్సిన్ హార్మోన్ విధులు: శారీరక, మానసిక వికాసానికి తోడ్పడుతుంది. ఆధార జీవక్రియ రేటును పెంచుతుంది. ఒక జీవిలో గది ఉష్ణోగ్రత (27°C) వద్ద విశ్రాంతి సమయంలో జరిగే జీవక్రియ రేటును ఆధార జీవక్రియ రేటు అంటారు. ఇది పెరిగితే శక్తి ఉత్పత్తి జరిగి, ఉష్ణం విడుదలవుతుంది. ఆధార జీవక్రియ రేటును కొలిచే పరికరం 'స్పైరోమీటర్'. ఏనుగుతో పోల్చినప్పుడు ఎలుకలో ఆధార జీవక్రియ రేటు ఎక్కువ. టాడ్‌పోల్ లార్వా రూపవిక్రియకు ఈ హార్మోన్ తోడ్పడుతుంది. చిన్న పిల్లల్లో థైరాక్సిన్ హార్మోన్ లోపిస్తే క్రిటినిజమ్ (జడవామనుడు) వ్యాధి కలుగుతుంది. పెరుగుదల లోపం, అల్పబుద్ధి, మానసిక మాంద్యం ఈ వ్యాధి లక్షణాలు. స్త్రీలలో ఈ హార్మోన్ లోపంతో రుతు చక్రం క్రమం తప్పుతుంది. పెద్దవారిలో ఈ హార్మోన్ లోపం వల్ల మిక్సో ఎడిమా వ్యాధి వస్తుంది. ఈ వ్యాధిగ్రస్తుల్లో ఆధార జీవక్రియ రేటు తగ్గి అలసట కలుగుతుంది. పెద్దవారిలో ఈ హార్మోన్ ఎక్కువైతే కనుగుడ్లు వాచి బయటకు పొడుచుకొని వస్తాయి. దీన్ని ఎక్సాప్తాల్మిక్ గాయిటర్ (గ్రేవ్స్ వ్యాధి, హైపర్ థైరాయిడిజమ్) అంటారు.

కాల్సిటోసిన్: ఈ హార్మోన్ రక్తంలో కాల్షియం, ఫాస్ఫేట్‌ల గాఢతను నియంత్రిస్తుంది.

పారాథైరాయిడ్ గ్రంథి

మానవుడిలో నాలుగు పారాథైరాయిడ్ గ్రంథులుంటాయి. ఈ గ్రంథులు థైరాయిడ్ గ్రంథికి పూర్వాంతంలో రెండు, పరాంతంలో రెండు ఉంటాయి. ఈ గ్రంథి స్రవించే హార్మోన్ పారాథార్మోన్. ఈ హార్మోన్ రక్తం, ఎముకల్లో కాల్షియం, ఫాస్ఫరస్ స్థాయిని నియంత్రిస్తుంది. ఫారాథార్మోన్ లోపం వల్ల కండరాలు ఎప్పుడు సంకోచ స్థితిలో ఉంటాయి. దీన్ని 'టిటానీ' అంటారు.

క్లోమ గ్రంథి

దీన్ని మిశ్రమగ్రంథి, నాళ వినాళ గ్రంథి, ఆకు లాంటి గ్రంథి అని కూడా అంటారు. ఈ గ్రంథి జీర్ణాశయం కింద ఆంత్రమూలం వంపులో ఉంటుంది.ఇది అంతస్స్రావ గంథుల్లో రెండో పెద్దగ్రంథి.క్లోమగ్రంథి అధ్యయనాన్ని పాంక్రియాలజీ అంటారు.

- క్లోమ గ్రంథిలో రెండు భాగాలుంటాయి.
  1) నాళభాగం – క్లోమరసాన్ని స్రవిస్తుంది.
  2) వినాళ గ్రంథి భాగం – ఈ భాగంలో లాంగర్ హన్స్ పుటికలుంటాయి. వీటిలో ఆల్ఫా, బీటా కణాలుంటాయి.

బీటాకణాలు:ఇవి ఇన్సులిన్ హార్మోన్‌ను స్రవిస్తాయి.

- ఇన్సులిన్ ప్రోటీన్ నిర్మిత హార్మోన్.
- ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్తలు – బాంటింగ్, బెస్ట్.
- ఈ హార్మోన్ రక్తంలో గ్లూకోజ్ (చక్కెర స్థాయి)ని తగ్గిస్తుంది.
- ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తంలో గ్లూకోజ్ 80–100 మి.గ్రా / 100 మి.లీ. ఉంటుంది.
- గ్లూకోజ్‌ను లెక్కించే పద్ధతి మి.గ్రా/డెసీలీటర్.
- ఇన్సులిన్ లోపిస్తే రక్తంలో గ్లూకోజ్ శాతం పెరిగి డయాబెటీస్ మెల్లిటస్ (చక్కెరవ్యాధి, మధుమేహ వ్యాధి) వస్తుంది. ఈ వ్యాధిగ్రస్తుడి మూత్రంలో గ్లూకోజ్ ఉంటుంది.
- ఈ వ్యాధి వస్తే ముందుగా కళ్లపై ప్రభావం చూపడం వల్ల అంధత్వం వస్తుంది. తర్వాత హృదయం, మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది.
- ఈ వ్యాధి వల్ల గాయాలు మానవు. రాత్రిపూట అధికంగా మూత్ర విసర్జన జరుగుతుంది. ఇన్సులిన్ థెరపీ ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు.
- అధికంగా ఇన్సులిన్ తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయి పడిపోవటాన్ని ఇన్సులిన్ షాక్ అంటారు. దీంతో మెదడు దెబ్బతిని ప్రాణహానికి దారితీయెచ్చు.

షుగర్ వ్యాధి రకాలు

టైప్–1 : ఇది చిన్న పిల్లలు, 20 ఏళ్ల లోపు వారికి వస్తుంది. ఇది క్లోమం క్షీణించి ఇన్సులిన్ స్రవించకపోవడం వల్ల వస్తుంది.

టైప్–2: 25 నుంచి 30 ఏళ్ల మధ్య వారికి వస్తుంది. ఇన్సులిన్ తక్కువగా ఏర్పడటం వల్ల ఈ వ్యాధి వస్తుంది.

- అప్పుడే పుట్టిన పిల్లలకు జువైనల్ డయాబెటీస్ వస్తుంది.
- గెస్టేషనల్ డయాబెటీస్..గర్భిణులకు వస్తుంది.
- షుగర్ వ్యాధి నియంత్రణకు వాడే భారతీయ మసాల దినుసులు – మెంతులు.
- రక్తంలో అధికంగా ఉన్న గ్లూకోజ్‌ను గ్లైకోజన్‌గా మార్చి కాలేయంలో నిల్వ ఉంచడానికి ఇన్సులిన్ తోడ్పడుతుంది.
- మానవుడిలో నిల్వ ఆహారం గ్లైకోజన్ (అనిమల్ స్టార్చ్). ఇది కాలేయం, కండరాల్లో నిల్వ ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో ఏ హార్మోన్ లోపంతో డయాబెటీస్ మెల్లిటస్ వస్తుంది?
   1) థైరాక్సిన్ 2) గ్లూకగాన్
   3) పిట్యూటరీ గ్రంథి 4) ఇన్సులిన్
2. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని ఏ గ్రంథిని పిలుస్తారు?
   1) అడ్రినల్ గ్రంథి
   2) థైరాయిడ్ / బాలగ్రంథి
   3) లివర్ / కాలేయం
   4) థైమస్ – బాలగ్రంథి
3. చిరు కప్ప రూపాంతరం చెంది ప్రౌఢ కప్పగా మారడానికి కావాల్సిన హార్మోన్?
   1) ఎఫ్ఎస్‌హెచ్ 2) ఎల్‌హెచ్
   3) థైరాక్సిన్ 4) అడ్రినల్ గ్రంథి
4. క్లోమం ఒక?
   1) బహిస్స్రావ గ్రంథి
   2) అంతస్స్రావ గ్రంథి
   3) అంతస్స్రావ – బహిస్స్రావ గ్రంథి
   4) ఏదీకాదు
5. పీయూష గ్రంథి ఎక్కడ ఉంటుంది?
   1) కంఠం 2) కాలేయం
   3) మూత్ర పిండంపైన
   4) కపాలం మధ్యన
6. పాల పొదుగు నుంచి చూషణ ద్వారా పాలను స్రవించడానికి తోడ్పడే హార్మోన్?
   1) ప్రొలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
   3) అడ్రినలిన్ 4) థైమోసిన్
7. కింది వాటిలో వేటి నుంచి అయోడిన్ అధికంగా లభిస్తుంది?
   1) సముద్ర చేపలు 2) సముద్ర ఉప్పు
   3) సీ వీడ్స్ 4) కూరగాయలు
8. అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధి?
   1) మహాకాయం 2) జడవామనుడు
   3) విస్తరించిన అవటు గ్రంథి
   4) చిన్న అవటు గ్రంథి
9. ఎండోక్రైన్ గ్రంథులపై ప్రభావం చూపే గ్రంథి
   1) ఎడ్రినల్ గ్రంథి
   2) పారాథైరాయిడ్ గ్రంథి
   3) పీయూష గ్రంథి 4) థైరాయిడ్ గ్రంథి
10. ఇన్సులిన్ ఒక?
   1) కొవ్వు పదార్థం 2) హార్మోన్
   3) రంగు పదార్థం 4) ఎక్సో ఎంజైమ్

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 3; 5) 4; 6) 2; 7) 3; 8) 3; 9) 3; 10) 2.

హైందవ ధర్మవీరుల గ్రంథ రచయిత?

సురవరం ప్రతాపరెడ్డి సంఘ సంస్కరణాభిలాషి, నిష్కళంక జాతీయవాది. సంస్కృతాంధ్రాలతో పాటు ఇంగ్లిష్, పారశీకం, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. ఆయన మంచి వక్త, విమర్శకుడు, పరిశోధకుడు. గోలకొండ పత్రిక ద్వారా నిద్రాణమై ఉన్న నాటి తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ప్రతాపరెడ్డి రచనల్లో రామాయణ విశేషాలు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండగలు పేర్కొనదగినవి. ఈ మూడు గ్రంథాలు తెలుగుభాష ఉన్నంత వరకు నిలిచి ఉండే ఉత్తమ శ్రేణి గ్రంథాలు.



తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి

గద్వాల సంస్థానానికి రాజధానిగా ఉన్న బోరవెల్లి గ్రామంలో 1896 మే 28న సురవరం ప్రతాపరెడ్డి జన్మించారు. ఆయన స్వగ్రామం ఆలంపురం తాలూకాలోని ఇటికాలపాడు. ప్రతాపరెడ్డి హైదరాబాద్ నిజాం కాలేజీలో ఇంటర్, మద్రాసులో బీఏ, బీఎల్ చేశారు. మద్రాసులో ఉన్న సమయంలో వెల్లాల సదాశివశాస్త్రి, వేదం వెంకటరామశాస్త్రి, మానవల్లి రామకృష్ణ కవి లాంటి పండితులతో ఆయనకు పరిచయం ఏర్పడింది. సురవరం ప్రతాపరెడ్డి సంస్కృతాంధ్ర భాషల్లో ప్రావీణ్యం పొందారు.

హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణ ప్రజల పరిస్థితి దయనీయంగా ఉండేది. తెలుగు ప్రజలు కనీసం ప్రాథమిక విద్యను కూడా మాతృభాషలో అభ్యసించడానికి అవకాశం ఉండేది కాదు. తెలంగాణలో తొంభై శాతం మంది ప్రజల మాతృభాష తెలుగే. అయినప్పటికీ ఉర్దూను తెలుగు ప్రజలపై బలవంతంగా రుద్దడాన్ని ప్రతాపరెడ్డి అవమానంగా భావించారు. దీంతో దేశసేవ, ప్రజల సర్వతోముఖాభివృద్ధి, సంఘసంస్కరణ, మాతృ భాషా వికాసం అనే ఉన్నత లక్ష్యాలకు అనువైన మార్గాన్ని నిర్దేశించుకున్నారు. ఫలితంగా కొమర్రాజు వెంకట లక్ష్మణరావు మార్గదర్శకులుగా, రాజాబహద్దూర్ వెంకట్రామారెడ్డి సహాయ సహకారాలతో సురవరం ప్రతాపరెడ్డి 1926 మే 10న గోలకొండ పత్రికను స్థాపించారు. 1947 వరకు నిరాటంకంగా అర్ధవార పత్రికగా నిర్వహించారు. గోలకొండ పత్రిక ద్వారా నిద్రాణమై ఉన్న నాటి తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. గోలకొండ పత్రిక తొలి సంపాదకీయంలో 'మేము మా పత్రికా స్థాపన కాలం నుంచి రెండు అంశాలు దృష్టిలో ఉంచుకొని దేశసేవ చేస్తున్నాం. మొదటిది ఆంధ్ర భాషా సేవ, రెండోది జాతి, కుల వివక్షత లేకుండా నిష్పక్షపాతంగా ఆంధ్రుల సత్వరాభివృద్ధికి పాటుపడటం' అని పత్రిక ఆశయాలను వివరించారు. పత్రికా నిర్వహణలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, నిజాం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రతాపరెడ్డి వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నారు. గొలకొండ పత్రిక ద్వారా తన జీవిత సర్వస్వాన్ని తెలంగాణ ప్రజల అభ్యుదయానికి ధారపోశారు.

జాతీయ భావాల స్ఫూర్తితో హైదరాబాద్ రాష్ట్రంలో కూడా జాతీయోద్యమాలు, విమోచనోద్యమాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉద్యమాల్లో ప్రతాపరెడ్డి ముఖ్య పాత్ర పోషించారు. ప్రతాపరెడ్డి సంఘ సంస్కరణాభిలాషి, నిష్కళంక జాతీయవాది. సంస్కృతాంధ్రాలతో పాటు ఇంగ్లిష్, పారశీకం, ఉర్దూ భాషల్లో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. మంచి వక్త, విమర్శకుడు, పరిశోధకుడు. అనేక విషయాల గురించి సంపూర్ణ జ్ఞానం సంపాదించిన మేధావి. కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, దేశోద్ధారక నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గిడుగు, గురజాడ తదితరుల వల్ల ప్రతాపరెడ్డి ప్రభావితమయ్యారు. కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి గ్రంథాలు ఆయనపై ప్రభావం చూపాయి.

సురవరం - సాహిత్య సేవ

సురవరం ప్రతాపరెడ్డి సుమారు 40 గ్రంథాలు రచించారు. తెలుగు సాహిత్యంలోని అన్ని నూతన ప్రక్రియలు చేపట్టారు. నవల, నాటకాలు, పద్య, వ్యాస రచనలు, కథలు, చారిత్రక గ్రంథాలు రచించారు. 'హిందువుల పండగలు' అనే గ్రంథాన్ని ప్రామాణిక పద్ధతిలో, సరళ శైలిలో రాశారు. పురాణాలు, స్మృతి గ్రంథాలను పరిశీలించి కొత్త విషయాలను ఆ గ్రంథంలో జోడించారు. ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ పుస్తకానికి పీఠిక రాశారు. ఈ వ్యాసాలను చిదిరమఠం వీరభద్ర శర్మ నడిపిన 'విభూతి' పత్రికలో తొలిసారిగా ప్రచురించారు. తర్వాత గ్రంథ రూపంలో తీసుకొచ్చారు. చారిత్రక దృక్పథంతో 'రామాయణ విశేషాలు' అనే గ్రంథాన్ని ప్రతాపరెడ్డి రచించారు. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' అనే ప్రామాణిక గ్రంథాన్ని రచించారు. ఇందులో క్రీ.శ.1050 నుంచి సుమారు వందేళ్ల కాలానికి చెందిన ప్రజల జీవన విధానాన్ని వర్ణించారు. కళలు, మతం, వ్యాపారం, వినోదాలు, ఆచార వ్యవహారాలు స్త్రీ-పురుషుల అలంకరణలు లాంటి శీర్షికలతో 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' రచించారు. ఇలాంటి గ్రంథం తెలుగులో రావడం ఇదే మొదటిసారి. ఈ గ్రంథం వేటూరి ప్రభాకర శాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ మొదలైన పండితుల ప్రశంసలు పొందింది. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన తొలి తెలుగు గ్రంథమిది. రామాయణ విశేషాలు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండగలు.. ఈ మూడు గ్రంథాలు తెలుగుభాష ఉన్నంత వరకు నిలిచి ఉండే ఉత్తమ శ్రేణి గ్రంథాలు.

ప్రతాపరెడ్డి ఉచ్చల విషాదం, భక్తతుకారాం అనే రెండు నాటకాలను రచించారు. ఉచ్చల విషాద నాటకం దేశభక్తిని ప్రబోధిస్తుంది. స్వదేశాభిమానంతో పాటు, కులరహిత సమాజ స్థాపన అనే ఆదర్శాలతో రచించిన నాటకమే 'భక్తతుకారాం'. మద్రాసులో రాజమన్నార్ నడిపిన 'కళ' అనే పత్రికలో భక్తతుకారాం నాటకాన్ని ప్రచురించారు. మద్రాసు, గుంటూరు, సికింద్రాబాద్, బెజవాడ తదితర పట్టణాల్లో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. 'చంపకీ భ్రమర విలాసం' పేరుతో సురవరం ప్రతాపరెడ్డి తొలి కావ్యరచన చేశారు. ప్రేమార్పణం, హంవీర సంభవం, ధర్మాసనం, మద్యపానం లాంటి కావ్యాలను రచించారు.

నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రవేశపెట్టిన కొన్ని సంస్కరణలను తీవ్రంగా విమర్శిస్తూ 'గోలకొండ' పత్రికలో ప్రతాపరెడ్డి రాసిన సంపాదకీయాలు తెలుగు ప్రజలను ఎంతగానో ఉత్తేజపరిచాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

గోలకొండ కవుల సంచిక

ఓసారి ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఒక ప్రముఖుడు తెలంగాణలో కవులు లేరని, తెలుగుభాష అసలే లేదని ఒక వ్యాసం రాశాడు. అది చదివిన ప్రతాపరెడ్డి ఎంతో బాధపడ్డారు. అది తప్పని నిరూపించేందుకు తెలంగాణలోని కవుల రచనలు, వారి జీవిత సంగ్రహ విశేషాలను సేకరించి 'గోలకొండ కవుల సంచిక' పేరుతో ఒక గ్రంథం ప్రచురించారు. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల రామచంద్రరావు, మందుముల నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు, చిదిరెమఠం వీరభద్రశర్మ, రావాడ సత్యనారాయణ, ఆచార్య వెంకటాచారి తదితరులతో వివిధ విషయాలపై గోలకొండ పత్రికలో వ్యాసాలు రాయించారు.

గోలకొండ పత్రికలో 'జంగములు బ్రాహ్మణులు కారు' అనే వ్యాసాన్ని ప్రచురించారు. దీనిపై అనేక తర్జన భర్జనలు జరిగాయి. శాకాహారం మంచిదా లేదా మాంసాహారమా, స్త్రీలకు స్వాతంత్ర్యం అవసరమా అనే వ్యాసాలను ప్రచురించి పత్రికను చర్చావేదికగా మార్చారు. రాజాబహద్దూర్ వెంకట్రామారెడ్డి సలహాపై 1939లో గోలకొండ పత్రిక సంపాదక, నిర్వహణ బాధ్యతలన్నీ సురవరం ప్రతాపరెడ్డి చేపట్టారు. 1949లో గోలకొండ పత్రిక దినపత్రికగా మారింది. అప్పటి నుంచి నూకల నరోత్తమరెడ్డి సంపాదక బాధ్యతలను స్వీకరించారు. దీంతో ప్రతాపరెడ్డికి గోలకొండ పత్రికతో సంబంధం తెగిపోయింది.

'ప్రజావాణి' స్థాపన

1951లో ప్రజావాణి అనే పేరుతో సురవరం ప్రతాపరెడ్డి ద్విదిన (రెండు రోజులకు ఒకసారి వచ్చే) పత్రికను స్థాపించారు. కొంత కాలం నడిచాక ఈ పత్రిక ఆగిపోయింది.

- 'నిజాం రాష్ట్ర పరిపాలనం' అనే చిన్న పుస్తకాన్ని ప్రతాపరెడ్డి రచించారు.
- ప్రజల హక్కులు, సాధించాల్సిన హక్కుల గురించి వివరించే 'ప్రాథమిక స్వత్యములు' అనే గ్రంథాన్ని 1938లో రచించారు. ఇదే గ్రంథం 'ప్రజాధికారము' పేరుతో 1950లో ప్రచురితమైంది.
- యువకుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి 'యువజన విజ్ఞానం' రచించారు. ఇందులో నీతిపద్యాలు, ప్రాచీన సాహిత్యం, ఆర్యావర్త నాగరికత, మతం, మత ప్రవక్తలు, మన ఆచార-వ్యవహారాలు మొదలైన విషయాలను గురించి రాశారు.
- 'హైందవ ధర్మవీరులు' అనే పేరుతో గోలకొండ పత్రికలో వీర రసాత్మక గాథలను ప్రచురించారు. బాలచంద్రుడు, అబ్దుల్ రజాక్ లారీ, గురు గోవింద్ సింగ్, అమర్ సింగ్, బాజీరావు దేశ పాండ్య తానాజీ లాంటి వీరుల గాథల్ని పత్రికలో ప్రచురించారు తర్వాత అది పుస్తకంగా వచ్చింది.
- 1925లో 'సంఘోద్ధరణ' గ్రంథం రచించారు. ఇందులో మలబారు క్రైస్తవులు, మన పరిశ్రమలు-నాశనం చేసింది ఎవరు, మద్యపానం లాంటి అంశాలను పొందుపర్చారు.
- వింత విడాకులు, వకీలు వెంకయ్య, నిరీక్షణ, సంఘాల పంతులు, మెహదీ బేగం, బారిష్టర్ గోపాలకిషన్ రావు మొదలైన కథలు రచించారు. ఆయన రాసిన కథలు ప్రతాపరెడ్డి కథలు అనే పేరుతో ప్రచురితమయ్యాయి. ఈ కథల్లో తెలంగాణ గ్రామీణ జీవనం, తెలంగాణ భాష, పలుకుబడులను వివరించారు.
- మొగలాయి కథలు అనే పేరుతో గోలకొండ పత్రికలో కథలను ప్రచురించారు.
- మాడపాటి హనుమంతరావు గురించి సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'వ్యక్తిచిత్రణ' ఒక కళా ఖండమని చెప్పవచ్చు.
- గోలకొండ పత్రికలో వేయికి పైగా వ్యాసాలు, సంపాదకీయాలను రాశారు. ఆయన సంపాదకీయాల శైలి విశిష్టమైంది. ఒకసారి నిజాం ప్రభుత్వం సంపాదకీయాలపై నిషేధం విధించింది. దీంతో ప్రతాపరెడ్డి సంపాదకీయ కాలమ్‌లో ప్రపంచ మేధావుల సూక్తులను ప్రచురించడం ప్రారంభించారు. ఈ సూక్తులే ప్రభుత్వానికి సూదుల్లా గుచ్చుకున్నాయి.
- కేవలం భాషాసేవ, పత్రికా రచనలే కాకుండా అనేక సాంఘిక-సాంస్కృతిక సంస్థలతోనూ సురవరం ప్రతాపరెడ్డికి సంబంధం ఉండేది. రెడ్డి వసతి గృహం కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు, విజ్ఞాన వర్ధినీ పరిషత్తుల అధ్యక్షుడిగా ఆయన సేవలందించారు.
- శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం, వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతీ గ్రంథాలయం, హిందీ ప్రచారసభ మొదలైన సంస్థల అభివృద్ధికి తోడ్పడ్డారు.
- నాటి తెలంగాణను చైతన్యపరిచిన వారిగా కొమర్రాజు లక్ష్మణరావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డిలకు సమున్నత స్థానముంది.
- పోలీసు చర్య తర్వాత 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి నియోజకవర్గం నుంచి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రతాపరెడ్డి ఎన్నికయ్యారు.
- తెలంగాణ ప్రజలకు దారి చూపిన, ఆంధ్ర భాషాభివృద్ధికి పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త, పండితుడైన సురవరం ప్రతాపరెడ్డి 1954 ఆగస్టు 25న మరణించారు.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ ప్రజల మాతృభాషా వికాసం కోసం సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ పత్రికను ప్రారంభించిన సంవత్సరం?
   1) 1926 2) 1925
   3) 1906 4) 1920
2. రామాయణ విశేషాలు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండగలు అనే ఉత్తమ శ్రేణి గ్రంథాల రచయిత?
   1) మాడపాటి హనుమంతరావు
   2) ఆదిరాజు వీరభద్రరావు
   3) బూర్గుల రామకృష్ణారావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
3. హైందవ ధర్మవీరుల గ్రంథ రచయిత?
   1) రామానంద తీర్థ
   2) రావి నారాయణ రెడ్డి
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కొమర్రాజు లక్ష్మణరావు
4. 1951లో ప్రజావాణి అనే పేరుతో ద్విదిన (రెండురోజులకు ఒకసారి వచ్చే) పత్రికను ఎవరు నడిపారు?
   1) సురవరం ప్రతాపరెడ్డి
   2) కాళోజీ నారాయణ రావు
   3) దాశరథి రంగాచార్యులు
   4) మందుముల నరసింగరావు
5. గోలకొండ కవుల సంచిక అనే పేరుతో గ్రంథాన్ని ఎవరు ప్రచురించారు?
   1) దయానంద సరస్వతి
   2) ముట్నూరి కృష్ణారావు
   3) కొమర్రాజు లక్ష్మణరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
6. హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సురవరం ప్రతాపరెడ్డి 1952లో ఏ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు?
   1) వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా
   2) హైదరాబాద్
   3) నల్లగొండ
   4) జోగిపేట, మెదక్ జిల్లా

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1; 5) 4; 6) 1.

The seriousness of the situation is..

BANK EXAMS

GENERAL ENGLISH



Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements: Climate change may force the shifting of locations of the existing crops due to
   a) Melting of glaciers
   b) Water availability and temperature suitability at other locations
   c) Poor productivity of crops
   d) Wider adaptability of crop plants
   Which of the statements given above are correct?
   1) a, b, & c 2) b & c only
   3) a & d only 4) a & c
   5) a, b, c, & d
2. To promote agricultural research in India is important because:
   1) To predict variations in monsoon patterns and to manage water resources.
   2) To make long term investment decisions for economic growth.
   3) To facilitate wider adaptability of crops.
   4) To predict drought conditions and to recharge aquifers.
   5) Changed weather patterns in future.
3. The spillover from the Himalayas is due to
   1) large-scale shifts in agro-ecological conditions.
   2) changed weather patterns in future
   3) productivity of crops
   4) melting of glaciers
   5) adaptability of crop plants
4. The antonym of **Critical** is
   1) waver 2) steady 3) unsure
   4) insecure 5) fasten
5. The synonym of **promote** is
   1) encompass 2) encourage
   3) entangle 4) entrust
   5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
   1) vary 2) variety 3) similar
   4) reported 5) yawning
7. She ____ to escape from her office job.
   1) earned 2) yelled 3) yearned
   4) yielded 5) learn
8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
   1) easy; complete
   2) different; wholesome
   3) difficult; totality
   4) hard; completeness
   5) tough; compliment
9. The new policy was adopted in the ____ of fierce ____.
   1) wake; opponent
   2) show; postponement
   3) teeth; criticism
   4) course; outcome
   5) reality; injustice
10. The computer is now an ____ tool for the family doctor.
    1) value 2) valid
    3) price 4) worth
    5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued <u>year two times.</u>
    1) year twice 2) twice yearly
    3) yearly two 4) two yearly
    5) no correction required
12. She yelled at the child to <u>getting down</u> from the wall.
    1) got down 2) get down
    3) getting away 4) get upon 5) no correction required
13. All her yesterday's <u>has</u> vanished without a trace.
    1) Have 2) had
    3) has been 4) have being
    5) no correction required
14. My son's 13 but he's <u>younger</u> for his age.
    1) Youngest 2) youth
    3) older 4) young
    5) no correction required
15. When the needle enters the red zone the engine is <u>indicator</u> hot.
    1) Too 2) much
    3) becomes 4) left
    5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)
17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)
18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)
19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)
20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)
21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)
22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)
23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)
24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)
25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred in** recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.
27. **A** (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)
28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)
29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)
30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.

B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfield's "English Grammar".

C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.

D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.

E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.

F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

Answers

1) 1;	2) 4;	3) 4;	4) 2;	5) 2;
6) 5;	7) 3;	8) 3;	9) 3;	10) 5;
11) 2;	12) 2;	13) 2;	14) 4;	15) 1;
16) 3;	17) 5;	18) 3;	19) 4;	20) 2;
21) 1;	22) 4;	23) 1;	24) 3;	25) 3;
26) 3;	27) 1;	28) 3;	29) 2;	30) 2;